
'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 23

శనివారం 7-10-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



నర్గిస్ మొహమ్మదికి నోబెల్

జైల్లో ఉన్న ఇరాన్ హక్కుల యోధురాలికి శాంతి పురస్కారం - 6లో




పసిడి వెలుగులు

ఆసియా క్రీడల్లో భారత పురుషుల హాకీ జట్టుకు స్వర్ణం -12లో

కృష్ణా జలాలపై
రాష్ట్ర హక్కులను పరిరక్షించండి

ప్రధాని మోదీకి సీఎం వైఎస్ జగన్ లేఖ

- రాష్ట్ర ప్రజల ఆందోళనలను పరిగణనలోకి తీసుకోండి
- కేడబ్ల్యూడీటీ-2కు మరిన్ని విధి విధానాలొద్దు
- కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలపడం ఆశ్చర్యపరుస్తోంది
- 2 రాష్ట్రాలకే దీనిని వర్తింప చేయాలని సూచించడం అశాస్త్రీయం
- తదుపరి చర్యలు తీసుకోకుండా నిలిపేయాలని వినతి



సాక్షి, అమరావతి: కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కులకు విఘాతం కలిగించకుండా పరిరక్షించాలని ప్రధాని నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. అంతర్రాష్ట్ర నదీ జల వివాదాల (ఐఎస్ఆర్‌డబ్ల్యూడీ-ఇంటర్ స్టేట్ రివర్ వాటర్ షేరింగ్ డిస్‌ప్యూట్స్) చట్టం -1956లో సెక్షన్-1 ప్రకారం కొనసాగుతున్న కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ (కేడబ్ల్యూడీటీ)-2కు

మిగతా 2వ పేజీలో ▶



ఢిల్లీలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్

పోలవరం తాజా అంచనాలు ఆమోదించాలి

కేంద్ర హోం మంత్రికి సీఎం జగన్ విజ్ఞప్తి

2లో

గిరిజన అభివృద్ధికి పెద్దపీట

వారి హక్కుల పరిరక్షణకు పలు సంక్షేమ, అభివృద్ధి పథకాలు

- వామపక్ష తీవ్రవాద ప్రభావిత రాష్ట్రాల సీఎంల సదస్సులో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- ప్రభుత్వ కార్యక్రమాలతో ఏపీలో వామపక్ష తీవ్రవాదం తగ్గుముఖం
- పంటలు పండించేందుకు గిరిజనులకు అన్ని విధాలా సహకారం
- గిరిజన రైతులకు 3.22 లక్షల ఎకరాలకు ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు
- మొబైల్ కనెక్టివిటీ పెంచేందుకు 944 కమ్యూనికేషన్ టవర్ల ఏర్పాటు
- గిరిజన కుటుంబాలకు అమ్మ ఒడి, రైతు భరోసా ద్వారా ఊతం

2లో

స్కిల్ కార్పొరేషన్‌కు, టీడీపీకి ఒకరే ఆడిటర్

- కీలక ఆధారాలు సేకరించిన సీఐడీ
- వాటిపై విచారించేందుకు చంద్రబాబును కస్టడీకి ఇవ్వాలి
- సాక్షులను బాబు బెదిరిస్తున్నారు.. బెయిల్ పిటిషన్ తిరస్కరించండి
- కోర్టును కోరిన ఏఏజీ పొన్నవోలు
- కోర్టుపై బాబు న్యాయవాది దూబే తప్పుడు ఆరోపణ
- సీడీ ఫైల్ లేకుండా విచారణ జరుపుతున్నారన్న దూబే
- టేబుల్‌పై ఉన్న సీడీ ఫైల్‌ను చూపించిన న్యాయమూర్తి
- వ్యాఖ్యలను వెనక్కు తీసుకున్న దూబే
- చంద్రబాబు కస్టడీ, బెయిల్ పిటిషన్లపై ఏసీబీ కోర్టులో ముగిసిన వాదనలు.. తీర్పు రిజర్వ్

10లో



ప్రజాధనం కొల్లగొట్టేందుకే ఈ ఎత్తుగడ

వైఎస్సార్‌సీపీ శ్రేణులతో 9న విజయవాడలో సమావేశం 3లో

క్లుప్తంగా...

ఆసియా క్రీడల్లో విజేతలకు సీఎం అభినందనలు

సాక్షి,అమరావతి: 2023 ఆసియా క్రీడల్లో ఆర్చరీ పురుషుల రికర్వ్ విభాగంలో రజత పతకం సాధించిన అతాను దాస్, బొమ్మదేవర ధీరజ్, తుషార్ షెల్కర్‌లకు సీఎం వైఎస్ జగన్ శుభాకాంక్షలు తెలిపారు. వీరిని చూసి ఏపీతో పాటు, భారతదేశం ఎంతో గర్విస్తున్నట్లు పేర్కొన్నారు. తెలుగు జెండా రెపరెపలాడుతోందని ఏపీకి చెందిన బొమ్మదేవర ధీరజ్‌ను ఉద్దేశిస్తూ శుక్రవారం సీఎం జగన్ ఎక్స్(ట్విట్టర్)లో పోస్ట్ చేశారు.

ఉత్పత్తి, మార్కెటింగ్‌లో స్టీల్‌ప్లాంట్ ఉత్తమం

ఉక్కునగరం (గాజువాక): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదట ఆర్నెల్లలో స్టీల్ ప్లాంట్ ఉత్పత్తి, మార్కెటింగ్ రంగాల్లో ఉత్తమ పనితీరు కనబరించింది. వైర్ రాడ్ కాయిల్స్ 3.64 లక్షల టన్నులు, స్ట్రక్చరల్ స్టీల్ 2.23 లక్షల టన్నులు, విలువ ఆధారిత ఉక్కు 6.82 లక్షల టన్నులు అమ్మకాలు చేసింది. మొదటి అర్ధ భాగంలో 1.95 మిలియన్ టన్నుల విక్రయాల ద్వారా రూ.10.79 కోట్ల అమ్మకాల టర్నోవర్ చేసింది. ఉత్పత్తి గణాంకాల ప్రకారం రెండు బీఎఫ్‌ల నుంచి 22.81 లక్షల టన్నులు హాట్ మెటల్, 2.86 లక్షల టన్నుల స్పెషల్ బార్ మిల్, 2.91 లక్షల టన్నులు స్ట్రక్చరల్ మిల్ ఉత్పత్తులు చేసి గత ఏడాది కంటే వృద్ధిని నమోదు చేసింది. ఈ సందర్భంగా సీఎండీ భట్ సిబ్బందిని అభినందించారు.

నేడు విజయవాడకు ముఖ్యమంత్రి జగన్

సాక్షి, అమరావతి: రెండు రోజుల ఢిల్లీ పర్యటన ముగించుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం మధ్యాహ్నం తాడేపల్లిలోని నివాసానికి చేరుకుంటారు. ఢిల్లీలో ఉదయం 10 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం తాడేపల్లి చేరుకుంటారు.

సింహాచలంలో దేవదాయ కార్యాలయం!

సాక్షి, విశాఖపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విశాఖపట్నం నుంచి పరిపాలన సాగించేందుకు వడివడిగా అడుగులు పడుతున్న తరుణంలో.. పలు ముఖ్య విభాగాలు కూడా ఇక్కడ కార్యాలయాల ఏర్పాటు పనుల్లో నిమగ్నమై ఉన్నాయి. దేవదాయ శాఖ ప్రధాన కార్యాలయాన్ని సింహాచలంలో ఏర్పాటు చేయాలని ఆ శాఖ అధికారులు భావిస్తున్నట్లు తెలిసింది. సింహాచలం దేవస్థానం ఆధ్వర్యంలో.. కొండ దిగువన ఉన్న శ్రీనివాస్‌నగర్‌లో రెండంతస్తుల భవనాలు రెండు నిర్మాణంలో ఉన్నాయి. తాజా పరిణామాల నేపథ్యంలో దేవదాయ శాఖ ప్రధాన కార్యాలయాలుగా వీటిని మార్చాలనే ప్రతిపాదనలను అధికారులు ప్రభుత్వానికి పంపించారు. ఇప్పటికే ఈ భవన నిర్మాణ పనులు దాదాపు 90 శాతం పూర్తయ్యాయి. రెండు భవనాల్లోని పై అంతస్తులను ఎండోమెంట్ కమిషనర్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ కార్యకలాపాల కోసం.. కింద గదుల్ని యాత్రికులకు కేటాయించాలనే ఆలోచన చేస్తున్నారు. వీలైనంత త్వరగా పనులు పూర్తిచేసేందుకు దేవస్థానం అధికారులు చర్యలు చేపట్టారు. సంబంధిత శాఖ నుంచి అనుమతి వస్తే.. ఇంటీరియర్ పనుల్ని పూర్తి చేయనున్నారు.

10 తర్వాత ఇంటర్ ఒరిజినల్ సర్టిఫికెట్లు

ఇంటర్మీడియెట్ విద్యా మండలి కార్యదర్శి సౌరభ్ గౌర్

సాక్షి, అమరావతి: ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులకు ఈ నెల 10 తర్వాత ఒరిజినల్ సర్టిఫికెట్లను అందజేయనున్నట్టు ఇంటర్మీడియెట్ విద్యా మండలి కార్యదర్శి సౌరభ్ గౌర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్కుల రీవెరిఫికేషన్, సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణ, ఫలితాల ప్రకటన జూలై నాటికి పూర్తయిందన్నారు. ఆ తర్వాత సర్టిఫికెట్ల ముద్రణ ప్రక్రియ చేపట్టామన్నారు. శనివారం (నేడు) నాటికి ముద్రణ పూర్తవుతుందని.. 10వ తేదీలోగా ఆయా కళాశాలలకు విద్యార్థుల ఉత్తీర్ణత సర్టిఫికెట్లను పంపిణీ చేస్తామన్నారు. ఇప్పటికే ఇంటర్ బోర్డు వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్ నంబర్ ఆధారంగా 3.73 లక్షల మంది తమ మార్కుల మెమోను పొందారని తెలిపారు. ఈ డిజిటల్ ప్రింట్ ఎక్కడైనా చెల్లుబాటు అవుతుందన్నారు. ఈ సర్టిఫికెట్లనే డిజి లాకర్‌లో భద్రపరిచామని చెప్పారు. విద్యా సంస్థలు డిజి లాకర్ ఈ-కాపీలను ఫిజికల్ కాపీలతో సమానంగా గుర్తిస్తున్నట్టు వివరించారు. ఇదే విషయాన్ని గతంలో ప్రభుత్వం జీవో ఆర్టీ నంబర్ 65 ద్వారా విద్యా సంస్థలకు తెలిపిందన్నారు. రాష్ట్ర విభజన తర్వాత ఇంటర్ విద్యార్థులకు చెందిన 45.53 లక్షల సర్టిఫికెట్లను డిజి లాకర్‌లో అందుబాటులో ఉంచినట్టు చెప్పారు.

కేసీఆర్‌కు ఛాతీలో ఇన్‌ఫెక్షన్

సాక్షి, హైదరాబాద్: అనారోగ్యం బారినపడిన తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు క్రమంగా కోలుకుంటున్నారని మంత్రి కేటీ రామారావు శుక్రవారం వెల్లడించారు. కొద్దిరోజుల క్రితం వైరల్ జ్వరం బారినపడిన కేసీఆర్‌కు తర్వాత బాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్ సోకిందని తెలిపారు. ఛాతీలో ఈ సెకండరీ ఇన్‌ఫెక్షన్ వచ్చిందని వివరించారు. దీంతో కేసీఆర్ పూర్తిగా కోలుకునేందుకు అనుకున్న సమయం కంటే ఎక్కువకాలం పట్టే అవకాశం ఉందని తెలిపారు. వైరల్ జ్వరం బారిన పడిన సీఎం కేసీఆర్ దాదాపు మూడు వారాలుగా బహిరంగ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. తాజాగా ఆయన ఆరోగ్యానికి సంబంధించిన అంశాలను కేటీఆర్ వెల్లడించారు.



సీఎం జగన్‌ను సత్కరిస్తున్న మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్..



ఢిల్లీలో జరిగిన సదస్సులో పాల్గొన్న సీఎం జగన్, సీఎస్ జవహర్‌రెడ్డి, డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి



సీఎం జగన్‌తో సెల్ఫీ దిగుతున్న భద్రతా సిబ్బంది

గిరిజనాభివృద్ధికి పెద్దపీట

వారి హక్కుల పరిరక్షణకు పలు సంక్షేమ, అభివృద్ధి పథకాలు

వామపక్ష తీవ్రవాద ప్రభావిత రాష్ట్రాల సీఎంల సదస్సులో ఏపీ సీఎం వైఎస్ జగన్

- గిరిజన కుటుంబాలకు అమ్మ ఒడి, రైతు భరోసా ద్వారా ఊతం
- ఆయా ప్రాంతాల్లో ఆర్థిక కార్యకలాపాలు ఇంకా పెరగాలి
- కనీసం 15 కొత్త బ్యాంకు శాఖలు మంజూరు చేయాలి
- వైజాగ్‌లో గ్రే హౌండ్స్ శిక్షణ కేంద్రం త్వరగా ఏర్పాటు కావాలి



వామపక్ష తీవ్రవాద ప్రభావిత రాష్ట్రాల ముఖ్యమంత్రుల సదస్సులో భాగంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు, డిప్యూటీ సీఎంల గ్రూప్ ఫొటో

> వామపక్ష తీవ్రవాదాన్ని నిర్మూలించడంలో విద్య పాత్ర కీలకం. భారత ప్రభుత్వ గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆంధ్రప్రదేశ్‌కు మంజూరు చేసిన 28 ఏకలవ్య పాఠశాలల్లో 24 స్కూళ్లు వామపక్ష తీవ్రవాద ప్రభావిత జిల్లాల్లోనే ఉన్నాయి. వీటి ద్వారా రాష్ట్రంలోని గిరిజన పిల్లలకు నాణ్యమైన విద్య అందుతోంది. దీంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం 1,953 ప్రభుత్వ ప్రాథమిక, 81 గురుకుల, 378 ఆశ్రమ పాఠశాలలతో పాటు 179 ప్రీ, పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లను నిర్వహిస్తోంది. మా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు–నేడు కార్యక్రమం ద్వారా ఈ స్కూళ్లన్నింటిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తూ.. డిజిటలైజేషన్ పరంగా తరగతి గదులన్నింటినీ అప్‌గ్రేడ్ చేస్తున్నాం. – సీఎం వైఎస్ జగన్

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో గిరిజన ప్రజల హక్కులు పరిరక్షిస్తున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. గిరిజన రైతుల అభివృద్ధి కోసం 3.22 లక్షల ఎకరాలకు పట్టాలు జారీ చేశామన్నారు. వామపక్ష తీవ్రవాదాన్ని నిర్మూలించాలంటే విద్య ప్రధాన ఆయుధంగా తీసుకొని ఆయా ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. కేంద్ర హోం శాఖ దృఢమైన మార్గదర్శకత్వం, మద్దతుతో రాష్ట్రంలో వామపక్ష తీవ్రవాద సమస్యను విజయవంతంగా రూపు మాపుతామని, రాష్ట్ర ప్రజలకు ఉజ్వల భవిష్యత్తును అందిస్తామని భావిస్తున్నట్లు స్పష్టం చేశారు. శుక్రవారం కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఆధ్వర్యంలో వామపక్ష తీవ్రవాద ప్రభావిత రాష్ట్రాల ముఖ్యమంత్రుల సదస్సులో పాల్గొన్న వైఎస్ జగన్.. రాష్ట్రంలో వామపక్ష తీవ్రవాదంపై పోరాటం, నిర్మూలన, గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధిపై మాట్లాడారు. 'ఆంధ్రప్రదేశ్ గత నాలుగు దశాబ్దాలుగా వామపక్ష తీవ్రవాద సమస్యపై పోరాడుతోంది. జాతీయ విధానం, కార్యాచరణ ప్రణాళిక ప్రకారం.. తీసుకున్న చర్యలు, అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, స్థానిక ప్రజల హక్కుల పరిరక్షణ వంటి బహుముఖ విధానం సానుకూల ఫలితాలను అందించింది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ మద్దతుతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో వామపక్ష తీవ్రవాద సమస్యను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి అవసరమైన అన్ని చర్యలను తీసుకుంటోంది. మా ప్రభుత్వం అనుసరించిన వ్యూహాల వల్ల రాష్ట్రంలో వామపక్ష తీవ్రవాద హింసాత్మక సంఘటనలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి' అని తెలిపారు. ఈ సదస్సులో సీఎం జగన్ ఇంకా ఏం చెప్పారంటే..

తీవ్రవాదబలం బాగా తగ్గుముఖం

- తొలుత ఆంధ్రప్రదేశ్‌లోని ఐదు జిల్లాల్లో విస్తరించిన మావోయిస్టు కార్యకలాపాలు ఇప్పుడు అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని మారుమూల ప్రాంతాలకు మాత్రమే పరిమితం అయ్యాయి. ప్రభుత్వం తీసుకున్న చురుకైన చర్యల కారణంగా మావోయిస్టు తీవ్రవాదబలం 2019 నుంచి 2023 నాటికి 150 నుంచి 50 కి తగ్గింది.
- పొరుగు రాష్ట్రాలైన ఒడిశా, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్‌లతో పటిష్టమైన సమన్వయం ఉంది. నాలుగు రాష్ట్రాల అధికారులతో కూడిన జాయింట్ టాస్క్‌ఫోర్స్‌లు ఇప్పటికే ఏర్పాటయ్యాయి. వామపక్ష తీవ్రవాద కార్యకలాపాలను ఎదుర్కోవడానికి మాకున్న సమాచారాలను ఈ ఉమ్మడి టాస్క్‌ఫోర్స్ ద్వారా పరస్పరం పంచుకుంటూ సమష్టిగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నాం.
- స్థిరమైన అభివృద్ధి, సామాజిక, ఆర్థిక పురోగతి మాత్రమే తీవ్రవాదాన్ని ఎదుర్కోవడానికి కీలక పరిష్కారాలు అని దృఢంగా విశ్వసిస్తున్నాం. పేదరికం, అవిద్య, అందుబాటులో లేని వైద్యం, సమాజాన్ని పీడిస్తున్న పరిమితమైన ఉపాధి అవకాశాలే తీవ్రవాదానికి అత్యంత అనుకూల అంశాలు. సమర్థవంతమైన విధానాలు అమలు చేయడం ద్వారా మాత్రమే దీన్ని రూపు మాపగలం.

ప్రత్యామ్నాయ పంటల సాగు

- ఆపరేషన్ పరివర్తనలో భాగంగా 2020–21 నుంచి ఆంధ్రప్రదేశ్ పోలీసులు 9,371 ఎకరాల్లో గంజాయి సాగును ధ్వంసం చేశారు. 224 కేసులు నమోదు చేసి, 141 మంది నిందితులను అరెస్టు చేశారు. సుమారు 3.24 లక్షల కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని తగులబెట్టారు. నిరంతరాయంగా చేస్తున్న ఈ ఆపరేషన్ వల్ల 2022లో గంజాయి సాగు 1500 ఎకరాలకు తగ్గింది. ప్రస్తుత సంవత్సరం అంటే 2023లో అది కేవలం 45 ఎకరాలకు మాత్రమే పరిమితమైందని చెప్పడానికి సంతోషిస్తున్నా.
- గంజాయి సాగు చేసే గిరిజనుల ఆలోచన విధానంలో మార్పు తీసుకురావడానికి పోలీసులు, జిల్లా యంత్రాంగం, పోలీసులు గంజాయి సాగు చేపడుతున్న గిరిజనులతో సంప్రదించి.. వారికి ప్రత్యామ్నాయ పంటలైన కాఫీ, నిమ్మ, జీడి మామిడి, నారింజ, కొబ్బరి, చింతపండు, సిల్వర్ ఓక్‌తో పాటు రాజ్మా, కందిపప్పు, వేరుశనగ తదతర పంటల సాగును ప్రోత్సహిస్తూ వారికి జీవనోపాధి కల్పిస్తోంది. తద్వారా వారిని గంజాయి సాగు నుంచి మరల్చే ప్రయత్నం చేస్తోంది.

ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు.. రహదారులు

- అటవీ ప్రాంతంలో అర్హులైన 1.54 లక్షల మంది గిరిజన రైతులకు 3.22 లక్షల ఎకరాల మేరకు ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు జారీ చేశాం. వారి భూములను సాగు చేసుకునేందుకు మద్దతుగా, పెట్టుబడి ఖర్చు కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం రైతు భరోసాగా రూ.13,500 ఆర్థిక సహాయం అందజేస్తోంది.
- మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో రహదారులతో అనుసంధానం అన్నది అత్యంత కీలకమైన అంశం. వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో లెఫ్ట్ వింగ్ ఎక్స్‌ట్రీమిజమ్ ఎఫెక్టెడ్ ఏరియాస్ స్కీం కింద 1,087 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణాన్ని పూర్తి చేశాం.
- ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు సమర్థవంతంగా, పారదర్శకంగా త్వరితగతిన అందజేయడం కోసం 897 గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేశాం. ఒక్కో సచివాలయంలో 10 మంది ఉద్యోగులతో పాటు ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్ కూడా ఉన్నారు. కమ్యూనికేషన్ నెట్‌వర్క్ ఏర్పాటుకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చాం. ఇందులో భాగంగా మొబైల్ కనెక్టివిటీ పెంచడం కోసం 944 కమ్యూనికేషన్ టవర్‌లను ఏర్పాటు చేశాం.

పిల్లలను బడికి పంపే తల్లులకు ప్రోత్సాహకం

- పిల్లలను బడికి పంపేలా తల్లులను ప్రోత్సహిస్తూ, అమ్మఒడి కార్యక్రమం ద్వారా వారికి ఏటా రూ.15,000 ఆర్థిక సహాయం అందిస్తున్నాం. మరోవైపు మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య సేవలు బలోపేతం చేయడానికి, మా ప్రభుత్వం కొత్తగా 879 విలేజ్ హెల్త్ క్లినిక్స్‌ను ఏర్పాటు చేసింది. దీంతో పాటు అత్యవసర ఆరోగ్య సంరక్షణ సేవలను అందించేందుకు గిరిజన ప్రాంతాల్లో 108 అంబులెన్స్‌లు 75 పని చేస్తున్నాయి. 89 మొబైల్ మెడికల్ యూనిట్ల (104) ద్వారా గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ సేవలు కూడా ప్రవేశపెట్టాం.
- సికిల్‌సెల్ అనీమియా, తలసేమియా వంటి వ్యాధులతో బాధపడుతున్న గిరిజనులకు ఆరోగ్య పింఛన్ కింద నెలకు రూ.10 వేలు అందజేస్తున్నాం. వృద్ధాప్య ఫించను కింద గిరిజన ప్రాంతాల్లో 50 ఏళ్ల నుంచే నెలకు రూ.2,750 ఇస్తున్నాం. మేము ఇన్ని కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ.. గిరిజన ప్రాంతాల్లో ఆర్థిక కార్యకలాపాలను ఇంకా పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దీనికోసం ఈ మావో ప్రభావిత జిల్లాల్లో కనీసం 15 కొత్త బ్యాంకు శాఖలు మంజూరు కావాల్సి ఉంది. గతంలో సదరన్ జోనల్ కౌన్సిల్‌లో సిఫార్సు మేరకు వైజాగ్‌లో గ్రే హౌండ్స్ శిక్షణా కేంద్రం ఏర్పాటు చేయాల్సి ఉంది. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే భూమిని కేటాయించి, దీనికి సంబంధించిన ప్రతిపాదనను కేంద్రానికి సమర్పించిందనే విషయాన్ని తెలియజేస్తున్నా. దీనిని వీలైనంత త్వరగా మంజూరు చేయగలరు.
- వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో సుస్థిర అభివృద్ధి, శాంతిని సాధించడం, వామపక్ష తీవ్రవాద కార్యకలాపాలు విస్తరించకుండా నిరోధించడం కోసం కేంద్ర, రాష్ట్రాల నడుమ నిరంతరం పరస్పర సహాయ సహకారాలు అవసరం. ఆయా ప్రాంతాల్లో శాంతి భద్రతల నిర్వహణ రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని అంశం అయినప్పటికీ, వామపక్ష తీవ్రవాద ప్రభావిత రాష్ట్రాలకు.. అక్కడ పోలీసు బలగాల ఆధునీకరణ, అభివృద్ధి కార్యక్రమాల్లో ఆర్థిక, వ్యూహాత్మక మద్దతును కేంద్రం అందించడం అన్నది చాలా కీలకం.

ఏపీకి 45, తెలంగాణకు 35

నీటి కేటాయింపులు చేయాలని కృష్ణా బోర్డుకు త్రిసభ్య కమిటీ సిఫార్సు

- శ్రీశైలం నుంచి 30 టీఎంసీలు, నాగార్జునసాగర్ నుంచి 15 టీఎంసీలు రాష్ట్రానికి
- మే వరకూ తాగునీటి అవసరాలకు వాడుకోవాలని నిర్ణయం
- నేడు సాగర్ కుడి కాలువ కింద తాగునీటి అవసరాలకు నీటి విడుదల

సాక్షి, అమరావతి : ప్రస్తుత నీటి సంవత్సరంలో మే వరకూ తాగునీటి అవసరాల కోసం రెండు తెలుగు రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టుల్లో లభ్యతగా ఉన్న నీటిలో ఏపీకి 45 టీఎంసీలు, తెలంగాణకు 35 టీఎంసీలు కేటాయించాలని కృష్ణా బోర్డుకు త్రిసభ్య కమిటీ సిఫార్సు చేసింది. ఏపీకి కేటాయించే నీటిలో శ్రీశైలం నుంచి 30 టీఎంసీలు, నాగార్జునసాగర్ నుంచి 15 టీఎంసీలు విడుదల చేయాలని సూచించింది. అలాగే, తెలంగాణకు రెండు ప్రాజెక్టుల నుంచి 35 టీఎంసీలు విడుదల చేయాలని చెప్పింది. జూన్–జూలైలలో తాగునీటి అవసరాల కోసం ఉమ్మడి ప్రాజెక్టుల్లో 2.788 టీఎంసీలను నిల్వచేయాలని తీర్మానిస్తూ కృష్ణా బోర్డు చైర్మన్ శివనందన్‌కుమార్‌కు త్రిసభ్య కమిటీ ప్రతిపాదనలను శుక్రవారం రాత్రి పంపింది. వీటి ఆధారంగా నీటి కేటాయింపులు, విడుదల ఉత్తర్వులను కృష్ణా బోర్డు చైర్మన్ జారీచేయనున్నారు. ప్రస్తుత నీటి సంవత్సరంలో కృష్ణా నదిలో లభ్యత, ఇప్పటిదాకా వినియోగం, మే వరకూ తాగునీటి అవసరాలపై చర్చించడమే అజెండాగా హైదరాబాద్‌లో కృష్ణాబోర్డు సభ్య కార్యదర్శి డీఎం రాయ్‌పురే అధ్యక్షతన ఏపీ ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి, తెలంగాణ ఈఎన్‌సీ మురళీధర్‌లు సభ్యులుగా ఏర్పాటైన త్రిసభ్య కమిటీ శుక్రవారం హైదరాబాద్‌లో సమావేశమైంది. రెండు దఫాలుగా సుదీర్ఘంగా జరిగిన ఈ సమావేశం వాడివేడిగా సాగింది.

ఇప్పటివరకు ఏపీ, తెలంగాణ 144 టీఎంసీల వినియోగం..

ప్రస్తుత నీటి సంవత్సరంలో సెప్టెంబరు 30 వరకూ ఆంధ్రప్రదేశ్ నాగార్జునసాగర్ నుంచి 4.210, శ్రీశైలం నుంచి 25.865, ఇతర ప్రాజెక్టుల నుంచి 65.649 మొత్తం 95.724 టీఎంసీలను వాడుకుందని తేల్చింది. అదే తెలంగాణ రాష్ట్రం నాగార్జునసాగర్ నుంచి 11.88, శ్రీశైలం నుంచి 12.626, ఇతర ప్రాజెక్టుల నుంచి 24.037 మొత్తం 48.543 టీఎంసీలు వాడుకుంది. రెండు రాష్ట్రాలు కలిసి ఇప్పటిదాకా 144.267 టీఎంసీలు వినియోగించుకున్నాయి. దీంతో సెప్టెంబరు 30 నాటికి సాగర్ కనీస నీటిమట్టానికి ఎగువన 27.532, శ్రీశైలంలో కనీస నీటిమట్టానికి ఎగువన 55.256 టీఎంసీలు వెరసి 82.788 టీఎంసీలు లభ్యతగా ఉన్నట్లు తేల్చింది. నీటి లభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో తాగునీటి అవసరాల కోసమే నీటిని వాడుకోవాలని బోర్డు సభ్య కార్యదర్శి డీఎం రాయ్‌పురే చేసిన సూచనకు రెండు రాష్ట్రాల ఈఎన్‌సీలు అంగీకరించారు.



అలా అయితేనే చెన్నైకి నీరు..

కానీ, నీటి లభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ వాటా నీటిని విడుదల చేస్తేనే.. చెన్నైకి నీటిని సరఫరా చేయగలమని ఏపీ ఈఎన్‌సీ నారాయణరెడ్డి స్పష్టంచేశారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో తమ వాటా ఇవ్వలేమని తెలంగాణ ఈఎన్‌సీ తేల్చిచెప్పారు. ఇలాగైతే చెన్నైకి నీటిని విడుదల చేయలేమని ఏపీ ఈఎన్‌సీ కూడా తెగేసిచెప్పారు. దీనిపై సభ్య కార్యదర్శి డీఎం రాయ్‌పురే స్పందిస్తూ.. కేంద్ర జల్‌శక్తి శాఖతో సంప్రదింపులు జరిపి ఎగువ రాష్ట్రాలు మహారాష్ట్ర, కర్ణాటకలు వాటా నీటిని విడుదల చేసేలా చూస్తామన్నారు. ఎగువ రాష్ట్రాలు వాటా నీటిని విడుదల చేస్తే చెన్నైకి నీటిని సరఫరా చేయడానికి తమకెలాంటి అభ్యంతరంలేదని ఏపీ ఈఎన్‌సీ నారాయణరెడ్డి చెప్పారు.

నేడు సాగర్ కుడి కాలువకు నీళ్లు

నీటి కేటాయింపులపై బోర్డుకు త్రిసభ్య కమిటీ సిఫార్సులు చేసిన నేపథ్యంలో నాగార్జునసాగర్ కుడి కాలువ కింద తాగునీటి అవసరాల కోసం శనివారం జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు నీటిని విడుదల చేయనున్నారు.

కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కులను పరిరక్షించండి

▶ మొదటి పేజీ తరువాయి

మరిన్ని విధి విధానాల జారీకి బుధవారం కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలపడం ఆంధ్రప్రదేశ్ ప్రజలను ఆశ్చర్యానికి గురిచేసిందని ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణ ప్రభుత్వం 2014 జూలై 14న చేసిన ఫిర్యాదు ప్రకారం ఈ విధి విధానాలను కేవలం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకే పరిమితం చేశారని గుర్తు చేశారు. ఆ విధి విధానాల నుంచి కృష్ణా నదీ పరివాహక ప్రాంతం(బేసిన్)లోని మిగతా రెండు రాష్ట్రాలను (మహారాష్ట్ర, కర్ణాటక) పూర్తిగా మినహాయించి.. రెండు రాష్ట్రాలకే (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ) పరిమితం చేయాలని ఏకపక్షంగా సూచించడం అశాస్త్రీయం అని చెప్పారు. దీంతోపాటు జాతీయ సంపద అయిన జల వనరులను న్యాయ బద్ధంగా వినియోగించుకోవడానికి కూడా విరుద్ధమని స్పష్టం చేశారు. కేంద్ర మంత్రివర్గం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల కృష్ణా జలాలపై ఆధార పడిన ఆంధ్రప్రదేశ్ ప్రజల ప్రయోజనాలకు విఘాతం కలిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయ పరమైన చిక్కులను పరిశీలించి, ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని తదుపరి చర్యలు తీసుకోకుండా కేంద్ర జల్‌శక్తి శాఖను ఆదేశించాలని ప్రధాని నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం ప్రధానికి లేఖ రాశారు. అందులో ప్రధానాంశాలు ఇలా ఉన్నాయి.

కేడబ్ల్యూడీటీ–1 అవార్డు సుప్రీంకోర్టు డిక్రీతో సమానం

- ఐఎస్ఆర్‌డబ్ల్యూడీ చట్టం–1956లో సెక్షన్–4 ప్రకారం కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్–1 (కేడబ్ల్యూడీటీ – కృష్ణా వాటర్ డిస్పూట్ ట్రిబ్యునల్)ను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కేడబ్ల్యూడీటీ–1 ఇచ్చిన తుది నివేదిక ఆధారంగా 1976 మే 31న గెజిట్‌ను ప్రచురించింది. కృష్ణా నదిలో 2,130 టీఎంసీల జలాలు అందుబాటులో ఉన్నాయని కేడబ్ల్యూడీటీ–1 లెక్క కట్టింది.
- 75 శాతం లభ్యత ఆధారంగా ఆ మేరకు నీటి లభ్యత ఉంటుందని అంచనా వేసింది. దీని ప్రకారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 811 టీఎంసీలు కేటాయించింది. 2,130 టీఎంసీల కన్నా అధికంగా ఉన్న జలాలు అంటే మిగులు జలాలను వినియోగించుకునే స్వేచ్ఛను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చింది. ఐఎస్ఆర్‌డబ్ల్యూడీ చట్టం–1956లో సెక్షన్–6(1) ప్రకారం కేడబ్ల్యూడీటీ–1 అవార్డు సుప్రీంకోర్టు డిక్రీతో సమానం.

అదనపు ప్రవాహాన్ని వినియోగించుకునే స్వేచ్ఛ

- కృష్ణా జలాల పంపిణీకి ఐఎస్ఆర్‌డబ్ల్యూడీ చట్టం –1956లోని సెక్షన్–4 (1) ప్రకారం 2004 ఏప్రిల్ 2న కేడబ్ల్యూడీటీ–2 (బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్)ని కేంద్రం ఏర్పాటు చేసింది. ఈ ట్రిబ్యునల్ 2010 డిసెంబర్ 30న సెక్షన్–5(2) ప్రకారం నివేదిక సమర్పించింది. 2013 నవంబర్ 29న సెక్షన్ 5(3) ప్రకారం కేడబ్ల్యూడీటీ–1 ద్వారా అప్పటికే 75 శాతం లభ్యత ఆధారంగా చేసిన 2,130 టీఎంసీల కేటాయింపులను నిర్ధారిస్తూ కేడబ్ల్యూడీటీ–2 తదుపరి నివేదిక సమర్పించింది.
- బేసిన్‌లోని రాష్ట్రాలకు సగటు ప్రవాహాలతో సహా 65 శాతం లభ్యత ఆధారంగా అదనపు నీటిని కూడా కేటాయించింది. దీని కింద ఉమ్మడి ఏపీకి 194 టీఎంసీలు కేటాయించింది. దాంతో ఉమ్మడి ఏపీకి చేసిన మొత్తం కేటా యింపులు 1005 టీఎంసీలు (811 టీఎంసీలు+194 టీఎంసీలు). దీంతోపాటు 2,578 టీఎంసీల కంటే ఎక్కువగా ఉండే అదనపు ప్రవాహాలను ఉపయోగించుకోవడానికి ఉమ్మడి ఏపీకి స్వేచ్ఛ ఇచ్చింది.

సుప్రీంకోర్టులో 5 ఎస్సెల్పీలు

- కేడబ్ల్యూడీటీ–2 నిర్ణయాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో ఐదు ఎస్సెల్పీ (స్పెషల్ లీవ్ పిటిషన్)లను కృష్ణా బేసిన్‌లోని రాష్ట్ర ప్రభుత్వాలు దాఖలు చేశాయి. సెక్షన్ 5(2) ప్రకారం కేడబ్ల్యూడీటీ–2 ఇచ్చిన నివేదికను పక్కన పెట్టాలంటూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టును అభ్యర్థించింది. సుప్రీంకోర్టు 2011 సెప్టెంబరు 16న జారీ చేసిన ఉత్తర్వుల ద్వారా కేడబ్ల్యూడీటీ–2 సెక్షన్–5(2) కింద ఇచ్చిన నివేదికపై స్టే ఇచ్చింది. అన్ని ఎస్సెల్పీలు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయి.
- ఇదే అంశాన్ని 2021 ఆగస్టు 17న.. ఆ తర్వాత 2022 జూన్ 25న కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లాం. ట్రిబ్యునల్ ద్వారా జరిగిన కేటాయింపులకు ఎలాంటి భంగం వాటిల్లకుండా న్యాయ బద్ధమైన నిర్ణయం తీసుకోవాలని కోరాం.

పోలవరం తాజా అంచనాలు ఆమోదించాలి

కేంద్ర హోం మంత్రికి సీఎం జగన్ విజ్ఞప్తి

సాక్షి, న్యూఢిల్లీ: పోలవరం ప్రాజెక్టు పూర్తి నిర్మాణ వ్యయంపై తాజా అంచనాలకు త్వరితగతిన ఆమోదం తెలిపేలా చర్యలు తీసుకోవాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను కోరారు. శుక్రవారం రాత్రి సీఎం జగన్ గంటకుపైగా అమిత్‌షా నివాసంలో ఆయనతో భేటీ అయ్యి పోలవరం ప్రాజెక్టుకు నిధులు, కృష్ణా జలాల వివాదంపై ఆయనతో చర్చించారు. 2017–18 ధరల సూచీ ప్రకారం పోలవరం ప్రాజెక్టు వ్యయం రూ.55,548.87 కోట్లుగా ఇప్పటికే టెక్నికల్ అడ్వైజరీ కమిటీ ఆమోదం తెలిపిందని గుర్తు చేశారు. పోలవరం పనులను వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు నిధులు విడుదల చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం గతంలో పలుమార్లు చేసిన విజ్ఞప్తి మేరకు రూ.12,911.15 కోట్ల విడుదలకు ఆమోదం లభించిందన్నారు. దీన్ని పునఃపరిశీలించి తాజాగా అంచనాలను రూపొందించామని తెలిపారు. లైడార్ సర్వే ప్రకారం అదనంగా 36 ఆవాసాల్లో ముంపు కుటుంబాలను రక్షిత ప్రాంతాలకు తరలించాల్సి ఉందని, పోలవరం తొలి దశను పూర్తి చేయడానికి ఇంకా రూ.17,144.06 కోట్లు అవసరమవుతాయని, ఆ మేరకు నిధులు విడుదల చేసేలా చూడాలని కోరారు. పోలవరం నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం తన సొంత నిధుల నుంచి ఖర్చు చేసిన రూ.1,355 కోట్లను రీయింబర్స్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

రెండు రాష్ట్రాలకే మరిన్ని విధివిధానాలొద్దు

కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ (కేడబ్ల్యూడీటీ)–2కు మరిన్ని విధి విధానాల జారీకి బుధవారం కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలపడంపై ముందుకెళ్లొద్దని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాకు సీఎం జగన్ విజ్ఞప్తి చేశారు. ఈ ఆమోదం ఏపీ ప్రజల హక్కులకు విఘాతం కలిగించే అవకాశం ఉందని తెలిపారు. కృష్ణా జలాలకు సంబంధించి కేంద్ర మంత్రి మండలి ఆమోదంపై తదుపరి చర్యలు తీసుకోకుండా చూడాలని కోరారు. విధివిధానాలను బేసిన్‌లోని కర్ణాటక, మహారాష్ట్రలకు కాకుండా ఏపీ, తెలంగాణకు పరిమితం చేయడం అశాస్త్రీయమని తెలిపారు.

మహారాష్ట్ర డిప్యూటీ సీఎంతో సమావేశం

శుక్రవారం ఉదయం మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల ముఖ్యమంత్రుల సదస్సు అనంతరం మహారాష్ట్ర డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌తో ఏపీ సీఎం వైఎస్ జగన్ భేటీ అయ్యారు. సమావేశం అనంతరం ఫడ్నవీస్ అధికారిక నివాసంలో మర్యాద పూర్వకంగా సమావేశమయ్యారు. సీఎం జగన్‌ను ఫడ్నవిస్ దుశ్శాలువతో సత్కరించారు.

క్లుప్తంగా...

ప్రభుత్వ స్కూళ్లలో 'సెల్ఫీ విత్ టాపర్స్'

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులను ప్రోత్సహించేందుకు పాఠశాల విద్యా శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఫార్మేటివ్ అసెస్మెంట్(ఎఫ్ఏ)–2 పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను మరింత చైతన్య పరిచేందుకు 'సెల్ఫీ విత్ టాపర్స్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఎఫ్ఏ–2 పరీక్షల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు సెల్ఫీలు తీసుకుని సామాజిక మాధ్యమాల్లో వారి ప్రతిభను తెలియజేయాలని పాఠశాల విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ శుక్రవారం ఆదేశించారు. తద్వారా విద్యార్థుల్లో మంచి మార్కులు సాధించాలనే పట్టుదల పెరుగుతుందని ఆకాంక్షించారు. సబ్జెక్టు టీచర్లు వెంటనే పరీక్షల మూల్యాంకనం పూర్తి చేసి అక్టోబర్ 7 నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాలన్నారు. కలెక్టర్లు, జిల్లా ఉన్నతాధికారులు కూడా ఇందులో పాల్గొనాలని సూచించారు.

నేటి బాలలే రేపటి శాస్త్రవేత్తలు

- చిల్లకూరులో ఆకట్టుకున్న రాకెట్ నమూనాల ప్రదర్శన

చిల్లకూరు(తిరుపతి జిల్లా): తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం చింతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా శ్రీహరికోట స్పేస్ సెంటర్ నుంచి ప్రయోగించిన పలు రాకెట్ నమూనాలను శుక్రవారం శ్రీహరి కోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ శాస్త్రవేత్తలు ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ రేపటి శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు కృషి చేయాలని కోరారు.

విశాఖ కేంద్రంగా పాలన సజావుగా సాగాలి

- జేఏసీ చైర్మన్ లజపతిరాయ్



సాక్షి, విశాఖపట్నం: దసరా నుంచి విశాఖ కేంద్రంగా సీఎం వైఎస్ జగన్ చేపట్టనున్న పరిపాలన సజావుగా సాగాలని ప్రజలంతా ఆకాంక్షిస్తున్నారని రాష్ట్ర పరిపాలన వికేంద్రీకరణ జేఏసీ చైర్మన్ లజపతిరాయ్ అన్నారు. ఇందుకోసం ప్రజలందరితో కలిసి శనివారం నుంచి దశలవారీగా సర్వమత ప్రార్థనలు చేయనున్నట్లు తెలిపారు. వెనుకబడిన ఉత్తరాంధ్రతోపాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాలను అభివృద్ధి పథంలో నడిపే శక్తిని ముఖ్యమంత్రికి ఇవ్వాలని కోరుతూ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నామన్నారు. జేఏసీ తరఫున దేవాలయాలు, చర్చిలు, ముస్లిం ప్రార్థనా స్థలాల్లో సర్వమత ప్రార్థనలు చేపట్టాలని నాన్ పొలిటికల్ జేఏసీ సమావేశంలో ఇటీవల తీర్మానించినట్లు వెల్లడించారు. శనివారం ఉదయం విశాఖ నగరంలోని సంపత్ వినాయక్ టెంపుల్ వద్ద ప్రారంభించి సింహాచలం, ఇతర దేవాలయాల్లో పూజలు నిర్వహించనున్నట్లు వివరించారు.

నాడు 'పోలవరం'పై టీడీపీ తప్పు చేసింది..

- సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరా



మడకశిర: జాతీయ ప్రాజెక్ట్ అయిన పోలవరం నిర్మాణ బాధ్యతను టీడీపీ ప్రభుత్వం నెత్తినెత్తుకుని తప్పు చేసిందని సీడబ్ల్యూసీ సభ్యుడు ఎన్.రఘువీరారెడ్డి అన్నారు. ఆయన శనివారం శ్రీసత్యసాయి జిల్లా నీలకంఠాపురంలో విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్ కృషితోనే పోలవరం ప్రాజెక్టు రూపుదిద్దుకుందనేది జగమెరిగిన సత్యమన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రెండేళ్లలోనే ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో మతతత్వ బీజేపీ ఓడిపోతేనే దేశం సుభిక్షంగా ఉంటుందన్నారు. ప్రస్తుతం దేశానికి 'ఇండియా' కూటమి అవసరం చాలా ఉందని చెప్పారు. ఈ నెల 9న ఢిల్లీలో సీడబ్ల్యూసీ సమావేశం జరుగుతుందని తెలిపారు.

'ఓటర్ల సవరణ' విధుల్లోని ఉద్యోగుల బదిలీపై నిషేధం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో జరుగుతున్న ఓటర్ల సవరణ కార్యక్రమంలో నిమగ్నమై ఉన్న ఉద్యోగుల బదిలీలపై నిషేధం విధిస్తూ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా శుక్రవారం ఉత్తర్వులిచ్చారు. ఈనెల 27న ముసాయిదా ఓటర్ల జాబితా, 2024 జనవరి 5న తుది ఓటర్ల జాబితా విడుదల చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అందువల్ల ఈనెల 27 నుంచి 2024 జనవరి 5 వరకు సవరణ కార్యక్రమంలో పాల్గొనే ఉద్యోగుల బదిలీలను నిషేధిస్తున్నట్లు తెలిపారు. ఈ విధుల్లో పాల్గొంటున్న జిల్లా కలెక్టర్లు, సబ్ కలెక్టర్లు, ఆర్డీవోలు, డిప్యూటీ కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు, అడిషనల్ మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, సూపర్‌వైజర్లు, వీఆర్వోలు–వీఆర్ఏలు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల బదిలీలపై ఈ నిషేధం ఉంటుందని పేర్కొన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో బదిలీలు చేయాల్సి వస్తే ముందుగా కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి అనుమతులు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే ఖాళీలున్న చోట్ల ఓటర్ల సవరణకు సంబంధించిన అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఉద్యోగులను గుర్తించాలని ఆదేశించారు.

5వ తరగతి వరకు స్మార్ట్‌టీవీలతో పాఠాలు

రెండో దశ నాడు-నేడు స్కూళ్లలో అమలుకు విద్యా శాఖ నిర్ణయం

- 1 నుంచి 5వ తరగతి వరకు ప్రతి 60 మంది పిల్లలకు ఒక స్మార్ట్ టీవీ
- 65 ఇంచులు గల 28,014 టీవీల కొనుగోలు
- ఓపెన్ కాంపిటీటివ్ బిడ్స్ పద్ధతిలో టెండర్లకు ఆహ్వానం
- జ్యుడిషియల్ ప్రివ్యూకు పంపిన ప్రభుత్వం
- అభ్యంతరాలకు 9 వరకు గడువు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులకు అత్యుత్తమ బోధన అందించడం ద్వారా వారిని ప్రపంచ స్థాయిలో పోటీపడేలా తీర్చిదిద్దాలని సర్కార్ సంకల్పించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ విద్యా సంవత్సరం వారికి డిజిటల్ బోధనను అమల్లోకి తెచ్చింది. ఇందులో భాగంగా తొలి దశ నాడు–నేడు స్కూళ్లలో 6వ తరగతి నుంచి పదో తరగతి వరకు 30,213 తరగతి గదుల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ (ఐఎఫ్‌పీ)లను అమర్చింది. అలాగే 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు స్కూళ్లలో 10,038 స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేసింది.

తరగతి గదుల డిజిటలైజేషన్‌లో భాగంగా..

ఇక ఇప్పుడు నాడు–నేడు కింద రెండో దశ స్కూళ్లలో కూడా ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్, స్మార్ట్ టీవీల ఏర్పాటు చేయాలని విద్యా శాఖ నిర్ణయించింది. ఇందులో భాగంగా 1 నుంచి 5వ తరగతి వరకు డిజిటలైజేషన్‌లో భాగంగా తరగతి గదుల్లో 28,014 స్మార్ట్ టీవీల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. 65 ఇంచులు గల స్మార్ట్ టీవీల కొనుగోలుకు ఓపెన్ కాంపిటీటివ్ బిడ్స్ పద్ధతిలో టెండర్లను ఆహ్వానించాలని విద్యా శాఖ నిర్ణయించింది. వీటి కొనుగోలుకు రూ.100 కోట్ల కన్నా ఎక్కువ వ్యయం అవుతుండటంతో నిబంధనల మేరకు ఓపెన్ కాంపిటీటివ్ బిడ్ టెండర్ డాక్యుమెంట్‌ను జ్యుడిషియల్ ప్రివ్యూకు పంపింది. ఏమైనా అభ్యంతరాలుంటే ఈ నెల 9 వరకు సమర్పించడానికి గడువు విధించింది. అనంతరం జ్యుడిషియల్ ప్రివ్యూ సూచనల మేరకు ఓపెన్ కాంపిటీటివ్ బిడ్ల కోసం టెండర్లను ఆహ్వానించనుంది.

లోపాలుంటే 24 గంటల్లోపే పరిష్కారం

1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు ప్రతి 60 మంది పిల్లలకు ఒక స్మార్ట్ టీవీ ఏర్పాటు చేసి వాటి ద్వారా బోధించనున్నారు. డిసెంబర్ నాటికల్లా వీటి ఏర్పాటు పూర్తి చేయనున్నారు. స్కూళ్లకు స్మార్ట్ టీవీలను తీసుకువచ్చి అమర్చిన నాటి నుంచి ఐదేళ్ల వారంటీ ఉండాలనే నిబంధనను ప్రభుత్వం విధించింది. స్మార్ట్ టీవీలను సరఫరా చేసిన తరువాత నెల రోజుల్లోనే వాటి పనితీరులో లోపాలున్నా, సంతృప్తికరంగా పనిచేయకపోయినా వాటి స్థానంలో కొత్తవి అమర్చాల్సి ఉంటుంది. అలాగే వాటిలో ఏమైనా లోపాలుంటే.. ఫిర్యాదు చేసిన 24 గంటల్లోగా పరిష్కరించాలి. ఒకవేళ స్మార్ట్ టీవీ కొత్తది అమర్చాలంటే మూడు రోజుల్లోపే అమర్చాలనే నిబంధన విధించింది. అదేవిధంగా సేవల కోసం కాల్ సెంటర్ నంబర్‌ను ఏర్పాటు చేయనున్నారు.

సదరం స్లాట్‌ల విడుదల

గ్రామ, వార్డు సచివాలయాల్లో బుకింగ్‌కు అవకాశం



సాక్షి, అమరావతి: దివ్యాంగులు సదరం సర్టిఫికెట్లు పొందేందుకు అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలలకు స్లాట్‌లను ప్రభుత్వం విడుదల చేసింది. అభ్యర్థులు అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. స్లాట్‌లు బుక్ చేసుకున్న వారికి రాష్ట్రవ్యాప్తంగా వైద్యశాఖ ఆధ్వర్యాన 173 ప్రభుత్వాస్పత్రుల్లో ఆర్థోపెడిక్, మానసిక, కంటి, ఈఎన్‌టీ వైద్యులు పరీక్షలు నిర్వహించి అర్హులైన వారికి ధ్రువీకరణపత్రాలు అందజేస్తారు. గతేడాది జూలై నుంచి స్థానికతతో సంబంధం లేకుండా రాష్ట్రంలోని ఏ ఆస్పత్రిలో అయినా స్లాట్ బుకింగ్‌కు అవకాశం కల్పిస్తున్నారు. అందువల్ల అభ్యర్థులు ఏ జిల్లాలో అయినా స్క్రీనింగ్ పరీక్షలకు హాజరుకావొచ్చు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సులభతరం

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సదరం సర్టిఫికెట్‌ల జారీ ప్రక్రియను సులభతరం చేసింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో మొక్కుబడిగా 56 ఆస్పత్రుల్లోనే సదరం క్యాంపులు నిర్వహించేవారు. అప్పట్లో సర్టిఫికెట్‌లు పొందడానికి దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులపాలయ్యారు. ప్రస్తుత ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాల్లోనే స్లాట్ బుకింగ్‌లకు అవకాశం కల్పించింది. ఆస్పత్రుల సంఖ్యను 173కి పెంచింది. దీంతో టీడీపీ ప్రభుత్వంతో పోలిస్తే ప్రజలకు ఇప్పుడు సులభంగా సదరం సేవలు లభిస్తున్నాయి. నాడు ఏడాదికి 25వేల నుంచి 30 వేల మందికి స్క్రీనింగ్ నిర్వహించగా, ప్రస్తుతం ఏడాదికి అంతకన్నా మూడు రెట్లు అధికంగా స్క్రీనింగ్ చేస్తున్నారు. 2022–23 సంవత్సరంలో 2.99 లక్షల స్లాట్‌లను ప్రభుత్వం విడుదల చేయగా, 2.25 లక్షల స్లాట్‌లు బుక్ అయ్యాయి. సందరం క్యాంప్‌లకు హాజరైన వారికి స్క్రీనింగ్ నిర్వహించి 96,439 సర్టిఫికెట్‌లను మంజూరు చేశారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణులతో 9న విజయవాడలో సమావేశం

- పార్టీ మండలస్థాయి నేతలకు సీఎం జగన్ దిశా నిర్దేశం: సజ్జల
- హాజరు కానున్న దాదాపు 8 వేల మందికి పైగా ప్రత్యేక ఆహ్వానితులు
- ప్రభుత్వ అభివృద్ధి – సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తాం
- చంద్రబాబు విప్లవ ఉద్యమాలు చేసి జైలుకెళ్లినట్లు టీడీపీ హడావుడి
- స్కిల్ స్కామ్‌లో బాబు అవినీతిపై స్పష్టమైన ఆధారాలు
- 13 చోట్ల సంతకాలు పెట్టిన విషయం వాస్తవమా.. కాదా?
- నోట్ ఫైల్స్‌లో స్పష్టంగా ఉంది
- స్కామ్‌ను పక్కదోవ పట్టించడానికే ఎలక్టోరల్ బాండ్స్ అంశం తెచ్చారు



సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ శ్రేణులను ఎన్నికలకు సమాయత్తం చేసే క్రమంలో భాగంగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి – సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి వెళ్లి వారి దీవెనలు కోరే ముందుగా మండల స్థాయి నాయకత్వంతో ఈనెల 9వతేదీన విజయవాడలో సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి వెల్లడించారు. తాడేపల్లిలో శుక్రవారం తనను కలిసిన మీడియాతో ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి ప్రత్యేక ఆహ్వానితులు మాత్రమే హాజరు కానున్నట్లు స్పష్టం చేశారు. మండలపార్టీ అధ్యక్షులు, జెడ్పీటీసీ, ఎంపీపీలు, పార్టీ పరమైన పదవులలో ఉన్నవారు, పార్టీ అనుబంధ సంఘాలు, మార్కెట్ యార్డు ఛైర్మన్లు తదితరులు దాదాపు 8 వేలమందికి పైగా హాజరవుతారన్నారు. ఇది పూర్తిగా ఆహ్వానితులతోనే జరుగుతున్న సమావేశమని, బహిరంగ సభ కాదని, ముఖ్యంగా ఓపెన్ టూ ఆల్ కాదని గమనించాలని కోరారు. ఈ సమావేశంలో మండల స్థాయిలో సంస్థాగతంగా అన్ని రకాలుగా లీడ్ చేయగలిగిన లీడర్‌షిప్‌తో ముఖ్యమంత్రి ఇంటరాక్షన్ ఉంటుందన్నారు. స్థానిక సంస్థలలో దాదాపు 80 శాతం గెలిచినందున ఆ నాయకత్వం అంతా హాజరవుతారన్నారు. మండల పార్టీ అధ్యక్షులు, అర్బన్ మండలాలకు సంబంధించి కూడా సమావేశంలో పాల్గొంటారన్నారు. క్షేత్రస్థాయి వరకు క్రియాశీలకంగా పార్టీని లీడ్ చేసే వారు సమావేశానికి హాజరై పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ఆలోచనలు, ప్రభుత్వం నాలుగేళ్లుగా చేసిన కార్యక్రమాలను ప్రజలలోకి తీసుకువెళ్తారని వివరించారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలలోకి తీసుకువెళ్లే వారిగా, తర్వాత ఎన్నికల వరకు జరిగే కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో లీడ్ చేసే వారిగా నేతలకు ఈ సమావేశం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. వారిలో నూతనోత్సాహాన్ని నింపుతుందని, వారికి చాలా అంశాలపై స్పష్టత వస్తుందని చెప్పారు.

ఆరోగ్య సురక్షకు విశేష స్పందన...

'మేం ప్రజల అవసరాలను తెలుసుకుని నెరవేరుస్తూ ముందుకు వెళ్తున్నాం. ఏడాదిన్నర క్రితం గడప గడపకూ ప్రారంభమైంది. శాసనసభ్యులు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు అభివృద్ధి – సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికీ వెళ్లి వివరిస్తున్నారు. బ్రహ్మాండమైన రెస్పాన్స్ వచ్చింది. ఇప్పుడు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. ఇంకా పార్టీకి సంబంధించి ప్రచార కార్యక్రమాలు తయారయ్యాయి. వాటితో పాటు పార్టీలో గృహ సారథుల వ్యవస్థ, సోషల్ మీడియా ఇటీవల బాగా యాక్టివ్ అయింది. వీటన్నింటికి క్షేత్ర స్థాయిలో మండలం యూనిట్‌గా ఉంటుంది. టీడీపీ, ఇతర పార్టీలు ప్రజలతో సంబంధం లేకుండా కుట్ర రాజకీయాలు చేస్తున్నాయి. చంద్రబాబు అవినీతి కేసులో అరెస్టు అయితే పళ్లాలు మోగించడం, క్రాంతితో కాంతి లాంటి కార్యక్రమాలు నిర్వహించడం ఏమిటి?' అని సజ్జల ప్రశ్నించారు.

స్కిల్ స్కామ్‌లో 13 చోట్ల చంద్రబాబు సంతకాలు..

చంద్రబాబు విప్లవ కార్యక్రమమో, ఉద్యమమో చేసి జైలుకు వెళ్లినట్లు టీడీపీ హడావుడి చేస్తోందని సజ్జల విమర్శించారు. చంద్రబాబు అవినీతిపై స్పష్టమైన ఆధారాలున్నాయన్నారు. ఏ తప్పూ చేయకుంటే తమ ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలన్నారు. కోర్టులో సమర్పించదగ్గ ఆధారాలు సీఐడీ వద్ద ఉన్నాయన్నారు. 'ఒక ప్రైవేట్ వ్యక్తిని తీసుకొచ్చి ప్రభుత్వంలో నాలుగు పదవులు ఇచ్చి పెట్టుకున్నారు. ఇందులో తప్పు చేయలేదని అనలేరు. ఇలాంటి వాటికి చంద్రబాబు సమాధానం చెప్పాల్సిందే. చంద్రబాబు స్కిల్ స్కామ్ కు సంబంధించి 13 చోట్ల సంతకాలు పెట్టిన విషయం వాస్తవమా? కాదా? ఈ విషయాలు నోట్ ఫైల్స్ లో స్పష్టంగా ఉన్నాయి. వీటిని పక్కదోవ పట్టించడానికే ఎలక్టోరల్ బాండ్స్ అంశం తెచ్చారు. అవి బాండ్స్ కాదు క్యాష్ డిపాజిట్ అని నాకు సమాచారం ఉంది. చంద్రబాబు దోషి కాబట్టే ఆయన ప్రభుత్వ హయాంలోనే జీఎస్టీ అధికారులు ఆ విషయాన్ని స్పష్టంగా చెప్పినా అవినీతిని దాచే ప్రయత్నం చేశారు. పిట్ట కథలు, పిట్ట ప్రశ్నలతో స్కాం అంశాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. వైఎస్సార్ హయాంలో వోక్స్ వ్యాగన్ అంశంలో ఆరోపణలు వస్తే ఆ కేసును సీబీఐకి అప్పగించారు. రూ.10 కోట్లలో దాదాపు రూ.8 కోట్లు వెనక్కు తేగలిగారు' అని సజ్జల తెలిపారు.

ఏపీఐఎస్‌తో ఉయ్ ఫౌండర్స్ సర్కిల్ ఎంవోయూ

విశాఖలో ముగిసిన మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సదస్సు

సాక్షి, విశాఖపట్నం: మహిళలను పారిశ్రామికవేత్తలుగా చేస్తూ వారిని చాంపియన్లుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తల సదస్సు సాగింది. ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ (ఏపీఐఎస్), ఎస్‌టీపీఐ, స్టార్టప్ ఇండియా, నాస్కాం, ఎన్ఆర్‌డీసీల ఆధ్వర్యంలో 2 రోజుల పాటు విశాఖలో జరిగిన ఈ సదస్సు శుక్రవారంతో ముగిసింది. ఈ సదస్సుకు రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు హాజరయ్యారు. రెండో రోజు సదస్సులో ఏపీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ(ఎపిటా) సీఈవో డీవీ రామకోటిరెడ్డి మాట్లాడుతూ..మహిళలకు ఎపిటా అందిస్తోన్న ప్రోత్సాహకాలను వివరించారు. ఫ్యాప్సీ కార్యనిర్వాహక సభ్యురాలు హేమ యడవల్లి మహిళలు నిర్వహిస్తున్న స్టార్టప్‌లను విజయపథంలో ఎలా నడపాలో, ఎదురయ్యే సవాళ్లను ఎలా అధిగమించాలో సూచనలు చేశారు. ఏపీ ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్ వింగ్ చైర్‌పర్సన్ లీలారాణి వ్యాపార ఆవిష్కరణల్లో మహిళల పాత్రను విశదీకరించారు. రెండోరోజు సదస్సులో 13 స్టార్టప్ కంపెనీలు తమ ఆలోచనలను పంచుకున్నాయి. అనంతరం ఏపీఐఎస్‌తో ఉయ్ ఫౌండర్స్ సర్కిల్ ప్రైవేట్ లిమిటెడ్ ఎంఓయూ కుదుర్చుకుంది. ఈ సదస్సుకు 150 మంది ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలు హాజరయ్యారు.

బండారును శిక్షించేంత వరకూ పోరాడతా..

- ఆయన వ్యాఖ్యలు దిగజారుడుతనానికి నిదర్శనం
- మనిషిగా ఉండటానికి కూడా బండారు పనికిరాడు
- బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు, జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు, సినీ నటి కుష్బూ



నగరి(చిత్తూరు జిల్లా): ఏపీ మంత్రి రోజాపై టీడీపీ మాజీ మంత్రి బండారు సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు, జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు, సినీ నటి కుష్బు తీవ్ర బాధను, ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. శుక్రవారం ఈ అంశంపై ఆమె స్పందిస్తూ సామాజిక మాధ్యమాల్లో ఓ వీడియోను విడుదల చేశారు. అందులో ఆమె మాట్లాడుతూ ఒక మహిళ గురించి ఇంత అసభ్యకరంగా మాట్లాడటం క్షమించరాని నేరమని.. దీనిని తాను ఖండిస్తున్నట్లు తెలిపారు. స్త్రీని గౌరవించలేని బండారు ఒక మనిషిగా విఫలమయ్యారంటూ మండిపడ్డారు. ఆయన వ్యాఖ్యలు దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. స్త్రీలనుద్దేశించి ఆయన వాడిన పదజాలాన్ని ప్రతి స్త్రీ అసహ్యించుకుంటోందని చెప్పారు. ప్రధాని మోదీ నారీ శక్తి యాక్ట్ ద్వారా మహిళాభ్యుదయానికి, మహిళల ఎదుగుదలకు కృషిచేస్తుంటే.. రాజకీయ కుట్రతో వారిని అణగదొక్కడానికి బండారు లాంటి వారు ఇలాంటి పదజాలాలు వాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ పదజాలం ఆయన మానసిక వైకల్యాన్ని సూచిస్తోందని, అలాంటి వాడు మనిషిగా ఉండటానికి అర్హుడు కాదన్నారు. మంత్రి రోజాకు బహిరంగ క్షమాపణ చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. లేకుంటే బండారును శిక్షించేంత వరకూ పోరాడుతానని కుష్బు హెచ్చరించారు.

మహిళలను కించపరచడం సిగ్గుచేటు

- బండారు క్షమాపణ చెప్పాలి
- సినీ నటి రాధిక



సాక్షి, అమరావతి: ఏపీలో మహిళలను కించపరుస్తూ ప్రతిపక్ష నేతలు దిగజారుడు వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని నటి రాధిక విమర్శించారు. టీడీపీ నేత, మాజీ మంత్రి బండారు సత్యనారాయణ సభ్యతను మరిచి మంత్రి రోజా వ్యక్తిత్వంపై దాడి చేయడం దుర్మార్గమన్నారు. మంత్రికి మద్దతుగా రాధిక శుక్రవారం ట్విట్టర్‌లో ఓ వీడియో పోస్టు చేశారు. ఈ వీడియోలో రాధిక మాట్లాడుతూ.. 'రోజాపై చేసిన వ్యాఖ్యలను తలచుకుంటే గుండె రగులుతోంది. ప్రపంచమంతా భారత మాత అంటూ దేశాన్ని కీర్తిస్తుంటే.. తెలుగుదేశం పార్టీ సభ్యులు మహిళలకు ఎలాంటి గౌరవం ఇస్తున్నారో అర్థమవుతోంది. మహిళలను రాజకీయంగా ఎదుర్కోవడానికి వారి వ్యక్తిత్వ హననానికి పాల్పడితే భయపడతారనుకోవడం అవివేకం. ఉదయం లేచిన దగ్గర్నుంచి మీ ఇంట్లో, మీ వెనుకాల ఏం జరుగుతుందో తెలుసా' అంటూ బండారును నిలదీశారు. బండారుకు వ్యక్తిత్వముంటే మంత్రి రోజాకు క్షమాపణ చెప్పి ఆయన చేసిన తప్పును సరిచేసుకోవాలని హితవుపలికారు. ఇలాంటి ఘటనలపై ప్రధాన మంత్రి స్పందించాలని, పార్లమెంట్, అసెంబ్లీల్లో ముక్తకంఠంతో ఖండించాలని కోరారు.

ప్రకాశం బ్యారేజ్‌కు అరుదైన గుర్తింపు

ప్రపంచ వారసత్వ సాగునీటి కట్టడంగా ఎంపిక



సాక్షి, అమరావతి: కృష్ణా డెల్టాలో 13.08 లక్షల ఎకరాలను సస్యశ్యామలం చేస్తున్న ప్రకాశం బ్యారేజ్‌కు మరో అరుదైన గుర్తింపు లభించింది. ప్రపంచ వారసత్వ సాగునీటి కట్టడంగా ప్రకాశం బ్యారేజ్‌ను ఇంటర్నేషనల్ కమిషన్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజ్ (ఐసీఐడీ) ఎంపిక చేసింది. నవంబర్ 2 నుంచి 8 వరకు విశాఖలో జరిగే ఐసీఐడీ 25వ కాంగ్రెస్‌లో ప్రకాశం బ్యారేజ్‌కి ఇచ్చే అవార్డును రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు అందుకోనున్నారు. ఈ మేరకు రాష్ట్ర జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్‌కు ఐసీఐడీ డైరెక్టర్ అవంతివర్మ తాజాగా లేఖ రాశారు. ప్రకాశం బ్యారేజ్‌తో కలిపి రాష్ట్రంలో ప్రపంచ వారసత్వ సాగునీటి కట్టడాలుగా ఐసీఐడీ గుర్తించిన ప్రాజెక్టుల సంఖ్య ఐదుకు చేరుకుంది. ఇప్పటికే కేసీ (కర్నూలు–కడప) కెనాల్, కంభం చెరువు, పోరుమామిళ్ల చెరువులను 2020లో.. సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్‌ను 2022లో ప్రపంచ వారసత్వ సాగునీటి కట్టడాలుగా ఐసీఐడీ ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. ప్రపంచవ్యాప్తంగా జలవనరుల సంరక్షణ.. తక్కువ నీటితో అధిక ఆయకట్టుకు నీళ్లందించే విధానాలపై అధ్యయనం చేసి, వాటి ఫలాలను దేశాలకు అందించడమే లక్ష్యంగా 1950, జూన్ 24న ఐసీఐడీ ఏర్పాటైంది. పురాతన కాలంలో నిర్మించి.. ఇప్పటికీ ఆయకట్టుకు నీళ్లందిస్తున్న సాగునీటి కట్టడాలను ప్రపంచ వారసత్వ సాగునీటి కట్టడాలుగా ఎంపిక చేసి అవార్డులను ప్రదానం చేస్తోంది.

గ'ఘన' కీర్తి.. జ్ఞాన దీప్తి



రాకెట్ నమూనాలను వీక్షిస్తున్న విద్యార్థులు

- ఆకట్టుకున్న అంతరిక్ష వైజ్ఞానిక ప్రదర్శన
- ఉపగ్రహాలపై అవగాహన కల్పించిన శాస్త్రవేత్తలు
- హాజరైన వివిధ కాలేజీలు, స్కూళ్లకు చెందిన విద్యార్థులు

కర్నూలు సిటీ: అంతరిక్ష పరిశోధనల్లో భారతదేశం సాధించిన విజయాలను వివరిస్తూ ఇండియన్ స్పేస్ రిసెర్చ్ ఆర్గనైజేషన్(ఇస్రో), సతీష్ ధావన్ స్పేస్ సెంటర్(షార్)ల ఆధ్వర్యంలో నిర్వహించిన అంతరిక్ష వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. కర్నూలు నగర శివారులోని జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనను వివిధ కాలేజీలు, స్కూళ్లకు చెందిన విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. ముందుగా ఎగ్జిబిషన్‌ను అతిథులు ట్రిపుల్‌ఐటీడీఎం డైరెక్టర్ డీవీఎల్ఎన్ సోమయాజులు, షార్ డిప్యూటీ డైరెక్టర్ గ్రహదోరయ్, జనరల్ మేనేజర్ ఎస్.నరసింహామూర్తి, జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ చైర్మన్ సుబ్బారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతం కావడంతో ప్రపంచ దేశాలన్నీ భారతదేశాన్ని కీర్తించాయన్నారు. అంతరిక్ష పరిజ్ఞానాన్ని ప్రజలకు, విద్యార్థులకు తెలియజేసేందుకు స్పేస్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంపై ఆసక్తి పెంచుకుని నూతన ఆవిష్కరణలకు నాందిపలకాలన్నారు. ఈ ప్రదర్శనను జిల్లాలోని 15 కాలేజీలు, 52 స్కూళ్లకు చెందిన 6,800 మంది విద్యార్థులు తిలకించారు. విద్యార్థులకు వక్తృత్వ, వ్యాస రచన, చిత్రలేఖన, క్విజ్ పోటీలు నిర్వహించారు. శని, ఆదివారాల్లో కూడా ప్రదర్శన కొనసాగనుంది. ప్రభుత్వ స్కూళ్లకు చెందిన విద్యార్థులకు జి.పుల్లారెడ్డి కాలేజీ యాజమాన్యమే బస్సు సౌకర్యాన్ని కల్పించింది.

అంతరిక్ష పరిశోధనలపై అవగాహన

వైజ్ఞానిక ప్రదర్శనలో శాటిలైట్ లాంచింగ్ విధానం, ఉపగ్రహం షీల్డ్ విడిపోవడం, రోదసిలోకి ప్రయాణించే విధానాన్ని విద్యార్థులకు వివరించారు. రాకెట్‌కు గుండెగా భావించే క్రయోజనిక్ వ్యవస్థ గురించి తెలియజేశారు. ఉపగ్రహాల ద్వారా వాతావరణంలో మార్పులను ఎలా తెలుసుకుంటారు.. సముద్రాలు, గ్రహాల స్థితిగతుల అధ్యయనం ఎలా చేస్తారో చెప్పారు.



స్పేస్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న అతిథులు



అంతరిక్ష ప్రయోగాల గురించి విద్యార్థులకు వివరిస్తున్న దృశ్యం

అద్భుతంగా ఉంది



నమూనా రాకెట్లను చూపించారు. రాకెట్లతో ప్రయోగాలు ఎలా చేస్తారో చెప్పారు. ఎగ్జిబిషన్ అద్భుతంగా ఉంది. అంతరిక్ష పరిశోధనల గురించి చాలా తెలుసుకున్నాం. – షాహిన్, 6వ తరగతి

చాలా నేర్చుకున్నా



సాధారణంగా అంతరిక్ష పరిశోధన కేంద్రాన్ని చూసేందుకు అనుమతించరు. అలాంటిది ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల సందర్భంగా ఇస్రో, షార్‌ల నుంచి సైంటిస్టులు మా కాలేజీకి రావడం చాలా సంతోషంగా ఉంది. వివిధ అంశాలపై వారు మాకు అవగాహన కల్పించారు. ఎగ్జిబిషన్‌లో వలంటీర్‌గా ఉంటూ విద్యార్థులకు వివరిస్తూ చాలా నేర్చుకున్నా.

– బి.మమత, బీటెక్ విద్యార్థిని

అదృష్టంగా భావిస్తున్నా



మా కాలేజీలో అంతరిక్ష వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేయడం అదృష్టంగా భావిస్తున్నా. రాకెట్లు, ఉపగ్రహాల గురించి, వాటిలో వాడే పరికరాల గురించి తెలుసుకోవడం ఆనందంగా ఉంది. వలంటీర్‌గా ఉండి స్పేస్ ప్రయోగాల గురించి, అందులోని వివిధ మాడ్యుల్స్ గురించి స్కూల్ పిల్లలకు వివరిస్తున్నా. – గుణశ్రీ, బీటెక్ విద్యార్థిని

ఎన్నో విషయాలు తెలుసుకున్నా



అంతరిక్షం, రాకెట్ల గురించి ఎన్నో విషయాలు తెలుసుకున్నా. ఎగ్జిబిషన్‌లో ఉపగ్రహాల పనితీరు గురించి చక్కగా వివరించారు. అంతరిక్ష పరిశోధనలు ఎలా చేస్తారో చెప్పారు. ఎగ్జిబిషన్ చాలా బాగుంది.

– శశి, 10వ తరగతి విద్యార్థి

చాలా ఆనందంగా ఉంది



అంతరిక్ష పరిశోధనల గురించి పుస్తకాల్లో చదువుకునే వాళ్లం. చంద్రయాన్–3 విజయవంతం తర్వాత రాకెట్లు ఎలా ఉంటాయో నేరుగా చూడాలని ఉండేది. స్పేస్ ఎగ్జిబిషన్‌లో నమూనా రాకెట్లు చూడటం చాలా ఆనందంగా ఉంది.

– ఓషియా భాను, 10వ తరగతి విద్యార్థి

> పురుష శ్రేష్ఠుడా! సుఖదుఃఖాలలో సమంగా ఉండే ఏ ధీరుణ్ణి ద్వంద్వాలు బాధించవో అతడు అమృతత్వానికి అర్హుడు అవుతాడు.
> – హైందవ ధర్మం

సాక్షి
శనివారం, 7 అక్టోబర్ 2023

ఏ వెలుగులకీ ప్రస్థానం!

చదవేస్తే ఉన్న మతి పోయిందని నానుడి. బాంబే ఐఐటీ పాలకవర్గం నిర్వాకం వల్ల తిండి చుట్టూ మన సమాజంలో అల్లుకొని ఉన్న వివక్ష ఆ ఉన్నత శ్రేణి విద్యాసంస్థను కూడా తాకింది. బాంబే ఐఐటీ హాస్టళ్లలో మూణ్ణెల్ల క్రితం శాకాహారులకు విడిగా టేబుల్స్ కేటాయించాలన్న డిమాండ్ బయల్దేరింది. మాంసాహారుల పక్కన కూర్చుంటే ఆ ఆహారం నుంచి వచ్చే వాసనల కారణంగా తమలో వికారం, వాంతులు వంటి అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని ఆ డిమాండు చేస్తున్న వారి ఫిర్యాదు. ఎప్పుడో 1958లో స్థాపించిన ఆ విద్యాసంస్థలో ఇప్పుడే ఈ డిమాండ్ ఎందుకు తలెత్తిందన్న సంగతలా వుంచితే... దాన్ని అంగీకరిస్తే మాంసాహారం అపవిత్రం లేదా మలినం అని సమాజంలోని కొన్ని వర్గాల్లో నెలకొన్న అభిప్రాయానికి ఆమోదముద్ర వేసినట్టవుతుందన్న సందేహం బాంబే ఐఐటీ పాలకవర్గానికి కలగలేదు. ప్రాంగణంలోని మూడు హాస్టళ్లలో విడిగా ఆరు టేబుళ్లను 'వెజిటేరియన్ ఓన్లీ' బోర్డులతో అలంకరించింది. అంతటితో ఊరుకోలేదు. దీనిపై నిరసన వ్యక్తం చేసిన విద్యార్థికి రూ. 10,000 జరిమానా విధించింది. ఈ నిరసన ఘర్షణకు దారితీస్తుందనీ, క్రమశిక్షణ ఉల్లంఘన కిందికొస్తుందనీ డీన్ అంటున్నారు. ఇలాంటి డిమాండ్ తలెత్తినప్పుడు దానిపై అందరి అభిప్రాయాలూ తీసుకోవటం, ఒక కమిటీని నియమించటం, దాని సాధ్యాసాధ్యాలు, పర్యవసానాలపై చర్చించటం ప్రజాస్వామిక పద్ధతి. అలాంటి విధానమే అమలైవుంటే శాకాహార విద్యార్థులు అంతిమంగా తమ డిమాండ్‌ను వదులుకునేవారో, మాంసాహార ప్రియులు వారి సమస్య పట్ల సానుభూతితో వ్యవహరించేవారో తెలిసేది. ఈ ప్రక్రియ అమలైందా లేదా... అందులో వచ్చిన అనుకూల, ప్రతికూల అభిప్రాయాలేమిటన్నది ఎవరికీ తెలియదు. బాంబే ఐఐటీలోని అంబేడ్కర్ పెరియార్ పూలే స్టడీ సర్కిల్ (ఏపీపీఎస్సీ) విద్యార్థుల ప్రకారం పాలకవర్గం ఈ మొత్తం వ్యవహారాన్ని గోప్యంగా ఉంచింది. కనుక సహజంగానే నిరసనలు వ్యక్తమయ్యాయి. 'మేం ఏం చేసినా శిరసావహించాల్సిందే, లేకుంటే కొరడా ఝుళిపిస్తాం' అన్నట్టు వ్యవహరించటం, ప్రశ్నించటమే నేరమన్నట్టు పరిగణించటం ఉన్నత శ్రేణి విద్యాసంస్థకు శోభస్కరం కాదు. వికారాలున్నవారిని దూరంగా పోయి తినమని చెప్పక గోటితో పోయేదానికి గొడ్డలి అందుకున్నట్టు ఇంత రాద్ధాంతం దేనికో అర్థం కాదు.

పాశ్చాత్య దేశాల్లో కూడా శాకాహారం, మాంసాహారం విభజన వుంది. డెయిరీ ఉత్పత్తులు సైతం సమ్మతం కాదనే వెగానిజం కూడా అక్కడుంది. అమెరికన్లలో గత మూడు నాలుగేళ్లలో దాదాపు 15 శాతం మంది శాకాహారులుగా మారారని ఈమధ్య ఒక సర్వే వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా 2020లో 1,400 కోట్ల డాలర్లుగా ఉన్న వెగాన్ మార్కెట్, ఆ మరుసటి ఏడాదికి 1,577 కోట్ల డాలర్లకు పెరిగిందని మరో సర్వే అంటున్నది. అయితే మన దేశంలో వలే అక్కడ తినే ఆహారం కులాలతో ముడిపడి లేదు. ఇక్కడ శాకాహారులు చాలా ఉన్నతులనీ, మాంసాహారులు తక్కువనీ అభిప్రాయం బలంగా పాతుకుపోయింది. అందుకు మన సంస్కృతి, సంప్రదాయాలు కూడా దోహదపడుతున్నాయి. ఆహారపుటలవాట్లలో కులాన్ని వెతకటం పాక్షిక దృష్టి అంటున్నవారు కొన్ని తూర్పు, ఈశాన్య రాష్ట్రాల్లో, మహారాష్ట్ర, కశ్మీర్ వంటిచోట్ల బ్రాహ్మణులు మాంసాహారులుగా ఉండటాన్ని ఉదహరిస్తున్నారు. కానీ ఇవి చెబుతున్నవారు మన దేశంలో చాలాచోట్ల అట్టడుగు కులాలవారికి అద్దెకు ఇల్లు ఇవ్వకుండా ఉండటానికి 'వెజిటేరియన్లకు మాత్రమే' అనే బోర్డులు పెడుతున్న ధోరణిని మరిచిపోకూడదు. ఏ తల్లిదండ్రులైనా తమ పిల్లలను ఒంటిస్తంభం మేడలో ఉంచి చదువు చెప్పించాలనుకోకుండా... ప్రాథమిక విద్య మొదలుకొని అన్ని దశల్లోనూ విద్యాసంస్థలకు పంపటంలో ఒక అంతరార్థం ఉంటుంది. వివిధ వర్గాల పిల్లలతో కలిసిమెలిసి పెరగటం, సామాజిక అవగాహన పెంపొందించుకోవటం అనే లక్ష్యాలు కూడా అంతర్లీనంగా ఇమిడివుంటాయి. తెలియనిది తెలుసుకోవటం, భిన్నత్వాన్ని గౌరవించటం, అవసరమైతే ప్రశ్నించటం, ఈ క్రమంలో తనను తాను మార్చుకోవటం కూడా విద్యాసముపార్జనలో భాగమే. బాధ్యతాయుతమైన రేపటి పౌరులుగా రూపొందటానికి ఇవన్నీ అవసరం. బాంబే ఐఐటీలో చదువుతున్నవారు పరిశోధనల కోసమో, ఉన్నతోద్యోగాల కోసమో విదేశాలకు వెళ్లవలసి వచ్చినప్పుడు తోటి మనిషి ఆహారాన్ని చూసి వికారాలు తెచ్చుకోవటం అక్కడికి కూడా మోసుకుపోతే క్షణకాలమైనా మనుగడ సాగించగలరా? ఈ ఆలోచన వాళ్లకు రాకపోతే పోయింది... సంస్థ నిర్వాహకులకేమైంది?

ఉన్నతశ్రేణి విద్యాసంస్థల్లో ఈ ఏడాది మొదటి ఏడు నెలల్లో 20 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని రాజ్యసభలో మొన్న జూలైలో కేంద్రం తెలిపింది. ఈ ఉదంతాల్లో వ్యక్తిగత కారణాలను వెదకటం తప్ప సంస్థాగతంగా ఎలాంటి దిద్దుబాటు చర్యలు అవసరమన్న విచికిత్సలోకి పోవటం లేదు. తినే తిండి మొదలుకొని ఎన్నిటినో ఎత్తి చూపి న్యూనత పరిచే ధోరణి ఉండటాన్ని ఈ సంస్థల పాలకవర్గాలు గుర్తించటం లేదు. బాంబే ఐఐటీ మరో అడుగు ముందుకేసి అలాంటి ధోరణులను బలపర్చే నిర్ణయాన్ని తీసుకోవటం ఆందోళన కలిగించే అంశం. ఈ జాడ్యం హైదరాబాద్ ఐఐటీకి కూడా వ్యాపించిందంటున్నారు. ఏకంగా శాకాహారుల కోసం అది ప్రత్యేక హాల్ కేటాయించబోతున్నదన్న వార్తలొస్తున్నాయి. తమ సంస్థల్ని ప్రపంచ శ్రేణి విద్యా కేంద్రాలుగా రూపుదిద్దటం ఎలాగన్న ఆలోచనలు మాని, క్షీణ విలువలను తలకెత్తుకోవటం ఏ మేరకు సమంజసమో నిర్వాహకులు ఆలోచించాలి.

వ్యవసాయ రంగ మేరు నగం

సందర్భం



నరేంద్ర మోదీ
ప్రధాన మంత్రి

ప్రొఫెసర్ ఎం.ఎస్.స్వామినాథన్ కొన్ని రోజుల కిందట (సెప్టెంబర్ 28) మనకు దూరమయ్యారు. వ్యవసాయ రంగాన్ని విప్లవాత్మక మలుపు తిప్పిన ఓ దార్శనికుడిని మన దేశం కోల్పోయింది. భారతదేశానికి ఆ దిగ్గజం చేసిన సేవలు చరిత్రలో సువర్ణాక్షర లిఖితం. మాతృభూమిని అమితంగా ప్రేమించే స్వామినాథన్– మన దేశం సదా సుభిక్షంగా ఉండాలనీ, మన రైతులోకం సౌభాగ్యంతో వర్ధిల్లాలనీ ఆకాంక్షించారు. ఒక తెలివైన విద్యార్థిగా తన ఉజ్వల భవిష్యత్తుకు బాటవేసుకునే వీలున్నా 1943 నాటి బెంగాల్ క్షామం ఆయనను చలింపజేసింది. ఆ రోజుల్లో ఎంతగా ప్రభావితులయ్యారంటే– ఆరు నూరైనా వ్యవసాయ రంగమే తన భవిష్యత్తుగా ఆయన తిరుగులేని నిర్ణయం తీసుకున్నారు.

వ్యవసాయ శాస్త్రంలో చదువు ముగించిన స్వామినాథన్‌కు తొలినాళ్లలోనే ప్రపంచ ప్రసిద్ధ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ నార్మన్ బోర్లాగ్‌తో పరిచయం ఏర్పడింది. నాటి నుంచీ పూర్తిగా ఆయన అడుగుజాడల్లో నడుస్తూ పరిశోధనలను ముందుకు తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో 1950 లోనే అమెరికాలో అధ్యాపకుడిగా ఆయనకు అవకాశం వచ్చింది. కానీ, జన్మభూమి సేవలో తరించడమే తన ధ్యేయమంటూ దాన్ని తిరస్కరించారు.

పెను సవాళ్లతో నిండిన అప్పటి పరిస్థితుల్లో... స్వామినాథన్ మన దేశాన్ని ఆత్మవిశ్వాసంతో స్వావలంబన వైపు నడిపించడాన్ని ఒకసారి ఊహించుకోవాల్సిందిగా కోరుతున్నాను. స్వాతంత్య్రం వచ్చిన తర్వాత తొలి రెండు దశాబ్దాల్లో మనకు ఎదురైన సవాళ్లలో ఆహార కొరత ప్రధానమైనది. 1960వ దశకం తొలినాళ్లలో భారతదేశం కరువు కాటకాలు కమ్ముకుని అల్లాడుతోంది. అటువంటి గడ్డు పరిస్థితుల నడుమ స్వామినాథన్ మొక్కవోని పట్టుదల, నిబద్ధత, ముందుచూపుతో ఉజ్వల వ్యవసాయ శకానికి నాంది పలికారు. వ్యవసాయ రంగంలో, ముఖ్యంగా గోధుమ సాగు వంటి నిర్దిష్ట ఆహార పంటల సమృద్ధి దిశగా మార్గదర్శకుడై నిలిచారు. తద్వారా ఆహార కొరతతో అల్లాడిన భారత్ స్వయం సమృద్ధ దేశంగా రూపొందింది. వ్యవసాయ రంగంలో దేశం సాధించిన ఈ అద్భుత విజయమే ఆయనకు 'భారత హరిత విప్లవ పితామహుడు' బిరుదును ఆర్జించి పెట్టింది.

'ఏదైనా సాధించగలం' అనే భారత ఆత్మస్థైర్యానికి హరిత విప్లవం ఒక సమగ్ర ఉదాహరణగా నిలిచింది. మనకు లక్ష సవాళ్లున్నా, ఆవిష్కరణల ఆలంబనగా వాటిని అధిగమించగల పది లక్షల మేధావుల అండ ఉన్నదని రుజువైంది. హరిత విప్లవం శ్రీకారం చుట్టుకున్న ఐదు దశాబ్దాల తర్వాత నేడు భారత వ్యవసాయ రంగం అత్యధునాతనం, ప్రగతిశీలమైనదిగా మారిందంటే కారణం స్వామినాథన్ వేసిన పునాదులేననే వాస్తవాన్ని మరువలేం. దేశ ఆహార కొరతను అధిగమించడంలో విజయం తర్వాత, ఏళ్ల తరబడి బంగాళాదుంప పంటను దెబ్బతీస్తున్న పరాన్నజీవుల ప్రభావాన్ని అరికట్టే దిశగా ఆయన పరిశోధన చేపట్టి సఫలమయ్యారు. అంతేకాకుండా ఈ పంట చలి వాతావరణాన్ని కూడా తట్టుకోగలిగింది. ఇక ప్రపంచం నేడు చిరుధాన్యాలు లేదా 'శ్రీఅన్న'ను అద్భుత ఆహార ధాన్యాలుగా పరిగణిస్తోంది. స్వామినాథన్ 1990లలోనే చిరుధాన్యాలపై చర్చను ముమ్మరం చేయడమే గాక వాటి సాగును ఇతోధికంగా ప్రోత్సహించారు.

స్వామినాథన్‌తో నాకు వ్యక్తిగత సంబంధాలు ఉండేవి. 2001లో నేను గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయనతో పరిచయం ఏర్పడింది. ఆ రోజుల్లో గుజరాత్ వ్యవసాయపరంగా పెద్దగా నైపుణ్యంగల రాష్ట్రం కాదు. దీనికితోడు వరుస కరువులు, తుపానులు, భూకంపం వంటివి రాష్ట్ర ప్రగతిని దెబ్బతీశాయి. ఈ నేపథ్యంలో మేం ప్రారంభించిన అనేక కార్యక్రమాలలో భూసార కార్డుల పథకం ఒకటి. ఇది భూసారాన్ని చక్కగా అర్థం చేసుకోవడంలో తోడ్పడింది. సమస్యలు తలెత్తినపుడు వాటిని సులువుగా పరిష్కరించడం సాధ్యమైంది. ఈ పథకం అమలు సమయంలోనే నేను స్వామినాథన్‌ను కలిశాను. ఆయన ఈ పథకాన్ని ఎంతగానో మెచ్చుకున్నారు. దాన్ని మరింత మెరుగుపరచడం కోసం విలువైన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఏదైనా పథకంపై సందేహాలు వెలిబుచ్చేవారు స్వామినాథన్ మాటతో ఒక్కసారిగా ఏకాభిప్రాయానికి వచ్చేవారు.



ప్రొఫెసర్ ఎం.ఎస్.స్వామినాథన్

నేను ముఖ్యమంత్రిగా ఉన్నపుడు మాత్రమేగాక, ప్రధానమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టాక కూడా మా మధ్య సంబంధాలు కొనసాగాయి. 2016 నాటి అంతర్జాతీయ వ్యవసాయ–జీవవైవిధ్య మహాసభలలో ఆయనను కలిశాను. మరుసటేడాది 2017లో ఆయన రెండు భాగాలుగా రాసిన పుస్తకాన్ని నేనే ఆవిష్కరించాను. ప్రపంచాన్ని పరస్పరం అనుసంధానించే సూదితో 'తిరుక్కురళ్'లోని ఒక ద్విపద రైతుల గురించి అభివర్ణిస్తుంది. ఎందుకంటే ప్రతి ఒక్కరికీ అన్నదాత రైతే! ఈ సూక్తిని స్వామినాథన్ చక్కగా జీర్ణించుకున్నారు. కాబట్టే, ప్రజలు ఆయనను 'వ్యవసాయ శాస్త్రవేత్త'గా పిలుస్తారు. కానీ, ఆయన ప్రతిభా వ్యుత్పత్తులు అంతకుమించినవని నా విశ్వాసం. ఆయన నిజమైన 'రైతు శాస్త్రవేత్త'. 'రైతుల శాస్త్రవేత్త'. ఆయన మెదడులో శాస్త్రవేత్త ఉంటే, హృదయంలో రైతు ఉన్నాడన్నది నా అభిప్రాయం.

స్వామినాథన్ పరిశోధనలు కేవలం ఆయన విద్యా నైపుణ్యానికి పరిమితం కాదు; వాటి ప్రభావం ప్రయోగశాలల వెలుపలకు... వ్యవసాయ క్షేత్రాలు–పొలాలకు విస్తరించాయి. శాస్త్రీయ జ్ఞానం–ఆచరణాత్మక అనువర్తనాల మధ్య అంతరాన్ని ఆయన పనితీరు తగ్గించింది. వ్యవసాయం రంగంలో సుస్థిరత కోసం ఆయన సదా పాటుపడ్డారు. మానవ పురోగమనం, పర్యావరణ సుస్థిరత నడుమ సున్నిత సమతౌల్యాన్ని నొక్కిచెప్పారు. సన్న–చిన్నకారు రైతుల జీవితాలను మెరుగుపరచడం, ఆవిష్కరణల ఫలాలు వారికి అందించడంలో స్వామినాథన్ ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వడాన్ని నేను తప్పక ప్రస్తావించాలి. ముఖ్యంగా మహిళా రైతుల జీవితాల సాధికారతపై ఆయనెంతో శ్రద్ధాసక్తులు చూపారు.

స్వామినాథన్ లోని మరో విశిష్ట కోణం గురించి కూడా చెప్పాలి. ఆవిష్కరణల విషయంలోనే కాకుండా మార్గదర్శకత్వం వహించడంలోనూ ఆయనొక ఆదర్శమూర్తి. 1987లో ప్రతిష్ఠాత్మక 'వరల్డ్ ఫుడ్ ప్రైజ్' తొలి విజేతగా, దానికింద లభించిన సొమ్ముతో లాభాపేక్ష రహిత పరిశోధన కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కేంద్రం ఇప్పటిదాకా వివిధ రంగాలలో విస్తృత, విశిష్ట పరిశోధనలు నిర్వహించింది. అలాగే ఆయన ఎందరో పరిశోధకులను తీర్చిదిద్దారు. అభ్యాసం, ఆవిష్కరణలపై ఎందరిలోనో శ్రద్ధాసక్తులు రగిలించారు. వేగంగా మారిపోతున్న నేటి ప్రపంచ పరిస్థితుల నడుమ విజ్ఞానం, మార్గదర్శకత్వం, ఆవిష్కరణలకు గల శక్తిసామర్థ్యాలను ఆయన జీవితం ప్రతిబింబిస్తుంది. ఆయన స్వయంగా ఓ సంస్థ స్థాపకులేగాక శక్తిమంతమైన పరిశోధనలు సాగిస్తున్న మరెన్నో సంస్థల స్థాపనకు ఊపిరి పోసినవారు. మనీలాలోని అంతర్జాతీయ వరి పరిశోధన కేంద్రం డైరెక్టర్‌గానూ ఆయన పనిచేయడం ఇందుకు నిదర్శనం. ఈ సంస్థ దక్షిణాసియా ప్రాంతీయ పరిశోధన కేంద్రం 2018లో వారణాసి నగరంలో ప్రారంభమైంది.

డాక్టర్ స్వామినాథన్‌కు నివాళి అర్పిస్తున్న ఈ సందర్భంలో నేను మరో ద్విపదను ప్రస్తావించదలిచాను. 'ప్రణాళిక రూపకర్త దృఢ మనస్కుడైతే... తానేది ఏ రీతిలో ఆకాంక్షించాడో ఆ రీతిలో దాన్ని సాధించగలడు' అని ఈ ద్విపద చెబుతుంది. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయాలనీ, రైతులకు సేవలందించాలనీ చిరుప్రాయంలోనే నిర్ణయించుకున్న మహనీయుడాయన. ఆ విధంగానే వినూత్నంగా, ఆవిష్కరణాత్మకంగా, భావోద్వేగాలతో తాను నిర్దేశించుకున్న లక్ష్యం సాధించారు. వ్యవసాయ ఆవిష్కరణలు, సుస్థిరత దిశగా మన పయనంలో స్వామినాథన్ కృషి, పరిశ్రమ మనకు సదా స్ఫూర్తిదాయక మార్గనిర్దేశం చేస్తాయి. మనం కూడా ఆయనెంతో ప్రీతిగా అనుసరించిన సూత్రాల అమలుకు మన నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ ముందుకు సాగాలి. రైతుల సంక్షేమం ప్రాతిపదికగా శాస్త్రీయ ఆవిష్కరణల ఫలాలు మూలాలకు చేరేలా చూడాలి. తద్వారా భవిష్యత్తరాలను వృద్ధి, సుస్థిరత, సౌభాగ్యం వైపు ప్రోత్సహించాలి.

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

బందీగా విజేత



బందీగా ఉన్న ఇరానియన్ మానవ హక్కుల యాక్టివిస్ట్ నర్గీస్ మొహమ్మదీకి నోబెల్ శాంతి బహుమతి వచ్చింది. ఇరాన్ జైళ్లలో మగ్గుతున్న చురుకైన మెదళ్ల జాబితా పెద్దది. ఇప్పుడు ఆ జాబితాకు ఒక నోబెల్ శాంతి బహుమతి విజేతను కలుపుకోవాలి.

– నజానిన్ నూర్, ఇరానియన్ అమెరికన్ నటి

ప్రత్యేక రోజు



నార్వేజియన్ నోబెల్ కమిటీ నర్గీస్ మొహమ్మదీకి నోబెల్ శాంతి బహుమతి ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇరానియన్లు, స్వాతంత్య్ర పోరాట యోధులు, మహిళల హక్కుల కోసం పోరాడుతున్న యాక్టివిస్టులందరికీ ఇది ప్రత్యేక రోజు.

– రెజా, విజువల్ స్టోరీటెల్లర్

సొంత లక్ష్యాలుండవా?



నేనేమీ ఇండియా మీద, ఈ భౌగోళిక రాజకీయాల మీద నిపుణురాలిని కాదుగానీ, 140 కోట్ల జనాభా కలిగిన దేశాన్ని తన సొంత ప్రయోజనాలు, లక్ష్యాలు ఉండే దేశంగా చూడాలే తప్ప, కేవలం చైనాకు ప్రతి సమ తూకంగా(కౌంటర్‌వెయిట్) చూడకూడదు.

– త్రిన్హ్ ఎంగుయెన్, ఆర్థికవేత్త

సోషల్ ట్రెండ్



ఓ 5 స్టార్ హోటల్లో ఓ కుటుంబం దిగడం చూశాను. తల్లి, కూతురు వేర్వేరుగా రీల్స్ తీసుకోవడంలో మునిగారు. పాపం, భర్తేమో ఆ 'చెక్ ఇన్' పనులు చూసుకుంటున్నాడు. ఎంజాయ్ చేయడం కన్నా, తాము ఎంజాయ్ చేస్తున్నామని జనాన్ని నమ్మించడం ఈమధ్య ఎక్కువైపోయింది.

– ఇద్రీస్ ముబారిక్, వైద్యుడు

విలువైన మూడు



మొదటి బహుమతి జీవితం. రెండవ బహుమతి ప్రేమ. మూడవ బహుమతి మనశ్శాంతి.

– వాలా అఫ్షార్, డిజిటల్ ఇవాంజెలిస్ట్

పేదజనం... ప్రగతిపథం

ప్రపంచ దేశాలతో సుస్థిర అభివృద్ధి గమనంలో పోటీ పడుతున్న భారతదేశం స్వాతంత్య్ర శతాబ్ది 2047 నాటికి అగ్రస్థానంలో నిలవాలని పరితపిస్తోంది. అధిక ఆదాయ స్థితి సాధనకు రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి శక్తిమంతంగా పని చేస్తోంది. ఒకవైపు కేంద్రం, మరోవైపు రాష్ట్ర ప్రభుత్వాలు పేదరిక నిర్మూలనలో మునిగిపోయాయి. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువయింది.

2022–23 ఆర్థిక సంవత్సరంలో నీతి ఆయోగ్ వెల్లడించిన జాతీయ బహుముఖ పేదరిక సూచిక (ఎంపీఐ) తాజా నివేదిక ప్రకారం, రాష్ట్రంలో పేదరికం రేటు 11.77 శాతం నుంచి 6.06 శాతానికి తగ్గింది. గ్రామాల్లో పేదరికం తగ్గింపు రేటు సగానికి పైగా దిగింది. పోషకాహారం, శిశు, కౌమార దశ మరణాలు; ప్రసూతి ఆరోగ్యం, పాఠశాల విద్య, హాజరు, వంట ఇంధనం, పారిశుద్ధ్యం, తాగు నీరు, విద్యుత్, గృహాలు, ఆస్తులు, బ్యాంకు ఖాతాల గణాంకాలను వినియోగించి నీతి ఆయోగ్ తాను ఈ నివేదికను రూపొందించినట్లు పేర్కొంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇంతవరకు ఏ ముఖ్యమంత్రీ అనుసరించని పాలనా పద్ధతుల్ని జగన్ ప్రవేశపెట్టారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి సంక్షేమాన్ని పొందవచ్చో తెలియజేసే వాలంటీరు వ్యవస్థ పేద ప్రజల వెంట నడుస్తోంది. అర్హులయిన లబ్ధిదారులంతా నవరత్నాలతో పాటు ఎప్పటికప్పుడు అమల్లోకి వస్తున్న మిగతా ప్రభుత్వ పథకాల్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ప్రజలకు ప్రభుత్వాన్ని మరింతగా చేరువ చేసింది. దీంతో ప్రజాపాలనలో రెట్టింపు వేగం పెరిగింది.

మానవ వనరుల సంపదకు పునాది వేయడానికి వ్యవసాయం, విద్య, ఆరోగ్య సంరక్షణ మూలస్తంభాలని ముఖ్యమంత్రి బలంగా విశ్వసిస్తున్నారు. భారతదేశంలో అతిపెద్ద వ్యవసాయ ఆధారిత రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమైనది. రాష్ట్రంలో 67 శాతానికి పైగా ప్రజలు ఈ రంగంలో నిమగ్నమై జీవిస్తున్నారు. కాబట్టి వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడానికి సుస్థిర విధానాలను ప్రభుత్వం అమలు చేస్తోంది. రాష్ట్రంలో 70 శాతం మంది సన్నకారు రైతులకు 'రైతు భరోసా'తో రబీ, ఖరీఫ్ పంటల్లో బాసటగా నిలుస్తుంది. పంటలు విఫలమయితే తదుపరి పంటపనులకు ముందుగానే రైతులకు బీమా అందిస్తోంది. పాడి, మత్స్య పరిశ్రమలకు తగిన సహకారం లభించింది. రాష్ట్ర అభివృద్ధిలో ఈ పరిశ్రమల వాటా పెరిగింది. ప్రభుత్వం స్వయం ఉపాధి, సాంప్రదాయ వృత్తుల నేత కార్మికులు, టైలర్లు, డ్రైవర్లు తదితర చేతివృత్తిదారులకు ఆర్థికంగా అండగా నిలుస్తుంది. మహిళల నేతృత్వంలోని స్వయం సహాయక బృందాలకు సకాలంలో రుణ సహాయాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు.

'ఆంధ్రప్రదేశ్‌ను దేశంలో అగ్రగామి రాష్ట్రంగా నిలపాలన్నది ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి ఆశయం. ''అందుకు నేను నా వంతు కృషి చేస్తున్నాను. నిజానికి నేను చేయలేనిది చేసిన వాగ్దానాన్ని ఉల్లంఘించడం. మీరు నా ప్రభుత్వం నుండి లబ్ధి పొందితేనే నాకు ఓటు వేయండి అనే నినాదంతో రేపటి ఎన్నికల్లో ప్రజల ముందుకు వెళ్తాను. నాకు ప్రజలు అద్భుత ఫలితాలు అందిస్తారని ప్రగాఢంగా విశ్వసిస్తున్నాను'' అంటున్నారు ఆయన. పేద ప్రజలను ప్రగతిపథంలో నడిపిస్తున్న ఆయన అభివృద్ధి, సంక్షేమ పాలన మీద ఆయనకున్న నమ్మకం ఇది.

– జి. యోగేశ్వరరావు, సీనియర్ జర్నలిస్ట్, 95028 12920.

1948 పోలీస్ యాక్షన్ – మరో కోణం

విశ్లేషణ




దానీ

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం, అది సృష్టించిన సాహిత్యం మన రాజకీయాల్లో, సాహిత్యంలో చివరకు మన జీవితాల్లోనూ విడదీయరాని భాగం. ఇప్పుడు కమ్యూనిస్టు పార్టీలకు రెండు తెలుగు రాష్ట్రాల చట్టసభల్లో ఒక్క ప్రతినిధి కూడా లేడు. అయినప్పటికీ, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో వామపక్ష భావజాలమే ఇప్పటికీ బలంగా ఉంది. తెలుగు సాహిత్యంలో అత్యధిక భాగం 'సామ్యవాద వాస్తవికత' ప్రభావంలోనే ఉందంటే అతిశయోక్తి కాదు.

భాషా ప్రయుక్త రాష్ట్రాల విధానం వచ్చాక 1956లో తెలంగాణ ప్రాంతాన్ని ఆంధ్రరాష్ట్రంతో కలిపి ఆంధ్రప్రదేశ్‌ను ఏర్పాటు చేశారు. నిజాం సంస్థానం చాలా పెద్దది. అందులోని ఐదు ప్రధాన ప్రాంతాల్లో తెలంగాణ ఒకటి. తెలంగాణలోని నల్లగొండ, వరంగల్ రెండు జిల్లాల్లో ప్రధానంగానూ, మరో ఒకటి రెండు జిల్లాల్లో స్వల్పంగానూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం సాగింది. ఆనాటి చారిత్రక సంఘటనల మీద తమ అనుభవాలను గ్రంథస్థం చేసిన ఆ పోరాట అగ్రనాయకులు అందరూ తెలంగాణకు పరిమితమయ్యారు. తమ పుస్తకాలకు నిజాయితీగా 'తెలంగాణ' అనే శీర్షికలే పెట్టారు. మిగిలిన నిజాం సంస్థానాన్ని వదిలేశారు. దానికి రెండు కారణాలు. మొదటిది ఉర్దూ భాషా సమస్య, రెండోది ముస్లిం మత సమస్య.

నిజాం పాలన గురించి మనకు, ముఖ్యంగా, తెలుగు పాఠకులకు తెలిసింది చాలా తక్కువ. నిజాం సంస్థానంలో పెట్టుబడీదారీ అభివృద్ధి గురించి పరిశోధనలు చేసిన ప్రొఫెషనల్స్ కొందరు లేకపోలేదు. వారిలో ఒకడైన సివి సుబ్బారావు ఆ రోజుల్లో జవహర్ లాల్ నెహ్రూ వాగ్దానం చేసిన ఇండియాకన్నా మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ పాలనలోని నిజాం సంస్థానంలో కొనసాగుతున్న అభివృద్ధి మెరుగ్గా ఉందనే నిర్ధారణకు వచ్చాడు.

ఇంతకీ తెలంగాణ సాయుధ పోరాటం ద్వారా భారత కమ్యూనిస్టు పార్టీ సాధించిందేమిటి? వాదన కోసం; నిజాం రాచరిక పాలననో, జాగీర్దార్ల భూస్వామ్యాన్నో వాళ్ళు అంతం చేసేశారు అనుకుందాము. భూస్వామ్య వ్యవస్థను అంతం చేశాక పెట్టుబడీదారీ వ్యవస్థ ఏర్పడుతుందని సాక్షాత్తు 'కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక'లో కార్ల్ మార్క్స్– ఫ్రెడరిక్ ఏంగిల్స్ చెప్పారు. అంతేకాని భూస్వామ్య వ్యవస్థను కూల్చేస్తే సమసమాజం వస్తుందనో, కమ్యూనిస్టు రాజ్యం వస్తుందనో, కనీసం 'రైతు–కూలీ రాజ్యం' వస్తుందనో వాళ్ళెక్కడా చెప్పలేదు.



తెలంగాణలో కమ్యూనిస్టు పార్టీ రాచరిక – భూస్వామ్య వ్యతిరేక పోరాటం చేసిన తరువాత అక్కడ అత్యంత సహజంగానే పెట్టుబడీదారీ వ్యవస్థ అభివృద్ధి చెందడాన్ని మనందరం చూస్తున్నాం. 1940ల చివర్లో ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీగానీ, 1980ల మొదట్లో నక్సలైట్ పార్టీలుగానీ ఉద్దేశ్యపూర్వకంగా కాకపోయినా పెట్టుబడిదారులు పెరగడానికి కారణమయ్యారు. సమాజానికి తనదైన ఒక రోడ్ మ్యాప్ ఉంటుంది. ఒకరు అనుకున్నా అనుకోకపోయినా అదలా సాగిపోతుందంతే. ఒక కఠోర చారిత్రక వాస్తవం ఏమంటే ప్రపంచంలో ఇప్పటి వరకు పెట్టుబడీదారీ వ్యవస్థ అభివృద్ధి చెందిన ఏ దేశంలోనూ సోషలిస్టు విప్లవం విజయవంతం కాలేదు.

1948 నాటి పోలీస్ యాక్షన్ గురించి కమ్యూనిస్టు నాయకులు చెప్పని ఇంకో పెద్ద నిజం కూడా ఉంది. జె.ఎన్. చౌదరి నాయకత్వంలోని 'పోలీసు యాక్షన్' కమ్యూనిస్టు ప్రభావిత జిల్లాలకు చేరుకోవడానికి ముందే నిజాం సంస్థానంలో సాయుధపోరాటంలో మరణించిన 3 వేలకు ఓ పది రెట్లకు పైగా ముస్లింలను అతి క్రూరంగా చంపేశారు. వాళ్ల ఆస్తుల్ని స్వాధీనం చేసుకున్నారు. దీనిపైన నెహ్రూ వేసిన సుందర్ లాల్ బహుగుణ కమిటీ మాత్రమే కాక, ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీకి అప్పటి పార్లమెంటరీ రాజకీయాల వేదికగా ఉన్న 'పీపుల్స్ డెమోక్రాటిక్ ఫ్రంట్'(పీడీఎఫ్) నాయకులు కూడ ఒక నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందచేశారు. సుందర్ లాల్ బహుగుణ నివేదికను జాతీయభద్రత దృష్ట్యా చాలా కాలం దాచిపెట్టారుగానీ ఇప్పుడు అది అందుబాటులో వుంది.

ఇండో–అమెరికన్ రచయిత అఫ్సర్ మహమ్మద్ 1948 నాటి పోలీస్ యాక్షన్ బాధిత కుటుంబాల సంతతిని కలిసి వాళ్ళ అనుభవాలను నమోదు చేసే బాధ్యతను భుజాన వేసుకున్నాడు. ఈ అంశం మీద ఓ దశాబ్దం పాటు విస్తృత పరిశోధనలు చేసి ఇప్పుడు 'రీమేకింగ్ హిస్టరీ –1948 పోలీస్ యాక్షన్ అండ్ ది ముస్లిమ్స్ ఆఫ్ హైదరాబాద్' శీర్షికతో ఒక భారీ చారిత్రక డాక్యుమెంట్ ప్రచురించాడు. 2002 గుజరాత్ అల్లర్ల తరువాత తను ముస్లిం సమాజం మీద దృష్టి పెట్టాడు. మొహర్రం పండుగ సందర్భంగా తెలంగాణలో వెల్లివిరిసే మతసామరస్యం మీద పరిశోధన సాగించాడు. ఆ క్రమంలో 1948 పోలీస్ యాక్షన్ బాధితులు అతనికి తారసపడ్డారు. దాచేస్తే దాగని సత్యాలను వెళ్ళడించడానికి సిద్ధపడ్డాడు. దాని ఫలితమే ఈ పరిశోధనా గ్రంథం.

ప్రపంచం అనేది చాలా పెద్దది. అందులో మనకు తెలిసింది చాలా తక్కువ, తెలియాల్సింది చాలా ఎక్కువ అనే స్పృహ చాలామందికి ఉండదు. ప్రపంచం మొత్తం తెలియకపోయినా మనదేశం గురించి, మన రాష్ట్రం గురించయినా తెలియాలి. హీనపక్షం మనతో వందల సంవత్సరాలుగా సహజీవనం చేస్తున్న సమూహాల మనోభావాలనైనా తెలుసుకోవాలిగా. దానికి ఈ పుస్తకం తోడ్పడుతుందని ఆశిస్తాను.

వ్యాసకర్త సమాజ విశ్లేషకులు, సీనియర్ జర్నలిస్టు
మొబైల్: 9010757776

క్షమాగుణం

> క్షమా శస్త్రం కరే యస్య దుర్జనః కిం కరిష్యతి?
> అతృణో పతితో వహ్నిః స్వయమేవోపశమ్యతి!

గడ్డి పరక లేని నేలమీద పడిన మంట తనంత తానే ఆరిపోతుంది. ఎవరి దగ్గరైతే క్షమ అనే శస్త్రం ఉంటుందో వారిని దుర్జనులు కూడా ఏమీ చేయలేరని శ్లోకం భావం. మంట తనని కాలుస్తున్నా తిరిగి ప్రతీకారం తీర్చుకోకుండా నేలతల్లి సహనం వహించడం వల్ల మంటలో ఉన్న కాలే గుణం తగ్గి పోతుందట.

రావణుడితో మొదటిసారి యుద్ధంలో తలపడినప్పుడు 'సీతను అప్పగించి శరణు కోరితే క్షమించి వదిలేస్తాను' అని పలికాడు రాముడు. ఎంతటి శత్రువునైనా క్షమించగల దయా గుణ సంపన్నుడు రాముడు. తన భార్యని అపహరించిన శత్రువుని కూడా క్షమాగుణంతోనే పలకరించాడు. రావణుడు చనిపోయాక శ్రాద్ధ కర్మల అవసరం లేదని విభీషణుడు చెప్పగా 'ఎంతటి శత్రువైనా మరణంతో పగలన్నీ మరచిపోవాలి. అతడు మీకెలా సోదరుడో నాకూ అంతే. అతడికి సద్గతులు కలగాలంటే శ్రాద్ధ కర్మలు జరిపించాలని' పలికాడు.



అంతటి క్షమాగుణం సీతాపతిది. కార్తవీర్యార్జునుడిని, పదిహేడు అక్షౌహిణుల సైన్యాన్ని హతమార్చిన పరశురాముడితో తండ్రి జమదగ్ని 'క్షమయే మన ధర్మం. ధర్మతత్వానికి క్షమయే మూలం. క్షమ కలిగి ఉండడం చేతనే సర్వేశ్వరుడు బ్రహ్మ పదాన్నీ, సకల జీవరాశినీ పరి పాలిస్తున్నాడు. క్షమ కలిగి ఉంటే సిరి కలుగుతుంది. విద్య అబ్బుతుంది. సౌఖ్యాలు కలుగుతాయి. శ్రీహరి మెప్పు పొందగలరని' హితబోధ చేశాడు. ఫలితంగా ఏడాది పాటు తీర్థయాత్రలు చేశాడు పరశురాముడు.

ఈ కాలం వారికి వింతగా కనబడవచ్చు కానీ క్షమాగుణానికి ఉన్న బలం అంచనా కట్టలేనిది. ఎవరైనా ఒక్క మాటంటే భరించలేకపోవడం, దూషిస్తూ తిరిగి ఎదురుదాడి చేయడం నేటి కాలంలో చూస్తుంటాం. ఒక్క క్షణం ఓపికతో అవతలి వారి కోణంలో ఆలోచిస్తే వారి మీద కోపం రావడం బదులు సానుభూతి కలుగుతుంది. క్షమాగుణాన్ని చూప డమంటే చేతకానితనం కాదు. ఆత్మబలమున్న బలవంతులకే అది సాధ్యం.

– అమ్మాజీ ఉమామహేశ్వర్

గ్రహం అనుగ్రహం శ్రీశోభకృత్‌నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, భాద్రపద మాసం, **తిథి:** బ.అష్టమి ఉ.10.05 వరకు, తదుపరి నవమి **నక్షత్రం:** పునర్వసు రా.2.31 వరకు, తదుపరి పుష్యమి, **వర్జ్యం:** ప.1.36 నుండి 3.21 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.55 నుండి 7.29 వరకు, **అమృతఘడియలు:** రా.11.55 నుండి 1.34 వరకు; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 5.54, **సూర్యాస్తమయం:** 5.43.

కాపు సామాజికవర్గానికి కళంకం తెస్తున్న పవన్

- కైకలూరు ఎమ్మెల్యే నాగేశ్వరరావు ధ్వజం
- రంగాను హత్యచేయించిన వారితో అంటకాగుతావా?
- ముద్రగడ కుటుంబాన్ని హింసించినప్పుడు ప్రశ్నించలేదేం
- నాపై ఆరోపణలు నిరూపిస్తే గుండు గీయించుకుంటా



కైకలూరు: వంగవీటి మోహనరంగాను హత్య చేయించిన హంతకులతో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అంటకాగుతూ కాపు సామాజికవర్గానికే కళంకం తెస్తున్నారని ఏలూరు జిల్లా కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) మండిపడ్డారు. ముదినేపల్లి వారాహి సభలో తనపై, తన కుమారుడిపై పవన్ చేసిన వ్యాఖ్యలకు ఘాటుగా సమాధానం ఇచ్చారు. శుక్రవారం ఇక్కడ తన నివాసం వద్ద విలేకరుల సమావేశంలో డీఎన్నార్ మాట్లాడుతూ.. ముద్రగడ, ఆయన కుటుంబాన్ని తెలుగుదేశం ప్రభుత్వం హింసించినప్పుడు పవన్ ఎందుకు ప్రశ్నించలేదన్నారు. అవినీతి ఆరోపణలతో చంద్రబాబు జైలుకు వెళితే రోడ్డుపై పవన్ పొర్లు దండాలు పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. పొలిటికల్ బ్రోకర్, మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ రాసిచ్చిన స్క్రిప్టునే పవన్ చదివాడని ధ్వజమెత్తారు. కామినేని ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు, ఇప్పుడు వైఎస్సార్‌సీపీ పాలనలో జరిగిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. గుడ్లవల్లేరు లాకుల వద్ద స్లూయిజ్ ఏర్పాటుతో కైకలూరు నియోజకవర్గానికి తాగునీటిని తీసుకొచ్చిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.

పవన్ అవాస్తవాలపై సవాల్..: కొల్లేరులో తాను అక్రమాలు చేసినట్లు పవన్ చేసిన ఆరోపణలు నిరూపిస్తే అతని వద్దే గుండు గీయించుకుంటానని, నిరూపించలేకపోతే పవన్ ఏమి చేస్తాడో చెప్పాలని డీఎన్నార్ సవాల్ విసిరారు. తన కుమారుడు దందాలు చేస్తున్నట్లు పవన్ ఆరోపించడంపై మండిపడ్డారు. పెద్దింట్లమ్మ వారధి నెల రోజుల్లో ప్రారంభం కానుండగా నిర్మాణం ఆలస్యమైందని చెప్పడం పవన్ అవివేకమన్నారు. రూ. 4 కోట్లతో కలిదిండిలో రోడ్డు నిర్మాణం జరుగుతోందన్నారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలో వివిధ పథకాలు, అభివృద్ధి పనుల నిమిత్తం రూ. 1,613.90 కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. వైఎస్సార్–జగనన్న విలేజ్ వద్ద రూ. 5.4 కోట్లతో డంపింగ్ యార్డు, తాగునీటి చెరువును ఏర్పాటు చేస్తున్నామని, కొల్లేరు ప్రజల తాగునీటికి పైపులైను పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు.

శాంతిభద్రతల సమస్య సృష్టించేందుకు పవన్ యత్నం

- పోలీసులు చర్యలు తీసుకోవాలి
- ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్‌నాయక్

సాక్షి, అమరావతి: ఒక రాజకీయ పార్టీ అధ్యక్షుడిగా ఉన్న పవన్‌కళ్యాణ్.. తన కార్యకర్తలను రెచ్చగొట్టి శాంతిభద్రతల సమస్య సృష్టించే ప్రయత్నం చేయడం దారుణమని, అతని బాధ్యతారాహిత్యాన్ని ఏ మాత్రం ఉపేక్షించకూడదని రాష్ట్ర పోలీసులకు ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. గౌరవప్రదమైన స్థానంలో ఉన్న ముఖ్యమంత్రిని కించపరిచేలా మాట్లాడటం పవన్ దిగజారుడుతనానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఉన్మాదంతో ఊగిపోతున్న పవన్.. వారాహి యాత్ర పేరుతో అలజడులు సృష్టించేలా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. పెడనలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు తనపై దాడికి వచ్చారంటూ ఆధారం లేని ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. పవన్ వ్యాఖ్యలను ఆసరాగా తీసుకున్న జనసైనికులు సోషల్ మీడియా ద్వారా రెచ్చగొట్టే పోస్టులు పెట్టి అలజడులు సృష్టించేలా వ్యవహరిస్తున్నారని తెలిపారు. శాంతిభద్రతల సమస్యను సృష్టించి దాన్ని ప్రభుత్వంపైకి నెట్టేందుకు పవన్ ప్రయత్నిస్తున్నారని అనుమానం వ్యక్తం చేశారు. రెచ్చగొట్టి రచ్చ చేసేలా వ్యవహరిస్తున్న పవన్‌పై పోలీసులు చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని శంకర్‌నాయక్ డిమాండ్ చేశారు.

16 కేజీల గంజాయి పట్టివేత



పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు

గూడూరు రూరల్ (తిరుపతి జిల్లా): చిల్లకూరు మండలం బూదనం టోల్ ప్లాజా వద్ద ఎన్‌హెచ్ 16వ జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున వాహనాలను తనిఖీ చేస్తుండగా ఆర్టీసీ బస్సులో అక్రమంగా రవాణా చేస్తున్న రూ.3.30లక్షల విలువైన 16 కేజీల గంజాయి పట్టుబడింది. గూడూరులోని ఎస్ఈబీ కార్యాలయంలో తిరుపతి జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి, ఏఎస్పీ ఎ.రాజేంద్ర కేసు వివరాలు శుక్రవారం విలేకరులకు వెల్లడించారు. ఆయన మాటల్లో.. తమిళనాడు రాష్ట్రంలోని మధురైకి చెందిన వి.మహేష్, ముత్తు అమ్మాల్ అనే ఇద్దరు వ్యక్తులను శివ అనే వ్యక్తి విజయవాడ వెళ్లి గంజాయి తీసుకురమ్మని పంపాడు. శివకు తెలిసిన వ్యక్తి విజయవాడ బస్టాండ్‌లో 16 కేజీల గంజాయిని మహేష్, ముత్తు అమ్మాల్‌కు అప్పగించాడు. వీరు విజయవాడ నుంచి తణుకు డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సులో తిరుపతికి గంజాయిని తరలించి, అక్కడి నుంచి మధురైకి తీసుకెళ్లేందుకు గంజాయిని బ్యాగుల్లో ఉంచి రవాణా చేశారు. గూడూరు ఎస్ఈబీ సీఐ పి.విజయ్‌కుమార్, సిబ్బంది వాహనాలను తనిఖీ చేస్తుండగా గంజాయి అక్రమ రవాణాను గుర్తించారు. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

విశాఖ ఎయిర్‌పోర్ట్ పునరుద్ధరణ పనులు వేగంగా పూర్తి చేయండి

- కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌ను కోరిన ఎంపీ జీవీఎల్

సాక్షి , న్యూఢిల్లీ : విశాఖపట్నం విమానాశ్రయం పునరుద్ధరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను, కేంద్ర రక్షణ శాఖ కార్యదర్శి గిరిధర్‌ను బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు కోరారు. పునరుద్ధరణ కోసం నెలల పాటు విమానాశ్రయ రన్ వేను మూసివేయడం వల్ల ప్రయాణికులకు అసౌకర్యం, వ్యాపార కార్యకలాపాలకు తీవ్ర ఆటంకంగా ఉందన్నారు. ఢిల్లీలో శుక్రవారం కేంద్ర మంత్రిని కలిసిన ఎంపీ జీవీఎల్.. ఇండియన్ నేవీ నియంత్రణలో ఉన్న విశాఖపట్నం విమానాశ్రయంలో చేపట్టనున్న ప్రతిపాదిత రన్ వే రీసర్ఫేసింగ్ కారణంగా ఈ ఏడాది నవంబర్ 15 నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ 1వ తేదీ వరకు రాత్రి 9.00 నుంచి ఉదయం 8.00 గంటల మధ్య రన్‌వేను మూసివేయాలని నిర్ణయించారని.. ఇది విశాఖ వాసులకు ఇబ్బందికరంగా మారిందన్నారు. ఆధునిక పద్ధతులు, సాంకేతికతలను అనుసరించడం ద్వారా విమానాశ్రయంలో పునరుద్ధరణ పనుల వ్యవధిని తగ్గించొచ్చని తెలిపారు.

'వాస్కోడిగామా ఎక్స్‌ప్రెస్'లో పొగలు

గిద్దలూరు రూరల్: గోవా నుంచి హౌరాకు వెళ్లే వాస్కోడిగామా ఎక్స్‌ప్రెస్ రైలు గురువారం అర్ధరాత్రి ప్రకాశం జిల్లా గిద్దలూరు రైల్వే స్టేషన్‌కు చేరుకోగానే రైలు బోగి నుంచి పొగలు వచ్చాయి. దీంతో ప్రయాణికులు భయాందోళనకు గురై రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంపైకి పరుగుతీశారు. వీరి కేకలను గమనించిన రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. రైలు బోగి చక్రాల రాపిడి వల్ల పొగలు వచ్చాయని గమనించి మంటలు వ్యాపించకుండా ముందు జాగ్రత్తగా గ్యాస్ బండిల్స్‌ను ఉపయోగించారు. ఎటువంటి ప్రమాదం లేదని ప్రయాణికులకు ధైర్యం చెప్పి రైలులో ఎక్కించారు. ఈ ఘటన వల్ల ఎక్స్‌ప్రెస్ రైలు 15 నిమిషాలు గిద్దలూరు రైల్వేస్టేషన్‌లో నిలిచిందని రైల్వే అధికారులు తెలిపారు.

గ్యాస్ లీకై నలుగురు మహిళలకు అస్వస్థత

- ఐస్ ఫ్యాక్టరీ తొలగిస్తుండగా ఘటన

కాళ్ల: ఐస్ ఫ్యాక్టరీని తొలగిస్తుండగా గ్యాస్ లీక్ అవడంతో పక్కనే ఉన్న ఫ్యాక్టరీలోని మహిళా కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన పశ్చిమ గోదావరి జిల్లా కాళ్ల మండలంలో శుక్రవారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు..మండలంలోని కోపల్లె గ్రామంలో ఆర్‌వీఆర్ రొయ్యల ఫ్యాక్టరీని ఆనుకుని ఉన్న ప్రభు ఐస్ ఫ్యాక్టరీ ఐదేళ్లుగా నిరుపయోగంగా ఉంది. ఐస్ ఫ్యాక్టరీని తొలగించే పనులు శుక్రవారం చేపట్టారు. కంప్రెషర్‌లో నిక్షిప్తమై ఉన్న గ్యాస్ లీకవ్వడంతో దాని ప్రభావానికి ప్లాంట్‌ను ఆనుకుని ఉన్న ఆర్‌వీఆర్ ఫ్యాక్టరీలో పనిచేస్తోన్న మహిళా కార్మికులు అస్వస్థతకు గురైనట్టు తెలిపారు. ఫ్యాక్టరీ యాజమాన్యం, నలుగురు మహిళా కార్మికులను భీమవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాళ్ల పోలీసులు, భీమవరం ఫైర్ సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కాళ్ల ఎస్ఐ వీరభద్రరావు మాట్లాడుతూ.. ప్రమాదంపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. బాధితుల ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు భీమవరం ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ చెప్పారు.

చదును చేస్తున్నా చెత్త రాతలా!

- మాటకు కట్టుబడి ఎమ్ఎస్ఎన్ చారిటీస్ గ్రౌండ్‌ను ఆధునీకరిస్తున్న 'ద్వారంపూడి'
- తట్ట మట్టి వేయకుండా 'కొండబాబు' రాద్ధాంతం
- మహాదాత నాయకర్ సమకూర్చిన రంగూన్ టేకు మటుమాయం
- విద్యాసంస్థ ప్లేగ్రౌండ్ అభివృద్ధి పనులపై విషం కక్కుతున్న ఈనాడు




ఎంఎస్ఎన్ చారిటీస్ లోపలికి వెళ్లే రహదారి అధ్వానంగా ఉన్న దృశ్యం(నాడు).. సీసీరోడ్డుతో నేడు




ఎంఎస్ఎన్ చారిటీస్‌లో అధ్వానంగా ఉన్న రోడ్లు (నాడు).. సీసీరోడ్లతో నేడు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ఆట స్థలం నీట మునిగిపోవడంతో మానసికోల్లాసానికి దూరమైన వేలాది మంది విద్యార్థుల ఇబ్బందులపై స్పందించిన కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మంచి చేయడానికి ఉపక్రమించడం 'ఈనాడు'కు కంటగింపుగా మారింది. పిల్లలకు మంచి జరుగుతుంటే పార్టీలు, రాజకీయాలకు అతీతంగా తలో చేయి వేసి సహకరించాల్సింది పోయి విషం కక్కడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. మహాదాత మల్లాడి సత్యలింగ నాయకర్ దాతృత్వంతో ఏర్పాటైన కాకినాడ జగన్నాథపురం ఎమ్ఎస్ఎన్ చారిటీస్ విద్యాసంస్థ ప్లేగ్రౌండ్ నీట మునగడంతో విద్యార్థులు ఆటపాటలకు దూరమయ్యారు. కనీసం రహదారి సౌకర్యం కూడా లేక మోకాలి లోతు నీటిలో వెళుతున్న విద్యార్థుల కష్టాలను తెలుసుకున్న ఎమ్మెల్యే ద్వారంపూడి ఏడాదిన్నర క్రితం రూ.50 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించారు. పూర్వ విద్యార్థుల విజ్ఞప్తి మేరకు ఈ ఏడాది చివరి నాటికి ఆట స్థలాన్ని మెరక చేసి ఫ్లడ్ లైట్ల వెలుగులో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తానని మాట ఇచ్చారు. ఈమేరకు కాకినాడలో తొలగించిన కొన్ని భవనాల శిథిలాలు, మట్టిని తరలించి ప్లేగ్రౌండ్‌ను మెరక చేస్తున్నారు. రెండు మూడు అడుగులు రబ్బీస్‌తో నింపిన తరువాత ఒకటి లేదా రెండు అడుగులు గ్రావెల్ వేసి చదును చేసి ఆపైన గ్రీనరీ, గార్డెనింగ్ పనులు చేపడుతున్నారు. ఇందుకోసం ఎమ్మెల్యే ద్వారంపూడి సొంత నిధులు రూ.20 లక్షలు వెచ్చిస్తున్నారు. ఇదంతా టీడీపీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబుకు కంటగింపుగా మారింది. ఆయన ఇదే ఎమ్ఎస్ఎన్‌లో ఏడో తరగతి వరకు చదువుకోవడం గమనార్హం. పూర్వ విద్యార్థిగా ఉంటూ తనకు విద్యాబుద్ధులు నేర్పిన సంస్థకు మంచి జరుగుతుంటే స్వాగతించాల్సింది పోయి పనులకు అడ్డుపడటం ఆయనకే చెల్లింది. 2017లో చారిటీస్‌లో నాసిరకం పనులతో రూ.70 లక్షలు వృథా చేసినట్లు కొండబాబుపై ఆరోపణలున్నాయి. స్థల దాత నాయకర్ రంగూన్ నుంచి తెప్పించిన టేకు కలపతో నిర్మించిన పైకప్పును తొలగించి ఫైబర్ రేకులు, సీలింగ్ వేసి చేతులు దులుపుకొన్నారు. చారిటీస్‌లో విద్యార్థుల సౌకర్యాలకు వినియోగించాల్సిన సొమ్మును సబ్ కాంట్రాక్టర్‌గా వ్యవహరించిన కొండబాబు బంధువర్గం పక్కదారి పట్టించిన విషయాన్ని స్థానికులు గుర్తు చేస్తున్నారు.


అభివృద్ధిపై బురద జల్లడం దారుణం..

విద్యార్థులకు మేలు చేయాలనే సదుద్దేశంతో ఎమ్మెల్యే ద్వారంపూడి సొంత నిధులు వెచ్చించి గ్రౌండ్‌ను అభివృద్ధి చేస్తున్నారు. చారిటీస్ గ్రౌండ్‌లో ఫ్లడ్‌లైట్ల వెలుతురులో క్రికెట్ నిర్వహించాలని ఏడాది క్రితం మా అసోసియేషన్ కోరింది. గ్రౌండ్‌ను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్న ఎమ్మెల్యేపై నిందలు వేయడం తగదు. మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు రాజకీయ దురుద్దేశాలతో బురద చల్లడం దారుణం. ఈనాడు అభూత కల్పనలతో వార్తలు రాయడం విడ్డూరంగా ఉంది.

నవరాత్రి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి


28న రాత్రి 7:05 గంటలకు శ్రీవారి ఆలయం మూసివేత

డయల్ యువర్ ఈవోలో ఏవీ ధర్మారెడ్డి



తిరుమల: అక్టోబర్ 15–23 వరకు తిరుమలలో నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి చెప్పారు. తిరుమల అన్నమయ్య భవనంలో శుక్రవారం జరిగిన డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో భక్తులు అడిగిన ప్రశ్నలకు ఈవో సమాధానమిచ్చారు. నవరాత్రి బ్రహ్మోత్సవాలకు ఈ నెల 14న అంకురార్పణ చేయనున్నామని తెలిపారు. బ్రహ్మోత్సవాల తేదీల్లో అన్ని రకాల ప్రివిలేజ్ దర్శనాలను రద్దు చేశామన్నారు. తిరుపతిలో అక్టోబర్ 6, 7, 8, 13, 14, 15వ తేదీల్లో ఎస్ఎస్‌డీ టోకెన్లు జారీ చేయబోమని చెప్పారు. 29న పాక్షిక చంద్రగ్రహణం కారణంగా 28న రాత్రి 7.05 గంటలకు శ్రీవారి ఆలయ తలుపులు మూసివేసి తిరిగి 29న తెల్లవారుజామున 3.15 గంటలకు తెరుస్తామని చెప్పారు. గ్రహణం కారణంగా తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనాన్ని 28న సాయంత్రం 6 గంటలకు మూసివేసి 29న ఉదయం 9 గంటలకు తెరుస్తామన్నారు. తిరుమలలో యూపీఐ విధానంలో చెల్లింపులు చేసి గదులు పొందిన భక్తులకు వారు గదులు ఖాళీ చేసిన గంటలోపు కాషన్ డిపాజిట్ మొత్తం రీఫండ్ చేస్తున్నట్లు చెప్పారు. క్రెడిట్/డెబిట్ కార్డు ద్వారా చెల్లింపులు చేసిన వారికి ఖాళీ చేసిన గంటలోనే రీఫండ్ ప్రక్రియను మొదలుపెడతామని, అయితే ఈ మొత్తం వారి బ్యాంకుఖాతాల్లోకి చేరడానికి 3–7 పనిదినాలు పడుతుందన్నారు. సెప్టెంబర్‌లో శ్రీవారిని 21.01 లక్షలు మంది దర్శించుకున్నారని, హుండీలో రూ.111.65 కోట్లు వేశారని చెప్పారు.

28న దుర్గమ్మ ఆలయం మూసివేత



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): పాక్షిక చంద్రగ్రహణాన్ని పురస్కరించుకుని ఈ నెల 28వ తేదీన సాయంత్రం ఆరు గంటలకు అమ్మవారి ఆలయం మూసివేయడం జరుగుతుందని దుర్గగుడి వైదిక కమిటీ పేర్కొంది. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ద్వారాలను మూసివేస్తారు. 29వ తేదీ తెల్లవారు జామున 3.30 గంటలకు ఆలయం తెరిచి సంప్రోక్షణ, అనంతరం అమ్మవారికి స్నపనాభిషేకం, అలంకరణ, నిత్య పూజలు నిర్వహిస్తారు. ఉదయం 9 గంటల తర్వాతే అమ్మవారి దర్శనానికి భక్తులను అనుమతిస్తారు.

కాలగర్భంలో కలిసిపోనున్న టీడీపీ అండ్‌కో..


1,104వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



తాడికొండ: దొరికినంత దోచుకుని పేదలకు అన్యాయం చేసిన చంద్రబాబు అండ్‌కో పార్టీలన్నీ కాలగర్భంలో కలిసిపోవడం ఖాయమని బహుజన పరిరక్షణ సమితి నాయకులు హెచ్చరించారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,104వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో శుక్రవారం పలువురు మాట్లాడారు. రాష్ట్ర ప్రయోజనాలను పక్కన బెట్టిన కులవాదులంతా బాబు అవినీతికి మద్దతుగా వత్తాసు పలకడంపై ప్రజలంతా మండిపడుతున్నారన్నారు. తన బినామీలకు దోచిపెట్టడమే లక్ష్యంగా రాజధానిని వాడుకున్న బాబును అరెస్టు చేస్తే వీరికొచ్చిన నష్టమేంటో చెప్పాలని డిమాండ్ చేశారు. పావలాక ళ్యాణ్ ప్యాకేజీ మాటలను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. తండ్రి జైల్లో మగ్గుతుంటే ఢిల్లీలో తందనాలు ఆడిన లోకేశ్‌ను ఎవరూ నమ్మడం లేదని తెలిపారు. అవినీతి అనకొండ చంద్రబాబుకు.. వత్తాసు పలుకుతున్న బినామీలకు కోర్టులు తగిన శిక్షలు వేయాలని డిమాండ్ చేశారు. అమరావతి ఉద్యమానికి వస్తున్న విరాళాల లెక్కలు బయటకు తీస్తే పెట్టుబడిదారీ ఉద్యమం బాగోతం బయట పడుతుందన్నారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ స్ఫూర్తితో ముందుకెళుతున్న బహుజన పరిరక్షణ ఉద్యమం సుదీర్ఘ పోరాటంలో సత్ఫలితాలు సాధిస్తుందని చెప్పారు. నాయకులు ఈపూరి ఆదాం, బేతపూడి సాంబయ్య, మాదిగాని గురునాథం, పులి దాసు, కారుమూరి పుష్పరాజు, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

వెన్నుపోటుతో టీడీపీని లాక్కున్న బాబు

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు



శ్రీకాకుళం రూరల్: చంద్రబాబు స్వతహాగా పార్టీ స్థాపించలేదని, టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్‌ను అల్లుడు ముసుగులో వెన్నుపోటు పొడిచి లాక్కున్నారని రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్ స్టాంప్స్ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. 1995లో వైశ్రాయ్ హోటల్ వద్ద జరిగిన ఘటనే దీనికి నిదర్శనమని, 75 ఏళ్ల వయస్సులో ఎన్టీఆర్ చాలా క్షోభపడి మృత్యువాత పడ్డారని గుర్తు చేశారు. శ్రీకాకుళంలోని పెదగ నగళ్లవానిపేటలో శుక్రవారం గ్రామ సచివాలయం ప్రారంభోత్సవంలో మంత్రి మాట్లాడారు. చంద్రబాబు వెంట ఉన్న నాయకులంతా అవినీతి, ప్రజాధనం లూటీ కేసుల్లో కొట్టుమిట్టాడు తున్నారని విమర్శించారు. ఇప్పటికే స్కిల్‌స్కామ్ కేసులో చంద్రబాబు రిమాండ్‌లో ఉన్నారని, చట్టం ముందు అంతా సమానులేనని తెలిపారు. చంద్రబాబు నిజాయితీపరుడైతే ఎందుకు దర్యాప్తు బృందాలకు సహకరించడం లేదని ప్రశ్నించారు. భవిష్యత్ తరాలు బాగుండాలంటే వైఎస్సార్‌సీపీకే పట్టం కట్టాలని కోరారు.

30 మందికి ఉద్యోగ నియామకపత్రాల అందజేత

'సిపెట్'లో ఎస్సీ కార్పొరేషన్ సహకారంతో శిక్షణ

గన్నవరం రూరల్: భారత ప్రభుత్వ సంస్థ సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ(సిపెట్) సేవలు ప్రశంసనీయమని ఎస్సీ కార్పొరేషన్ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.చిన్నరాముడు అన్నారు. కృష్ణాజిల్లా గన్నవరం మండలం సూరంపల్లిలోని సిపెట్‌లో ఎస్సీ కార్పొరేషన్ సౌజన్యంతో పీఎం అజయ్ నిధుల ద్వారా శిక్షణ పొంది ఉద్యోగాలు సాధించిన 30 మందికి శుక్రవారం ఆయన నియామకపత్రాలు అందజేశారు. చిన్న రాముడు మాట్లాడుతూ యువతలో నైపుణ్యాలను పెంపొందించి ప్రగతిపథంలో నడిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. ఇందులో భాగంగానే సిపెట్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్‌కు సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. సిపెట్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ శేఖర్ మాట్లాడుతూ రాగ్ పికర్స్‌కు మూడు నెలలు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇచ్చామన్నారు. వీరికి చెన్నై మదర్సన్ ఆటోమోటివ్ కంపెనీలో, బెంగళూరు ఫైన్ టూల్స్ కంపెనీలో ఉద్యోగాలు వచ్చాయని చెప్పారు. కోర్సు పూర్తి చేసిన సర్టిఫికెట్లు, ఉద్యోగ నియామకపత్రాలు అందజేశామని తెలిపారు. ఇప్పటివరకు నాలుగు బ్యాచ్‌లుగా 120 మందికి శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించామని వివరించారు. ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బివిఆర్ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

పలువురు టీడీపీ నేతలకు హైకోర్టులో ఊరట

- అంగళ్లు, పుంగనూరు ఘటనల్లో ముందస్తు బెయిల్
- పుంగనూరు ఘటనకు సంబంధించిన కేసుల్లో చల్లా బాబుకు బెయిల్

సాక్షి, అమరావతి : యుద్ధభేరి పేరుతో చంద్రబాబు చేసిన పర్యటన సందర్భంగా అన్నమయ్య జిల్లా అంగళ్లు, చిత్తూరు జిల్లా భీమగానిపల్లె వద్ద టీడీపీ శ్రేణులు సాగించిన విధ్వంసంపై పోలీసులు వేర్వేరుగా నమోదు చేసిన కేసుల్లో పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలకు హైకోర్టు ఊరటనిచ్చింది. వారికి షరతులతో కూడిన ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఒక్కొక్కరు రూ.10 వేల చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించింది. రెండు వారాల్లో పీలేరు పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోవాలని పిటిషనర్లకు స్పష్టం చేసింది. లొంగిపోయిన వెంటనే వారిని విడుదల చేయాలని పోలీసులను ఆదేశించింది. రెండు వారాల పాటు వారంలో ఒక రోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 5లోపు పీలేరు పోలీసుల ముందు హాజరు కావాలంది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులిచ్చారు. అంగళ్లు ఘటనకు సంబంధించి ముదివేడు పోలీసులు నమోదు చేసిన కేసుల్లో, భీమగానిపల్లె వద్ద జరిగిన ఘటనకు సంబంధించి పుంగనూరు పోలీసులు నమోదు చేసిన కేసుల్లో తమకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ టీడీపీ నేతలు అమర్‌నాథ్‌రెడ్డి, షాజహాన్ బాషా, దొమ్మాలపాటి రమేష్, గంటా నరహరి, శ్రీరామ్ చిన్నబాబు, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డిలతో పాటు పలువురు వేర్వేరుగా హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై శుక్రవారం జస్టిస్ సురేష్‌రెడ్డి విచారణ జరిపారు. ఇదిలా ఉండగా, పుంగనూరు ఘటనలో పోలీసులు నమోదు చేసిన మూడు వేర్వేరు కేసుల్లో టీడీపీ పుంగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి అలియాస్ చల్లా బాబుకు హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. రూ.45 వేల చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలని హైకోర్టు ఆదేశించింది. పోలీసుల దర్యాప్తునకు సహకరించాలని, దర్యాప్తులో ఏ రకంగానూ జోక్యం చేసుకోవడానికి వీల్లేదని బాబును ఆదేశించింది.

సంక్షేమ సారథి వైఎస్సార్

కడప వైఎస్ఆర్ సర్కిల్: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడంతో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి చరిత్రలో నిలిచిపోయారని కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజు స్పష్టం చేశారు. వైఎస్ఆర్ జిల్లా కడప కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కడప జిల్లా అంటే ముందుగా గుర్తుకొచ్చేది వైఎస్ రాజశేఖర్ రెడ్డి అన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి రాయలసీమ రైతాంగ సంక్షేమం కోసం పోలవరం ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వ నిధుల నుంచి దాదాపు రూ.6 వేల కోట్లు ఖర్చు పెట్టి పనులు ప్రారంభించారన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను నిలువునా మోసం చేసిందని చెప్పారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రధాని మోడీ తన అనుకూల కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు కుట్ర పన్నడం దారుణమన్నారు. రైతులు సంక్షోభంలో ఉంటే 2008లో కాంగ్రెస్ ప్రభుత్వం దాదాపు రూ. 77 వేల కోట్లు రుణ మాఫీ చేసిందని గుర్తు చేశారు. పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు పాల్గొన్నారు.

మత్స్యకారులకు జీపీఎస్ పరికరాల పంపిణీ

ఎంవీపీ కాలనీ (విశాఖ): మత్స్యకారులు గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్(జీపీఎస్)ను సద్వినియోగం చేసుకోవాలని విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ సూచించారు. శుక్రవారం లాసన్స్ బే కాలనీలోని క్యాంపు కార్యాలయంలో జీపీఎస్ పరికరాలను మత్స్యకారులకు మత్స్యశాఖ విభాగ అధికారులతో కలిసి ఎంపీ సత్యనారాయణ అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ మత్స్యకారుల రోజు వారి వేట సమయంలో జీపీఎస్ టెక్నాలజీ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మత్స్యశాఖ సంయుక్త సంచాలకురాలు విజయ పాల్గొన్నారు.

త్వరలో 'వందే సాధారణ్' రైళ్లు

- జనవరి నాటికి నాన్ ఏసీ వందేభారత్ రైళ్లు
- అల్పాదాయ వర్గాలకు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు
- సంప్రదాయ రైళ్ల కంటే సౌకర్యవంతంగా, ఆధునికంగా కోచ్‌లు
- వందేభారత్ తరహాలో పుష్‌పుల్ పద్ధతిలో లోకోమోటివ్ వ్యవస్థ

సాక్షి, హైదరాబాద్: వందేభారత్ రైళ్లు విజయవంతం కావడంతో రైల్వే శాఖ సాధారణ ప్రజలకు కూడా వీటిని అందుబాటులోకి తీసుకు రావడానికి సన్నాహాలు చేస్తోంది. కాచిగూడ నుంచి బెంగళూరుకు కేవలం ఎనిమిదిన్నర గంటల్లోనే చేరుకునే పూర్తి ఏసీతో ఉండే వందేభారత్ రైలు ఎక్కాలని సామాన్య జనానికి కోరిక ఉన్నా, రూ.1,600 టికెట్ ధర చూసి వారు వెనకడుగు వేస్తున్నారు. మరింత సౌకర్యవంతంగా ఉండే ఎగ్జిక్యూటివ్ కోచ్ టికెట్ ధర ఏకంగా రూ.2,550 ఉండటంతో మామూలు ప్రయాణికులు అటు వైపు చూసే పరిస్థితి కూడా లేదు. ఈ నేపథ్యంలో ఇప్పుడు అతి సాధారణ జనానికి కూడా కొంతమేర వందేభారత్ రైలు అనుభూతిని కలిగించేందుకు రైల్వే శాఖ వేగంగా ఏర్పాట్లు చేస్తోంది. మరో మూడు నెలల్లో నాన్ ఏసీ రైళ్లు పట్టాలెక్కే అవకాశం ఉందని రైల్వే వర్గాలు చెపుతున్నాయి. 'వందే సాధారణ్' నాన్ ఏసీ రైలు కోచ్‌లను రైల్వే శాఖ వేగంగా సిద్ధం చేస్తోంది.

జనవరి నాటికి తొలి రైలు..

వందేభారత్ రైళ్లు విజయవంతం కావటంతో వాటిని మరింత అప్‌గ్రేడ్ చేసే పనులు ప్రారంభించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ రైళ్లు ఉదయం బయలుదేరి, మళ్లీ రాత్రి 12 వరకు తిరిగి వస్తున్నాయి. తాజాగా దూరప్రాంతాలకు కూడా తిరిగేలా స్లీపర్ వందేభారత్ రైళ్ల తయారీ ప్రారంభించిన రైల్వే, సమాంతరంగా నాన్ ఏసీ సాధారణ రైళ్లను కూడా తయారు చేస్తోంది. చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసీఎఫ్)లో వచ్చే జనవరి నాటికి తొలి రైలు సిద్ధమవుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

మామూలు రైళ్లు తెరమరుగు..

శతాబ్ది రైళ్లను క్రమంగా తొలగించి వాటి స్థానంలో వందేభారత్ రైళ్లు నడుపుతారని సమాచారం. అలాగే కొత్తగా వచ్చే స్లీపర్ వందేభారత్ రైళ్లు రాజధాని రైళ్ల స్థానాన్ని ఆక్రమిస్తాయి. ఇక సాధారణ సంప్రదాయ రైళ్లను దశలవారీగా తొలగిస్తూ వాటి స్థానంలో వందే సాధారణ్ రైళ్లను తిప్పే అవకాశం ఉందని చెపుతున్నారు.

వందే సాధారణ్ ప్రత్యేకతలు ఇవే..

- సంప్రదాయ నాన్ ఏసీ రైళ్లకు ఇవి కొంత భిన్నంగా ఉంటాయి. వందేభారత్ తరహాలో పుష్ పుల్ పద్ధతిలో ముందు, వెనక ఇంజన్లు ఉంటాయి.
- గరిష్టంగా 24 చొప్పున లింక్ హాఫ్‌మాన్ బుష్ (ఎల్‌హెచ్‌బీ) కోచ్‌లు ఉంటాయి.
- సంప్రదాయ రైళ్లలోని సీట్లతో పోలిస్తే వీటిల్లో మెరుగ్గా ఉంటాయి. ప్రతి బెర్త్ వద్ద చార్జింగ్ పాయింట్లు కూడా ఉంటాయి.
- వందేభారత్ రైళ్లలో ఉన్నట్టుగానే ప్రయాణికులకు కోచ్‌లలో అనౌన్స్‌మెంట్ స్క్రీన్లు, ఆడియో వ్యవస్థ ఉంటాయి.
- ప్రయాణికుల భద్రత కోసం సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేస్తారు. వందేభారత్ రైళ్లలో ఉన్నట్లు ఆటోమేటిక్ డోర్లు ఉంటాయి.
- శుభ్రంగా ఉండేలా చూడటంతోపాటు చెడు వాసన రాకుండా బయో వాక్యూమ్ టాయిలెట్లు ఏర్పాటు చేస్తారు.

ధాన్యం కొనుగోళ్లకు సన్నద్ధం

- 15 నుంచి కొనుగోళ్లు
- ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 12 లక్షల టన్నుల దిగుబడి
- 575 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు



తాడేపల్లిగూడెం ప్రాంతంలో కోతకు సిద్ధమైన సార్వా వరి పంట

సాక్షి, భీమవరం: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సార్వా వరి పంట ఆశాజనకంగా ఉండగా.. ధాన్యం కొనుగోళ్లకు ప్రభుత్వం సర్వత్రా సిద్ధం చేసింది. జిల్లావ్యాప్తంగా సుమారు 4.39 లక్షల ఎకరాల్లో వరిసాగు చేయగా దాదాపు 12 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. రైతుల స్థానిక అవసరాలకుపోను మిగిలిగిన ధాన్యం కొనుగోలుకు 575 రైతు భరోసా కేంద్రాల్లో (ఆర్‌బీకే) ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 15వ తేదీ తర్వాత ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు చేయనున్నట్టు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుత సార్వా సీజన్‌లో వర్షాలు సక్రమంగా లేకపోయినా సాగునీటి కొరత లేకపోవడంతో పైరు ఏపుగా పెరిగి పంట కళకళలాడుతోంది. ముందుగా నాట్లు వేసిన ప్రాంతాల్లో కొన్నిచోట్ల ఇప్పటికే మాసూళ్లు ప్రారంభించగా ఎకరాకు 35 బస్తాలకు పైగా దిగుబడి వస్తున్నట్టు రైతులు చెబుతున్నారు.


4.39 లక్షల ఎకరాల్లో

పశ్చిమగోదావరి జిల్లాలోని 20 మండలాల్లో 2.13 లక్షల ఎకరాల్లో సార్వావరి సాగుచేయగా దాదాపు 5.28 లక్షల టన్నులు ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. అలాగే ఏలూరు జిల్లాలో 2.26 లక్షల ఎకరాల్లో నాట్లు వేయగా 6.78 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని భావిస్తున్నారు. ఈ మేరకు ధాన్యం కొనుగోళ్లకు పశ్చిమగోదావరి జిల్లాలో 314 ఆర్‌బీకేలు, ఏలూరు జిల్లాలో 261 ఆర్‌బీకేల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. పశ్చిమగోదావరిలో 4.56 లక్షల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఈ మేరకు 942 మంది టెక్నికల్ అసిస్టెంట్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్స్, హెల్పర్స్‌ను నియమిస్తున్నారు. అలాగే ధాన్యం పట్టుబడికి కోటి వరకు గోనె సంచులు అవసరమని గుర్తించి ఈ మేరకు ఏర్పాట్లు చేశారు. అలాగే హమాలీలు, రవాణా వాహనాలను కూడా సమకూరుస్తున్నారు.

ధాన్యం ధరలు

ప్రస్తుత సీజన్‌లో ప్రభుత్వం ధాన్యం మద్దతు ధర పెంచడంతో కామన్ రకం ధాన్యం 75 కిలోల బస్తాకు రూ.1,637, ఏ గ్రేడ్ రకానికి బస్తాకు రూ.1,652 రైతులకు దక్కనుంది. అయితే ధాన్యంలో తేమ 17 శాతానికి మించకుండా ఉండాలి. గత దాళ్వా సీజన్‌లో ఎండలు ఎక్కువగా ఉండటం, ధాన్యం కూడా ఎక్కువగా ఆరబెట్టడం వల్ల బియ్యం ముక్క కావడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. అయితే ప్రస్తుత సీజన్‌కు తగినంతగా ఎండబెట్టి పట్టుబడులు పట్టుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

ఆ తార అస్తమయం వెనక...!



ఆసక్తి కలిగిస్తున్న భిన్న వాదనలు

అది 2009. అనంతాకాశంలో ఒక తార ఉన్నట్టుండి మాయమైంది. అది సైంటిస్టులను ఎంతగానో ఆశ్చర్యపరిచింది. నక్షత్రాలు మరణించడం వింతేమీ కాదు. అరుదు అంతకన్నా కాదు. కానీ అందుకు ఒక క్రమం ఉంటుంది. తమ జీవిత కాలంలో చివరి ఏడాదిలో అవి అత్యంత ప్రకాశవంతంగా మారతాయి. అనంతరం సూపర్ నోవాగా పిలిచే బ్రహ్మాండమైన పేలుడుకు లోనవుతాయి. అలా శక్తినంతా కోల్పోయి మరుగుజ్జు తారలుగా మిగిలిపోతాయి. నెమ్మదిగా అంతర్ధానం చెందుతాయి.

కానీ... సూర్యుని కంటే ఏకంగా 25 రెట్లు పెద్దదైన ఎన్6946- బీహెచ్1 అనే నక్షత్రం మాత్రం ఏదో మంత్రం వేసినట్టు ఉన్నపళంగా మాయమైపోయింది!

మనకు 2.2 కోట్ల కాంతి సంవత్సరాల దూరంలో ఉన్న అది కూడా తొలుత మరణానికి సిద్ధమయ్యే ఇతర తారల మాదిరిగానే 10 లక్షల సూర్యులకు సమాన తేజంతో వెలిగిపోయింది. దీన్ని గమనించిన సైంటిస్టులు, మరో సూపర్ నోవా చోటు చేసుకోనుందనే అనుకున్నారు. కానీ జరగకపోగా, అది వెలుగులన్నీ కోల్పోయింది. అలాగే క్రమంగా మాయమైపోయి ఆశ్చర్యానికి గురిచేసింది. దీనికి కారణాలపై ఇప్పుడు బోలెడంత చర్చ జరుగుతోంది.

కృష్ణబిలం మింగింది.. కాదు....

ఈ తార విచిత్ర అంతర్ధానాన్ని 'జరగని సూపర్ నోవా'గా అప్పట్లో కొందరు సైంటిస్టులు పిలిచారు. బహుశా ఆ నక్షత్రాన్ని ఏదో కృష్ణబిలం మింగేసిందని వారు ప్రతిపాదించారు. అలా అది కూడా కృష్ణబిలంగానే మారిందని సూత్రీకరించారు. ఆ ఉద్దేశంతోనే దాని పేరు చివరన బీహెచ్1 అని చేర్చారు. అయితే అది సరికాదని మరికొందరు సైంటిస్టులు తాజాగా వాదిస్తున్నారు. దీనికి సంబంధించి జేమ్స్ వెబ్ టెలిస్కోప్ ఇటీవల సేకరించిన పరిణామాల్ని విశ్లేషించిన మీదట ఆ వాదనకు బలం చేకూరుతోంది. బీహెచ్1 తార ఉన్న చోట అతి ప్రకాశవంతమైన పరారుణ కాంతిని జేమ్స్ వెబ్ గమనించింది. అది మూడు వేర్వేరు రకాల కాంతి అని కూడా చెబుతున్నారు. బహుశా పలు నక్షత్రాలు పరస్పరం కలిసిపోయి పెను తారగా మారాయనేందుకు ఇది నిదర్శనమని అంటున్నారు. కానీ సూపర్ నోవాగా మారకుండా అది ఎలా అంతర్ధానం అయిందన్న కీలక ప్రశ్నకు మాత్రం ఇంకా బదులు దొరకాల్సే ఉంది! - సాక్షి, నేషనల్ డెస్క్

ఇరాన్ హక్కుల యోధురాలికి నోబెల్ శాంతి

టెహ్రాన్ జైల్లో ఉన్న నర్గిస్ మొహమ్మదికి ప్రతిష్టాత్మక పురస్కారం ● జైలు నుంచే పోరాటం చేస్తున్న అలుపెరగని యోధురాలు



స్టాక్‌హోమ్: అత్యంత ప్రతిష్టాత్మకమైన నోబెల్ శాంతి పురస్కారం ఇరాన్‌కు చెందిన మానవ హక్కుల కార్యకర్త నర్గిస్ మొహమ్మదికి లభించింది. ఇరాన్‌లో మహిళల అణచివేత, మానవ హక్కులపై అవగాహన, అందరికీ స్వేచ్ఛ, మరణ శిక్ష రద్దు కోసం అలుపెరగకుండా ఆమె చేస్తున్న పోరాటానికి అత్యున్నత పురస్కారం దక్కింది. మహిళల కోసం జీవితాన్ని ధారపోసినందుకు నర్గిస్‌ను శాంతి పురస్కారానికి ఎంపిక చేసినట్టుగా నార్వే నోబెల్ కమిటీ ప్రకటించింది. ప్రస్తుతం ఆమె టెహ్రాన్‌లోని ఎవిన్ జైల్లో ఉన్నారు. ''నర్గిస్ చేసిన పోరాటం అత్యంత సాహసోపేతమైనది. మహిళా హక్కుల కోసం ఆమె తన వ్యక్తిగత జీవితాన్ని పణంగా పెట్టారు. ఇరాన్‌లో ఏడాదిగా సాగుతున్న మహిళా హక్కుల పోరాటానికి నోబెల్ శాంతి తొలి గుర్తింపు. జైలు నుంచే ఈ ఉద్యమానికి ఊపిరిలా మారిన వివాదరహితురాలైన నర్గిస్ మొహమ్మదికి నోబెల్ శాంతి బహుమతిని ప్రకటిస్తున్నాం'' అని కమిటీ చైర్ పర్సన్ బెరిట్ రెసి అండర్సన్ వెల్లడించారు. నోబెల్ శాంతి పురస్కారం కింద ఆమెకు 1.1 కోట్ల స్వీడిష్ క్రోనర్లు (దాదాపుగా 10 లక్షల డాలర్లు) నగదు బహుమానం, 18 కేరట్ గోల్డ్ మెడల్, డిప్లొమా లభిస్తుంది.. డిసెంబర్‌లో జరిగే అవార్డు ప్రదానోత్సవం సమయానికి నర్గిస్ జైలు నుంచి విడుదల కావాలని, స్వయంగా పురస్కారాన్ని అందుకోవాలని నోబెల్ కమిటీ ఆశాభావం వ్యక్తం చేసింది. ఇరాన్‌లో మహిళా హక్కుల ఉద్యమానికి అంతర్జాతీయ గుర్తింపు రావడంతో తనపై మరింత బాధ్యత పెరిగిందని నర్గిస్ జైలు నుంచే న్యూయార్క్ టైమ్స్‌కి ఒక ప్రకటన పంపారు. ''నోబెల్ శాంతి పుర స్కారం నాలో మరింత స్ఫూర్తిని నింపింది. మహిళల సమస్యలు పరిష్కారమవుతాయన్న ఆశ పెరిగింది. ఇరాన్‌లో మార్పు కోసం పోరాడుతున్న వారిలో మరింత బలం పెరుగుతుంది. ఇక విజయం సమీపంలో ఉంది''అని ఆ ప్రకటనలో ఆశాభావం వ్యక్తం చేశారు.

13 సార్లు అరెస్ట్

హక్కుల పోరాటంలో ఎన్ని సవాళ్లు ఎదురైనా నర్గిస్ వెనుకంజ వేయలేదు. ఇరాన్ ప్రభుత్వం ఆమెను ఇప్పటికి 13 సార్లు అరెస్ట్ చేసింది. అయిదు సార్లు దోషిగా నిర్ధారించింది. 31 ఏళ్ల జైలు శిక్ష విధించింది. 154 సార్లు కొరడా దెబ్బల శిక్ష విధించింది. అయినా ఆమె అదరలేదు. బెదరలేదు. 1998లో ఇరాన్ ప్రభుత్వాన్ని విమర్శించి తొలిసారి అరెస్టయి ఏడాది జైల్లో ఉన్నారు. హ్యూమన్ రైట్స్ సంస్థలో చేరి మళ్లీ అరెస్టయ్యారు. 2011లో జాతి విద్రోహ కార్యకలాపాలు సాగిస్తున్నారంటూ మరోసారి అరెస్ట్ చేశారు. ఇరాన్‌లో మరణ శిక్షలకు వ్యతిరేకంగా గళమెత్తినందుకు 2015లో జైలుకు పంపారు. ఇలా తన జీవితంలో సగభాగం ఆమె జైల్లోనే గడుపుతున్నారు.

అన్నీ కోల్పోయినా....

సంప్రదాయం పేరుతో మహిళలపై ఆంక్షలు విధిస్తూ హిజాబ్ కాస్త పక్కకి జరిగినా జైలు పాల్జేయడమో, కొట్టి చంపేయడమో చేసే దేశంలో పుట్టి మహిళా హక్కుల కోసం జీవితాన్ని ధారపోస్తున్న నర్గిస్ అత్యున్నత పురస్కారాన్ని ప్రకటించిన సమయంలో నాలుగ్గోడల మధ్య బందీగా ఉన్నారు. వ్యక్తిగత జీవితాన్ని, ఆరోగ్యాన్ని, స్వేచ్ఛని పణంగా పెట్టి 51 ఏళ్ల వయసున్న నర్గిస్ ఇంకా మార్పు కోసం పోరాటం చేస్తూనే ఉన్నారు. ''ప్రభుత్వం నన్ను ఎంత అణగదొక్కాలని చూస్తే, ఎంతగా శిక్షిస్తే నాలో పోరాట స్ఫూర్తి అంతకంతకూ పెరుగుతుంది. దేశంలో మహిళలు స్వేచ్ఛా వాయువులు పీల్చుకునే వరకు ఈ పోరాటం ఆగదు''అని నర్గిస్ పలు ఇంటర్వ్యూల్లో చెప్పారు. ఇరాన్‌లోని జంజన్ పట్టణంలో 1972, ఏప్రిల్ 21న ఒక మధ్య తరగతి కుటుంబంలో జన్మించారు. ఆమె తండ్రి ఒక రైతు. తల్లి ఒక రాజకీయ కుటుంబం నుంచి వచ్చారు. 1979లో ఇరాన్ విప్లవం సమయంలో రాచరికం రద్దయిందో అప్పుడే నర్గిస్ తల్లి సోదరుడు, మరో ఇద్దరు కుటుంబ సభ్యులు జైలు పాలయ్యారు. వారిని ప్రతీ వారం కలుసుకోవడానికి తల్లితో పాటు జైలుకు వెళ్లే చిన్నారి నర్గిస్‌కు తమ బతుకులు ఎందుకంత అణచివేతకు గురవుతున్నాయో అర్థం కాక తీవ్ర సంఘర్షణకు లోనయ్యేది. అది చూసి ఆమె తల్లి తనకున్న అనుభవంతో రాజకీయాలు, వ్యవస్థల జోలికి వెళ్లొద్దని హితవు చెప్పింది. అయినప్పటికీ నర్గిస్‌లో చిన్నప్పట్నుంచి ధైర్యసాహసాలు, పోరాట స్ఫూర్తి ఆమెను హక్కుల పోరాటంలో ముందుకు నడిపించాయి. ఇంజనీరింగ్ విద్య పూర్తి చేసిన తర్వాత ఆమె కొన్నాళ్లు వార్తాపత్రికలకు కాలమిస్ట్‌గా చేశారు. నోబెల్ శాంతి బహుమతి గ్రహీత షిరిన్ ఎబది స్థాపించిన డిఫెండర్స్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ సెంటర్‌లో

31 ఏళ్ల జైలు శిక్ష

2003లో చేరిన ఆమె ప్రస్తుతం ఉపాధ్యక్షురాలిగా వ్యవహరిస్తున్నారు. కాలేజీలో సహచర విద్యార్థిగా పరిచయమైన ప్రఖ్యాత సామాజిక కార్యకర్త తాఘి రెహమనీను ఆమె ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి ఇద్దరు కవల పిల్లలు ఉన్నారు. ప్రస్తుతం రెహమనీ తన పిల్లలతో కలిసి పారిస్‌కు ప్రవాసం వెళ్లిపోయారు. తన భర్త, పిల్లలతో మాట్లాడి, ప్రేమతో వారిని అక్కున చేర్చుకొని ఆమెకు ఏళ్లు గడిచిపోయాయి.

జైలు నుంచే పోరాటం

జైలు నుంచి ఆమె ఎందరిలోనో ఉద్యమ స్ఫూర్తి రగిలిస్తున్నారు. రాజకీయ ఖైదీలు, మహిళా ఖైదీలపై జరుగుతున్న లైంగిక హింసకు వ్యతిరేకంగా జైల్లోనే ఆమె ఉద్యమం ప్రారంభించారు. జైల్లో కూడా ఆమెకు మద్దతుదారులు పెరగడంతో అధికారులు ఆమెపై పలు ఆంక్షలు విధించారు. అయినా ఆమె బెదరలేదు. జైలు నుంచే పలు వ్యాసాలు న్యూయార్క్ టైమ్స్, బీబీసీ వంటి వాటికి పంపించారు. 2022 సెప్టెంబర్‌లో హిజాబ్ ధరించనందుకు మాసా అమిని అనే యువతిని ఇరాన్ పోలీసులు అరెస్ట్ చేయగా కస్టడీలో తీవ్ర గాయాలపాలై ఆమె మరణించిన విషయం తెలిసిందే. దీంతో ఇరాన్‌లో భారీగా యువతీ యువకులు ఆందోళనలు చేపట్టి రోడ్లపైకి వచ్చినప్పుడు జైలు నుంచే ఆమె తన గళాన్ని వినిపించారు. పోరాడే వారిలో ఉద్యమ స్ఫూర్తిని రగిలించారు. తోటి మహిళా ఖైదీల అనుభవాలతో వైట్ టార్చర్ అనే పుస్తకాన్ని రాశారు. ప్రపంచంలో అత్యధికంగా ఉరిశిక్షలు విధించే ఇరాన్‌లో అత్యంత క్రూరమైన ఆ శిక్షను రద్దు చేసే వరకు తన పోరాటం ఆగదని నర్గిస్ ఎలుగెత్తి చాటుతున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

రెండేళ్లలో తీవ్రవాదానికి చరమగీతం: అమిత్ షా

న్యూఢిల్లీ: దేశంలో వామపక్ష తీవ్రవాదాన్ని రెండేళ్లలో పూర్తిగా నిర్మూలిస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ధీమా వెలిబుచ్చారు. నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో మరణాలు, హింసాత్మక ఘటనలు 2022లో గత 4 దశాబ్దాల్లోకెల్లా అతి తక్కువగా నమోదయ్యాయని చెప్పారు. 'నక్సలిజం మానవత్వం పాలిట శాపం. దాన్ని అన్నివిధాలా నిర్మూలించేందుకు కట్టుబడి ఉన్నాం' అని అన్నారు. వామపక్ష తీవ్రవాద రాష్ట్రాల్లో పరిస్థితిపై ఆయన శుక్రవారం సమీక్ష జరిపారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో పాటు మహారాష్ట్ర, జార్ఖండ్ సీఎంలు కూడా ఇందులో పాల్గొన్నారు. 2015లో 'వామపక్ష తీవ్రవాదంపై జాతీయ విధానం, కార్యాచరణ ప్రణాళిక' అమల్లోకి వచ్చాక ఆ ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిస్థితి ఎంతో మెరుగుపడిందని ఉన్నతాధికారులు తెలిపారు. 2010తో పోలిస్తే నక్సల్స్ హింసలో పోలీసు, పౌర మరణాలు 90 శాతం తగ్గాయని వివరించారు. '2004-14 మధ్య 17,679 నక్సల్ సంబంధిత హింసా ఘటనలు, 6,984 మరణాలు సంభవించాయి. 2014-23 మధ్య 7,659 ఘటనలు, 2,020 మరణాలు నమోదయ్యాయి' అని పేర్కొన్నారు.



శుక్రవారం సిక్కింలోని రంగ్‌పో పట్టణంలో జల దిగ్బంధంలో ఇళ్లు

సిక్కిం వరదలు.. 26కు చేరిన మరణాలు

గ్యాంగ్‌టక్: సిక్కింలోని తీస్తా నదికి బుధవారం సంభవించిన ఆకస్మిక వరదల్లో గల్లంతైన వారి ఆచూకీ కోసం ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు నిర్విరామంగా గాలిస్తున్నాయి. ఇప్పటి దాకా 26 మృతదేహాలను వెలికితీశారు. ఇందులో ఏడుగురు జవాన్ల మృతదేహాలున్నాయి. బర్దంగ్ ఏరియాలో సంభవించిన వరదల్లో 23 మంది ఆర్మీ సిబ్బంది గల్లంతైన విషయం తెలిసిందే. జవాన్లు సహా మొత్తం 143 మంది జాడ తెలియాల్సి ఉంది. జల దిగ్బంధానికి గురైన మొత్తం 2,413 మందిని రక్షించి, సహాయక శిబిరాలకు తరలించామని అధికారులు చెప్పారు. బర్దంగ్ ప్రాంతంలో ఇసుక మేటను తొలగించి ఆయుధ డిపోను వెలికితీసినట్లు రక్షణ శాఖ తెలిపింది. అన్వేషణ కార్యకలాపాల్లో స్పెషల్ రాడార్లు, జాగిలాలను రప్పించామని తెలిపింది. సింగ్‌టమ్-బర్దంగ్ మధ్య ధ్వంసమైన రహదారిని వాహనాల రాకపోకలకు వీలుగా పునరుద్ధరించినట్లు తెలిపింది. ఇలా ఉండగా, రాష్ట్రానికి అవసరమైన సాయం అందజేస్తామని ప్రధాని మోదీ హామీ ఇచ్చారని సీఎం తమాంగ్ చెప్పారు. అడ్వాన్సుగా రూ.44.8 కోట్లు విడుదల చేస్తున్నట్లు హోం మంత్రి అమిత్ షా చెప్పారన్నారు. ఆకస్మిక వరద నష్టం అంచనాకు హోం శాఖ, ఇతర విభాగాల అధికారులతో కూడిన బృందాన్ని కూడా పంపుతామని అమిత్ షా తెలిపినట్లు సీఎం వెల్లడించారు.

రాష్ట్ర ప్రభుత్వాల విధాన నిర్ణయాలను అడ్డుకోలేం

న్యూఢిల్లీ: రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొనే విధాన పరమైన నిర్ణయాలను అడ్డుకోలేమని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. బిహార్ ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన కుల గణనకు సంబంధించిన తదుపరి సమాచారాన్ని బహిర్గతం చేయకుండా తాము నిరోధించలేమని వెల్లడించింది. కుల గణన డేటాను ఎందుకు ప్రచురించాల్సి వచ్చిందో చెప్పాలని బిహార్ ప్రభుత్వాన్ని న్యాయస్థానం ప్రశ్నించింది. కుల గణన చేపట్టే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందో లేదో పరిశీలిస్తామని తెలియజేసింది. బిహార్‌లో కుల గణనకు అనుమతి ఇస్తూ ఆగస్టు 1న బిహార్ హైకోర్టు జారీచేసిన ఉత్తర్వును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎస్వీఎన్ భట్టీతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. కులాల వారీగా సర్వేకు సంబంధించిన కొన్ని వివరాలను ప్రభుత్వం ప్రచురించిందని, మిగిలిన వివరాలకు బయటపెట్టకుండా స్టే ఇవ్వాలని పిటిషనర్లు విజ్ఞప్తి చేయగా, ధర్మాసనం అందుకు నిరాకరించింది. విచారణను వచ్చే ఏడాది జనవరికి వాయిదా వేసింది.

టెక్నాలజీ అత్యవసరం.. అందిపుచ్చుకోవాల్సిందే

హైకోర్టులకు, న్యాయమూర్తులకు సీజేఐ సూచన



న్యూఢిల్లీ: పలు హైకోర్టుల్లో వర్చువల్ విచారణల శాతం తక్కువగా ఉండటంపై సుప్రీంకోర్టు విస్మయం వెలిబుచ్చింది. అన్ని కోర్టులు, దేశంలో ప్రతి జడ్జీ టెక్నాలజీని వీలైనంత త్వరగా అందిపుచ్చుకోవాల్సిందేనని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ స్పష్టం చేశారు. పంజాబ్, హరియాణా హైకోర్టు విచారణల్లో వీడియో కాన్ఫరెన్స్ వాడకాన్ని పూర్తిగా పక్కన పెట్టిందంటూ దాఖలైన పిటిషన్‌పై సీజేఐ సారథ్యంలోని ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. న్యాయమూర్తులు టెక్నాలజీ వాడకంలో నిష్ణాతులా కాదా అన్నది కాదు సమస్య. కానీ వారికి దాని వాడకం తెలిసి ఉండాలి. లేదంటే అది అలవాటయ్యేలా శిక్షణ తీసుకోవాలి. సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు కూడా ఇది వర్తిస్తుంది. టెక్నాలజీ వాడకం మీద అవగాహన కోసం వాళ్లు ప్రత్యేక కేంద్రాలకు వెళ్లి శిక్షణ తీసుకున్నారు' అని పేర్కొంది. నేటి పరిస్థితుల్లో టెక్నాలజీ వాడకం ఇంకెంతమాత్రమూ ఆప్షన్ కాదని, అత్యవసర పనిముట్టుగా మారిందని జస్టిస్ చంద్రచూడ్ అన్నారు. ఈ మార్పు దిశగా లాయర్లను కూడా సిద్ధం చేయక తప్పదని అభిప్రాయపడ్డారు. బాంబే హైకోర్టులో వీడియో కాన్ఫరెన్స్‌లకు ఉద్దేశించిన స్క్రీన్స్‌ను తీసేయడం దారుణమన్నారు. ఇకపై మన దేశంలో జడ్జి కావాలంటే టెక్ ఫ్రెండ్లీగా ఉండాల్సిందేనని స్పష్టం చేశారు.



అమెరికాలోనే మొట్ట మొదటిసారిగా టెక్సాస్ రాష్ట్రం హ్యూస్టన్‌లో ఇటీవల గాంధీ మ్యూజియంను ప్రారంభించారు. ఈ మ్యూజియం ఆవరణలో నెలకొల్పిన మహాత్ముని విగ్రహమిది.

'మహాదేవ్' లూటీ రోజుకు రూ.200 కోట్లు

- దుబాయ్ కేంద్రంగా భారీ బెట్టింగ్ దందా
- బాలీవుడ్ నటుల ప్రమేయంపై ఈడీ దర్యాప్తు

మహాదేవ్ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్.. ప్రస్తుతం దేశవ్యాప్తంగా సంచలనాత్మకంగా మారిన వ్యవహారమిది. బాలీవుడ్ ప్రముఖ నటులకు ఇందులో భాగస్వామ్యం ఉన్నట్లు కేంద్ర దర్యాప్తు సంస్థలు గుర్తించడం తీవ్ర కలకలం సృష్టిస్తోంది. యాప్‌పై దర్యాప్తులో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) గత నెలలో భారత్‌లో 39 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించింది. రూ.417 కోట్ల విలువైన బంగారు బిస్కెట్లు, ఆభరణాలు, నగదు స్వాధీనం చేసుకుంది. యాప్ కోసం ప్రచారం చేసిన బాలీవుడ్ నటులు రణబీర్ కపూర్, శ్రద్ధ కపూర్‌కు ఈడీ నోటీసులు జారీ చేసింది. విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. ఈ కేసులో ఇప్పటికే నలుగురి నిందితులను అదుపులోకి తీసుకుంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఈ యాప్ బాగోతం బయటపడింది.

- ఛత్తీస్‌గఢ్‌లోని భిలాయి పట్టణానికి చెందిన సౌరభ్ చంద్రశేఖర్, రవి ఉప్పల్ దుబాయ్‌లో మకాం వేసి, మహాదేవ్ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ను ఆపరేట్ చేస్తున్నారు.
- కొత్తకొత్త వెబ్‌సైట్లు, చాటింగ్ యాప్‌ల ద్వారా కస్టమర్లను ఆకర్షిస్తారు. ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌ల్లో భారీగా లాభాలు వస్తాయంటూ సోషల్ మీడియాలో ప్రచారం చేస్తారు.



- తమ వలలో చిక్కిన కస్టమర్లతో వాట్సాప్‌లో గ్రూప్‌లు ఏర్పాటు చేస్తారు. వారితో నేరుగా ఫోన్లలో మాట్లాడరు. వాట్సాప్ ద్వారానే సంప్రదిస్తుంటారు.
- కస్టమర్లను బెట్టింగ్ యాప్‌లో సభ్యులుగా చేర్చి, యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ ఇస్తారు. తర్వాత వారితో నగదు జమ చేయించుకుంటారు. ఈ వ్యవహారాన్ని మహాదేవ్ కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్‌లు పర్యవేక్షిస్తుంటారు. ఈ డబ్బంతా తప్పుడు పత్రాలతో తెరిచిన యాప్ నిర్వాహకుల బినామీ బ్యాంకు ఖాతాల్లోకి చేరుతుంది.
- యాప్‌లో బెట్టింగ్‌లు కాస్తే తొలుత లాభాలు వచ్చినట్లు నమ్మిస్తారు. దాంతో కస్టమర్‌లో ఆశ పెరిగిపోతుంది. పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టేలా అతడిని ప్రేరేపిస్తారు. చివరకు అదంతా నష్టపోయేలా బెట్టింగ్ యాప్‌లో రిగ్గింగ్ చేస్తారు. మళ్లీ కొత్త బకరా కోసం వేట మొదలవుతుంది.
- మహాదేవ్ బెట్టింగ్ యాప్ సంపాదన ప్రతిరోజూ రూ.200 కోట్లు ఉంటుందని ఈడీ దర్యాప్తులో తేలింది.
- భారత్, మలేసియా, థాయ్‌లాండ్, యూఏఈలో మహాదేవ్ యాప్‌నకు వందలాది కాల్ సెంటర్లు ఉన్నాయి. ప్రధాన కార్యాలయం యూఏఈలో ఉంది. నాలుగు దేశాల్లో పెద్ద సంఖ్యలో బినామీ బ్యాంకు ఖాతాలు తెరిచారు.
- భారత్‌లోని 30 కాల్ సెంటర్లను అనిల్ దమానీ, సునీల్ దమానీ నిర్వహిస్తున్నారు. వీరిద్దరిని ఈడీ అరెస్టు చేసింది.
- బెట్టింగ్ యాప్ జోలికి రాకుండా ఉండడానికి పోలీసులకు, రాజకీయ నాయకులకు, ప్రభుత్వ అధికారులకు నిర్వాహకులు హవాలా మార్గాల్లో లంచాలు ఇచ్చినట్లు వెల్లడయ్యింది.
- బెట్టింగ్ సిండికేట్ నడిపిస్తున్న ఓ యాప్‌ను బాలీవుడ్ హీరో రణబీర్ కపూర్ ప్రమోట్ చేస్తున్నట్లు ఈడీ చెబుతోంది.
- ఈ ఏడాది ఫిబ్రవరిలో దుబాయ్‌లో ఓ పెళ్లి నిర్వహణకు రూ.200 కోట్లు నగదు రూపంలో చెల్లించారు. దీనిపై దర్యాప్తు చేయగా మహాదేవ్ బెట్టింగ్ యాప్ గురించి బయటపడింది. ఈ పెళ్లిలో రణబీర్ కపూర్, శ్రద్ధాకపూర్, కపిల్ శర్మ, హీనా ఖాన్‌తో పాటు మరికొందరు బాలీవుడ్ నటులు ప్రదర్శన ఇచ్చారు. వారికి హవాలా మార్గంలో రూ.కోట్లలో చెల్లింపులు చేసినట్లు తేలింది. పెళ్లిలో ప్రదర్శన ఇవ్వడానికి 17 మంది బాలీవుడ్ సెలబ్రిటీలను చార్టర్డ్ విమానంలో దుబాయ్‌కి తీసుకెళ్లారని ఈడీ అధికారులు వెల్లడించారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

కెనడా దౌత్యవేత్తలు వెనక్కు!

టొరంటో: ఖలిస్తానీ వేర్పాటువాది హర్‌ప్రీత్ సింగ్ నిజ్జర్ మృతి వివాదం రేపిన మంటల నేపథ్యంలో భారత్‌లోని తమ దౌత్యవేత్తల సంఖ్యను కెనడా బాగా తగ్గించింది. ఢిల్లీ వెలుపల పని చేస్తున్న వారిని చాలావరకు కౌలాలంపూర్ (మలేసియా), సింగపూర్‌కు తరలించింది. ఆ దేశ ప్రైవేట్ వార్తా చానల్ ఒకటి శుక్రవారం ఈ మేరకు పేర్కొంది. అక్టోబర్ 10లోగా వారి సంఖ్యను కెనడాలోని భారత దౌత్యవేత్తల సంఖ్యకు సమానంగా తగ్గించాలని కేంద్రం ఇటీవలే ఆదేశించడం తెలిసిందే. ఆ ఆదేశాలను పాటించి తీరాల్సిందేనని గురువారం కూడా పునరుద్ఘాటించింది. ఈ విషయంలో ఎలాంటి సమీక్షకూ, పునరాలోచనకూ తావు లేదని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి అరిందం బాగ్చి చెప్పకనే చెప్పారు కూడా. నిజ్జర్ హత్య వెనక భారత్ ప్రమేయం ఉందని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో చేసిన ఆరోపణలు ఇరుదేశాల మధ్య తీవ్ర స్థాయిలో మంటలు రేపడం తెలిసిందే. ఆ తర్వాత భారత సీనియర్ దౌత్యవేత్తను కెనడా బహిష్కరించడంతో వివాదం మరింత ముదిరింది. వెంటనే భారత్ కూడా కెనడా సీనియర్ దౌత్యవేత్తను పంపించేసింది. ప్రస్తుతం భారత్‌లో కెనడా దౌత్యవేత్తలు 60 మంది దాకా ఉన్నారు. వారిలో కనీసం 40 మందిని పంపించేయాలని భారత్ పేర్కొన్నట్టు సమాచారం.

'ఉచితాల'పై సుప్రీంకోర్టు నోటీసు

న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్, రాజస్తాన్‌లో త్వరలో శాసనసభ ఎన్నికలు జరుగనున్నాయి. ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు ఓటర్లపై ఉచితాల వల విసురుతున్నాయి. మళ్లీ అధికారం అప్పగిస్తే ఉచిత పథకాలు అమలు చేస్తామని, ఎన్నో ప్రయోజనాలు చేకూరుస్తామని హామీ ఇస్తున్నాయి. ప్రజాధనాన్ని దుర్వినియోగం అవుతోందని, ఈ ఉచిత పథకాలను అడ్డుకోవాలని కోరుతూ భట్టూలాల్ జైన్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. మధ్యప్రదేశ్, రాజస్తాన్ ప్రభుత్వాలతోపాటు కేంద్ర ప్రభుత్వానికి, ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా స్పందించాలని ఆదేశించింది.

సీఐసీ పోస్టుకు 76 దరఖాస్తులు

న్యూఢిల్లీ: ముఖ్య సమాచార కమిషనర్(సీఐసీ) పదవిని భర్తీ చేయడానికి కేంద్ర ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించగా, ఇప్పటిదాకా 76 దరఖాస్తులు వచ్చాయి. సీఐసీ వైకే సిన్హా పదవీ కాలం మంగళవారం ముగిసింది. ఈ పోస్టు కోసం ముగ్గురు సమాచార కమిషనర్లు హీరాలాల్ సమారియా, సరోజ్ పున్హానీ, ఉదయ్ మహూర్కర్ పోటీ పడుతున్నారు. మాజీ సమాచార కమిషనర్ అమిత్ పాండోవ్ కూడా దరఖాస్తు చేసుకున్నారు.

ఆ కంటెంట్ తొలగించకుంటే చర్యలే

న్యూఢిల్లీ: సోషల్ మీడియాలో బాలలపై లైంగిక వేధింపుల కంటెంట్ వ్యాప్తిపై కేంద్రం కన్నెర్రజేసింది. దాన్ని తక్షణం తొలగించాల్సిందేనని స్పష్టం చేసింది. సోషల్ మీడియా వేదికలు ఎక్స్, యూట్యూబ్, టెలిగ్రాంలకు ఈ మేరకు శుక్రవారం నోటీసులిచ్చింది. 'భారత ఇంటర్నెట్ పరిధిలో వాటిని తక్షణం శాశ్వతంగా తొలగించండి. లేదా డిజెబుల్ చేయండి' అని ఆదేశించింది. లేదంటే ఐటీ చట్టంలో 79వ సెక్షన్ కింద వారికి కలిగించిన రక్షణను తొలగిస్తామని ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ హెచ్చరించారు. నిబంధనల మేరకు పౌరులకు నమ్మకమూ, సురక్షితమైన ఇంటర్నెట్‌ను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

రైలులో మద్యం మత్తులో...

ఝాన్సీ: ఇటీవల విమానంలో ఓ వ్యక్తి మద్యం మత్తులో తోటి ప్రయాణికులపై మూత్ర విసర్జన చేసిన సంఘటన గురించి విన్నాం. అలాంటి ఘటనపై ఉత్తరప్రదేశ్‌లో రైలులో జరిగింది. 19 ఏళ్ల రితేశ్ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ ఏసీ కంపార్ట్‌మెంట్‌లో ప్రయాణిస్తూ కింది బెర్తుపై నిద్రిస్తున్న వృద్ధ దంపతులపై మద్యం మత్తులో మూత్ర విసర్జన చేశాడు. అతడిని అరెస్టు చేశామని ఆర్పీఎఫ్ పోలీసులు శుక్రవారం తెలిపారు. అయితే, అతడు ఉద్దేశపూర్వకంగా ఈ పని చేయలేదని తేలినట్లు చెప్పారు. మూత్ర విసర్జన ఘటన జరగ్గానే దంపతులు రైలులో ఉన్న టీటీఈకి ఫిర్యాదు చేశారు టీటీఈ ఝాన్సీ రైల్వే స్టేషన్‌కు సమాచారం చేరవేశాడు. రైలు ఝాన్సీ స్టేషన్‌కు చేరుకోగా పోలీసులు రితేశ్‌ను అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేశారు. రైల్వే చట్టం ప్రకారం జరిమానా చెల్లించిన రితేశ్‌ను విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు.

భవనంలో మంటలు.. ఏడుగురు మృతి

ముంబై: ముంబైలోని ఓ నివాస భవనంలో శుక్రవారం వేకువజామున చెలరేగిన మంటల్లో ఇద్దరు చిన్నారులు సహా ఏడుగురు మృతి చెందారు. మరో 68 మంది గాయపడ్డారు. గోరెగావ్ వెస్ట్‌లోని ఏడంతస్తుల నివాస భవనంలో తెల్లవారు జామున 3 గంటల సమయంలో మంటలు ప్రారంభమయ్యాయి. సమాచారం అందుకుని ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకునే సరికి అగ్ని కీలలు భవనాన్నంతటినీ చుట్టుముట్టాయి. పార్కింగ్ ప్లేస్‌లోని దుకాణాలు, ద్విచక్ర వాహనాలతోపాటు, భారీగా నిల్వ ఉంచిన పాత దుస్తులు తగులబడిపోయాయి. వివిధ అంతస్తులతోపాటు టెర్రస్‌పై చిక్కుకున్న సుమారు 30 మందిని ఫైర్ సిబ్బంది కాపాడారు. గాయపడిన వారిని ఆస్పత్రులకు తరలించారు. ఆస్పత్రుల్లో ఒక మహిళ, ఇద్దరు చిన్నారులు సహా ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. వీరంతా ఊపిరాడకనే చనిపోయినట్లు అధికారులు తెలిపారు. గాయపడిన 68 మందిలో అయిదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

అమెరికాలో భారత సంతతి దంపతులు, ఇద్దరు చిన్నారులు హత్య

న్యూయార్క్: అమెరికాలోని న్యూజెర్సీలో భారత సంతతికి చెందిన దంపతులు, వారి ఇద్దరు చిన్నారులు హత్యకు గురయ్యారు. తేజ్ ప్రతాప్ సింగ్(43), సొనాల్ పరిహార్(42), వారి పదేళ్ల కొడుకు ఆయుష్, ఆరేళ్ల కూతురు ఆరీలు ప్లెయిన్స్‌బొరోలోని వారి సొంతింట్లోనే విగతజీవులై రక్తపు మడుగులో కనిపించారని పోలీసులు తెలిపారు. ఐటీ నిపుణులుగా పనిచేస్తున్న సింగ్ దంపతులు 2018లో సొంతింటిని కొనుక్కున్నారని బంధువులు తెలిపారు. ఈ నెల 4న సాయంత్రం తమ ఫోన్‌కాల్‌కు సింగ్ దంపతులు స్పందించడం లేదంటూ వారి బంధువొకరు అధికారులను అలర్ట్ చేశారు. పోలీసులు అక్కడికి వెళ్లి చూడగా విషయం బయటపడింది. బుధవారం రాత్రి వారు హత్యకు గురై ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. తేజ్ ప్రతాప్ సింగ్ సొంతూరు యూపీలోని జలౌన్ అని తెలిసింది.

ఖర్గే, రాహుల్ గాంధీతో శరద్ పవార్ భేటీ

న్యూఢిల్లీ: నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) అధినేత శరద్ పవార్ శుక్రవారం ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఆ పార్టీ సీనియర్ నేత రాహుల్ గాంధీతో సమావేశమయ్యారు. ప్రస్తుత రాజకీయ పరిణామాలపై వారు చర్చించుకున్నారు. విపక్ష 'ఇండియా' కూటమి తదుపరి కార్యాచరణపై అభిప్రాయాలు పంచుకున్నారు. దాదాపు 40 నిమిషాలపాటు ఈ సమావేశం జరిగింది. ఇండియా కూటమి చివరి సమావేశం ఆగస్టు 31, సెప్టెంబర్ 1న ముంబైలో జరిగింది. త్వరలోనే కూటమి నేతలంతా మరోసారి భేటీ కావాలని పవార్, ఖర్గే, రాహుల్ గాంధీ అభిప్రాయపడ్డారు.

టీచర్‌పై కాల్పులు.. సోషల్ మీడియాలో పోస్టింగ్

ఆగ్రా(యూపీ): కోచింగ్ సెంటర్ టీచర్‌పై అకారణంగా కోపం పెంచుకున్న ఇద్దరు విద్యార్థులు తుపాకీతో ఆయనపై కాల్పులు జరిపారు. మరోసారి మరిన్ని బుల్లెట్లు దించుతామని సోషల్ మీడియాలో హెచ్చరించారు. ఆగ్రాలోని ఖండోలిలో చోటుచేసుకుంది. సుమిత్ సింగ్ గతంలో ఓ కోచింగ్ సెంటర్‌లో పనిచేశారు. ఆయన వద్ద చదువుకున్న 16, 18 ఏళ్ల ఇద్దరు విద్యార్థులు ఓ బాలికతో మాట్లాడుతుండగా సుమిత్ సోదరుడు తరుణ్ అడ్డుకున్నారు. దీనిపై వారు కోపం పెంచుకుని గురువారం సుమిత్‌కు ఫోన్ చేసి, కోచింగ్ సెంటర్‌కు రావాలని కోరారు. రాగానే తెచ్చుకున్న తుపాకీతో సుమిత్ కాలిపై కాల్చారు. అనంతరం సోషల్ మీడియాలో ఓ వీడియోను పోస్ట్ చేశారు. అందులో 'గ్యాంగ్ ఆఫ్ వాసేపూర్' సినిమాలోని నటుల్లా పోజులు పెట్టి, ప్రస్తుతానికి ఒక్క బుల్లెట్టే కాల్చామని, ఆరు నెల్ల తర్వాత మిగతా 39 బుల్లెట్లనూ సుమిత్ శరీరంలోకి దించుతామంటూ హెచ్చరికలు చేశారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
శనివారం : 7 : అక్టోబర్ : 2023



తమిళనాడుకు కావేరి నీటి విడుదలను వ్యతిరేకిస్తూ బెంగళూరు ఫ్రీడం పార్కులో శుక్రవారం కర్ణాటక జల సంరక్షణ సమితి ధర్నా. కొన్ని రోజులుగా వీరు ఆందోళనలు కొనసాగిస్తూనే ఉన్నారు.

కళ్లకు కట్టిన కరువు తీవ్రత



బెళగావి జిల్లా నేసరిగిలో ఎండిన పంటను పరిశీలిస్తున్న కేంద్ర బృందం



లక్ష్మేశ్వర తాలూకాలో పంటలను పరిశీలిస్తున్న దృశ్యం

- రాష్ట్రంలో పర్యటించిన కేంద్ర కరువు అధ్యయన బృందాలు
- రైతుల గోడు ఆలకించిన అధికారులు

శివాజీనగర: రాష్ట్రంలోని సగానికిపైగా జిల్లాల్లో నెలకొన్న క్షామ పరిస్థితులను అధ్యయనం చేసేందుకు పదిమంది అధికారులతో కూడిన కేంద్ర బృందం శుక్రవారం పలు జిల్లాల్లో పర్యటించింది. నెర్రెలు చీలిన భూములు, ఎండిన పంటలు, ఎండిపోయిన చెరువులు కరువు తీవ్రతను అధికారుల కళ్లకు కట్టింది. రైతుల దయనీయ పరిస్థితులను అధికారులు స్వయంగా పరిశీలించారు. గురువారం రాష్ట్రానికి చేరుకున్న కేంద్ర బృందం సీఎం సిద్ధరామయ్యతో సమీక్ష జరిపింది. శుక్రవారం క్షేత్రస్థాయికి వెళ్లి కరువు పరిస్థితులను అధ్యయనం చేసింది. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ సచివాలయ జాయింట్ కార్యదర్శి అజిత్‌కుమార్ సాహూ నేతృత్వంలో బృందం బెళగావి, విజయపుర జిల్లాల్లో పర్యటించింది. కేంద్ర తాగునీరు, పరిశుభ్రత సచివాలయ అదనపు సలహాదారుడు టీ.రాజశేఖర్ నేతృత్వంలో 2వ బృందం గదగ్, కొప్పళ జిల్లాల్లో పర్యటించింది. కేంద్ర జల కమిషన్ డైరెక్టర్ అశోక్‌కుమార్ నేతృత్వంలో మూడో బృందం చిక్కబళ్లాపుర, తుమకూరు జిల్లాల్లో పర్యటించింది.

పెట్టుబడులు కూడా దక్కవు

చిక్కబళ్లాపుర జిల్లా నుంచి తుమకూరు జిల్లా కొరటగెరె తాలూకాలోని అరసాపుర గ్రామానికి చేరుకొన్న కేంద్ర బృందానికి జిల్లాధికారి కే.శ్రీనివాస్, జెడ్పీ సీఈఓ జీ.ప్రభు ఆహ్వానం పలికారు. జిల్లాలో 10 తాలూకాల్లో 9 తాలూకాలను తీవ్ర కరువుగా, ఒక తాలూకాను సాధారణ కరువుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విషయాన్ని కలెక్టర్.. కేంద్ర కరువు బృందం అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. గదగ్ జిల్లాలో పర్యటించిన కేంద్ర బృందం లక్ష్మేశ్వర తాలూకా గుజనూరు, లక్ష్మేశ్వర, దొడ్డూరు, సురణగి గ్రామాలను సందర్శించింది. నిట్టనిలువునా ఎండిపోయినా జొన్న, ఇతర పంటలను కళ్లారా వీక్షించారు. కొన్ని చోట్ల వేరుశనగ పైరు పచ్చగా ఉండటాన్ని గమనించారు. అయితే పైకి పచ్చగా ఉన్నా లోపల కాయలు లేని విషయాన్ని రైతులు వివరించారు.విత్తనానికి పెట్టిన ఖర్చులు కూడా రావని రైతులు వాపోయారు. అదేవిధంగా మరో కేంద్ర బృందం బెళగావిలోని సవదత్తి తాలూకాలోని చచడి, నేసరిగి తదితర ప్రాంతాల్లో పర్యటించింది. ఎదుగూబొదుగు లేని సూర్యకాంతి, క్యారెట్ పంటలను పరిశీలించారు.

కేంద్ర అధికారుల బృందం ఎదురుగానే రైతు ఆత్మహత్యాయత్నం

కరువు పరిశీలనకు విచ్చేసిన కేంద్రం మూడు బృందాలు తమ సమస్య ఆలకించలేదనే బాధతో ఓ రైతు ఆత్మహత్యకు ప్రయత్నించిన సంఘటన బెళగావి జిల్లా బైలహొంగల తాలూకా కలకుప్పిలో జరిగింది. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ సచివాలయ జాయింట్ కార్యదర్శి అదిత్‌కుమార్ సావ్ నేతృత్వపు కేంద్ర బృందం కలకుప్పి గ్రామానికి చేరుకొని రైతుల కష్టాలు ఆలకించి సవదత్తి ప్రయాణం చేపట్టారు. అయితే అప్పా సాహెబ్ యక్కుండి అనే రైతు పురుగు మందు తాగేందుకు యత్నించగా అధికారులు అడ్డుకున్నారు. బాధిత రైతు మాట్లాడుతూ 40 ఎకరాల్లో వేరుశనగ, సూర్యకాంతి, బీన్స్ సాగు చేశానని, వర్షాభావంతో పంటలు ఎండిపోయాయని వాపోయాడు. తాము పడుతున్న ఇబ్బందులను అధికారులు పట్టించుకోవడం లేదని, తమకు ప్రభుత్వం ఎలాంటి గ్యారంటీ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పటికైనా పరిహారం అందించాలని డిమాండ్ చేశాడు.

గౌరిబిదనూరు: చిక్కబళ్లాపుర జిల్లా గౌరిబిదనూరు తాలూకాలోని గంగసంద్ర గ్రామాన్ని కేంద్ర కరువు అధ్యయన బృందం సందర్శించింది. మొక్కజొన్న, రాగి పంటకు ఎక్కువ నష్టం వాటిల్లినట్లు కలెక్టర్ రవీంద్ర కేంద్ర బృందం దృష్టికి తెచ్చారు. బోరు బావుల కింద పంటల పరిస్థితిని సమీక్షించారు. రైతులతో మాట్లాడి కరువు వల్ల ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.

తుమకూరు: కొరటగెరె తాలూకా అరసాపుర, రెనహళ్లిలో ఎండిపోయిన వేరుశనగ, జొన్న పంటలను పరిశీలించారు. 83 శాతం పంటలకు నష్టం జరిగిందని కలెక్టర్ కే.శ్రీనివాస్ కేంద్ర అధికారులకు వివరించారు.

చిక్కబళ్లాపురం: చిక్కబళ్లాపురం తాలూకా చొక్కహళ్లి గ్రామంలో అధికారులు పర్యటించారు. రాగి, వేరుశనగ పంటలను పరిశీలించారు. అనంతరం బండమ్మనహళ్లి, దొడ్డగానహళ్లిలో పర్యటించారు. జిల్లాలో రూ. 463 కోట్ల మేర పంటనష్టం జరిగినట్లు జిల్లా అధికారులు కేంద్ర బృందానికి తెలిపారు.

నేడు కేంద్ర బృందం పర్యటించే జిల్లాలు

శుక్రవారం పలు జిల్లాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి కరువు పరిస్థితులను అధ్యయనం చేసిన మూడు బృందాలు శనివారం బాగలకోట, ధార్వాడ, విజయనగర, బళ్లారి జిల్లాల్లో చిత్రదుర్గ, దావణగెరె జిల్లాల్లో పర్యటించనున్నాయి. ఈ మూడు బృందాలు అక్టోబర్ 8న బెంగళూరుకు విచ్చేసి 9న మళ్లీ రాష్ట్రానికి చెందిన అధికారులతో సమావేశమై ఢిల్లీకి వెనుతిరిగి వెళ్లనుంది.







తుమకూరు: పైకి పచ్చగా కనిపిస్తున్నా దిగుబడి లేని పంటను ఫొటో తీస్తున్న అధికారి, చిక్కబళ్లాపుర జిల్లాలో ఎండిన మెక్కజొన్న పంటను, బెళగావి జిల్లాలో సూర్యకాంతి పంటను పరిశీలిస్తున్న అధికారులు

న్యూస్‌రీల్

వృషభానికి జన్మదిన వేడుక

- రక్తదాన శిబిరం ఏర్పాటు చేసిన యజమాని



వృషభాన్ని అలంకరించిన దృశ్యం

యశవంతపుర: మనిషి జన్మదినం రోజున సామాజిక సేవలో భాగంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం చూస్తూంటాం. అయితే తన పెంపుడు ఎద్దు జన్మదినం సందర్భంగా ఓ వ్యక్తి రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. హావేరి తాలూకా కెరిమత్తిహళ్లికి చెందిన సిద్ధలింగేశవాలి ఎడ్ల పోటీల కోసం పోట్లగిత్తను చిన్న వయస్సులోనే రూ.లక్ష వ్యయం చేసి కొనుగోలు చేశాడు. దానికి రాక్షస–220 అని పేరు పెట్టాడు. పోటీల్లో మంచి ప్రతిభ చూపిన ఆ వృషభం సిద్ధలింగేశ వాలికి మంచి పేరు తెచ్చింది. ఈక్రమంలో వృషభం శుక్రవారం 8వ ఏడాదిలోకి అడుగు పెట్టింది. దీంతో గ్రామస్తులను ఆహ్వానించి భోజనాలు పెట్టాడు. అనంతరం రక్తదాన శిబిరం ఏర్పాటు చేయగా 50మందికిపైగా యువకులు రక్తదానం చేశారు.

ఎస్‌ఐ సస్పెన్షన్

బనశంకరి: మైనర్‌బాలిక మృతి కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన బీదర్ జిల్లా బెమళఖేడ ఎస్‌ఐ రాచయ్యమఠపతిని అధికారులు సస్పెండ్ చేశారు. గ్రామానికి చెందిన మైనర్‌బాలిక యువకుడి వేధింపుల నేపథ్యంలో ఆగస్టు 17న అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ కేసు నమోదు చేయలేదు. డీఎస్పీ విచారణ చేపట్టారు. ఎస్‌ఐ నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు డీఎస్పీ నివేదిక అందించడంతో ఎస్‌ఐను సస్పెండ్ చేసినట్లు జిల్లా ఎస్పీ చెన్నబసవణ్ణ ఎస్‌ఎల్ తెలిపారు.

నడిరోడ్డుపై కారు దగ్ధం



రోడ్డుమీద కాలిపోతున్న కారు

దొడ్డబళ్లాపురం: రూ.50 వేల నగదుతో పాటు కారు నడిరోడ్డుపై కాలిపోయిన సంఘటన నెలమంగల తాలూకా సోలూరు వద్ద చోటుచేసుకుంది. కారు యజమాని కిరణ్ ఫైనాన్స్‌లో డబ్బు చెల్లించడానికి రూ.50 వేలు డ్రా చేసి కారులో వెళ్తుండగా షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంటలు చెలరేగి రోడ్డుమీదే కాలిపోయింది. అదృష్టవశాత్తు కిరణ్ ప్రాణాలతో బయటపడ్డాడు. అగ్నిమాపకదళ సిబ్బంది మంటలు ఆర్పారు.

బాలికపై అత్యాచారం.. ముద్దాయికి 20 ఏళ్ల జైలు

కోలారు: బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.50 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ముళబాగిలు తాలూకా కువనహళ్లికి చెందిన వినయ్ ఓ మైనర్ బాలికను అపహరించి అత్యాచారం చేశాడని ఛత్రకోడిహళ్లికి చెందిన రాజణ్ణ అనే వ్యక్తి చేసిన ఫిర్యాదు మేరకు కోలారు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈకేసు శుక్రవారం విచారణకు వచ్చింది. వినయ్ నేరం చేసినట్లు రుజువవడంతో జైలు శిక్ష విధిస్తూ, బాధిత బాలికకు రూ.4 లక్షల పరిహారం అందించాలని జడ్జి బీపీ దేవమానె తీర్పు వెలువరించారు.

నమ్మమెట్రోలో యూట్యూబర్ హల్‌చల్

- మూర్ఛ వచ్చినట్లు నటన
- ప్రాంక్ వీడియోలు ఇన్‌స్టాగ్రామ్‌లో అప్‌లోడ్



మెట్రో స్టేషన్‌లో, రైలులో మూర్ఛవచ్చినట్లు ప్రాంక్ చేస్తున్న యూట్యూబర్ ప్రజ్జు

బనశంకరి: మెట్రో రైలులో కొందరు తోటి ప్రయాణికులకు ఇబ్బందులు పెడుతున్న ఘటనలు అప్పుడప్పుడు జరుగుతూనే ఉన్నాయి. తాజాగా బెంగళూరు మెట్రోలో అలాంటి ఒక ఘటన చోటుచేసుకుంది. విజయనగర నుంచి మెజిస్టిక్‌కు ప్రయాణించే సమయంలో ఓ యూట్యూబర్ తొలుత ఎస్కలేటర్‌పై వస్తూ మూర్ఛ వచ్చినట్లు ప్రాంక్ వీడియో చేసి ప్రయాణికులను గాభరా పెట్టాడు. అనంతరం మెట్రోలో ప్రయాణిస్తూ మూర్ఛవచ్చినట్లు నటించి ప్రయాణికులను షాక్‌కు గురిచేశాడు. అనంతరం ఆ వీడియోలను తన ఇన్‌స్టాగ్రామ్‌లో అప్‌లోడ్ చేశాడు. ఈ ఘటనను బీఎంఆర్‌సీఎల్ అధికారులు తీవ్రంగా పరిగణించారు. ప్రయాణికులను కంగారుపెట్టిన యువకుడి సమాచారం సేకరిస్తున్నారు. అతడి పేరు ప్రాంక్ ప్రజ్జు అని తెలిసింది. ముంబై, న్యూఢిల్లీ మెట్రోలో ఇలాంటి అనేక ఘటనలు వెలుగుచూడగా ప్రస్తుతం బెంగళూరులో జరిగింది.

మెట్రో ప్రయాణికుడిపై కేసు

నమ్మ మెట్రోరైలులో గోబిమంచూరి తిన్న ప్రయాణికుడిపై బీఎంఆర్‌సీఎల్ కేసు నమోదు చేసింది. నిబంధనలు ఉల్లంఘించినందుకు రూ.500 జరిమానా విధించింది. బీఎంఆర్‌సీఎల్‌లో ఇలాంటి చర్య తీసుకోవడం ఇదే మొదటిసారి అని అధికారులు తెలిపారు. కేసు నమోదైన వ్యక్తి నమ్మమెట్రోలో జయనగర నుంచి సంపిగే రోడ్డు మధ్య నిత్యం ప్రయాణిస్తుంటారు. ఈ క్రమంలో నిబంధనలు ఉల్లంఘించి గోబిమంచూరి తీసుకువచ్చి అక్కడే తిన్నాడు. తోటి స్నేహితులు వారించారు. ఈ వీడియోను ఓ యూట్యూబర్ సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో అది వైరల్‌గా మారింది. బీఎంఆర్‌సీఎల్ కేఆర్.మార్కెట్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసింది.

కొత్త మద్యం దుకాణాలకు అనుమతివ్వం

సాక్షి,బళ్లారి: రాష్ట్రంలో కొత్త మద్యం అంగళ్లకు అనుమతి ఇచ్చేది లేదని, లైసెన్స్‌లు కూడా ఇవ్వడం లేదు కదా? అని సీఎం సిద్ధరామయ్య పేర్కొన్నారు. ఆయన శుక్రవారం చిత్రదుర్గలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విచ్చేసిన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కొత్తగా 1000 మద్యం అంగళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఎక్సైజ్ శాఖ మంత్రి చేసిన వ్యాఖ్యలను సీఎం దృష్టికి తేగా ఆయన పైవిధంగా స్పందించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న మద్యం అంగళ్లు మినహా కొత్త వాటిని తెరిచేది లేదన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగానే ఉందన్నారు. ప్రతిపక్షాలు రాజకీయ లబ్ధి కోసం మాట్లాడుతుంటారన్నారు. బీజేపీ, జేడీఎస్‌ల పొత్తు అపవిత్రమన్నారు. మతతత్వ పార్టీతో జేడీఎస్ పొత్తు కుదుర్చుకోవడం వల్ల ఆ రెండు పార్టీలకే నష్టం అన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి నష్టం వాటిల్లబోదన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు ఎలాంటి నిధుల కొరత లేదన్నారు. ఐదు గ్యారెంటీలను అమలు చేయడానికి కూడా ఇబ్బందులు లేవన్నారు. ఎమ్మెల్యేలకు కూడా నిధులు విడుదల చేస్తామన్నారు. తమకు పాలన ఎలా సాగించాలో తెలుసన్నారు. ప్రజలకు మేలు చేసేందుకు ఎలాంటి ఇబ్బందులైనా ఎదుర్కొంటామన్నారు. కరువు పరిస్థితులను నివారించడానికి గట్టి చర్యలు తీసుకుంటామన్నారు. ఈసందర్భంగా పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

దంపతుల ఆత్మహత్య



మృతులు పవిత్ర, మను (ఫైల్)

పావగడ: పి రొప్పం గ్రామంలో దంపతులు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసుల వివరాలమేరకు... రొప్పం గ్రామానికి చెందిన దంపతులు మను (26), పవిత్ర (22) బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి రెండేళ్ల కుమార్తె ఉంది. కళ్యాణదుర్గం తాలూకా కంబదూరు మండలం ఒంటారెడ్డిపల్లికి చెందిన మను తాలూకాలోని పాలకుంట గ్రామానికి చెందిన పవిత్రను మూడేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వీరు చాలా ఏళ్ల క్రితం వలస వచ్చి రొప్పం గ్రామంలో స్థిర పడ్డారు. అయితే టమాట పంటలో నష్టం రావడంతో తీర్చేమార్గం లేక బెంగతో గురువారం రాత్రి మను, పవిత్ర ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. సీఐ సురేష్, ఎస్‌ఐ గురునాథ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

అధికారం లేకుంటే కొందరికి ఊపిరాడదు

- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీటీ రవి

సాక్షి,బళ్లారి: అధికారం లేకపోతే కొందరికి ఊపిరి ఆడదని, అలాంటి వారు పార్టీలు మారడం సర్వసాధారణమని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీటీ రవి అన్నారు. ఆయన శుక్రవారం దావణగెరెలో విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రి ఎస్‌టీ సోమశేఖర్ వ్యాఖ్యలపై ఆయన తీవ్రంగా స్పందించారు. బీజేపీలో ఊపిరాడని పరిస్థితి లేదని, ఆయనకు అధికారం లేనందున ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. పార్టీ పెద్దల నిర్ణయంతో బీజేపీ–జేడీఎస్ మైత్రి ఏర్పాటైందన్నారు. అలాంటి విషయంపై ఆయన మాట్లాడటంలో అర్థం లేదన్నారు. పార్టీ హైకమాండ్ తీసుకున్న నిర్ణయాలను వ్యతిరేకించే వారు వారిలో స్వార్థ ఆలోచనలు ఉంటేనే ఆలా మాట్లాడతారన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవిపై ఆయన స్పందిస్తూ అదంతా పార్టీ పెద్దలు చూసుకుంటారన్నారు. కొందరు బీజేపీలో నకిలీ హిందువులు ఉన్నారంటున్నారని, బీజేపీలో అలాంటి వారే ఉన్నా వారంతా కాషాయ కండువా, నుదుటన కుంకుమ ధరిస్తారన్నారు. అయితే నిజమైన హిందువుల్లా బయట ఉండి మాట్లాడే వారంతా కాషాయ కండువాలు, కుంకుమ ధరించడానికి భయపడతారని ఎద్దేవా చేశారు. బీజేపీలో ఉండి హిందువులను విమర్శించే వారంతా టోపీ పెట్టుకోవడానికి ఇష్టపడతారన్నారు.

హత్య కేసులో వ్యక్తికి జీవిత ఖైదు

మైసూరు: మహిళను హత్య చేసిన కేసులో వ్యక్తికి జీవిత ఖైదు పడింది. హైకోర్టు న్యాయమూర్తి హెచ్.బీ ప్రభాకర్ శాస్త్రి న్యాయ పీఠం తీర్పు ఇచ్చింది. వివరాలు... మండ్య జిల్లా కొరమెనహళ్లి గ్రామానికి చెందిన గిరీశ్ 2010లో ఓ మహిళను మైసూరులోని ఓ లాడ్జికి తీసుకెళ్లి ఆమెను చంపి ఆమె వద్ద ఉన్న నగలు, మొబైల్, నగదు తీసుకుని పారిపోయాడు. లష్కర్ పోలీసులు కేసు నమోదు చేశారు. మైసూరు 7వ జిల్లా అదనపు న్యాయమూర్తి 2016 ఏప్రిల్‌లో నేరం రుజువు కాలేదని కొట్టివేశారు. దీన్ని ప్రశ్నిస్తూ పోలీసులు హైకోర్టును ఆశ్రయించారు. ఆధారాలను పరిశీలించిన న్యాయమూర్తి హెచ్.బీ ప్రభాకర్ శాస్త్రి, అనిల్‌తో కూడిన న్యాయపీఠం గిరీశ్‌పై నేరం రుజువు కావడంతో దోషికి జీవిత ఖైదు, రూ.40 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

మెడికల్ సీటు ఇప్పిస్తామని ఘరానా మోసం

- నలుగురు అరెస్ట్

శివాజీనగర: మెడికల్ సీటు ఇప్పిస్తానని నమ్మించి రూ.10.80 లక్షలు తీసుకుని మోసగించిన నలుగురిని హైగ్రౌండ్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన మోసగాళ్లలో ముగ్గురు బిహార్‌కు చెందిన వారు, మరొకరు ఉత్తరాఖండ్‌కు చెందినవాడు. మైసూరు నగరానికి చెందిన కళా మంజునాథ్ రెండో కుమారుడు జీవన్ నీట్ పరీక్ష రాశాడు. అయితే ర్యాంక్ రాలేదు. ఇదిలా ఉంటే గతనెల 23న కళా మంజునాథ్ మొబైల్‌కు మెడికల్ సీటుకు రూ.75 లక్షలు ప్యాకేజ్ అని మెసేజ్ వచ్చింది. ఆ తరువాత రోషి అనే వ్యక్తి ఫోన్ చేసి మీ కుమారుడికి దావణగెరెలోని మెడికల్ కాలేజీలో సీట్ ఇప్పిస్తామని, రూ.60 లక్షలు ఖర్చవుతుందని కళాను నమ్మించారు. ఆ తరువాత కళా మొబైల్‌కు ఆఫీస్ లొకేషన్ పంపించారు. సెప్టెంబర్ 24న నగరంలోని కన్నింగ్‌హామ్ రోడ్డులో ఉన్న ఎజుటిన్సి కన్సల్టెన్సీ సర్వీస్ కంపెనీకి వచ్చి రోశి అనే వ్యక్తిని కళా కలిశారు. రోశి అక్కడున్న యోగేశ్ అనే వ్యక్తిని పరిచయం చేశారు. ఆయన ప్రభుత్వ ఫీజులోనే మీ కుమారుడికి మెడికల్ సీటు ఇప్పిస్తాం. తమకు రూ.3 లక్షలు కమీషన్ ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. ఆ తరువాత తమ బాస్ అని మానవ గుప్త అనే వ్యక్తిని ఫోన్ ద్వారా మాట్లాడించి రూ.10,80,152 చెల్లించాలని తెలిపి కార్యాలయంలో ఉన్న నిఖిల్ ఆశుతోశ్‌లను భేటీ చేయాలని తెలిపారు. కళా ఆ ఇద్దరిని భేటీ చేసినపుడు మానవగుప్త అకౌంట్ నెంబర్, ఫోన్ పే నెంబర్‌ను ఇచ్చి వారి ఖాతాలకు సొమ్మును డిపాజిట్ చేయండి, మెడికల్ సీటు కన్ఫర్మ్ చేస్తామని తెలిపారు. కళా వారి మాటలను నమ్మి సెప్టెంబర్ 25న మానవగుప్తకు మొత్తం రూ.10,80,152 పంపించారు.

ఫోన్ స్విచాఫ్: ఆ తరువాత యోగేశ్‌కు ఫోన్ చేస్తే స్విచాఫ్ వచ్చింది. రోశి కూడా ఫోన్ స్వీకరించలేదు. అనుమానించిన కళా కన్నింగ్ హ్యామ్ రోడ్డులో ఉన్న కార్యాలయానికి వచ్చాడు. అక్కడ ఎవరూ లేరు. మోసపోయినట్లు గుర్తించి హైగ్రౌండ్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు గాలింపు చేపట్టి నలుగురిని పట్టుకున్నారు. మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు.

అట్టహాసంగా ఖేలో ఇండియా ఖోఖో పోటీలు



తెలంగాణ, తమిళనాడు జట్ల క్రీడాకారులతో ప్రముఖులు



తలపడుతున్న తెలంగాణ, తమిళనాడు క్రీడాకారులు

హోసూరు: భారత క్రీడాభివృద్ధి శాఖ, ఇండియన్ ఖోఖో అసోసియేషన్ సంయుక్తంగా దక్షిణ భారత మండల స్థాయి ఖేలో ఇండియా ఖోఖో పోటీలు శుక్రవారం హోసూరులోని జాన్‌బాస్కో బాలికల ఉన్నతోన్నత పాఠశాలలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ప్రిన్సిపాల్ ఏంజిలా అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి హోసూరు డీఎస్పీ బాబుప్రశాంత్, మాజీ ఎమ్మెల్యే కే.ఏ.మనోహరన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. డీఎస్పీ మాట్లాడుతూ దక్షిణ విభాగ ఖేలో ఇండియా ఖోఖో పోటీలను హోసూరులో నిర్వహించడం హర్షదాయకమన్నారు. విద్యార్థులు చదువులతో పాటు క్రీడా రంగంలోనూ రాణించాలని సూచించారు. అండర్–14, అండర్–18 విద్యార్థులకు జూనియర్, సబ్ జూనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో తెలంగాణ, ఆంధ్ర, కర్ణాటక, పాండిచ్చేరి, కేరళ, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. 8వ తేదీ ఫైనల్స్ జరుగుతాయి. అదే రోజు గెలుపొందిన జట్లకు బహుమతుల ప్రదానం చేయనున్నారు.

మైసూరు దసరా ఉత్సవాల్లో ఎయిర్ షో





ఎయిర్‌షో జరిగే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎయిర్ బెస్ట్ గ్రూప్ కెప్టెన్ డి.ఖే.హుజా, మైసూరు దసరా వేడుకల్లో ప్యారాచూట్ విన్యాసాలు (ఫైల్)

- అనుమతి ఇచ్చిన కేంద్ర రక్షణ శాఖ

మైసూరు: ప్రపంచ ప్రసిద్ధి చెందిన మైసూరు దసరా వేడుకల్లో ఎయిర్ షో నిర్వహించడానికి కేంద్ర రక్షణ శాఖ అనుమతి ఇచ్చింది. దీంతో మైసూరులో విమానాలు చక్కర్లు కొట్టనున్నాయి. ఉత్సవాలను వీక్షించేదుకు దేశవిదేశాలనుంచి పర్యాటకులు వేల సంఖ్యలో తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో మైసూరులో ఎయిర్‌షో ఏర్పాటు చేయాలని సీఎం సిద్ధరామయ్య కేంద్ర రక్షణ శాఖ మంత్రికి విన్నవించగా అనుమతి మంజూరైంది. దీంతో శుక్రవారం మైసూరు ఎయిర్ బెస్ట్ గ్రూప్ కెప్టెన్ డి.ఖే.హుజా కలెక్టర్ కే.వీ.రాజేంద్రతో కలిసి మైసూరు నగరంలోని బన్ని మంటపం వద్దకు వచ్చి పరిశీలించారు. ఎయిర్ షో తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు.

క్లుప్తంగా

జోరుగా నామినేషన్ ప్రక్రియ



నామినేషన్‌ను సమర్పిస్తున్న ఎమ్మెల్యే లతా మల్లికార్జున్

హొసపేటె: డీసీసీ బ్యాంక్ అధ్యక్ష స్థానానికి మాజీ మంత్రి ఆనంద్‌సింగ్ రాజీనామా చేయడంతో ఆ స్థానానికి జరిగే ఎన్నికలకు నామినేషన్ ప్రక్రియ జోరందుకుంది. ఎన్నడూ లేని విధంగా ఈసారి అధ్యక్ష బరిలో మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ప్రస్తుత ఎమ్మెల్యేలు కూడా నిలిచేందుకు నామినేషన్లు వేశారు. ఇప్పటికే మాజీ మంత్రి పరమేశ్వర్ నాయక్, మాజీ ఎమ్మెల్యే భీమానాయక్, ప్రస్తుత ఎమ్మెల్యేలు తుకారాం, లతా మల్లికార్జున్, రైతు నాయకులు నామినేషన్ దాఖలు చేశారు. ఈసారి ఈ ఎన్నికలు నగరంలో చర్చనీయాంశంగా మారాయి. ఈ నెల 7వ తేదీ నామినేషన్ సమర్పణకు తుది గడువు కాగా, ఈ నెల 15న ఎన్నికలు జరుగనున్నాయి.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

బళ్లారిఅర్బన్: పవన్ హోటల్ వెనుక భాగంలోని రోటరీ క్లబ్ హాల్‌లో ప్రపంచ ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం రాత్రి పలువురు ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. క్లబ్ అధ్యక్షుడు సురేష్ మాట్లాడుతూ తల్లిదండ్రులు జన్మనిస్తే ఉపాధ్యాయులు జ్ఞానాన్ని ఇచ్చారన్నారు. గురువులను గుర్తించి సత్కరించడం మనందరి బాధ్యత అన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులు ప్రమీల, శోభ, సుమిత్ర, జావీద్, జమున, సతీష్, కాళమ్మ, రాజేంద్ర ప్రసాద్, రాజశేఖర్ తదితరులను సన్మానించారు. క్లబ్ సహ కార్యదర్శి ఖాదర్‌బాష, రోటరీ ఇన్నర్ వీల్ క్లబ్ మహిళా అధ్యక్షురాలు ఎస్‌టీ.లక్ష్మీప్రియ, కార్యదర్శి జయంతి శిల్పా, శివకుమార్, నామా సత్యనారాయణ, విఠా కృష్ణ, వినోద్‌జైన్, రవీంద్రనాయుడు, గీతనాయుడు పాల్గొన్నారు.

చెరువు ఉన్నతీకరణ పనులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న దృశ్యం

కంప్లి: చెరువు నీటితో పశుపక్ష్యాదులు, మేకలకు తాగునీరు, వ్యవసాయానికి సాగునీటిని అందించవచ్చని జేఎస్‌డబ్ల్యూ ఫౌండేషన్ ఉపాధ్యక్షులు సునీల్‌కుమార్ సింగ్ తెలిపారు. సండూరు తాలూకా నందిహళ్లిలో శుక్రవారం చెరువు ఉన్నతీకరణ పనులకు భూమిపూజ నిర్వహించి ఆయన మాట్లాడారు. చెరువులు, వాగులకు మరమ్మతులు అవసరమన్నారు. తద్వారా రైతుల భూములకు అంతర్జలాలు పెంపొందుతాయన్నారు. ప్రధానంగా చెరువులో నీటి నిల్వ వృద్ధికి ముఖ్యంగా పూడిక తొలగింపు ప్రధానమని, ఆ పనులు కూడా పూర్తి చేస్తామన్నారు.

మైనర్లు డ్రైవింగ్ చేయడం నేరం



జిల్లా ఎస్పీ శ్రీహరిబాబు

హొసపేటె: డ్రైవింగ్ చేసే మైనర్లు, డ్రైవింగ్ లైసెన్స్ లేని వారికి భారీ జరిమానాతో పాటు జైలు శిక్ష తప్పదని విజయనగర జిల్లా ఎస్పీ శ్రీహరిబాబు తెలిపారు. మోటారు వాహన చట్టం ప్రకారం మైనర్లు, డ్రైవింగ్ లైసెన్స్ లేని వ్యక్తులు డ్రైవింగ్ చేయడం చట్ట విరుద్ధమని ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. నగరంలో ఇప్పటికే ఆపరేషన్ ప్రారంభించామని, తల్లిదండ్రులు తమ పిల్లలను వాహనాలను నడపడానికి అనుమతిస్తే వారి వాహనాన్ని జప్తు చేస్తామని, తల్లిదండ్రులపై సెక్షన్ 5(1) ప్రకారం మూడేళ్ల జైలు శిక్ష, రూ.25 వేల జరిమాన విధిస్తామని హెచ్చరించారు.

మ్యూజిక్ సంస్థచే చంద్రయాన్ ఆల్బమ్



ఆల్బమ్ ఆవిష్కరణలో పాల్గొన్న స్వామీజీ

తుమకూరు: తుమకూరు నగరానికి చెందిన సంగీత్ స్కూల్ ఆఫ్ మ్యూజిక్ సంస్థ ఆధ్వర్యంలో నిర్మాణం చేసిన చంద్రయాన్–3 గురించి తీసిన ఇస్రోయాన్ అనే ఆల్బమ్‌ను శుక్రవారం నగరంలోని సిద్దగంగ మఠంలో మఠాధ్యక్షుడు సిద్దలింగ స్వామీజీ ప్రారంభించారు.

పంటలు పూర్తిగా ఎండిపోయాయి

- కరువు అధ్యయన బృందానికి గోడు వినిపించిన రైతులు
- అధైర్యపడొద్దు..ఆదుకుంటామని భరోసా ఇచ్చిన అధికారులు



కొప్పళ జిల్లాలో పర్యటిస్తున్న అధ్యయన బృందానికి గోడు వినిపిస్తున్న మహిళా రైతు శరణమ్మ

సాక్షి,బళ్లారి: ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులతో పెట్టిన పంటలు పూర్తిగా ఎండిపోయి రైతులకు కనీసం పెట్టుబడి కూడా దక్కే అవకాశం లేకపోవడంతో రైతులు కరువు కోరల్లో చిక్కుకొని విలవిలలాడుతున్నారు. ఈనేపథ్యంలో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంట నష్టాన్ని అధ్యయనం చేయడానికి శుక్రవారం రాష్ట్రానికి కేంద్ర కరువు అధ్యయన బృందాలు విచ్చేశాయి. రాష్ట్రంలో కరువు బృందాలు వేర్వేరుగా పలు జిల్లాల్లో పర్యటించి రైతుల పంటల స్థితిగతులను పరిశీలించారు. కొప్పళ జిల్లా యలబుర్గ తాలూకా బండి క్రాస్ సమీపంలో శరణమ్మ అనే మహిళా రైతుకు చెందిన పంట పొలాలను పరిశీలించగా, రైతులు కరువు అధ్యయన బృందానికి తమ గోడు వెళ్లబోసుకున్నారు. బృందంలో సీనియర్ ఐఏఎస్ అధికారి రాజశేఖర్, పశు సంవర్థక శాఖ డైరెక్టర్ తకరే, గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయక కమిషనర్ మోతీరామ్, రాష్ట్రానికి చెందిన కరువు నివారణ సహాయక డైరెక్టర్ కరేగౌడ తదితరులు రైతు మహిళ పొలంలో పర్యటించి గోడును ఆలకించారు.

పెట్టుబడి కూడా దక్కదు

తన 10 ఎకరాల పొలంలో పూర్తిగా పంట ఎండిపోయిందని ఏకరువు పెట్టారు. పెట్టుబడి కూడా దక్కదన్నారు. ఒక ఎకరా పొలంలో సజ్జలు పూర్తిగా ఎండిపోయాయని కరువు బృందంతో కన్నీరు పెట్టుకుంది. ఇదే తరహాలో గ్రామంలోని రైతులు పెద్ద సంఖ్యలో చేరి రైతుల పంటల స్థితిగతులను వివరించారు. ఒక్క శరణమ్మ పొలంలోనే కాకుండా గ్రామం, తాలూకా, కొప్పళ జిల్లాలో వర్షాధారిత పొలాల్లో పంటలు పూర్తిగా ఎండిపోయాయని కేంద్ర కరువు బృందం దృష్టికి తెచ్చారు. బెళగావి, విజయపుర జిల్లాల్లో పలు గ్రామాల్లో కేంద్ర కరువు అధ్యయన బృందం పర్యటించి రైతుల బాధలను ఆలకించింది. కేంద్ర కరువు అధ్యయన బృందంలో అజిత్‌కుమార్ సాహా నేతృత్వంలో ముందుగా బెళగావి, విజయపుర జిల్లాల్లో పర్యటించి రైతు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో రైతులు తమ పంటలు ఎండిపోయిన విషయాన్ని అధ్యయన బృందంతో పంచుకుంది. ఆదుకోకపోతే తమకు ఆత్మహత్యలే శరణ్యమని విజ్ఞప్తి చేసింది.

గదగ్ జిల్లాలో..

అలాగే గదగ్ జిల్లాలో కరువు నివారణ బృందం రాజశేఖర్ నేతృత్వంలో పలు గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో రైతులు సమస్యలను తెలుసుకున్నారు. కరువు బృందంతో పాటు స్థానిక జిల్లాధికారులు, రైతు సంఘం నేతలు కూడా వెంట తిరిగి కేంద్ర బృందానికి రైతుల పంటలు ఎండిపోయిన విషయాన్ని వివరించారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఆయా జిల్లాల్లోని పలు తాలూకాలను కరువు తాలూకాలుగా ప్రకటించిన సంగతిని గుర్తు చేశారు. అనంతరం కేంద్ర కరువు బృందం రైతులను అధైర్య పడకూడదని, ఎట్టిపరిస్థితిలోను ఆత్మహత్యలు చేసుకోరాదని, కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, సంబంధిత మంత్రుల దృష్టికి తీసుకెళ్లి ఖచ్చితంగా రైతులను ఆదుకొనే చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా అధికారుల బృందం వెంట కొప్పళ లోక్‌సభ సభ్యుడు కరడి సంగణ్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో నిధుల విడుదలపై హర్షం



ఎమ్మెల్యేను అభినందించిన న్యాయవాదులు

బళ్లారిటౌన్: నగరంలో నూతనంగా నిర్మించిన జిల్లా కోర్టు సముదాయానికి సంబంధించి బకాయి ఉన్న నిధుల విషయంపై ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి మంత్రిమండలి దృష్టికి తేవడంతో చర్చ జరిగి నిధుల విడుదలకు అంగీకారం లభించింది. దీంతో శుక్రవారం జిల్లా నూతన కోర్టు ఆవరణలో ఎమ్మెల్యేను న్యాయవాదుల సంఘం పదాధికారులు అభినందించారు. గతంలో రూ.120.90 కోట్లతో నిర్మించిన ఈ కోర్టు సముదాయానికి ఇంకా రూ.21.90 కోట్ల నిధులు బకాయి ఉన్న విషయాన్ని ఎమ్మెల్యే మంత్రి మండలి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో బకాయి మొత్తాన్ని వెంటనే విడుదల చేయడానికి ఆమోదం లభించడంపై లాయర్ల అసోసియేషన్ అధ్యక్షులు ఎర్రెగౌడ, ఇతర పదాధికారులు హర్షం వ్యక్తం చేశారు.

డిసెంబర్ 31 వరకు సాగునీరివ్వాలి



వినతిపత్రాన్ని సమర్పిస్తున్న రైతు సంఘం నాయకులు

గంగావతి: తుంగభద్ర ఎడమ కాలువకు డిసెంబర్ 31కు సాగునీరు సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కారటగి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని కర్ణాటక రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు ముట్టడించారు. పోలీసులు ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు. ఆందోళనను ఉద్దేశించి సంఘం నేత శరణప్ప దొడ్డమని మాట్లాడుతూ తుంగభద్ర డ్యాం నీటిని అక్రమంగా కర్మాగారాలకు ధారాదత్తం చేస్తున్నారని ఆరోపించారు. ఆ నీటి పంపకాలను అరికడితే డిసెంబర్ చివరి వరకు రైతులకు సాగునీరు అందించవచ్చన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ప్రధానంగా చొరవ తీసుకోవాలని డిమాండ్‌చేశారు. రైతు సంఘం పదాధికారులు, ప్రముఖులు, ఆందోళనకారులను పోలీసులు వాహనంలో స్టేషన్‌కు తరలించి అనంతరం విడుదల చేశారు.

ప్యాలెస్‌లోకి పర్యాటకుల ప్రవేశం నిషిద్ధం

మైసూరు : మైసూరు దసరా వేడుకల్లో భాగంగా అంబా విలాస్ ప్యాలెస్‌లో వివిధ ధార్మిక పూజ విధి విధానాలు నిర్వహించే రోజుల్లో ప్యాలెస్‌లోకి పర్యాటకులను నిషేధించినట్లు అధికారులు తెలిపారు. ఈ నెల 9న సింహాసనం జోడింపు, వివిధ ధార్మిక కార్యక్రమాలు ఉంటాయి. ఈనెల 15న యదువీర్ కృష్ణదత్త ఒడెయార్ ప్రైవేటు దర్బార్‌తోపాటు ఈ నెల 23వ తేదీన ఆయుధ పూజ ఉంటుంది. 24వ తేదీన విజయ దశమి రోజున జంబూ సవారీ ఉంటుంది. ఆయా రోజుల్లో మైసూరు రాజవంశస్తుల రాకపోకలు ఉంటాయి. ఈ నేపథ్యంలో పర్యాటకులను లోపలకు అనుమతించరు.

యోగా జీవన దర్శన

శిడ్లఘట్ట: శిడ్లఘట్ట నగర హండిగనాళలోని శ్రీ బాలాజీ సమావేశం హాల్లో శుక్రవారం యోగా జీవన దర్శన– 2023 కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రవి కుమార్ ప్రారంభించారు. హిరియూరు వేదావతి విభాగం సంచాలకుడు కుమారన్న, శిడ్లఘట్ట తాలూకా ఎస్‌పీవైఎస్ అధ్యక్షుడు సుందరాచారి, నగర్త మండలి శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యక్షుడిగా మంజునాథ్



అధ్యక్ష, ఉపాధ్యక్షులను సన్మానిస్తున్న దృశ్యం

కృష్ణరాజపురం: బెంగళూరు ఉత్తర తాలూకా వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ సహకార సంఘానికి ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా శీగేహళ్లి వి.మంజునాథ్, ఉపాధ్యక్షుడుగా రాగి మోహన రెడ్డి ఎన్నికయ్యారు. నాయకులు హుస్కురు సుబ్బణ్ణ, జ్యోతిపుర వేణు, బొమ్మనహళ్లి మునిరాజు, దేవరాజు, అంజనేయ రెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

డబ్బుల కోసం కిడ్నాప్ నాటకం

యశవంతపుర: తనను కిడ్నాప్ చేశారని యజమానిని నమ్మించి డబ్బులు వసూలు చేసుకోవాలనే ఓ యువకుడు చేసిన కుట్ర బెడిసికొట్టింది. ఈ ఘటనలో బిహార్‌కు చెందిన నూరుల్లా హుసేన్, అబూబకర్, అలిరేజాలను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు...మహమ్మద్ అసీఫ్ హబీబ్ పరిశ్రమను నడుపుతున్నారు. అతని వద్ద నూరుల్లా హుస్సేన్ అనే యువకుడు పనిచేస్తున్నాడు. అతన్ని యజమాని సొంత కొడుకులా భావించేవాడు. ఈ క్రమంలో నూరుల్లాకు చెడుబుద్ధి పుట్టింది. ఈ క్రమంలో తన స్నేహితులు అబూబకర్, అలిరేజాలతో పథకం వేశాడు. ప్లాన్ ప్రకారం క్యాబ్ తీసుకుని మండ్యకు చేరుకుని తనను కిడ్నాప్ చేశారని మహ్మద్ హబీబ్‌కు నూరుల్లా ఫోన్ చేశాడు. రెండు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని చెప్పాడు. దీంతో యజమాని ఈ విషయం పోలీసుల దృష్టికి తీసుకెళ్లాడు. నూరుల్లా మొబైల్ ట్రాక్ చేసిన పోలీసులు అది మండ్యలో ఉన్నట్లు బయటపడింది. పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని స్థానిక పోలీసుల సహకారంతో పట్టుకున్నారు. అంతా నాటకమని తేలడంతో ముగ్గురిని అదుపులోకి తీసుకుని బెంగళూరు తరలించారు.

కొత్తగా 188 ఇందిరా క్యాంటీన్లు

- మంత్రి భైరతి సురేశ్

శివాజీనగర: మహానగర పాలికె, నగరసభ, పురసభ వ్యాప్తిలో రాష్ట్రమంతటా కొత్తగా 188 ఇందిరా క్యాంటీన్లు ప్రారంభించనున్నట్లు నగరాభివృద్ధి శాఖ మంత్రి భైరతి సురేశ్ తెలిపారు. శుక్రవారం బెళగావిలో రాణి చెన్నమ్మ విగ్రహానికి పూలమాలను సమర్పించిన తరువాత విలేకరులతో ఆయన మాట్లాడారు. ఇందిరా క్యాంటీన్లు చాలా సమస్యల్లో ఉన్నాయని విలేకరులు ప్రస్తావించగా గత బీజేపీ ప్రభుత్వం సక్రమంగా నిర్వహించకుండా వాటిని మూతవేసే స్థితికి తెచ్చిందన్నారు. క్యాంటీన్‌ల పునశ్చేతనానికి రూ.240 కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. ప్రాంతాల వారీగా బెళగావి భాగంలో రొట్టి భోజనం, మైసూరు భాగంలో రాగి ముద్ద, బెంగళూరులో అన్నం, ఇడ్లీ పంపిణీ చేసే మెనూను సిద్ధం చేసి జారీ చేస్తామన్నారు.

ఆసియా గేమ్స్‌లో దివ్యకు వెండి పతకం



సాధించిన పతకంతో దివ్య సుబ్బరాజు

శ్రీనివాసపురం: చైనాలో జరుగుతున్న ఆసియా గేమ్స్‌లో తాలూకాలోని తాడిగోళ గ్రామానికి చెందిన దివ్య సుబ్బరాజు షూటింగ్‌లో వెండి పతకాన్ని సాధించడం ద్వారా తాలూకాకు, జిల్లాకు కీర్తి ప్రతిష్టలు సాధించారు. చిన్న వయసు నుంచి షూటింగ్‌పై ఆసక్తి పెంచుకున్న దివ్య 2019లో బెంగళూరులో షూటింగ్ పరిణితులు మంజునాథ్ పటగార్ వద్ద, భారతీయ క్రీడా అకాడమిలో సాధన ప్రారంభించారు. నిరంతర పరిశ్రమ, కఠిన అభ్యాసం ద్వారా ప్రస్తుతం చైనాలో జరుగుతున్న 19వ ఆసియా గేమ్స్‌లో 10 ఎంఆర్ పిస్టల్ షూటింగ్ విభాగంలో వెండి పతకాన్ని సాధించిన సుబ్బరాజు, గాయత్రి దంపతుల కుమార్తె దివ్య బాల్యం నుంచే షూటింగ్‌లో ప్రతిభ కనబరిచింది. షూటింగ్‌లో భారత్‌కు చెందిన సరబ్‌జిత్‌సింగ్ 291, దివ్య పొందిన 286 మార్కుల ద్వారా వీరిద్దరికి కలిపి 577 మార్కులు లభించగా, చైనా జంట 576 మార్కులకు పరిమితమై వెనుకపడడంతో భారత జంటకు వెండి పతకాలు లభించాయి. భవిష్యత్‌లో జరిగే ఒలంపిక్స్ పోటీల్లో కూడా భారత్ తరపున పాల్గొని ఉత్తమ సాధనతో పతకాలు చేజిక్కించుకోవాలని తాలూకా ప్రజలు కోరుతున్నారు. కాగా దివ్య సుబ్బరాజు బెంగళూరులోని శేషాద్రిపురం లా కళాశాలలో డిగ్రీ పూర్తి చేసి, యూపీఎస్‌సీ పరీక్షలకు సిద్ధం అవుతున్నారు.

నకిలీ పత్రాలతో భూమి విక్రయం

- బతికుండగానే మరణించినట్లు రికార్డులు
- వెలుగు చూసిన తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది మోసం



మోసపోయిన బాధిత కుటుంబ సభ్యులు వీరే

రాయచూరు రూరల్: బతికుండగానే మరణించినట్లు తహసీల్దార్ కార్యాలయ సిబ్బందితో రికార్డులు పుట్టించి నకిలీ పత్రాలతో భూములను విక్రయించిన ఘటన తాలూకాలో వెలుగు చూసింది. వివరాలు..తాలూకాలోని పోతుగల్ నివాసి గోవిందప్ప పేరు మీద సర్వే నంబర్–172–3 లో ఆరు ఎకరాల పొలం ఉంది. గోవిందప్ప మరణానతరం భార్య సుశీలమ్మ పేరిట రిజిస్టరైంది. గోవిందప్ప, సుశీలమ్మకు పిల్లలు లేరని, మరణించినట్లు నకిలీ రికార్డులు తయారు చేసి భూమిని ఎస్.కే.నాగిరెడ్డికి తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది చేతివాటంతో విక్రయించారు. 16 ఏళ్ల క్రితం సుశీలమ్మ(68) మరణించినట్లు రికార్డుల్లో నమోదు చేశారు. శుక్రవారం సుశీలమ్మ, కుమారులు వచ్చి తమకు తహసీల్దార్ కార్యాలయ అధికారులు మోసం చేసి ఆరు ఎకరాల భూమిని ఇతరులకు అమ్మారని, తమకు న్యాయం చేయాలని, సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు చేపట్టాలని బాధిత కుటుంబ సభ్యులు విన్నవించారు.

హిందుత్వ పేరుతో బీజేపీ రాజకీయం



బొమ్మనహళ్లి : హిందుత్వ పేరుతో బీజేపీ నాయకులు రాజకీయం చేస్తున్నారని, కాని తాము మాత్రం అన్ని వర్గాలను కలుపుకొని రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నామని రాష్ట్ర రవాణ, దేవదాయ శాఖ మంత్రి రామలింగారెడ్డి అన్నారు. నగరంలోని సర్జాపుర రోడ్డులోని ముత్తనల్లూరు క్రాస్ వద్ద కొత్తగా ఏర్పాటైన కృపా గ్రాటర్స్ షోరూంను మాజీ రాజ్యసభ సభ్యుడు డి.కుపేంద్ర రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. శివమొగ్గ అల్లర్ల ఘటనలో బీజేపీ హిందుత్వ పేరుతో చిచ్చు పెట్టిందని ఆయన ఆరోపించారు. అల్లర్ల విషయంపై సమగ్ర విచారణ చేసి తప్పు చేసినవారిని శిక్షించడానికి చర్యలు చేపట్టామన్నారు. మాజీ రాజ్యసభ సభ్యుడు డి.కుపేంద్రరెడ్డి, స్థానిక నాయకుడు కే.రమేష్ రెడ్డి, కుశాల్, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

కుమ్మర సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా నాగరాజ్



కోలారు: దక్షిణ భారత కుమ్మర సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా తాలూకాలోని కల్లండూరుకు చెందిన కె.నాగరాజ్ ఎన్నికయ్యారు. బెంగళూరులో జరిగిన సంఘం సమన్వయ సమావేశంలో నాగరాజ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నాగరాజ్ మాట్లాడుతూ సమాజ ప్రజల సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. అందరి సహకారంతో సంఘాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. ప్రజలకు ప్రభుత్వ సౌకర్యాలను అందించడానికి ప్రామాణిక ప్రయత్నం చేస్తానన్నారు.

వేడుకగా శౌర్య జాగరణ యాత్ర



యాత్రలో పాల్గొన్న ఎంపీ మునిస్వామి, భజరంగదళ్, వీహెచ్‌పీ కార్యకర్తలు

కోలారు: భజరంగదళ్, విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా సంచరిస్తున్న శౌర్య జాగరణ రథయాత్ర శుక్రవారం నగరంలోని సోమేశ్వర ఆలయం నుంచి ప్రారంభమై ప్రధాన వీధుల్లో వేడుకగా సాగింది. ఎంపీ ఎస్.మునిస్వామి శౌర్య యాత్రలో పాల్గొని మాట్లాడుతూ మనది శౌర్య, త్యాగ పరంపర కలిగిన సంస్కృతి అని అన్నారు. హిందువులు ఎన్నటికీ ఇతరులపై దాడి చేసిన నిదర్శనాలు లేవన్నారు. హిందూ ధర్మం యావత్ విశ్వానికే ఆదర్శమన్నారు. మన సనాతన సంస్కృతి, యోగాకు విశ్వమే తలవంచిందన్నారు. వసుధైక కుటుంబం అనే ధ్యేయ వాక్యం తమ భారతీయ సంస్కృతి కలిగి ఉందన్నారు. అదే ఉద్దేశాన్ని సఫలం చేసే ఉద్దేశంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పని చేస్తున్నారన్నారు. మన సంస్కృతిని గౌరవించే సాంప్రదాయాన్ని ప్రతి ఒక్కరూ కొనసాగించాలన్నారు. రథయాత్రలో భజరంగదళ్, వీహెచ్‌పీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సాకులు చెప్పొద్దు



జాబ్‌కార్డులు అందిస్తున్న దృశ్యం

కోలారు: అధికారులు, సిబ్బంది సాకులు చెప్పకుండా ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత నివ్వాలని జెడ్పీ సీఈఓ పద్మ బసవంతప్ప తెలిపారు. శుక్రవారం తాలూకాలోని నరసాపుర జీపీ ప్రాంగణంలో ఫిర్కా స్థాయి ఫిర్యాదుల స్వీకరణ, వివిధ శాఖల ప్రగతి పరిశీలన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రజల వద్దకు ప్రభుత్వ సౌలభ్యాలు అందించడమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. గ్రీవెన్స్ డే నిర్వహణపై తగిన ప్రచారం నిర్వహించాలన్నారు. వివిధ శాఖల ద్వారా ప్రజలకు అందిస్తున్న సౌకర్యాలపై ప్రజలకు అవగాహన కల్గించాలన్నారు. ఎంతో మంది ప్రభుత్వ సౌకర్యాలకు అర్హత కలిగి ఉన్నా తగిన అవగాహన లేకపోవడం వల్ల సౌకర్యాల నుంచి వంచితులవుతున్నారన్నారు. నేటి గ్రీవెన్స్ డేలో కేవలం 38 దరఖాస్తులు మాత్రమే వచ్చాయన్నారు. ప్రజల్లో గ్రీవెన్స్ డేపై తగిన అవగాహన లేకపోవడమే దీనికి కారణమన్నారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజలు కార్యాలయం వద్దకు వచ్చినప్పుడు అనవసరంగా వారిని కార్యాలయం చుట్టూ తిప్పించుకోవద్దన్నారు. ప్రజల సమస్యలకు పరిష్కారం లభించినప్పుడే విధుల నిర్వహణకు సార్థకత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

వైభవంగా దీపోత్సవం

మాలూరు: తాలూకాలోని లక్కూరులో వెలసిన రేణుకా యల్లమ్మ ఆలయంలో శుక్రవారం అమ్మవారి దీపోత్సవ వేడుకలను భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. దీపోత్సవం సందర్భంగా అమ్మవారికి ప్రధాన అర్చకులు రవి నేతృత్వంలో ప్రత్యేక అలంకరణ చేసి విశేష పూజలు జరిపారు. సుదర్శన హోమం, గోపూజ, గంగపూజ, యాగశాల ప్రవేశం, గణపతి పూజ, గణపతి హోమం, పుణ్యహవాచనం, కలశారాధన తదితర పూజలు జరిగాయి. పెద్ద సంఖ్యలో మహిళలు తలపై దీపాలను మోసుకుని గ్రామ వీధులలో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించారు.

రేపు ప్రతిభా పురస్కారాల పంపిణీ



మాట్లాడుతున్న నారాయణస్వామి

కోలారు: జిల్లా కురుబ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 8న ప్రతిభాన్విత విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను పంపిణీ చేస్తున్నట్లు జిల్లా కనక నౌకరుల సంఘం అధ్యక్షుడు బీఎం నారాయణస్వామి తెలిపారు. శుక్రవారం నగరంలోని పాత్రికేయుల భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమాన్ని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి భైరతి సురేష్ ప్రారంభిస్తారని, భక్త కనకదాస చిత్రపటాన్ని మాజీ మంత్రి ఆర్.వర్తూరు ప్రకాష్ ఆవిష్కరిస్తారన్నారు. ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి మీడియా సలహాదారు ఆర్.ప్రభాకర్ పాల్గొంటారన్నారు. టెన్త్, ఇంటర్‌లో 90 శాతం పైగా మార్కులు సాధించిన సుమారు 200 మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో సముదాయ ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సంఘం కోశాధికారి బి.హరీష్, ప్రధాన కార్యదర్శి డీఆర్ శ్రీరామగౌడ, కార్యాధ్యక్షుడు ఎంఎం నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరా క్యాంటీన్‌ను ప్రారంభించరూ..



వినతిపత్రం సమర్పిస్తున్న శరణప్ప

రాయచూరు రూరల్: రాయచూరు వైద్య విజ్ఞాన సంస్థ(రిమ్స్) ఆస్పత్రి, కళాశాల ఆవరణలో ఇందిరా క్యాంటీన్‌ను ప్రారంభించాలని దళిత సంఘర్ష సమితి డిమాండ్ చేసింది. శుక్రవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనను ఉద్దేశించి అధ్యక్షుడు శరణప్ప దిన్ని మాట్లాడారు. ఆస్పత్రిలో చికిత్స కోసం వచ్చే పేద రోగులు, వారి వెంట గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే సహాయకులకు అనుకూలమయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా క్యాంటీన్‌ను ప్రారంభించాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

కారు ఢీకొని బాలిక మృతి

హుబ్లీ: ఎదురుగా వస్తున్న బైక్‌ను కారు ఢీకొనడంతో ఓ బాలిక మృతి చెందిన ఘటన తాలూకాలోని హెబసూరులో జరిగింది. స్థానిక గణేష్‌నగర్ నివాసి మెహబూబ్ సాబ్ కుమార్తె సాజియా(4) మృతురాలు. కారు హుబ్లీ నుంచి నవలగుంద వైపునకు వెళుతుండగా డ్రైవర్ వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే ప్రయత్నంలో నవలగుంద నుంచి హుబ్లీ వైపునకు వస్తున్న బైక్‌ను ఢీకొన్నాడు. బైక్‌పై ఉన్న మెహబూబ్‌సాబ్, ఆయన భార్య నసీమా తీవ్రంగా గాయపడి కిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. కారులో ప్రయాణిస్తున్న ముంతాజ్ కూడా గాయపడ్డారు. కారును స్థలంలోనే వదిలి పరారైన డ్రైవర్‌ను హుబ్లీ గ్రామీణ పోలీసులు అరెస్ట్ చేసి కేసు దర్యాప్తు చేపట్టారు.

పోటీలకు తరలిన విద్యార్థులు

గంగావతి: కలబురిగి డివిజన్ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన తాలూకాలోని పాఠశాల విద్యార్థులను క్లస్టర్ల వారీగా బీఈఓ వెంకటేష్ శుక్రవారం సాగనంపారు. ఈనెల 7, 8 తేదీల్లో యాదగిరి జిల్లా సురపురలో జరగనున్న ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావాలని బీఈఓ వారిని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వ్యాయామ విద్యాధికారులు, బీఈఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తకాలకంటే మద్యం షాపులే ఎక్కువ



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మహేష్ జోషి

బొమ్మనహళ్లి : రాష్ట్రంలో విద్యార్థులు చదువుకునే పుస్తకాలకంటే మద్యం దుకాణాల సంఖ్య ఎక్కువగా ఉన్నాయని కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు నాడోజా డాక్టర్ మహేష్ జోషి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం నగరంలోని సౌందర్య ఇన్సిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ సైన్స్ విద్యా సంస్థలో శుక్రవారం ఆయన వివిధ పుస్తకాలను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వం విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని సూచించారు. అనంతరం పలువురు సాధకులను సన్మానించారు.

క్లుప్తంగా

ఆయుష్మాన్‌భవ ప్రారంభం



కృష్ణరాజపురం: బెంగళూరు గ్రామీణ జిల్లా హోసకోటె తాలుకా పరిపాలన భవనం ముందు భాగంలో ఆయుష్మాన్‌భవ 3.0 అభియాన్ కార్యక్రమంలో భాగంగా తాలూకా స్థాయి ఆయుష్మాన్‌భవ కార్యక్రమాన్ని హోసకోటె ఎమ్మెల్యే శరత్ బచ్చేగౌడ గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అవయవదానాల గురించి తెలియజేశారు.

కేరళ యువకుడు దుర్మరణం

దొడ్డబళ్లాపురం: కారు డివైడర్‌ను ఢీకొన్న ప్రమాదంలో కేరళ యువకుడు మృతి చెందిన సంఘటన చెన్నపట్టణ తాలూకా భైరాపట్టణ పాలడెయిరీ వద్ద బెంగళూరు–మైసూరు ఎక్స్‌ప్రెస్‌వే పై చోటుచేసుకుంది. ప్రమాదంలో కేరళకు చెందిన అనాథ్ (35)మృతి చెందాడు. మృతుడు అనాథ్ తన హుండై కారులో బెంగళూరు నుండి మైసూరు వెళ్తుండగా భైరాపట్టణ వద్ద కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ప్రమాదం తీవ్రతకు అనాథ్ తల ఛిద్రమైంది. చెన్నపట్టణ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

వినాయకుడికి ఎమ్మెల్యే పూజలు



ఆహారం వడ్డిస్తున్న ఎమ్మెల్యే ఎం.సతీష్‌రెడ్డి

బొమ్మనహళ్లి: బొమ్మనహళ్లి నియోజకవర్గం, పుట్టెనహళ్లిలో వినాయక యువకుల సంఘం, శివపుత్ర యువకుల సంఘం ఏర్పాటు చేసిన వినాయకునికి ఎమ్మెల్యే ఎం . సతీష్‌రెడ్డి పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. మాజీ కార్పొరేటర్ రమేష్, అంజినప్ప తదితరులు పాల్గొన్నారు.

శ్రీరంగపట్టణంలో దసరా ఘనంగా నిర్వహించాలి



మండ్య: మండ్య జిల్లా శ్రీరంగ పట్టణంలో జరిగే చరిత్ర ప్రసిద్ధి చెందిన శ్రీరంగ పట్టణం దసరా ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే ఎ.బీ.రమేష్ బండిసిద్దెగౌడ అన్నారు. శుక్రవారం మండ్య నగరంలోని జిల్లా పంచాయతీ కావేరి సమావేశం హాల్లో నిర్వహించిన శ్రీరంగ పట్టణం దసరా ఉత్సవం అధికారుల సమావేశంలో పాల్గొని సలహాలు, సూచనలు ఇచ్చారు. దసరా మారథాన్ 16 ఉదయం 7 గంటలకు క్రీడా మైదానం నుంచి కరిఘట్ట వరకు జరుగుతుందని, ఔత్సాహికులు ఈనెల 15లోపు పేర్లను నమోదు చేసుకోవాలని అన్నారు. మహిళల దసరా, రైతు దసరా, పిల్లల దసరా వాటిని నిర్వహిస్తామన్నారు.

ఆమె జీవిత పోషణకు అనర్హులు

● హైకోర్టు సంచలన తీర్పు

శివాజీనగర: మరో వ్యక్తితో వివాహేతర సంబంధం కలిగి ఉన్న భార్య జీవిత పోషణను కోరేందుకు లేదని కర్ణాటక హైకోర్టు ఇటీవల తీర్పులో వెల్లడించింది. మహిళల భద్రత చట్టం 2005 సెక్షన్ 12 కింద ఆర్థిక సహాయాన్ని పొందే లక్ష్యాన్ని కలిగిన మహిళ పరిశీలనా పిటిషన్‌ను న్యాయస్థానం డిస్మిస్ చేసింది. ఇతరులతో వివాహేతర సంబంధాల్లో భార్య పాల్గొనటం స్పష్టమైన ఆధారాలను న్యాయస్థానం గమనించింది. వ్యభిచారం స్పష్టమైనపుడు, జీవిత పోషణకు భార్య అర్హత అన్వయించదని న్యాయస్థానం వెల్లడించింది.

ముఖాముఖి ఢీకొన్న బైక్‌లు

● కానిస్టేబుల్ మృతి



నుజ్జునుజ్జయిన బైక్‌లు

దొడ్డబళ్లాపురం: రెండు బైక్‌లు ముఖాముఖి ఢీకొన్న ప్రమాదంలో పోలీస్ కానిస్టేబుల్ మృతి చెందిన సంఘటన నెలమంగల–కుణిగల్ మార్గంలోని సోలూరు వద్ద చోటుచేసుకుంది. బెంగళూరు ఉప్పారపేట పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీనివాస్ బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వచ్చిన మరో బైక్ వేగంగా ఢీకొంది. ప్రమాదంలో తలకు తీవ్రమైన గాయం కావడంతో శ్రీనివాస్ మృతి చెందాడు. మరో బైక్‌పై వచ్చిన బైకిస్టుకి కూడా గాయాలయ్యాయి. కుదూరు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ప్రకృతి అందాలు స్వయానా చూడాల్సిందే

● అసహజ ఆకృతిలో రాతి శిలలు
● పర్యాటకులను కనువిందు చేసే సుందర ప్రదేశం కుమటా



పచ్చటి ప్రకృతి నడుమ భైరవేశ్వర, మోహిని అనే పేర్లతో పిలిచే రాతి శిఖరాలు



యానా ప్రవేశ ద్వారం వద్ద పర్యాటకులు (ఫైల్)

బనశంకరి: ఉత్తర కన్నడ జిల్లాకు ఎంతో చారిత్రక నేపథ్యం ఉంది. పర్యాటక స్థలాలకు కొదవ లేదు. అందులో యానా గుహలు ప్రకృతి యొక్క అత్యుత్తమ సృష్టిలో ఒకటి. ఇది కర్ణాటకలోని ఉత్తర కన్నడ జిల్లా కుమటాలో ఉంది. యానా గుహలు ఆకర్షణీయంగా చాలా రహస్యమైనవి. కటిక చీకటిగా, గుహ కార్స్ట్' సున్నపురాయితో ఏర్పడింది. ఇది చాలా ప్రత్యేకమైన నిర్మాణం, కుమటాలోని అడవులు మధ్యలో ఉన్న అద్భుతమైన రాళ్లు 390 అడుగుల ఎత్తులో ఉన్నాయి. ఈ



గుహ

భారీ శిలలలో రెండు విభిన్న శిఖరాలను కలిగి ఉన్నాయి. భైరవేశ్వర శిఖర, మోహిని శిఖర అనే రెండు ఎత్తైన శిఖరాలను కలిగి ఉంది. గంభీరమైన పశ్చిమ కనుమల కారణంగా యానా గ్రామం ఎక్కువగా రాతితో కూడిన ప్రకృతి దృశ్యాన్ని కలిగి ఉంటుంది. అడవిలోని పచ్చని చెట్లకు వ్యతిరేకంగా అద్భుతమైన నల్లటి గుహలతో కూడిన వ్యత్యాసం ప్రయాణికులకు పర్యాటకులకు సంపూర్ణ ఆనందాన్ని ఇస్తుంది.

చక్కటి వాతావరణం

యానా గుహల చుట్టూ ఉన్న ప్రాంతం పర్వతాలు, జలపాతాలు ఒక రకమైన రాతి నిర్మాణాలతో చాలా విభిన్నంగా ఉంటుంది. సాహసాలతో ఉత్కంఠభరితమైన అనుభవాలను ఇష్టపడేవారికి యానా గుహలను ట్రెక్కింగ్ చేయవచ్చు. ఇందులో ఉన్న అద్భుతమైన ఫీచర్ ఏమిటంటే ఖచ్చితంగా నలుపురంగు ఇంత అందమైన సహజమైన నిర్మాణాన్ని సృష్టించిన అద్భుతమైన శక్తులను నిశితంగా పరిశీలించినట్లయితే మీరు కచ్చితంగా నమ్మలేరు.

నమ్మశక్యం కాని పురాణ కథలు

యానా గుహలు చరిత్రలో హిందూ పురాణాల గురించి ప్రస్తావన ఉంది. భస్మాసురుడు అనే రాక్షస రాజుకు శివుడు వరం ఇచ్చారని అతడు తలపై చేయి వేసి ఎవరినైనా కాల్చి చంపేవాడని కథలో చెప్పబడింది. ఈ వరం వల్ల దానవుల శక్తి పెరిగిపోవడంతో అందరూ చింతించడం ప్రారంభించారు. విష్ణువు అప్పుడు ఒక ప్రణాళిక వేసి అతను మోహిని అనే సమ్మోహమైన యువతిగా రూపాంతరం చెంది చివరికి భస్మాసురుడిని అతని తలపై అతనే చేయివేసి తన జీవితాన్ని ముగించుకునేలా మోసగిస్తాడు. ఈ కారణంగా భస్మాసుర బూడిద నుంచి గుహలు నల్లగా మారాయని చెబుతారు. యానా కేవ్స్ మిమ్మల్ని మంత్రముగ్ధులను చేస్తుంది.


హిందూ పురాణాల గురించి కానీ, పరమేశ్వరుడి గురించి తెలిసిన వారికి భస్మాసురఘట్టం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. కాని చాలామందికి భస్మాసురుడి నుంచి తప్పించుకుని పరుగెత్తుకెళ్లిన పరమేశ్వరుడు ఎక్కడ దాక్కున్నారనే విషయం మాత్రం తెలియదు. అలా పరుగెత్తుకెళ్లిన పరమేశ్వరుడు యానా గుహ పర్వతం దాక్కున్నారు. ప్రస్తుతం ధార్మిక కేంద్రంగా మారింది. చుట్టుపక్కల ప్రకృతి అందాలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటాయి. ఉత్తర కన్నడ జిల్లా శిరసి నుంచి 40 కిలోమీటర్లు, కుమటా నుంచి 31 కిలోమీటర్లు దూరంలో యానా శిలలు ఉన్నాయి.



నల్లరాతి శిలలు



మెట్ల మార్గంలో వెళ్తున్న పర్యాటకులు



నల్లటి రాతి శిఖరం

ఇన్‌స్పైర్ అవార్డుల పోటీకి ఎంపిక

శివమొగ్గ: రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ పోటీలలో పాల్గొన్న శివమొగ్గ జిల్లా గ్రామీణ ప్రాంతానికి చెందిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ముగ్గురు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. శివమొగ్గ తాలూకాలో ఆయనూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఎస్. ప్రార్థన శెట్టి, తీర్థహళ్లి తాలూకా మాలూరు కువెంపు శతమానోత్సవం నోడల్ పాఠశాల విద్యార్థిని ఆపేక్ష, భద్రావతి తాలుకా అరళిహళ్ళి ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థిని చంద్రమ్మ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఢిల్లీలో ఈనెల 9 నుంచి 11 వరకు జరిగే పోటీలలో వీరు పాల్గొంటారని డైట్ ప్రిన్సిపాల్ బీ.ఆర్. బసవరాజప్ప, ఇన్‌స్పైర్ అవార్డు జిల్లా నోడల్ అధికారి నాగరాజ తెలిపారు. ఈ సందర్భంగా ముగ్గురు విద్యార్థులను అభినందించారు.

అన్నంలో పురుగులు, విద్యార్థుల ధర్నా



మైసూరు: మైసూరు నగరంలో జేసీ ఇంజనీరింగ్ కళాశాల హాస్టల్‌లో విద్యార్థులకు ఇచ్చిన ఆహారంలో పురుగులు రావడంతో వారు ధర్నాకు దిగిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. నగరంలోని మానస గంగోత్రి క్యాంపస్‌లో ఉన్న జేసీ ఇంజనీరింగ్ కళాశాల హాస్టల్‌లో గురువారం రాత్రి ఇచ్చిన అన్నంలో పురుగులు కనిపించాయి. దీంతో విద్యార్థులు ఆహారం తినకుండా శుక్రవారం ఉదయం హాస్టల్ విద్యార్థులు ధర్నాకు దిగారు. సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారు మండిపడ్డారు. వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రూ.5 నోటు ఇస్తే రూ.5 లక్షలు ఇస్తామని వంచన

చిక్కబళ్లాపురం: రూ.5 నోటు ఇస్తే రూ.5లక్షలు ఇస్తామని చెప్పిన వంచకులు మహిళకు టోకరా వేశారు. నిందితులు వెబ్‌సైట్‌లో ఇచ్చిన ప్రకటనను చూసి జిల్లా కేంద్రంలోని వాబసంద్రవార్డుకు చెందిన ఆస్మా అనే మహిళ నిందితులు ఇచ్చిన ఫోన్ నంబర్‌కు ఫోన్ చేసింది. ట్యాక్స్‌ల నిమిత్తం కొంత మొత్తం అవసరమని చెప్పి రూ35,063 తమ ఖాతాలకు జమ చేయించుకొని ఫోన్ స్విచ్ఛాఫ్ చేశారు. మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఆగని కావేరి ఆందోళనలు



ధర్నా చేస్తున్న విలేకరులు

మండ్య: తమిళనాడుకు కావేరి నీటి విడుదలను వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. మండ్య నగరంలో విలేకరులు భారీ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అనంతరం రైతు హితరక్షణ సమితి ధర్నా ప్రాంతానికి చేరుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

కొబ్బరి చిప్పలతో నిరసన :

కన్నడ సేనె కార్యకర్తలు రైతులు కొబ్బరి చిప్పలు తెచ్చి వినూత్నంగా ఆందోళన చేశారు. కావేరి నీటిని మొత్తం తమిళనాడుకు వదిలిన రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర రైతులకు నీరు లేకుండా చేసిందని వారి చేతిలో కొబ్బరి చిప్పలని పెట్టిందని నిరసిస్తూ కార్యకర్తలు నగరంలో కొబ్బరి చిప్పలతో ర్యాలీ నిర్వహించారు.

కావేరి నీటి కోసం వికలాంగుల ధర్నా

తమిళనాడుకు కావేరి నీటి విడుదలన వ్యతిరేకిస్తూ వికలాంగులు మండ్య నగరంలో ధర్నా నిర్వహించారు. మండ్య నగరంలోని జేసీ సర్కిల్ వద్దకు చేరుకున్న వికలాంగులు బెంగళూరు– మైసూరు జాతీయ రహదారిలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం నగరంలోని సర్.ఎం.వి. విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న రైతుహిత రక్షణ సమితి ప్రాంతానికి చేరుకుని అక్కడే బైఠాయించారు.

మైసూరు పర్యాటకులకు అంబారీ బస్సులు

మైసూరు : మైసూరు దసరా వేడుకలకు దేశ విదేశాలనుంచి తరలివచ్చే పర్యాటకులు నగర పర్యటన కోసం ఆరు అంబారీ బస్సులు ఏర్పాటు చేశారు. ఈనెల 15నుంచి ప్రత్యే దసరా అంబారీ బస్సులను సీఎం సిద్ధరామయ్య ప్రారంభించనున్నారు. మైసూరు దసరా దీపాలంకరణతోపాటు నగరంలోని పర్యాటక ప్రాంతాలను ఈ బస్సులో వెళ్లి వీక్షించవచ్చు. రోజూ సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటలకు, రాత్రి 9 గంటల వరకు ఈ బస్సులు సంచరిస్తాయి. ఒక్కో బస్సులో 25 సీట్లు ఉంటాయి. మయూరా హోటల్ నుంచి బస్సు ప్రారంభమై డీసీ కార్యాలయం, క్రాఫర్డ్ హాల్, సెంట్రల్ లైబ్రరీ, రామ స్వామిసర్కిల్, సంస్కృత పాఠశాల, కేఆర్ సర్కిల్, సయ్యాజిరావు రోడ్డు, ఆయుర్వేద ఆస్పత్రి, రైల్వే స్టేషన్ మీదుగా తిరిగి మయూరా హోటల్ వద్దకు చేరుకుంటుంది.

విద్యావేత్త నరసింహయ్య ఆదర్శాలను పాటించాలి



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు

గౌరిబిదనూరు: విద్యావేత్త డా హెచ్ నరసింహయ్యను ఆదర్శంగా తీసుకోవాలని బెంగళూరు బసవనగుడి నేషనల్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డా ఎం లీలావతి అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక నేషనల్ కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...గురువును గౌరవించే వారే నిజమైన విద్యార్థులని, ఈ తాలూకా హోసూరుకు చెందిన నరసింహయ్య గ్రామీణ విద్యార్థుల అభ్యుదయానికి ఎంతో పాటుపడ్డారని, గ్రామీణ ప్రాంతాలలో నేషనల్ ఎడుకేషన్ సొసైటీ ద్వారా కళాశాలలను ఏర్పాటు చేశారు అన్నారు. విశ్రాంత ప్రిన్సిపాల్ కెపి నారాయణప్ప మాట్లాడుతూ 2003లో బీఎస్సీ చదివిన విద్యార్థులను 20 ఏళ్ల తరువాత చూడటం ఎంతో సంతోషంగా ఉదన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపల్ నాగరాజు, భీమేశ్, రామచంద్రమూర్తి, అరవింద, గోవిందప్ప, పరిమళ, సరిత, వీణ, భారతి, కల్పన తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధచూపాలి



మాట్లాడుతున్న దస్తగిరి సాబ్

గౌరిబిదనూరు: వృద్ధాప్యంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు దస్తగిరిసాబ్ తెలిపారు. గురువారం సాయంత్రం సంఘం కార్యాలయంలో మహాత్మ గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రిల జయంతి కార్యక్రమంలో మాట్లాడుతూ...సంఘానికి స్థలం కోసం తహసీల్దార్‌తో మాట్లాడటానికి సభ్యులు సహకరించాలన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడు వెంకటప్ప మహాత్మ గాంధీజీ ఆదర్శాలను, జీవన విధానాన్ని, రిటైర్డ్ ప్రిన్సిపాల్ మేలూరప్ప లాల్ బహదూర్ శాస్త్రి సరళ జీవనాన్ని వివరించారు. దాత దానమప్పను సన్మానించారు. కార్యక్రమంలో హనుమంతరాయప్ప, కోశాధికారి గంగాధరయ్య, కార్యదర్శి సంజీవరాయప్ప, ఉపాధ్యక్షుడు నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ప్రాణం తీసిన వడ్డీ గొడవ



ఖలీల్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

తుమకూరు: వడ్డీ డబ్బులు విషయంలో గొడవ జరిగిన ఓ వ్యక్తి హత్యకు గురైన ఘటన తుమకూరు జిల్లా కుణిగల్ తాలూకా అమృతూరు గ్రామంలో చోటుచేసుకుంది. అమృతూరు గ్రామానికి చెందిన అబ్దుల్ ఖలీల్ (55) మృతి చెందిన వ్యక్తి. అబ్దుల్ ఖలీల్ తన కుమార్తె వివాహానికి అదే గ్రామానికి చెందిన తౌసిఫ్ పాషాతో రూ. 50 వేలు అప్పు తీసుకున్నాడు. ప్రతి నెల వడ్డీ చెలిస్తున్నాడు. ఈనెల వడ్డీ చెల్లించకపోవడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. తౌసిఫ్ పాషా కుటుంబ సభ్యుల అబ్దుల్ ఖలీల్‌పై దాడి చేసి మాంసం కోసే కత్తితో నరకడంతో ఖలీల్ తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం బెంగళూరు నిమ్హాన్స్ తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

గంగమ్మకు పూజలు



పూజలు చేస్తున్న కృష్ణారెడ్డి

చింతామణి: లోక కల్యాణార్థం మాజీ ఎమ్మెల్యే కృష్ణారెడ్డి పట్టణంలోని గంగమ్మ దేవతకు ప్రత్యేక పూజలు జరిపారు. రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురవాలని, రైతులు, ప్రజలు సుభిక్షంగా ఉండాలని ప్రార్థించినట్లు చెప్పారు. కౌన్సిలర్ శంకర్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

కేఎస్‌ఓయూలో రూ. కోట్ల కుంభకోణం

● సీబీఐ కేసు నమోదు

మైసూరు: మైసూరు నగరంలోని గంగోత్రిలో ఉన్న రాష్ట్ర ఓపెన్ యునివర్సిటీలో రూ. కోట్ల నిధుల దుర్వినియోగంపై సీబీఐ కేసు నమోదు చేసింది. కేఎస్‌ఓయూ విద్యాసంస్థల సహకారంతో దూరవిద్య పథకంలో 2013–14, 2014–15 ఏడాదికి సంబంధించి విద్యా సంస్థకు జమ కావాల్సి నిధులు రూ. 50 కోట్లు కనిపించకుండా పోయాయి. ఈ క్రమంలో అంతర్గత విచారణ జరిగినట్లు సమాచారం. ఫీజులు, ఇతరత్ర నిధులకు సంబంధించి దాదాపు రూ. 300 కోట్లు తేడా వచ్చింది. దీంతో ఉన్నతాధికారులు సీబీఐ అధికారులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

జేబుదొంగల చేతివాటం



కత్తిరించిన జేబు చూసుకుంటున్న ఎమ్మెల్యే పీఏ

దొడ్డబళ్లాపురం: మాగడి తాలూకా కుదూరులో శుక్రవారం జరిగిన ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కార్యక్రమంలో జేబుదొంగలు చేతివాటం ప్రదర్శించారు. ఏకంగా ఎమ్మెల్యే పీఏ జేబు కత్తిరించి రూ.40 వేలు ఎగరేసుకుపోయారు. ఎమ్మెల్యే హెచ్‌సీ బాలకృష్ణ పీఏ కార్యక్రమం బిజీలో ఉండగా జేబుదొంగ అతడి జేబు కత్తిరించి రూ.40 వేలు తస్కరించాడు. చాలాసేపటికి కానీ ఎమ్మెల్యే పీఏ జేబు కత్తిరించిన సంగతి గమనించుకోలేదు. విషయం తెలుసుకున్న కుదూరు పోలీసులు దొంగల కోసం గాలిస్తున్నారు.

కాంట్రాక్టర్ ఆత్మహత్య

యశవంతపుర: ఆర్థిక సమస్యలతో కాంట్రాక్టర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన హాసన జిల్లా హొళెనరసీపురలో జరిగింది. ఫస్ట్‌క్లాస్ కాంట్రాక్టర్ కె సత్తార్ (79) దీంతో జీవితంపై విసుగు చెంది సమీపంలోని హేమావతి నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. అవసరాల కోసం అప్పులు తీసుకున్నాడు. హొళెనరసీపుర తాలూకాలో పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టారు. డబ్బులు రావాల్సి ఉంది. మృతదేహం శుక్రవారం ఉదయం బయట పడింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

సీఎస్‌ఆర్ నిధులతో హైటెక్ స్కూళ్లు



మాట్లాడుతున్న డీసీఎం డీకే శివకుమార్

దొడ్డబళ్లాపురం: గ్రామీణ ప్రాంతాల్లో సీఎస్‌ఆర్ నిధులతో హైటెక్ పాఠశాలలు నిర్మిస్తామని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలిపారు. శుక్రవారం మాగడి తాలూకా కుదూరులో హైటెక్ పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన చేసి అనంతరం బహిరంగ సభలో మాట్లాడారు. రామనగర జిల్లాలో 288 ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు నిర్మించిన టయోటా సంస్థ ఇప్పుడు కుదూరులో రూ.16 కోట్ల ఖర్చుతో కేపీఎస్ పాఠశాల నిర్మిస్తుండడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో ఉన్న కార్ఖానాలు ఈ ఏడాది 2వేల పాఠశాలల నిర్మాణానికి ముందుకు వచ్చాయని, పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ సందర్భంగా మంత్రి రామలింగారెడ్డి హాజరయ్యారు.

హోసూరు వార్తలు..

డీఎంకే కార్యకర్తల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై. ప్రకాష్

హోసూరు: డిసెంబర్‌లో జరిగే డీఎంకే పార్టీ యువజన విభాగ రాష్ట్ర మహాసభ నిర్వహణపై క్రిష్ణగిరి పశ్చిమ జిల్లా కార్యకర్తల ముందస్తు సమావేశం జరిగింది. పట్టణంలోని చెన్నీస్ మహాల్లో జరిగిన ఈ కార్యక్రమానికి వేపనపల్లి మాజీ ఎమ్మెల్యే మురుగన్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హోసూరు ఎమ్మెల్యే వై. ప్రకాష్ పాల్గొని కార్యకర్తలతో చర్చించారు. డిసెంబర్ 17వ తేదీ జరిగే డీఎంకే యువజన విభాగ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని, అక్టోబర్ 14వ తేదీ మహిళా విభాగ రాష్ట్ర మహాసభ సందర్భంగా పెద్ద ఎత్తున సభ్యత్వ నమోదు కార్యక్రమాలను చేపట్టి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, ప్రస్తుతం రాష్ట్రంలో డీఎంకే ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లి ప్రజలకు వివరించాలని, రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో డీఎంకే పార్టీ నుంచి పోటీ చేసే అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమలో మేయర్ ఎస్.ఏ.సత్య, డెప్యూటీ మేయర్ ఆనందయ్య, వేలూరు రమేష్, చిన్నస్వామి, పుష్పాసర్వేష్, సుకమార్, వీరారెడ్డి, పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా వీధి శునకాలు



సూళగిరిలో బాలుడిపై దూసుకెళ్తున్న వీధికుక్కలు



హోసూరు అలసనత్తం ప్రాంతంలో సంచరిస్తున్న శునకాలు

● పెరిగిపోతున్న దాడులు

హోసూరు: క్రిష్ణగిరి జిల్లాలోని అనేక గ్రామాలు, పట్టణాల్లో వీధికుక్కల బెడద పెరిగింది. గుంపులుగా సంచరిస్తూ దారిన వెళ్లే వృద్ధులు, చిన్నారులపై దాడులు చేస్తూ తీవ్రంగా గాయపరుస్తున్నాయి. దీంతో రోడ్డుపైకి రావాలంటే జనం జంకుతున్నారు. సూళగిరి బస్టాండు సమీపంలో గురువారం సాయంత్రం ఇంటి నుంచి ఓ బాలుడు బయటకు రాగానే వీధికుక్కలు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. హోసూరు పట్టణంలోని అలసనత్తం రోడ్డు ప్రాంతంలో వందల సంఖ్యలో వీధికుక్కలు సంచరిస్తూ ప్రజలపై దాడులకు పాల్పడుతున్నాయి. కెలమంగలంలో వీధికుక్కలు రోడ్డుపైకొచ్చి వాహనదారులను వెంటాడుతున్నాయి. అధికారులు స్పందించి వీధి కుక్కలను బంధించి బయటి ప్రాంతాలకు తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

ఉద్యోగం పేరుతో రూ. లక్షలు టోపీ

హోసూరు: ఉద్యోగాల పేరుతో ఆన్‌లైన్ కేటుగాళ్లు దోచేస్తున్నారు. తాజాగా ఓ వ్యక్తి వంచనకు గురయ్యాడు. పార్ట్‌టైం ఉద్యోగమని చెప్పి రూ. 30.83 లక్షలు దోచుకున్నారు. క్రిష్ణగిరి జిల్లా కొప్పగరై గ్రామానికి చెందిన రమేష్ బాధితుడు. రమేష్ బెంగళూరులోని ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. మే 9న ఆయన సెల్‌కు ఒక మెసేజ్ వచ్చింది. పార్ట్‌టైం ఉద్యోగంతో ఎక్కువ ఆదాయం పొందవచ్చని ప్రాసెసింగ్ ఫీజుగా రూ. 30.83 లక్షలు చెల్లించాలని సందేశం ఉంది. దీంతో వారి మాటలు నమ్మిన రమేష్ విడతల వారీగా నగదు పంపాడు. అనంతరం వారి ఫోన్ నంబర్ స్విచాఫ్ రావడంతో మోసపోయినట్లు గుర్తించి క్రిష్ణగిరి క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

కెలమంగలం: కుటుంబ కలహాలతో వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్న ఘటన డెంకణీకోట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. డెంకణీకోట తాలూకా బెట్టముగిళాలం గ్రామానికి చెందిన మాదప్ప (26) ప్రైవేట్ స్వచ్ఛంద సంస్థలో పనిచేస్తున్నాడు. రెండు రోజుల క్రితం కుటుంబంలో గొడవలు జరిగాయి. దీంతో జీవితంపై విరక్తి చెందిన మాదప్ప గురువారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

తెలుగు పాఠశాలకు చేయూత



చెక్కును ప్రధానోపాధ్యాయురాలికి అందజేస్తున్న దృశ్యం

శివాజీనగర: తెలుగు విజ్ఞాన సమితి బెంగళూరులోని తెలుగు పాఠశాలల అభివృద్ధికి చేయూతనందిస్తున్న విషయం తెల్సిందే. ఈ క్రమంలో మర్ఫీటౌన్ తెలుగు పాఠశాలకు విద్యుత్ బిల్లుకు రూ.25 వేలు ఇవ్వాలని తీర్మానించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం సమితి అధ్యక్షుడు డాక్టర్ ఏ.రాధాకృష్ణరాజు, కోశాధికారి సీ.ఏ.వరదరాజు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కవితకు చెక్కును అందజేశారు. ఇటీవల యలహంక ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన సందర్భంలో అక్కడి ఉపాధ్యాయులు అభ్యర్థన మేరకు తెలుగు ఉపాధ్యాయులను నియమించడానికి సమితి అంగీకారం తెలిపి ఆ ఉపాధ్యాయునికి ప్రతి నెల జీత భత్యాలు ఇవ్వడానికి సమితి నిర్ణయించినట్లు రాధాకృష్ణరాజు ఈ సందర్భంగా తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్ష


నెల్లూరు జిల్లా కావలిలో బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి


పల్నాడు జిల్లా లింగంగుంట్లలో మహిళలకు రక్త పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది


శ్రీకాకుళం జిల్లా పర్లాం గ్రామంలో ఆరోగ్య శిబిరం వద్ద పేర్లు నమోదు చేసుకుంటున్న ప్రజలు


ప్రకాశం జిల్లా హనుమంతునిపాడు మండలం వేములపాడులో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు


కృష్ణా జిల్లా పెడన యూపీహెచ్‌సీ వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి తరలి వచ్చిన రోగులు


విశాఖలోని 39వ వార్డులో వైఎస్సార్ ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన క్యాంప్‌నకు భారీగా వచ్చిన ప్రజలు


పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురంలో పరీక్షలు చేస్తున్న సిబ్బంది


బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా టి.కొత్తపల్లి గ్రామంలో నేత్ర పరీక్షలు చేస్తున్న డాక్టర్


విజయనగరం జిల్లా గుణుపూరుపేటలోని క్యాంప్‌లో వృద్ధుడికి ఈసీజీ తీస్తున్న సిబ్బంది


కర్నూలులోని గడ్డా వీధిలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో పౌష్టికాహార ప్రాధాన్యతను వివరిస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు


చిత్తూరు జిల్లా కాటప్పగారిపల్లె ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది


వైఎస్సార్ జిల్లా కడప నగరంలో వైద్య పరీక్షలు చేయించుకుని మందులు తీసుకుంటున్న ప్రజలు


అనంతపురం జిల్లా ఉరవకొండలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న వృద్ధుడు

క్లుప్తంగా...

చేనేతలను నిర్లక్ష్యం చేసిన బాబును ప్రశ్నించవేంటి ?

పవన్ కళ్యాణ్‌పై ఆప్కో మాజీ చైర్మన్ చిల్లపల్లి ఆగ్రహం



సాక్షి, అమరావతి: చేనేతలను తీవ్ర నిర్లక్ష్యం చేసిన మీ దత్తతండ్రి చంద్రబాబును ప్రశ్నించలేని నీకు.. ఇప్పుడు చేతగాని మాటలెందుకు? అని పవన్‌కళ్యాణ్‌పై ఆప్కో మాజీ చైర్మన్ చిల్లపల్లి మోహనరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. చేనేతలకు అన్యాయం జరుగుతోందని, ఆత్మహత్యలు చేసుకుంటున్నారంటూ పెడనలో పవన్ వ్యాఖ్యలను ఖండించారు. శుక్రవారం ఆయన మంగళగిరిలో మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో, సీఎం వైఎస్ జగన్ హయాంలో చేనేతల కోసం ఏం చేశారనే దానిపై ఎక్కడైనా చర్చకు తాను సిద్ధమన్నారు. దేశంలో మరెక్కడా లేని విధంగా సీఎం జగన్.. నేతన్న నేస్తం ద్వారా ఒక్కక్కరికి రూ.24వేల చొప్పున ఐదు పర్యాయాల్లో ఒక్కొక్కరికి రూ.1.20 లక్షలు అందించారని, రాష్ట్రంలో సుమారు 90 వేల చేనేత కుటుంబాలకు రూ.969.77 కోట్లు ఆర్థిక సాయం చేసినట్టు చెప్పారు.

నిరసనల పేరుతో సంబరాలు!


కుప్పంలో గంగమ్మ వేషధారణలో టీడీపీ మహిళా నేతల సంబరాలు

కుప్పం(చిత్తూరు జిల్లా) : చంద్రబాబు అరెస్ట్‌పై టీడీపీ నేతలు చేపట్టిన నిరసనలు సంబరాలను మించిపోయాయి. సాధారణంగా గ్రామాల్లో అమ్మవారి జాతరలో సంబరాలు జరుపుకొంటారు. మారెమ్మ, గంగమ్మ వేషధారణలతో వేపాకు చేతపట్టి.. అమ్మవారి రికార్డింగ్ పాటలతో డ్యాన్స్‌లు వేసి భక్తులను అలరింపజేస్తారు. అదే తరహాలో చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా కుప్పంలో శుక్రవారం ఆందోళన చేస్తున్న శిబిరం వద్ద.. తెలుగు మహిళలు వేపాకు చేతబట్టి.. అమ్మవారి వేషధారణలో రికార్డు డ్యాన్స్‌లతో మురిపింపజేశారు. అటువైపు వెళుతున్న బాటసారులు ఆసక్తిగా వారి డ్యాన్సులను తిలకిస్తూ ముచ్చటపడ్డారు. స్థానికులు మాత్రం ఇదంతా నిరసన చేసినట్టు లేదని, సంబరాలు, విందు భోజనాలు చేస్తున్నట్టుందంటూ ముక్కున వేలేసుకోవడం కనిపించింది.

స్కిల్ కార్పొరేషన్‌కు, టీడీపీకి ఒకరే ఆడిటర్

- ఏఏజీ సుధాకర్‌రెడ్డి వెల్లడి
- చంద్రబాబు కస్టడీ, బెయిల్ పిటిషన్లపై ఏసీబీ కోర్టులో ముగిసిన వాదనలు
- తీర్పు రిజర్వ్ చేసిన న్యాయస్థానం.. సోమవారానికి వాయిదా



సాక్షి, అమరావతి : టీడీపీ ప్రభుత్వం హయాంలో తెలుగుదేశం పార్టీ ఆడిటర్‌నే స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు కూడా ఆడిటర్‌గా నియమించడం వెనుక ప్రజాధనం కొల్లగొట్టాలన్న ఎత్తుగడ ఉందని న్యాయస్థానానికి సీఐడీ తెలిపింది. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిధుల అక్రమ మళ్లింపులో దర్యాప్తు అధికారులు తాజాగా గుర్తించిన ఆధారాలపై ప్రశ్నించాల్సిన అవసరం ఉందని, అందువల్ల ఈ కేసులో నిందితుడు, టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబును సీఐడీ కస్టడీకి అనుమతించాలని సీఐడీ తరఫున రాష్ట్ర అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్ రెడ్డి న్యాయస్థానానికి నివేదించారు. స్కిల్ స్కామ్ కేసులో చంద్రబాబు కస్టడీ, బెయిల్ పిటిషన్లను విజయవాడ ఏసీబీ న్యాయస్థానం వరుసగా మూడో రోజు శుక్రవారం విచారించింది. సీఐడీ తరఫున ఏఏజీ సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. నిధుల అక్రమ మళ్లింపునకే టీడీపీకి, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు రెండింటికీ వెంకటేశ్వరరావును ఆడిటర్‌గా నియమించారన్నారు. గుట్టుచప్పుడు కాకుండా వ్యవహారం నడిపించారని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా డిజైన్‌టెక్ కంపెనీకి విడుదల చేసిన రూ.371 కోట్లలో రూ.27 కోట్లు టీడీపీ ఖాతాలోకి చేరినట్టు సీఐడీ అధికారులు గుర్తించారన్నారు. దీనిపై ఈ నెల 10న విచారణకు రావాలని ఆడిటర్ వెంకటేశ్వరరావుకు సీఐడీ నోటీసులు జారీ చేసిందన్నారు. టీడీపీ ఖాతాల్లో చేరిన రూ.27 కోట్లతోపాటు అక్రమంగా తరలించిన మిగిలిన నిధులపై రాబట్టిన కీలక ఆధారాలపై చంద్రబాబును సీఐడీ ప్రశ్నించాల్సిన అవసరం ఉందని చెప్పారు. టీడీపీ ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన ఐటీ రిటర్న్‌ను మాత్రమే సీఐడీ డౌన్‌లోడ్ చేసిందని, బ్యాంకుల నుంచి రికార్డులు తీసుకోలేదన్నారు. బ్యాంకర్ల నుంచి రికార్డులు తీసుకున్నారని చెబుతున్న చంద్రబాబు న్యాయవాదుల వాదనలో వాస్తవం లేదన్నారు. గతంలో రెండు రోజుల కస్టడీలో చంద్రబాబు ఉద్దేశపూర్వకంగానే కాలయాపన, సహాయ నిరాకరణ చేసి విలువైన సమయాన్ని వృథా చేశారని తెలిపారు. కాబట్టి చంద్రబాబును కనీసం మూడు రోజులు సీఐడీ కస్టడీకి అనుమతించాలని కోరారు. దర్యాప్తు కీలక దశలో ఉన్నందున చంద్రబాబు బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించాలని న్యాయస్థానాన్ని ఏఏజీ కోరారు. సీఎం హోదాలో ఉంటూ కుట్రపూరితంగా వ్యవహరించి షెల్ కంపెనీల ద్వారా ప్రజాధనాన్ని కొల్లగొట్టిన చంద్రబాబుకు సెక్షన్ 409 వర్తిస్తుందన్నారు. సీఐడీ నోటీసులు జారీ చేసిన కీలక సాక్షులు చంద్రబాబుకు పీఎస్‌గా పని చేసిన పెండ్యాల శ్రీనివాస్, షాపూర్జీ–పల్లోంజీ కంపెనీ ప్రతినిధి మనోజ్ పార్థసాని విదేశాలకు పరారైన విషయాన్ని ఆయన మరోసారి ప్రముఖంగా ప్రస్తావించారు. ఈ తరుణంలో చంద్రబాబుకు బెయిల్ మంజూరు చేస్తే ఇతర కీలక సాక్షులను బెదిరించి కేసు దర్యాప్తును ప్రభావితం చేసే ప్రమాదం ఉందన్నారు.

13 మంది నిందితులు బెయిల్‌పై ఉన్నారు.. చంద్రబాబుకు కూడా బెయిల్ ఇవ్వండి

చంద్రబాబు తరఫున ఢిల్లీ నుంచి వచ్చిన సీనియర్ న్యాయవాది ప్రమోద్‌కుమార్ దూబే వాదనలు వినిపిస్తూ.. ఆదాయ పన్ను శాఖ, ఎన్నికల సంఘానికి టీడీపీ సమర్పించిన రిటర్న్‌లు, రికార్డులను తప్పుగా అన్వయిస్తున్నారన్నారు. ఈ కేసులో ఇప్పటికే 13మంది నిందితులు బెయిల్‌పై బయట ఉన్నందున చంద్రబాబుకు కూడా బెయిల్ మంజూరు చేయాలన్నారు. వాదనల సందర్భంగా న్యాయస్థానంపై చంద్రబాబు తరఫు న్యాయవాది దూబే చేసిన వ్యాఖ్యలను న్యాయమూర్తి తప్పుబట్టారు. సీడీ ఫైల్ లేకుండా విచారిస్తున్నారని దూబే వాదించారు. దీనిపై న్యాయమూర్తి స్పందిస్తూ తన టేబుల్‌పై ఉన్న సీడీ ఫైల్‌ను చూపిస్తూ ఇదేమిటి అన్ని ప్రశ్నించారు. న్యాయస్థానంపై తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. దాంతో కంగుతిన్న దూబే తన మాటలను ఉపసంహరించుకుంటున్నట్లు చెప్పారు. చంద్రబాబు కస్టడీ, బెయిల్ పిటిషన్లపై ఇరువర్గాల వాదనలు విన్న తరువాత న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేస్తూ ఈ కేసును సోమవారానికి వాయిదా వేసింది.

షేర్ మార్కెట్ .. ఆ కుటుంబాన్ని బలి తీసుకుందా?

- భార్యాబిడ్డలను చంపి ఆత్మహత్య చేసుకున్న హెడ్‌కానిస్టేబుల్
- పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో వెల్లడి

కడప అర్బన్ : షేర్ మార్కెట్ వ్యాపారంలో నిండా మునిగిపోయి అప్పుల బాధ తట్టుకోలేకే హెడ్ కానిస్టేబుల్ తనతోపాటు కుటుంబాన్ని బలి తీసుకున్నట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైనట్లు తెలుస్తున్నది. కడప నగరానికి చెందిన హెడ్‌కానిస్టేబుల్ టి.వెంకటేశ్వర్ తన భార్య మాధవి, కుమార్తెలు లాఖిన్య, అభిజ్ఞను ఈ నెల 4వ తేదీ రాత్రి నిద్రపోతున్న సమయంలో పిస్టల్‌తో కాల్చి చంపి తానూ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తెలిసిందే. వెంకటేశ్వర్ షేర్ మార్కెట్‌లో పెట్టుబడి కోసం అందినకాడల్లా అప్పులు చేశాడు. రూ.లక్షల్లో నష్టాలు రావడంతో కష్టాల్లో మునిగిపోయాడు. ఈ క్రమంలోనే ఆయన సోదరుడు కొన్నేళ్ల క్రితం హైదరాబాద్ నుంచి వచ్చి రూ.20 లక్షల మేర అప్పు తీర్చాడు. మరోవైపు వెంకటేశ్వర్ కడపకు చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగించాడు. ఆమె కూడా తనకు తెలిసినవారి దగ్గర అప్పు చేసి డబ్బులు ఇప్పించింది. ఆమెతోపాటు మరికొందరి నుంచి అప్పు తీర్చాలనే ఒత్తిళ్లు రావడంతో తనతోపాటు తన కుటుంబాన్ని అంతం చేసుకున్నట్లు తెలుస్తోంది.

చంద్రబాబు భద్రతపై ఆందోళనగా ఉంది

- జైలుపై దాడి చేస్తామని మావోయిస్టులు లేఖ రాశారు
- నారా లోకేశ్ వెల్లడి
- జైల్లో బాబుతో భువనేశ్వరి, లోకేశ్, బ్రాహ్మణి ములాఖత్


మీడియాతో మాట్లాడుతున్న లోకేశ్

సాక్షి, రాజమహేంద్రవరం: రాజమండ్రి సెంట్రల్ జైల్లో మాజీ సీఎం చంద్రబాబు భద్రతపై ఆందోళనగా ఉందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టయి రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న బాబుతో ఆయన భార్య భువనేశ్వరి, కుమారుడు లోకేశ్, కోడలు బ్రాహ్మణి శుక్రవారం ములాఖత్ అయ్యారు. అనంతరం జైలు వద్ద లోకేశ్ మీడియాతో మాట్లాడారు. రాజమండ్రి జైలుపై దాడి చేస్తామని మావోయిస్టులు లేఖ రాశారన్నారు. అదే సమయంలో బాబు పైనా దాడి జరగవచ్చని అన్నారు. జైలుపై డ్రోన్ ఎగరేశారని చెప్పారు. జైలులో నక్సల్స్, గంజాయి బ్యాచ్ ఖైదీలుగా ఉన్నారన్నారు. ఈ పరిణామాలు చూస్తుంటే బాబుకు జైల్లో ఇబ్బందికర పరిస్థితులు ఉన్నట్లు తెలుస్తోందని ఆరోపించారు. పోలవరం, ఇసుక, మద్యం, మైన్స్‌లో అవినీతిని ప్రశ్నించినందుకే దొంగ కేసులు పెట్టి చంద్రబాబును జైల్లో పెట్టారన్నారు. కక్ష సాధింపు కోసం, వ్యవస్థలను మేనేజ్ చేసి జ్యుడిషియల్ రిమాండ్‌లో ఉంచారన్నారు. ఆలస్యమైనా న్యాయమే గెలుస్తుందన్నారు. ఆ నాడు చంద్రబాబు చిటికేస్తే పిచ్చి జగన్ పాదయాత్ర చేసేవాడా.. అని ప్రశ్నించారు. 2014, 2016, 2018, 2022 సంవత్సరాల్లో కూడా ఒక్కొక్కరి నుంచి రూ.100 సభ్యత్వం చేయించామని, 1,300 బ్రాంచిల ద్వారా డబ్బు వసూలు చేసినట్లు వెల్లడించారు. టీడీపీ ఆడిటింగ్ అడుగుతున్నారని, ఇన్‌కమ్ టాక్స్ డిపార్ట్‌మెంట్‌కు మా అకౌంట్స్ సబ్‌మిట్ చేస్తామన్నారు. వారి పార్టీకి కూడా డబ్బులు ఎవరు ఇచ్చారో ఆధారాలు బయటపెట్టాలన్నా. కృష్ణా జలాలను జగన్ సొంత ప్రయోజనాల కోసం తాకట్టు పెట్టారని చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు చెప్పారు. తాము అధికారంలోకి వచ్చాక తప్పు చేసిన అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. బాబు అరెస్టులో కేంద్ర ప్రభుత్వ హస్తం ఉందనడానికి ఎలాంటి ఆధారాలు లేవన్నారు. శనివారం రాత్రి 7 గంటలకు అందరూ కొవ్వొత్తులు, మొబైల్ ఫ్లాష్ లైట్లతో సంఘీభావం తెలపాలన్నారు. ఇంట్లో లైట్లు ఆఫ్ చేసి ఇంటి ముందు కొవ్వొత్తులు వెలిగించాలని కోరారు. కాగా, లోకేశ్ మళ్లీ శనివారం ఢిల్లీ వెళ్లే అవకాశం ఉందని టీడీపీ వర్గాలు తెలిపాయి.

అల్లర్లకు టీడీపీ కుట్ర

- సానుభూతి రాజకీయం విఫలం కావడంతో పూటకో ఆందోళన: మంత్రి కారుమూరి
- బాబు తప్పు చేశాడు కాబట్టే జైలు కెళ్లాడని ప్రజలు విశ్వసిస్తున్నారు



సాక్షి, అమరావతి: సానుభూతి రాజకీయాలు విఫలం కావడంతో రాష్ట్రంలో అల్లర్లు సృష్టించేందుకు టీడీపీ కుట్ర చేస్తోందని పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆరోపించారు. చంద్రబాబు కోసం రోడ్డెక్కే కార్యకర్తలు లేకుండా పోవడంతో ఎలాగైనా అలజడులు సృష్టించాలనే దురుద్దేశంతో టీడీపీ పూటకో ఆందోళనకు పిలుపునిస్తోందన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ టీడీపీ–జనసేన కూటమిని ప్రజలు నమ్మే ప్రసక్తే లేదన్నారు. అవినీతి పార్టీ అని విమర్శించిన టీడీపీతో పవన్ మళ్లీ జతకట్టడం అవకాశవాద రాజకీయం కాక పోతే ఇంకేమిటని ప్రశ్నించారు. చంద్రబాబు, లోకేశ్ మాటలనే వారాహి యాత్రలో ఆయన వల్లె వేస్తున్నారని చెప్పారు. చంద్రబాబు తన తరఫున ప్రజల దగ్గరకు యాక్టర్లను పంపిస్తుంటే సీఎం జగన్ ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతీ ఇంటికి డాక్టర్లను పంపిస్తున్నారని చెప్పారు.

కోర్టు నమ్మింది కాబట్టే కస్టడీకి..

చంద్రబాబు అరెస్ట్ కాగానే ఆయన సామాజిక వర్గంవారు మీటింగులు నిర్వహించి గగ్గోలు పెట్టినా ప్రజలు పట్టించుకోవడం లేదన్నారు. తప్పు చేశారు కాబట్టే జైలు కెళ్లాడని బలంగా విశ్వసిస్తున్నారన్నారు. 13 చోట్ల సంతకాలు చేసి రూ.371 కోట్లు దోచేసిన చంద్రబాబు సిగ్గు లేకుండా తనపై కేసులు కొట్టివేయాలంటూ కోర్టులకు మొరపెట్టుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబు తప్పు చేశాడని కోర్టు నమ్మింది కాబట్టే ఆయనను కస్టడీకి పంపిందన్నారు. ఫైబర్ గ్రిడ్ స్కామ్ కేసులో కూడా ఆయన అరెస్ట్ కావడం ఖాయమన్నారు. 'ఇందులో సీఎం జగన్ ప్రమేయం ఏముంది? ఆయనపై ఎల్లో మీడియాలో ఎందుకు విమర్శలు చేస్తున్నారు?' అని ప్రశ్నించారు. పవన్‌కళ్యాణ్ వారాహి యాత్ర బహిరంగ సభల్లో ఏం మాట్లాడుతున్నాడో ఎవరికీ అర్థం కావడం లేదన్నారు. దేనిపైనా అవగాహన లేకుండా నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. చంద్రబాబు ఎంత అవినీతి పరుడో ఢిల్లీలో కూడా అందరికీ తెలుసు కాబట్టే లోకేశ్‌ను ఎవరూ పట్టించుకోలేదని చెప్పారు.

తండ్రి జైలుకెళ్లగానే లోకేశ్ ఢిల్లీకి పారిపోయాడు

వైఎస్సార్‌సీపీ ఎంపీ నందిగం సురేష్



సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి భయం అంటే ఏమిటో చూపిస్తానని ప్రగల్భాలు పలికిన లోకేశ్.. తండ్రి జైలుకు వెళ్లగానే ఢిల్లీకి పారిపోయి రఘురామకృష్ణరాజు గెస్ట్‌హౌస్‌లో కూర్చున్నారని వైఎస్సార్‌సీపీ ఎంపీ నందిగం సురేష్ ఎద్దేవా చేశారు. ఆయన శుక్రవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు రాజధాని రైతుల జీవితాల్లో వెలుగుల్లేకుండా చేశారని, ఆ పాపం ఊరికే పోదని అన్నారు. బాబు అరెస్ట్‌తో పవన్ తప్ప ఎవరూ బాధపడటం లేదన్నారు. పాపాలు చేసిన వారికి ప్రజల సానుభూతి ఉండదని చెప్పారు. చంద్రబాబు తప్పు చేశారని కోర్టులు కూడా నమ్మాయని, అందుకే జైలులో ఉన్నారని అన్నారు. రెండెకరాల నుంచి రూ.6 లక్షల కోట్లు సంపాదించటం అంటే మామూలు విషయమా? ఇలాంటి అవినీతిపరులను ప్రజలు క్షమించాలా అని అన్నారు. చంద్రబాబు అవినీతి ఢిల్లీలో కూడా అందరికీ తెలుసు కాబట్టే అక్కడ ఎవరూ లోకేశ్‌ను ఆదరించలేదని చెప్పారు. లోకేశ్ తండ్రి సంపాదనతో కొవ్వెక్కి మాట్లాడుతున్నారని విమర్శించారు. చంద్రబాబును నమ్మి బాగుపడిన వారు లేరని, వైఎస్సార్ ఫ్యామిలీని నమ్మి నష్టపోయిన వారు లేరన్నారు.

రియల్టర్లకు రూ.3 కోట్ల టోకరా!

నరవలో ఏపీఐఐసీ స్థలాలకు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి విక్రయం


- పెందుర్తి పోలీసులకు బాధితుల ఫిర్యాదు
- పరారీలో నిందితుడు ఆడారి శ్రీనివాస్ కుటుంబం

దొండపర్తి: ఏపీఐఐసీకి చెందిన 6 ఎకరాల స్థలం తనదంటూ నకిలీ పత్రాలు సృష్టించి.. రియల్టర్లకు విక్రయించి సుమారు రూ.3 కోట్లకు టోకరా వేశాడు ఓ ప్రబుద్ధుడు. వివరాల్లోకి వెళితే.. విశాఖ షీలానగర్ ప్రాంతానికి చెందిన ఆడారి శ్రీనివాస్, ఇతర కుటుంబ సభ్యులు ఏపీఐఐసీ స్థలాలకు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించారు. ఆ స్థలంలో లేఅవుట్లు వేసుకుంటే మంచి లాభాలొస్తాయని, భాగస్వాములను చూడాలని జగదీశ్వరరావు, మళ్ల సంతోష్ అనే ఇద్దరు మధ్యవర్తులను శ్రీనివాస్ నమ్మించాడు. వారు 2019లో గవర జగ్గయ్యపాలెంకు చెందిన కాండ్రేగుల సత్యనారాయణ, ఆయన బంధువు చలపతిరావుకు 6 ఎకరాలకు పైగా స్థలం విక్రయానికి ఉందని చెప్పారు. దీంతో కాండ్రేగుల సత్యనారాయణ పలు దఫాలలో రూ.28 లక్షలు, రూ.10 లక్షలు, రూ.8 లక్షలు ఆడారి శ్రీనివాస్ భార్య బ్యాంక్ అకౌంట్‌లో వేశాడు. ఆ తరువాత ఆ స్థలాన్ని తమ పేర్ల మీద రిజిస్ట్రేషన్ చేయాలని శ్రీనివాస్‌ను అడగగా.. ఆ స్థలంలో లేఅవుట్‌కు వేరే వారితో ఒప్పందం చేసుకున్నామని, వారికి డబ్బులు ఇచ్చేస్తే ఆ అగ్రిమెంట్ రద్దు చేసుకుంటానని చెప్పి వారి నుంచి మరికొంత డబ్బు వసూలు చేశాడు. ఆ తరువాత కాండ్రేగుల సత్యనారాయణ, చలపతిరావు పేర్ల మీద నకిలీ డాక్యుమెంట్లతో చోడవరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించేశాడు. ఆ సమయంలో సుమారు రూ.1.50 కోట్ల వరకు చెల్లించారు. పూర్తిగా డబ్బులు చెల్లించినా ఆ భూములు వారి పేర్ల మీద మారకపోవడంతో సత్యనారాయణకు అనుమానం వచ్చింది. దీనిపై ఆడారి శ్రీనివాస్‌ను ప్రశ్నించగా ఆ భూములకు ఏపీఐఐసీ ఎన్‌వోసీ ఇవ్వాలని చెప్పుకొచ్చాడు. ఎన్‌వోసీ వచ్చేస్తే లేఅవుట్ వేసుకోవచ్చని భావించిన సత్యనారాయణ మళ్లీ దఫదఫాలుగా రూ.50 లక్షల వరకు శ్రీనివాస్‌కు చెల్లించుకున్నారు. అయినప్పటికీ ఆ పని అవకపోవడంతో సత్యనారాయణ ఆ స్థలాలపై పూర్తిస్థాయిలో ఆరా తీయడంతో అవి ఏపీఐఐసీ భూములు అని తేలింది. దీంతో బాధితులు పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం నిందితుడు ఆడారి శ్రీనివాస్ కుటుంబంతో సహా పరారీలో ఉన్నట్లు తెలుస్తున్నది.

కోర్టు పర్యవేక్షణలో ఆస్తులపై విచారణకు సిద్ధమా?

నారా లోకేశ్‌కు మాజీ మంత్రి పేర్ని నాని సవాల్

- వీరప్పన్ తరహాలో చంద్రబాబు బుకాయింపు
- నిజాయితీపరుడంటూ సొల్లు కబుర్లు
- తెలంగాణలో కేసీఆర్ చెప్పిన చోటే పవన్ పార్టీ పోటీ
- నిన్ను ప్యాకేజీ స్టార్ అనక మరేమంటారు సన్నాసిన్నర సన్నాసి?



సాక్షి, అమరావతి: మాజీ సీఎం చంద్రబాబు నిజాయితీపరుడే అయితే కోర్టు పర్యవేక్షణలో మీ ఆస్తులపై విచారణకు సిద్ధమా? అని నారా లోకేశ్‌కు మాజీ మంత్రి పేర్ని నాని(వెంకట్రామయ్య) సవాల్ విసిరారు. చంద్రబాబు నిజాయితీపరుడంటూ ఆయన కుటుంబం చెబుతున్న సొల్లు కబుర్లను కట్టిపెట్టాలన్నారు. శుక్రవారం తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో పేర్ని నాని మీడియాతో మాట్లాడారు. గంధపు చెక్కల దొంగ వీరప్పన్ తాను అడవులను సంరక్షిస్తున్నానంటూ నమ్మబలికినట్లుగానే ఖజానాకు కన్నం వేసి తాను ప్రజల కోసం పని చేస్తున్నానంటూ చంద్రబాబు ఇన్నాళ్లూ నీతులు వల్లించారన్నారు. స్కిల్ స్కామ్‌లో అడ్డంగా దొరికిపోయిన దొంగ చంద్రబాబును కోర్టు రిమాండ్‌పై జైలుకు పంపితే తల్లిని, భార్యను రాజమండ్రిలో రోడ్ల మీద వదిలేసి ఢిల్లీకి ఎందుకు పరిగెత్తావని లోకేశ్‌ను ప్రశ్నించారు. తండ్రిని రక్షించుకోవడానికి ఎవరి కాళ్లు పట్టుకోవడానికి ఢిల్లీకి వెళ్లావని నిలదీశారు. దేశంలో వ్యవస్థలను మేనేజ్ చేయడంలో మొనగాడు ఎవరని లోకేశ్ ఆయన డ్రైవర్‌ను అడిగినా చంద్రబాబు పేరే చెబుతారన్నారు. సీమెన్స్ ఇస్తుందని మీరు చెప్పిన రూ.3 వేల కోట్లు ఎక్కడికి వెళ్లాయో చెప్పాలన్నారు. ఖజానా నుంచి కాజేసిన రూ.371 కోట్లలో రూ.27 కోట్లు సిగ్గు లేకుండా టీడీపీ ఖాతాలో వేసుకున్నారని ధ్వజమెత్తారు. పెడన సభలో ఎన్డీఏ నుంచి బయటకొచ్చానని ప్రకటించిన జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ముదినేపల్లికి వచ్చేసరికి మాట మార్చారని పేర్ని నాని గుర్తు చేశారు. 'నువ్వు ఎన్డీఏలోనే కొనసాగుతుంటే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఏ పార్టీకి మద్దతు ఇచ్చావ్? తెలంగాణ ఎన్నికల్లో బీజేపీతో సంప్రదించకుండా ఏకపక్షంగా 32 సీట్లలో పోటీ చేస్తున్నామని, గ్లాస్ గుర్తు కేటాయించాలని ఎన్నికల సంఘాన్ని ఎందుకు కోరావ్?' అని పవన్‌ను నిలదీశారు. తెలంగాణలో మున్నూరు కాపులు ఉన్న చోటే ఎందుకు పోటీ చేస్తున్నారని ప్రశ్నించారు. తెలంగాణ సీఎం కేసీఆర్ సూచించిన మేరకే ఆ స్థానాల్లో పోటీ చేస్తున్నావా? అని నిలదీశారు.

రాష్ట్రానికి మహమ్మారులు పవన్, చంద్రబాబే

'జనసేనను స్థాపించాక 2014 ఎన్నికల్లో టీడీపీకి మద్దతు ఇచ్చావ్. తమను బీసీల్లో చేర్చుతామన్న హామీని నిలబెట్టుకోని చంద్రబాబుపై కాపులు ఆగ్రహంతో ఉన్నందున వారి ఓట్లను చీల్చేందుకు 2019లో విడిగా పోటీ చేశావ్. ఎన్నికలు పూర్తవగానే బీజేపీ పంచన చేరావు. చంద్రబాబు జైలుకు వెళ్లగానే టీడీపీతో కలిసి పోటీ చేస్తానని ప్రకటించావ్. దీన్ని బట్టి చంద్రబాబుకు అమ్ముడుపోయే నిన్ను ప్యాకేజీ స్టార్ అనక మరేమంటారు సన్నాసిన్నర సన్నాసి..!' అంటూ పేర్ని నాని మండిపడ్డారు. రాష్ట్రానికి పట్టిన మహమ్మారులు చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లేనని ధ్వజమెత్తారు.

రాష్ట్ర ప్రయోజనాల కోసమే సీఎం జగన్ ఢిల్లీకి..

సీఎం వైఎస్ జగన్ దమ్మున్న నాయకుడు కాబట్టే ఎన్నికల్లో పొత్తులు లేకుండా పోటీ చేస్తున్నారని పేర్ని నాని గుర్తు చేశారు. 'దివంగత వైఎస్సార్‌పైనే పోరాటం చేశానని బీరాలు పలుకుతున్నావ్ కదా..! అలాంటి పోరాటం చేశానని మీ అన్న చిరంజీవి దగ్గర నుంచి సర్టిఫికెట్ తీసుకురాగలవా?' అని పవన్‌ను ప్రశ్నించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసమే సీఎం వైఎస్ జగన్ ఢిల్లీకి వెళ్తున్నారన్నారు. కేంద్రంతో చర్చలు జరిపి ఒప్పించి రాష్ట్రానికి రెవెన్యూ లోటు కింద రూ.12 వేల కోట్లు రాబట్టారని, పోలవరానికి నిధులను రాబడుతున్నారని చెప్పారు.

సాక్షి ఫ్యామిలీ
బెంగళూరు
శనివారం ॥ 7-10-2023

ఆర్థికశాస్త్రం చదువుకున్నవారి ఆసక్తి గణాంకాలకే పరిమితమని, న్యాయశాస్త్రం చదువుకున్న వారి ఆసక్తి ఆ శాస్త్రానికి సంబంధించిన అంశాలపైనే ఉంటుందనేది ఒక సాధారణ భావన.

'విభిన్న విద్యానేపథ్యం ఉన్న మేధావి'గా గుర్తింపు పొందిన జ్యోయితా గుప్తా ఆర్థికశాస్త్రం నుంచి న్యాయశాస్త్రం వరకు ఎన్నో శాస్త్రాలు చదివింది. అయితే ఆమె ప్రయాణంలో ఆ శాస్త్రాలేవీ వేటికవే అన్నట్లుగా ఉండిపోలేదు. వాతావరణ మార్పులపై తాను చేసిన శాస్త్రీయ పరిశోధనకు మరింత విస్తృతిని ఇచ్చాయి.

నెదర్‌లాండ్స్‌లోని యూనివర్శిటీ ఆఫ్ ఆమ్‌స్టార్‌డమ్‌లో ఎన్విరాన్‌మెంట్ అండ్ డెవలప్‌మెంట్ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న జ్యోయితా గుప్తా డచ్ రిసెర్చ్ కౌన్సిల్ నుంచి 'డచ్ నోబెల్'గా పేరొందిన ప్రతిష్ఠాత్మకమైన స్పినోజా ప్రైజ్‌ను ది హేగ్‌లో అందుకుంది...

పురస్కారం

డైనమిక్ ప్రొఫెసర్‌కు డచ్ నోబెల్



జ్యోయితా గుప్తా

ఢిల్లీలో పుట్టి పెరిగింది జ్యోయితా గుప్తా. లోరెటో కాన్వెంట్ స్కూల్లో చదువుకుంది. ఢిల్లీ యూనివర్శిటీలో ఎకనామిక్స్, గుజరాత్ యూనివర్శిటీలో న్యాయశాస్త్రం, హార్వర్డ్ లా స్కూల్‌లో ఇంటర్నేషనల్ లా చదివింది.

'అభివృద్ధి చెందుతున్న దేశాల్లో వాతావరణ మార్పులు' అనే అంశంపై ఆమ్‌స్టార్ డామ్‌లోని వ్రిజే యూనివర్శిటీలో డాక్టరేట్ చేసింది. 2013లో ఈ యూనివర్శిటీలో ఫ్యాకల్టీగా చేరింది. వాతావరణ మార్పుల వల్ల సమాజంపై కలుగుతున్న ప్రభావం, ఉత్పన్నమవుతున్న సామాజిక అశాంతి... మొదలైన అంశాలపై లోతైన పరిశోధనలు చేసింది.

2016లో ఐక్యరాజ్య సమితి ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రామ్ గ్లోబల్ ఎన్విరాన్‌మెంట్ ఔట్‌లుక్ (జీఈవో)కు కో– చైర్‌పర్సన్‌గా నియమితురాలైంది.

యూనివర్శిటీ ఆఫ్ ఆమ్‌స్టర్‌డమ్‌లో ఎన్విరాన్‌మెంట్ అండ్ డెవలప్‌మెంట్ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న జ్యోయితా గుప్తా 'ఆమ్‌స్టర్‌డామ్ గ్లోబల్ చేంజ్ ఇన్‌స్టిట్యూట్' సభ్యులలో ఒకరు.

పరిశోధనలకే పరిమితం కాకుండా పర్యావరణ సంబంధిత అంశాలపై విలువైన పుస్తకాలు రాసింది జ్యోయిత. 'ది హిస్టరీ ఆఫ్ గ్లోబల్ క్లైమెట్ గవర్నెన్స్' 'ది క్లైమెట్ ఛేంజ్ కన్వెన్షన్ అండ్ డెవలపింగ్ కంట్రీస్' 'టాక్సిక్ టెర్రరిజమ్: డంపింగ్ హాజడస్ వేస్ట్' 'అవర్ సిమరింగ్ ప్లానెట్' 'ఆన్ బిహాఫ్ ఆఫ్ మై డెలిగేషన్: ఏ సర్వైవల్ గైడ్ ఫర్ డెవలపింగ్ కంట్రీ క్లైమెట్ నెగోషియేటర్స్' 'మెయిన్ స్ట్రీమింగ్ క్లైమేట్ చేంజ్ ఇన్ డెవలప్‌మెంట్ కో ఆపరేషన్'... మొదలైన పుస్తకాలు రాసింది.

అమెరికా పరిశ్రమల చెత్త ఏ దేశాలకు చేరుతుంది? ఎంత విషతుల్యం అవుతుందో 1990లోనే 'టాక్సిక్ టెర్రరిజమ్: డంపింగ్ హాజడస్ వేస్ట్' పుస్తకంలో కళ్లకు కట్టినట్లు వివరించింది. పాశ్చాత్య దేశాల పరిశ్రమలు ఉత్పత్తి చేసే విషపూరిత వ్యర్థాలు మరోవైపు విదేశీ మారకద్రవ్యం కోసం పరితపిస్తూ పర్యావరణాన్ని పట్టించుకోని దేశాల గురించి లోతైన విశ్లేషణ చేసింది జ్యోయిత.

సాధారణంగానైతే పర్యావరణ అంశాలకు సంబంధించిన చర్చ, విశ్లేషణ ఒక పరిధిని దాటి బయటికి రాదు. అయితే జ్యోయిత విశ్లేషణ మాత్రం ఎన్నో కోణాలను ఆవిష్కరించింది. వాతావరణంలోని మార్పులు ప్రభుత్వ పాలనపై చూపే ప్రభావం, ధనిక, పేద సమాజాల మధ్య తలెత్తే వైరుధ్యాల గురించి చెప్పడం ఇందుకు ఒక ఉదాహరణ.



ది హేగ్‌లో జరిగిన బహుమతి ప్రదాన కార్యక్రమంలో జ్యోయిత (చివరి వ్యక్తి)

'ప్రపంచవ్యాప్తంగా తగినన్ని ఆర్థిక వనరులు ఉన్నాయి. అందరి జీవితాలను బాగు చేయడానికి ఆ వనరులను ఎలా ఉపయోగించాలనేదే సమస్య. ప్రపంచవ్యాప్తంగా సంపన్నులు, నిరుపేదల మధ్య అసమానతలు ఉన్నాయి. భారత్‌లాంటి దేశాల్లో కూడా ఇదొక పెద్ద సవాలు' అంటుంది జ్యోయిత.

ఆమె విశ్లేషణలో విమర్శ మాత్రమే కనిపించదు. సందర్భాన్ని బట్టి పరిష్కారాలు కూడా కనిపిస్తాయి.

'విస్తృతమైన, విలువైన పరిశోధన' అంటూ స్పినోజా ప్రైజ్ జ్యూరీ గుప్తాను కొనియాడింది. కొత్త తరం పరిశోధకులకు ఆమె మార్గదర్శకత్వం విలువైనదిగా ప్రశంసించింది.

తనకు లభించిన బహుమతి మొత్తాన్ని (1.5 మిలియన్ యూరోలు) శాస్త్రపరిశోధన కార్యక్రమాలపై ఖర్చు చేయాలని నిర్ణయం తీసుకుంది జ్యోయితా గుప్తా.

అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణకు, పర్యావరణ సంరక్షణకు చట్టాలతో కూడిన ప్రపంచ రాజ్యాంగం కోసం జ్యోయితా గుప్తా గట్టి కృషి చేస్తోంది.

టిప్

ఆరోగ్యాన్ని నమలండి

చేదుగా ఉన్నప్పటికీ వేపలో అనేక ఆరోగ్యసుగుణాలు ఉన్నాయని తెలిసిందే. అయితే రోజూ వేపను మన జీవన శైలిలో భాగం చేసుకుంటే మరిన్ని ప్రయోజనాలు చేకూరతాయి. అవేంటో చూద్దాం... ● పరగడుపున నాలుగు వేపాకులను నమిలితే నోటి ఆరోగ్యం మెరుగుపడుతుంది. నోటినుంచి వచ్చే దుర్వాసన, పంటినొప్పి వంటి సమస్యలు తగ్గుముఖం పడతాయి. ● పొట్టలోని హానికర సూక్ష్మజీవుల్ని చంపడంలో వేపాకు చక్కగా పనిచేస్తోంది. వేపాకును కొద్దిగా నమిలి మింగితే వాంతులు అవ్వవు ● రోజూ క్రమం తప్పకుండా వేపాకుల్ని నమలడం వల్ల జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగుపడుతుంది. ఫలితంగా జీర్ణక్రియ సక్రమంగా జరిగి, మలబద్ధకం సమస్య తగ్గుతుంది. ● వేప పేస్టుని వాపుపై పెడితే వాపు తగ్గుతుంది. ● క్రమం తప్పకుండా వేపాకులు నమిలితే చర్మం కాంతిమంతమవడంతోపాటు, శరీరం అలసట తగ్గి, చురుకుగా మారుతుంది.



మహింద్రా థార్‌ను చూసి భలే ఉందే అనుకున్నారా?
దానిని డిజైన్ చేసింది ఒక స్త్రీ అని చాలామంది అనుకోరు.
ఎందుకంటే ఆటోమొబైల్ ఇండస్ట్రీలో మగవారి ప్రాబల్యం ఎక్కువ.
కాని క్రిపా అనంతన్ గొప్ప కార్ డిజైనర్‌గా
ఈ రంగంలో తన ప్రభావం చూపుతోంది.
మహింద్రాలో హిట్ అయిన అనేక ఎస్‌యువీలను ఆమే డిజైన్ చేసింది.
ఇపుడు ఓలాకు డిజైన్ హెడ్‌గా పని చేస్తూ ఉంది.

కార్ డిజైనర్ థార్ డిజైనర్



క్రిపా అనంతన్

మహింద్రా సంస్థకు గొప్ప పేరు తెచ్చిన 'థార్'ను క్రిపా అనంతన్ డిజైన్ చేసింది. ఆమె వయసు 53. పూర్తి పేరు రామ్‌క్రిపా అనంతన్ అయితే అందరూ క్రిపా అని పిలుస్తారు. 'ఆటోమొబైల్ డిజైనర్ కూడా చిత్రకారుడే. కాకపోతే చిత్రకారుడు కాగితం మీద రంగులతో గీస్తే మేము లోహాలకు రూపం ఇస్తాం... శక్తి కూడా ఇచ్చి కదలిక తెస్తాం' అంటుంది క్రిపా.

బిట్స్ పిలానీలో మెకానికల్ ఇంజినీరింగ్ చేసిన క్రిపా ఆ తర్వాత ఐ.ఐ.టి ముంబైలో ఇండస్ట్రియల్ డిజైన్ చదివి 1997లో మహింద్రాలో ఇంటీరియర్ డిజైనర్‌గా చేరింది. ఆ సమయంలో తయారైన వాహనాలు– బొలెరో, స్కార్పియోలకు ఇంటీరియర్ డిజైన్ పర్యవేక్షించింది. ఆమె ప్రతిభను గుర్తించిన సంస్థ కొత్త ఎస్‌యువిని తేదలిచి దాని డిజైనింగ్ బాధ్యతలు అప్పజెప్పింది.

సాధారణంగా ప్రయాణాలంటే ఇష్టపడే క్రిపా తన టూ వీలర్– బజాజ్ అవెంజర్ మీద మనాలి నుంచి శ్రీనగర్ వరకూ ఒక్కతే ప్రయాణిస్తూ వాహనం ఎలా ఉండాలో ఆలోచించింది. అంతేకాదు దాదాపు 1500 మందిని సర్వే చేయించి ఎస్‌యువి ఎలా ఉంటే బాగుంటుందో సూచనలు తీసుకుంది. 'మహింద్రా ఏ బండి తయారు చేసినా దాని రూపం ఘనంగా ఉండాలి. చిన్న బండి అయినా తన ముద్ర వేయాలి. నేను సాధారణంగా ప్రకృతి నుంచి అటవీ జంతువుల నుంచి వాహనాల డిజైన్లు చూసి ఇన్‌స్పైర్ అవుతాను. చీటాను దృష్టిలో పెట్టుకుని నేను అనుకున్న డిజైన్ తయారు చేశాను' అందామె. ఆ విధంగా ఆమె పూర్తిస్థాయి డిజైన్‌తో మహింద్రా ఎస్‌యువి 500 మార్కెట్‌లోకి వచ్చింది. పెద్ద హిట్ అయ్యింది. దాంతో ఆటోమొబైల్ ఇండస్ట్రీలో మహిళా డిజైనర్‌గా క్రిపా సంచలనం సృష్టించింది. ఆ తర్వాత ఇతర వాహనాల డిజైన్ల బాధ్యత కూడా ఆమెకే అప్పజెప్పారు. 'ప్రతి మనిషికీ ఒక కథ ఉన్నట్టే ప్రతి వాహనానికీ ఒక కథ ఉండాలి. అప్పుడే జనానికి కనెక్ట్ అవుతుంది' అంటుంది క్రిపా.

> ప్రతి మనిషికీ ఒక కథ ఉన్నట్టే ప్రతి వాహనానికీ ఒక కథ ఉండాలి. అప్పుడే జనానికి కనెక్ట్ అవుతుంది.
> – క్రిపా అరంతన్

ఆమె తయారు చేసిన 'ఎస్‌యువి 300' మరో మంచి డిజైన్‌గా ఆదరణ పొందింది. ఇక 'థార్' అయితే అందరూ ఆశపడే బండి అయ్యింది. ఇప్పుడు థార్ అమ్మకాలు భారీగా ఉన్నాయి. మహింద్రా సంస్థ ఎలక్ట్రిక్ వాహనాల తయారీకి ఉపక్రమిస్తుండగా 2021లో తన సొంత ఆటోమొబైల్ డిజైన్ స్టూడియో ఏర్పాటు కోసం సంస్థ నుంచి బయటకు వచ్చింది క్రిపా. అయితే ఇప్పుడు ఓలా గ్రూప్‌కు డిజైన్‌హెడ్‌గా పని చేస్తోంది. అంటే ఇకపై ఓలా గ్రూప్ నుంచి వెలువడే వాహనాలు ఆమె రూపకల్పన చేసేవన్న మాట.

ఇరవైమంది డిజైనర్లతో కొత్త ఆలోచనలకు పదును పెట్టే క్రిపా తన బృందంలో కనీసం 5గురు మహిళలు ఉండేలా చూసుకుంటుంది. మహిళల ప్రతిభకు ఎప్పుడూ చోటు కల్పించాలనేది ఆమె నియమం. క్రిపాకు ఏ మాత్రం సమయం దొరికినా పారిస్‌కో లండన్‌కో వెళ్లిపోతుంది. అక్కడ ఏదైనా కేఫ్‌లో కూచుని రోడ్డు మీద వెళ్లే స్పోర్ట్స్ కార్లను పరిశీలిస్తూ ఉండటం ఆమెకు సరదా.

'2050 నాటికి ఆటోమొబైల్ ఇండస్ట్రీ ఎలా ఉంటుందో ఊహించుకుంటూ ఇవాళ్టి నుంచి మన పనిని తీర్చిదిద్దుకోవాలి' అంటుందామె.

ఇంత దార్శనికత ఉన్న డిజైనర్ కనుక విజయం ఆమెకు డోర్ తెరిచి నిలబడుతోంది.

లైఫ్@360

సర్దుకు పోవద్దు.. సర్దుకుందాం ఇలా



వంట చేయాలంటే మంచి వాతావరణం ఉండాలి. అంటే కిచెన్ క్లీన్‌గా ఉండాలి. చాలా మంది ఇది పెద్ద పనిలా అనుకుంటారు. కానీ, కొన్ని చిట్కాలు పాటిస్తే కిచెన్ ఈజీగా క్లీన్ అవుతుంది. దీంతో వంట చేయాలనే ఉత్సాహం వస్తుంది. కిచెన్‌ని ఎలా క్లీన్ చేస్తే త్వరగా పని పూర్తవుతుంది, వంటగదిని పరిశుభ్రంగా ఉంచుకోవడం ఎలాగో వివరించే కొన్ని చిట్కాలను పాటించడం వల్ల వంటగది ఎలా ఉన్నా సరే, సర్దుకుపోదాం అనే ధోరణిలో కాకుండా ఇలా ఉంటే సులువుగా సర్దుకోవచ్చు.

కిచెన్‌ను శుభ్రంగా ఉంచుకోవడంలో మొదటి మెట్టు... వంట పూర్తి కాగానే.. కిచెన్ ప్లాట్‌ఫామ్, స్టౌను వెంటనే శుభ్రం చేసేసుకోవడం. స్టవ్ మీద, ప్లాట్‌ఫామ్ మీదా మనం వండిన వంటలోని చిందులు, నూనె మరకలు పడటం సహజం. అలాంటి వాటిని వంట అవగానే వెంటనే తుడిచేయాలి. గోరువెచ్చటి నీళ్లలో వెనిగర్ కలిపి శుభ్రం చేస్తే.. క్రిములు తొలగిపోతాయి. స్టౌ మీద పడిన నూనె మరకలను తొలగించడానికి, కిచెన్ ప్లాట్‌ఫామ్ శుభ్రం చేయడానికి యాంటీ బ్యాక్టీరియల్ వైప్స్‌ని ఉపయోగించచ్చు. అవి కాసింత ఖరీదైనవి కావడం వల్ల చాలామంది కిచెన్ టవల్స్‌నే వాడతారు.

ఒకోసారి కిచెన్‌లో నూనె ఒలికిపోతుంటుంది. వెంటనే ఆ నూనె మీద గోధుమ పిండి లేదా బియ్యప్పిండిని చల్లి కాసేపటి తరువాత పేపర్‌తో తుడిస్తే జిడ్డులేకుండా శుభ్రపడుతుంది.

■ **కిచెన్ ప్లాట్‌ఫామ్‌పై మరకలు ఉంటే..**

వంటసోడా వేసిన నీళ్లతో కిచెన్ ప్లాట్‌ఫామ్ తుడిస్తే చాలు. అంతేకానీ బ్లీచింగ్, అమోనియా లాంటివి వాడటం వల్ల క్యాబినెట్‌కున్న రంగులు, టైల్స్ దెబ్బతింటాయి.

కూరగాయలు తరగడం పూర్తయిన వెంటనే ఆ ప్రదేశాన్ని శుభ్రం చేయకపోతే అక్కడున్న తేమ, కాయగూరల అవశేషాలు వాతావరణంలో ఉన్న బ్యాక్టీరియా, వైరస్, ఇతర క్రిముల్ని త్వరగా ఆకర్షిస్తాయి. తరిగేటప్పుడే ఓ డబ్బా పెట్టుకొని, తొక్కలు, తొడిమల్లాంటివి దాంట్లో వేసి తర్వాత చెత్తడబ్బాలో పడేస్తే.. శుభ్రంగా ఉంటుంది.

■ **కిచెన్ టవల్స్‌ను కూడా...**

కిచెన్ ప్లాట్‌ఫామ్‌ని, స్టవ్‌నీ క్లీన్ చేసేందుకు ఉపయోగించే కిచెన్ టవల్‌ని సరిగా శుభ్రం చేయకపోతే దానికి ఉండే బ్యాక్టీరియా వల్ల అంతవరకు మనం చేసినదంతా నిరర్థకమవుతుంది. కిచెన్ టవల్స్ జిడ్డుగా ఉంటే గోరువెచ్చని నీటిలో సర్ఫ్, వాషింగ్ లిక్విడ్ వేసి కాసేపు నానబెట్టిన తర్వాత బట్టలుతికే బ్రష్‌తో క్లీన్ చేస్తే క్లీన్ అయిపోతాయి.



■ **కిచెన్ క్యాబినెట్**

కిచెన్ ప్లాట్‌ఫామ్ కింద లేదా పైన సామాన్లు పెట్టుకోవడం కోసం ఉంచిన ర్యాక్స్, క్యాబినెట్ పుల్స్, హ్యాండిల్స్‌పై కూడా సూక్ష్మక్రిములు ఉంటాయి. వాటిని క్రిమిసంహారక వైప్‌తో క్లీన్ చేస్తే మంచిది. వెనిగర్‌ని క్లాత్‌పై స్ప్రే చేసి వాడండి. దీనివల్ల వేలిముద్రలు, నీటి గుర్తులు పోయి తెల్లగా మెరుస్తాయి.

■ **ఫ్రిజ్ క్లీన్‌గా..**

ఫ్రిజ్‌లో మనం చాలా స్టఫ్ పెడుతుంటాం. కానీ, దానిని ఎప్పుడో ఓసారి క్లీన్ చేస్తుంటాం. అలా కాకుండా దీనిని కూడా మరకలు లేకుండా శుభ్రంగా తుడవడం మంచిది. ఫ్రిజ్ కింద, డోర్స్, లోపల గ్లాసెస్.. ఇలా అన్నింటిని తడిగుడ్డతో తుడిస్తే త్వరగా క్లీన్ అవుతుంది. ఇక మిగిలిపోయిన ప్రతిదానిని ఫ్రిజ్‌లో తోసేయకుండా ఎప్పటికప్పుడు క్లీన్ చేయడం చాలా మంచిది.

■ **సింక్ క్లీన్..**

కిచెన్ క్లీన్ చేయాలంటే ముందుగా సింక్‌ని క్లీన్ చేయాలి. సింక్ బేసిన్ నీట్‌గా ఉందో లేదో చూసుకోండి. కౌంటర్ చుట్టూ ఎప్పటికప్పుడు క్లీన్ చేయడం వల్ల వైరస్, బ్యాక్టీరియా వంటివి దూరమవుతాయి. అందుకే, ముందు దీనిని క్లీన్ చేయండి. సింక్ సరిగ్గా లేకపోతే అందులో నుంచే ఎక్కువ బొద్దింకలు, వాటి ద్వారా వ్యాధులు వస్తాయి. కొద్దిగా బ్లీచింగ్ పౌడర్, డిష్‌వాష్, బేకింగ్ సోడాతో క్లీన్ చేస్తే సరి. సింక్‌లో మాంసాహారం కడిగిన తర్వాత దాన్ని సోప్ వాటర్‌తో శుభ్రం చేసేస్తే సింక్ దుర్వాసన రాకుండా ఉంటుంది.

కాస్త తీరిక దొరికినప్పుడు ఓ క్లాత్ తీసుకుని వాటర్ స్ప్రే చేస్తూ కిచెన్ గోడలు, కౌంటర్స్‌ని క్లీన్ చేయండి. ఇందుకోసం మార్కెట్లో దొరికే స్ప్రేలను కూడా ఉపయోగించవచ్చు.. ఇప్పుడు డోర్ ఫ్రేమ్స్‌ని క్లీన్ చేయండి.

వంటగదిని అన్ని వస్తువులు సులభంగా దొరికేలా సర్దుకుంటే వంట చేయడం ఈజీ అవుతుంది. ఎలాగో చూద్దాం...

■ **ట్రాన్స్‌పరెంట్ డబ్బాలు**

వంట చేసుకునేప్పుడు ఏ డబ్బాలో ఏముందా? అని వెతుక్కోవడానికే సమయం వృథా అవుతుంది. అలా కాకుండా షెల్ఫుల్లో ట్రాన్స్‌పరెంట్‌గా ఉండే ప్లాస్టిక్ డబ్బాలు లేదా స్టీల్ డబ్బాలూ గాజు సీసాలూ అందుబాటులో ఉంటాయి. వాటిని ప్రయత్నించి చూడండి. పని సులభం అవుతుంది.



■ **సరుకులనూ వేరు చేయడం**

వంట గదిలో షెల్ఫులలో అన్ని సరుకుల్ని అన్ని షెల్ఫుల్లో సర్దేయకుండా ఎక్కువగా వంటకు వాడే వాటిని ఒకచోట, తక్కువగా వాడే పదార్థాల్ని వేరే షెల్ఫులో, బేకింగ్ సామగ్రిని మరో దగ్గర పెట్టుకోవడం వల్ల చాలా సమయం ఆదా అవుతుంది.



పిల్లల ఎముకలు బలంగా పెరగాలంటే..

పిల్లల ఎదుగుదల విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ఎందుకంటే పెద్దవారితో పోల్చితే పిల్లల ఎముకలు బలహీనంగా ఉంటాయి. దీనివల్ల చిన్న చిన్న దెబ్బలు తాకినా తొందరగా విరిగిపోయే ప్రమాదం ఉంటుంది. బాల్యంలోని బలమైన ఎముకలు వారి జీవితకాల ఆరోగ్యానికి అద్భుతమైన పునాదిని అందిస్తాయి. అందువల్ల వారి ఎముకలు దృఢంగా ఉండేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలు, పాటించవలసిన ఆహార నియమాలపై అవగాహన కోసం...

కాల్షియం

గుండెను ఆరోగ్యంగా ఉంచడానికి, కండరాలను బలోపేతం చేయడానికి, ఎముకలను అభివృద్ధి చేయడానికి కాల్షియం అవసరం అని తెలుసు కాబట్టి పిల్లలు రోజుకు కనీసం రెండు గ్లాసుల పాలను తాగేట్టు చూడాలి. అలాగే ఆహారంలో బచ్చలికూర, పాలకూర వంటి ఆకుకూరలు, బెండ, పొట్ల వంటి కూరగాయలు ఉండేట్టు చూడండి. అలాగే రోజుకు ఒకసారైనా పెరుగును తినేట్టు చూడండి. సోయా పాలు, సోయా పెరుగు వంటి సోయాబీన్ ఉత్పత్తుల్లో కూడా కాల్షియం పుష్కలంగా ఉంటుంది.



విటమిన్ డి

శరీరానికి కావలసిన కాల్షియంను గ్రహించేందుకు విటమిన్ డి సహాయపడుతుంది. విటమిన్ డి సూర్యరశ్మి ద్వారా, కొన్ని రకాల ఆహారాల ద్వారా పొందవచ్చు. పిల్లల ఆహారంలో తగినంత విటమిన్ డి లేకపోతే విటమిన్ డి సప్లిమెంట్‌ను తీసుకోవాలి. నవజాత శిశువులకు కూడా విటమిన్ డి సప్లిమెంట్స్ అవసరం. కానీ డాక్టర్లను సంప్రదించిన తర్వాతే ఇవ్వాలి.

మెగ్నీషియం, విటమిన్ కె


శరీరంలో విటమిన్ కె, మెగ్నీషియం స్థాయిలు ఎక్కువగా ఉంటే ఎముకలు బలంగా ఉంటాయి. అలాగే రికెట్స్, బోలు ఎముకల వ్యాధితో సహా ఎన్నో ఎముకల సమస్యలను తగ్గించడానికి ఇవి సహాయపడతాయి. కాల్షియంతో పాటుగా ఈ విటమిన్లు కూడా మీ పిల్లల ఎముకలను బలోపేతం చేయడానికి సహాయపడతాయి. బచ్చలికూర, క్యాబేజీ, మొలకలు వంటి వాటిల్లో విటమిన్ కె, మెగ్నీషియం పుష్కలంగా ఉంటాయి. పిల్లలకు తృణధాన్యాలను పెట్టండి.

కార్బోనేటేడ్ పానీయాలు వద్దే వద్దు

కార్బోనేటేడ్ పానీయాలలో సాధారణంగా కొన్ని ఫాస్పోరిక్ ఆమ్లాలు ఉంటాయి. ఇది శరీరం కాల్షియాన్ని గ్రహించకుండా నిరోధిస్తుంది. ఈ ఆమ్లం ఎముకల ఆరోగ్యానికి అస్సలు మంచిది కాదు. కార్బోనేటెడ్ పానీయాలకు బదులుగా నారింజ రసం వంటి హెల్తీ పానీయాలను తాగించండి.

ఎముకలను బలోపేతం చేసేవాటిలో ముఖ్యమైనది శారీరక శ్రమ. అందుకే పిల్లలు బాగా ఆటలు ఆడేలా చూడండి. వీలైతే చిన్న చిన్న వ్యాయామాలను చేయించండి.

40లలో ఉన్నారా?
జీవన సరళిలో మార్పులు అవసరం



మనిషి జీవితం 40 ఏళ్ళకి ముందు ఒకలా, ఆ తరువాత మరొకలా ఉంటుంది. బాధ్యతలు పెరగటం వల్ల, శరీర మార్పుల వల్ల, రకరకాల శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలతో సతమతం కావడం మొదలవుతుంది. అందుకే ఆ వయసుకి రాగానే మన జీవన సరళిలో మార్పులు చేయాలి. ఆ మార్పులేమిటో తెలుసుకుని వాటిని ఆచరించే ప్రయత్నం చేద్దాం.

● నాలుగు పదుల వయసు వచ్చేసరికి కండరాల్లో సాంద్రత తగ్గుతూ ఉంటుంది. రక్త సరఫరా కూడా నెమ్మదిస్తుంటుంది కాబట్టి, దినచర్యలో వ్యాయామం తప్పనిసరి చేసుకోవాలి. మలబద్ధకం, జీర్ణ సమస్యలు రాకుండా ఆహారంలో పీచు పదార్థాలు ఎక్కువ ఉండేలా చూసుకోవాలి. అన్నం పరిమాణాన్ని తగ్గించాలి. తాజాఫలాలు ఎక్కువ తీసుకోవాలి. ● కాల్షియం లెవెల్స్ తీసుకోవడం పెంచండి. ● కంటిచూపు మందగించకుండా విటమిన్ ఎ, సి ఉండే పదార్థాలు తినాలి. ● మొబైల్స్, ల్యాప్ టాప్ వాడకం తగ్గించాలి. ● ఎప్పుడు హైడ్రేటెడ్‌గా ఉండాలి. అంటే నీళ్ళు బాగా తాగాలి. ● వయసు, బరువు, ఎత్తు, బాడి మాస్ ఇండెక్స్ చూసుకోండి. ఫ్యాట్ ఉంటే కరిగించండి. ● బలహీనంగా ఉంటే బరువు పెంచండి. ● విటమిన్ ఎ, సి, యాంటి ఆక్సిడెంట్స్ ఉండే ఆహారం తీసుకోవాలి. ● రోగనిరోధకశక్తి పెంచుకోవాలి. ● మెంటల్ హెల్త్ బాగుండాలంటే ప్రశాంతంగా ఉంటూ తగినంత నిద్ర పోవడం అవసరం.



ఆసియా క్రీడల చెస్: పతకాల రేసులో భారత మహిళల, పురుషుల జట్లు

వ్యక్తిగత విభాగాల్లో పతకాలు సాధించలేకపోయిన భారత చెస్ క్రీడాకారులు టీమ్ విభాగంలో పతకాల రేసులో నిలిచారు. ఆసియా క్రీడల చెస్ టీమ్ ఈవెంట్‌లో ఎనిమిదో రౌండ్ పూర్తయ్యాక అర్జున్, ప్రజ్ఞానంద, విదిత్, గుకేశ్, హరికృష్ణలతో కూడిన భారత పురుషుల జట్టు...హంపి, హారిక, వైశాలి, వంతిక, సవితాశ్రీలతో కూడిన భారత మహిళల జట్టు 13 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్నాయి. ఎనిమిదో రౌండ్‌లో భారత మహిళల జట్టు 4-0తో హాంకాంగ్‌పై... భారత పురుషుల జట్టు 3.5-0.5తో దక్షిణ కొరియాపై గెలిచింది. హాంకాంగ్‌తో జరిగిన మ్యాచ్‌లో హారిక, వైశాలి, వంతిక, సవితాశ్రీ తమ ప్రత్యర్థులపై గెలిచారు. పురుషుల జట్టు తరఫున అర్జున్, గుకేశ్, ప్రజ్ఞానంద నెగ్గగా... హరికృష్ణ తన గేమ్‌ను 'డ్రా' చేసుకున్నాడు. నేడు జరిగే చివరిదైన తొమ్మిదో రౌండ్‌లో ఫిలిప్పీన్స్‌తో భారత పురుషుల జట్టు...కొరియాతో భారత మహిళల జట్టు తలపడతాయి. ఈ రౌండ్‌లో భారత జట్లు గెలిస్తే పతకాలను ఖాయం చేసుకుంటారు.



హాకీలో పసిడి వెలుగులు

- స్వర్ణ పతకం గెలిచిన భారత పురుషుల జట్టు
- ఫైనల్లో జపాన్‌పై 5-1 గోల్స్‌తో ఘనవిజయం
- ఆసియా క్రీడల చాంపియన్ హోదాలో పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత
- నేడు పతకాల్లో 'సెంచరీ' మైలురాయి దాటనున్న భారత బృందం



ఏ లక్ష్యంతోనైతే చైనా గడ్డపై భారత పురుషుల హాకీ జట్టు అడుగుపెట్టిందో దానిని దిగ్విజయంగా అందుకుంది. ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకం సాధించి వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్ క్రీడలకు నేరుగా అర్హత పొందాలన్న లక్ష్యాన్ని టీమిండియా సాధించింది. డిఫెండింగ్ చాంపియన్ జపాన్ జట్టుతో జరిగిన ఫైనల్లో హర్మన్‌ప్రీత్ సింగ్ నాయకత్వంలోని భారత హాకీ జట్టు ఆద్యంతం ఆధిపత్యం చలాయించి ఏకపక్ష విజయాన్ని నమోదు చేసింది. పోటీల 13వ రోజు భారత్ ఖాతాలో మొత్తం తొమ్మిది పతకాలు చేరాయి. ఆర్చరీలో రజతం, కాంస్యం... రెజ్లింగ్‌లో మూడు కాంస్యాలు... బ్రిడ్జ్, సెపక్‌తక్రా, బ్యాడ్మింటన్‌లో ఒక్కో కాంస్య పతకం లభించాయి. ప్రస్తుతం భారత్ 95 పతకాలతో నాలుగో స్థానంలో ఉంది. నేడు క్రికెట్, ఆర్చరీ, కబడ్డీ, మహిళల హాకీ, చెస్, రోలర్ స్కేటింగ్, రెజ్లింగ్, బ్యాడ్మింటన్ క్రీడాంశాల్లో భారత క్రీడాకారులు పతకాల బరిలో ఉన్నారు. క్రికెట్, ఆర్చరీ, కబడ్డీ, బ్యాడ్మింటన్ ద్వారా భారత్‌కు కచ్చితంగా ఏడు పతకాలు రానున్నాయి. ఈ నేపథ్యంలో ఆసియా క్రీడల చరిత్రలో భారత్ తొలిసారి నేడు అధికారికంగా 100 పతకాల మైలురాయిని దాటనుంది.

హాంగ్జౌ: పక్కా ప్రణాళికతో, పూర్తిస్థాయిలో సన్నద్ధమై ఆసియా క్రీడల్లో అడుగుపెట్టిన భారత పురుషుల హాకీ జట్టు తమ లక్ష్యాన్ని సాధించింది. లీగ్ దశ నుంచి ప్రత్యర్థి జట్లపై పూర్తి ఆధిపత్యం కనబరిచిన టీమిండియా తుది పోరులోనూ ఈ దూకుడు కొనసాగించింది. దాంతో ఆసియా క్రీడల్లో తొమ్మిదేళ్ల తర్వాత మళ్లీ పసిడి పతకాన్ని సొంతం చేసుకుంది. డిఫెండింగ్ చాంపియన్ జపాన్ జట్టుతో శుక్రవారం జరిగిన ఫైనల్లో హర్మన్‌ప్రీత్ సింగ్ సారథ్యంలోని భారత జట్టు 5-1 గోల్స్ తేడాతో ఘనవిజయం సాధించింది. తద్వారా ఆసియా క్రీడల విజేత హోదాలో టీమిండియా వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్ క్రీడలకు నేరుగా అర్హత పొందింది. జపాన్‌తో జరిగిన తుది పోరులో భారత్ తరఫున కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ (32వ, 59వ ని.లో) రెండు గోల్స్ చేయగా... అమిత్ రోహిదాస్ (36వ ని.లో), మన్‌ప్రీత్ సింగ్ (25వ ని.లో), అభిషేక్ (48వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. జపాన్ జట్టుకు సెరెన్ తనాకా (51వ ని.లో) ఏకైక గోల్ అందించాడు. ఓవరాల్‌గా ఆసియా క్రీడల్లో భారత్ నాలుగోసారి స్వర్ణ పతకం సాధించింది. 1966 బ్యాంకాక్, 1998 బ్యాంకాక్, 2014 ఇంచియోన్ ఆసియా క్రీడల్లోనూ భారత్ బంగారు పతకాలు సొంతం చేసుకుంది. కాంస్య పతక మ్యాచ్‌లో దక్షిణ కొరియా 2-1తో చైనా జట్టుపై గెలిచింది. హర్మన్‌ప్రీత్ 13 గోల్స్‌తో టోర్నీ టాప్ స్కోరర్‌గా నిలిచాడు. జపాన్ జట్టును ఏమాత్రం తక్కువ చేయకుండా ఆడిన భారత్ అవకాశం వచ్చినపుడల్లా ప్రత్యర్థి గోల్‌పోస్ట్ వైపు దూసుకెళ్లింది. ఈ క్రమంలో కొన్నిసార్లు గోల్ చేసే అవకాశాలను చేజార్చుకుంది. తొలి 25 నిమిషాల వరకు భారత్‌ను నిలువరించిన జపాన్ ఆ తర్వాత తడబడింది. అభిషేక్ 'డి' ఏరియా వద్ద నుంచి కొట్టిన రివర్స్ షాట్‌ను జపాన్ గోల్‌కీపర్ నిలువరించాడు. తిరిగి వచ్చిన బంతిని అక్కడే ఉన్న మన్‌ప్రీత్ లక్ష్యానికి చేర్చడంతో భారత్ ఖాతా తెరిచింది. ఆ తర్వాత భారత్ జోరు పెంచగా... జపాన్ డీలా పడింది.

'క్రికెట్' ఫైనల్లో భారత్

తొలిసారి ఆసియా క్రీడల్లో ఆడుతున్న భారత క్రికెట్ జట్టు స్వర్ణ పతకానికి విజయం దూరంలో నిలిచింది. టి20 ఫార్మాట్‌లో జరుగుతున్న ఈ క్రీడల్లో టీమిండియా ఫైనల్ చేరింది. సెమీఫైనల్లో భారత్ తొమ్మిది వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌ను ఓడించింది. నేడు జరిగే ఫైనల్లో అఫ్గానిస్తాన్‌తో భారత్ ఆడుతుంది. రెండో సెమీఫైనల్లో అఫ్గానిస్తాన్ నాలుగు వికెట్ల తేడాతో పాకిస్తాన్‌ను ఓడించింది. బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ 97 పరుగుల లక్ష్యాన్ని 9.2 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి అందుకుంది. భారత్ తరఫున హైదరాబాద్ క్రికెటర్ తిలక్ వర్మ (26 బంతుల్లో 55 నాటౌట్; 2 ఫోర్లు, 6 సిక్స్‌లు), రుతురాజ్ గైక్వాడ్ (26 బంతుల్లో 40 నాటౌట్; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్ ఆడారు. అంతకుముందు బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 96 పరుగులు చేసింది. భారత బౌలర్లలో సాయికిశోర్ 3 వికెట్లు, వాషింగ్టన్ సుందర్ 2 వికెట్లు తీశారు.

పతకాల పట్టిక (టాప్-10)

దేశం	స్వ	ర	కాం	మొ
చైనా	187	104	63	354
జపాన్	47	57	65	169
దక్షిణ కొరియా	36	49	84	169
భారత్	22	34	39	95
ఉజ్బెకిస్తాన్	20	18	26	64
చైనీస్ తైపీ	17	16	25	58
ఉత్తర కొరియా	11	18	10	39
థాయ్‌లాండ్	10	14	30	54
బహ్రెయిన్	10	3	5	18
కజకిస్తాన్	9	18	41	68

నోట్: స్వ-స్వర్ణం, ర-రజతం, కాం-కాంస్యం, మొ-మొత్తం.


అర్ధ సెంచరీ చేశాక తాను వేసుకున్న తల్లిదండ్రుల టాటూను చూపుతున్న తిలక్ వర్మ


రజత పతకాలతో ధీరజ్, అతాను దాస్, తుషార్

రికర్వ్‌లో తొలిసారి రజతం

ఆసియా క్రీడల ఆర్చరీ రికర్వ్ విభాగంలో భారత్ 13 ఏళ్ల పతక నిరీక్షణకు హాంగ్జౌలో తెర పడింది. చివరిసారి 2010 గ్వాంగ్‌జౌ ఏషియాడ్‌లో రికర్వ్ ఈవెంట్ టీమ్ ఈవెంట్‌లో భారత్‌కు కాంస్య పతకాలు లభించాయి. ఆ తర్వాతి రెండు ఆసియా క్రీడల్లో ఈ విభాగంలో భారత్‌కు నిరాశే ఎదురైంది. తాజా ఏషియాడ్‌లో ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ బొమ్మదేవర ధీరజ్, అతాను దాస్, తుషార్‌లతో కూడిన జట్టు రికర్వ్ టీమ్ విభాగంలో భారత్‌కు తొలిసారి రజత పతకం అందించింది. ఫైనల్లో భారత్ 1-5తో దక్షిణ కొరియా చేతిలో ఓడిపోయింది. అంతకుముందు భారత్ క్వార్టర్ ఫైనల్లో 5-4తో మంగోలియాపై, సెమీఫైనల్లో 5-3తో బంగ్లాదేశ్‌పై గెలిచి ఫైనల్ చేరింది. మరోవైపు సిమ్రన్‌జీత్ కౌర్, అంకిత, భజన్ కౌర్‌లతో కూడిన భారత మహిళల రికర్వ్ జట్టు కాంస్యం గెలిచింది. కాంస్య పతక మ్యాచ్‌లో భారత్ 6-2తో వియత్నాంపై నెగ్గింది. అంతకుముందు క్వార్టర్ ఫైనల్లో భారత్ 6-2తో జపాన్‌పై గెలిచి, సెమీఫైనల్లో 2-6తో దక్షిణ కొరియా చేతిలో ఓడిపోయింది. నేడు కాంపౌండ్ మహిళల వ్యక్తిగత విభాగంలో స్వర్ణం కోసం జ్యోతి సురేఖ, కాంస్యం కోసం అదితి... పురుషుల వ్యక్తిగత విభాగంలో అభిషేక్, ఓజస్ ప్రవీణ్ స్వర్ణ, రజత పతకాల కోసం పోటీపడతారు.


కాంస్యాలతో సిమ్రన్‌జీత్, అంకిత, భజన్ కౌర్

సాత్విక్-చిరాగ్ జోడీ కొత్త చరిత్ర

- ఆసియా క్రీడల్లో ఫైనల్ చేరిన తొలి భారత డబుల్స్ జోడీగా రికార్డు
- సెమీస్‌లో మాజీ ప్రపంచ చాంపియన్ జంటపై గెలుపు



ఈ ఏడాది తమ అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తూ భారత బ్యాడ్మింటన్ పురుషుల డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి కొత్త చరిత్ర సృష్టించింది. ఆసియా క్రీడల చరిత్రలో ఫైనల్ చేరిన తొలి భారతీయ జోడీగా రికార్డు నెలకొల్పింది. హాంగ్జౌలో శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో సాత్విక్-చిరాగ్ జోడీ 21-17, 21-12తో మాజీ ప్రపంచ చాంపియన్ ఆరోన్ చియా-సో వుయ్ యిక్ (మలేసియా)పై గెలిచింది. 46 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సాత్విక్-చిరాగ్ కళ్లు చెదిరే స్మాష్‌లతో, చక్కటి డిఫెన్స్‌తో ప్రత్యర్థి జోడీ ఆట కట్టించారు. నేడు జరిగే ఫైనల్లో చోయ్ సోల్ జియు-కిమ్ వన్ హో (దక్షిణ కొరియా) జంటతో సాత్విక్-చిరాగ్ ద్వయం తలపడుతుంది. తాజా ప్రదర్శనతో సాత్విక్-చిరాగ్ శెట్టి జోడీ వచ్చే మంగళవారం విడుదల చేసే ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) ర్యాంకింగ్స్‌లో తొలిసారి నంబర్‌వన్ ర్యాంక్‌కు చేరుకునే అవకాశముంది. మరోవైపు పురుషుల సింగిల్స్‌లో భారత నంబర్‌వన్ ప్రణయ్ కాంస్య పతకాన్ని దక్కించుకున్నాడు. పూర్తి ఫిట్‌నెస్‌తో లేకుండానే సెమీఫైనల్ ఆడిన ప్రణయ్ 16-21, 9-21తో ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ చాంపియన్ లీ షి ఫెంగ్ (చైనా) చేతిలో ఓడిపోయాడు.


ప్రణయ్

పసిడి 'కూత'కు గెలుపు దూరంలో...

ఫైనల్లో భారత పురుషుల, మహిళల కబడ్డీ జట్లు



గత జకార్తా ఆసియా క్రీడల్లో తొలిసారి స్వర్ణ పతకాన్ని చేజార్చుకున్న భారత పురుషుల, మహిళల కబడ్డీ జట్లు చైనా గడ్డపై తిరిగి పసిడి పతకాలను అందుకునేందుకు విజయం దూరంలో నిలిచాయి. శుక్రవారం జరిగిన కబడ్డీ సెమీఫైనల్స్‌లో భారత పురుషుల జట్టు 61-14తో పాకిస్తాన్ జట్టును చిత్తు చేయగా... భారత మహిళల జట్టు 61-17తో నేపాల్ జట్టుపై నెగ్గింది. నేడు జరిగే ఫైనల్స్‌లో చైనీస్ తైపీతో భారత మహిళల జట్టు... ఇరాన్‌తో భారత పురుషుల జట్టు 'ఢీ'కొంటాయి.

పతకాల రేసులో గ్రీష్మ, సంహిత

ఆసియా క్రీడల రోలర్ స్కేటింగ్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణులు దొంతర గ్రీష్మ, ఆకుల సాయి సంహిత పతకాల రేసులో ఉన్నారు. శుక్రవారం లేడీస్ ఆర్టిస్టిక్ సింగిల్ ఫ్రీ స్కేటింగ్ షార్ట్ ఫైనల్ తొలి రౌండ్ ముగిశాక గ్రీష్మ 20.94 పాయింట్లతో నాలుగో స్థానంలో... సాయి సంహిత 16.95 పాయింట్లతో ఆరో స్థానంలో ఉన్నారు. నేడు కూడా రాణించి టాప్-3లోకి వస్తే వీరికి పతకాలు ఖరారవుతాయి.


భారత్ 'కంచు' పట్టు

కాంస్యాలు నెగ్గిన భారత రెజ్లర్లు అమన్, సోనమ్, కిరణ్

ఆసియా క్రీడల రెజ్లింగ్‌లో భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. స్టార్ రెజ్లర్ బజరంగ్ పూనియాకు అనూహ్య ఓటమి ఎదురుకాగా... అమన్ (57 కేజీలు), మహిళల విభాగంలో సోనమ్ మలిక్ (62 కేజీలు), కిరణ్ (76 కేజీలు) కాంస్య పతకాలు గెలిచారు. కాంస్య పతక బౌట్‌లలో అమన్ 11-0తో లియు మింగు (చైనా)పై, సోనమ్ 7-5తో జియా లాంగ్ (చైనా)పై, కిరణ్ 6-3తో అరియున్‌జర్గాల్ (మంగోలియా)పై నెగ్గారు.

బజరంగ్ విఫలం

సెలెక్షన్ ట్రయల్స్‌లో పాల్గొనకుండా నేరుగా ఆసియా క్రీడల్లో ఆడే అవకాశం దక్కించుకున్న భారత స్టార్ రెజ్లర్ బజరంగ్ పూనియా నిరాశపరిచాడు. చైనా నుంచి అతను రిక్తహస్తాలతో స్వదేశానికి రానున్నాడు. పురుషుల ఫ్రీస్టయిల్ 65 కేజీల విభాగంలో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన బజరంగ్ పూనియా కాంస్య పతక బౌట్‌లో 4 నిమిషాల 31 సెకన్లలో ఓడిపోయాడు. జపాన్ ప్లేయర్ కైకి యామగుచి 10-0తో బజరంగ్‌ను చిత్తుగా ఓడించాడు. రెజ్లింగ్ నిబంధనల ప్రకారం ప్రత్యర్థిపై 10 పాయింట్ల ఆధిక్యం సంపాదించిన వెంటనే రిఫరీ బౌట్‌ను నిలిపివేసి 'టెక్నికల్ సుపీరియారిటీ' పద్ధతిలో విజేతగా ప్రకటిస్తారు. భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ సింగ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణల కేసులో బజరంగ్ తన సహచర రెజ్లర్లతో కలిసి దాదాపు రెండునెలలపాటు నిరసన చేపట్టిన సంగతి తెలిసిందే. దాంతో కొంతకాలంపాటు ఆటకు దూరంగా ఉన్న అతను ఆసియా క్రీడల్లో పూర్తిస్థాయి ప్రదర్శన ఇవ్వడంలో విఫలమయ్యాడు. 2014 ఏషియాడ్‌లో బజరంగ్ 61 కేజీల్లో రజతం, 2018 ఏషియాడ్‌లో 65 కేజీల్లో స్వర్ణం నెగ్గాడు.


బజరంగ్


అమన్


సోనమ్


కిరణ్

మహిళల సెపక్‌తక్రాలో తొలిసారి భారత్‌కు పతకం



ఆసియా క్రీడల సెపక్‌తక్రా ఈవెంట్‌లో భారత మహిళల జట్టు తొలిసారి పతకంతో తిరిగి వస్తోంది. మహిళల రెగూ టీమ్ ఈవెంట్‌లో ఖుప్‌మ్ మైపాక్ దేవి, ఒయినమ్ చవోబా దేవి, ఖుష్బూ, ఎలాంగ్‌బమ్ ప్రియాదేవి, ఇలాంగ్‌బమ్ లెరెంతోంబి దేవిలతో కూడిన భారత జట్టు కాంస్య పతకం కైవసం చేసుకుంది. థాయ్‌లాండ్‌తో జరిగిన సెమీఫైనల్లో భారత్ 10-21, 13-21తో ఓడిపోయింది.

బ్రిడ్జ్‌లో రజతంతో సరి...



గత ఆసియా క్రీడల్లో బ్రిడ్జ్ క్రీడాంశంలో ఒక స్వర్ణం, రెండు కాంస్య పతకాలు గెలిచిన భారత బృందం ఈసారి రజత పతకంతో సరిపెట్టుకుంది. హాంగ్జౌలో శుక్రవారం జరిగిన పురుషుల టీమ్ ఈవెంట్ ఫైనల్లో భారత్ 152-238.1 పాయింట్ల తేడాతో హాంకాంగ్ చేతిలో ఓడిపోయింది. సందీప్ తక్రాల్, జగ్గీ శివ్‌దసాని, రాజు తొలాని, అజయ్ ప్రభాకర్ రజత పతకం గెలిచిన భారత జట్టులో సభ్యులుగా ఉన్నారు.

'డచ్' పని పట్టిన పాక్

ప్రపంచకప్‌లో పాకిస్తాన్‌కు శుభారంభం లభించింది. మెరుపు బ్యాటింగ్ ప్రదర్శనలు, అసాధారణ బౌలింగ్ లేకపోయినా సమష్టి తత్వంతో ఆ జట్టు తొలి అడుగును విజయవంతంగా వేసింది. అసోసియేటెడ్ టీమ్ నెదర్లాండ్స్‌పై అన్ని రకాలుగా ఆధిపత్యం ప్రదర్శించి తొలి విజయాన్ని తమ ఖాతాలో వేసుకుంది. తమ ఆటతో మ్యాచ్‌లో అక్కడక్కడ పైచేయి సాధించినట్లు కనిపించినా... చివరకు నెదర్లాండ్స్ సులువుగానే తలవంచింది. 'ఆరెంజ్' జట్టు సంచలన విజయానికి ఈ ఆట సరిపోలేదు.

- తొలి మ్యాచ్‌లో పాకిస్తాన్ విజయం
- 81 పరుగులతో నెదర్లాండ్స్ చిత్తు
- రాణించిన షకీల్, రిజ్వాన్


రిజ్వాన్

సాక్షి, హైదరాబాద్: రెండు వామప్ మ్యాచ్‌లతో ఉప్పల్ స్టేడియంపై అంచనాకు వచ్చిన పాకిస్తాన్ ఈ వారం రోజుల అనుభవాన్ని అసలు మ్యాచ్‌లో సమర్థంగా వాడుకుంది. శుక్రవారం జరిగిన వన్డే వరల్డ్ కప్ పోరులో పాక్ 81 పరుగుల తేడాతో నెదర్లాండ్స్‌పై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాక్ 49 ఓవర్లలో 286 పరుగులకు ఆలౌటైంది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సౌద్ షకీల్ (52 బంతుల్లో 68; 9 ఫోర్లు, 1 సిక్స్), మొహమ్మద్ రిజ్వాన్ (75 బంతుల్లో 68; 8 ఫోర్లు) అర్ధసెంచరీలు సాధించారు. అనంతరం నెదర్లాండ్స్ 41 ఓవర్లలో 205 పరుగులకే ఆలౌటైంది. బాస్ డి లీడ్ (68 బంతుల్లో 67; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), విక్రమ్‌జిత్ సింగ్ (67 బంతుల్లో 52; 4 ఫోర్లు, 1 సిక్స్) రాణించినా జట్టుకు ఓటమి తప్పలేదు.

సెంచరీ భాగస్వామ్యం...

కనీసం 300 పరుగులు నమోదు చేస్తాం. టాస్ సమయంలో పాక్ కెప్టెన్ బాబర్ ఆజమ్ చేసిన వ్యాఖ్య ఇది. అయితే దానికి చేరువగా వెళ్లడంలో పాక్ సఫలమైంది. ఆరంభ ఓవర్లలో ప్రదర్శన చూస్తే అది కష్టంగానే అనిపించినా రెండు కీలక భాగస్వామ్యాలు జట్టును ఆదుకున్నాయి. తొలి పవర్‌ప్లేలో 9.1 ఓవర్లు ముగిసేసరికి పాక్ 3 కీలక వికెట్లు చేజార్చుకుంది. ఓపెనర్లు ఫఖర్ (12), ఇమామ్ (15)లతో పాటు కెప్టెన్ బాబర్ ఆజమ్ (5) కూడా తొందరగా వెనుదిరిగారు. ఈ దశలో రిజ్వాన్, షకీల్ కలిసి జట్టును ఆదుకున్నారు. ఆరంభంలో నిలదొక్కుకునేందుకు కొంత సమయం తీసుకున్న వీరిద్దరు ఆ తర్వాత చక్కటి షాట్లతో దూకుడు పెంచారు. ఈ క్రమంలో షకీల్ 32 బంతుల్లో, రిజ్వాన్ 58 బంతుల్లో అర్ధ సెంచరీలు పూర్తి చేసుకున్నారు. వీరిద్దరి శతక భాగస్వామ్యం తర్వాత తక్కువ వ్యవధిలో పాక్ 3 వికెట్లు చేజార్చుకుంది. అయితే నవాజ్ (43 బంతుల్లో 39; 4 ఫోర్లు), షాదాబ్ (34 బంతుల్లో 32; 2 ఫోర్లు, 1 సిక్స్) మళ్లీ పరిస్థితిని చక్కదిద్దారు. వీరిద్దరు ఏడో వికెట్‌కు 70 బంతుల్లో 64 పరుగులు జత చేశారు. చివరి 2 వికెట్లకు కలిపి మరో 34 పరుగులు రావడం కూడా పాక్‌ను మెరుగైన స్థితికి చేర్చింది.


విక్రమ్‌జిత్ సింగ్


బాస్ డి లీడ్

ఆ ఇద్దరు మినహా...

ఛేదనలో నెదర్లాండ్స్‌కు విక్రమ్‌జిత్ చక్కటి షాట్లతో శుభారంభం అందించాడు. అయితే తక్కువ వ్యవధిలో జట్టు డౌడ్ (5), అకెర్‌మన్ (17) వికెట్లు కోల్పోయింది. దాంతో విక్రమ్‌జిత్‌కు డి లీడ్ జత కలిశాడు. వీరిద్దరి భాగస్వామ్యం ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించింది. ఈ జోడీ మూడో వికెట్‌కు 76 బంతుల్లో 70 పరుగులు జత చేసింది. అయితే 65 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్న వెంటనే విక్రమ్ భారీ షాట్‌కు ప్రయత్నించి వెనుదిరిగాడు. తేజ నిడమనూరు (5) విఫలం కాగా, డచ్ ఆ వెంటనే మరో 2 చేజార్చుకుంది. అయితే డి లీడ్ క్రీజ్‌లో ఉన్నంత వరకు టీమ్‌కు కాస్త ఆశలు ఉన్నాయి. 50 బంతుల్లోనే అతను హాఫ్ సెంచరీని అందుకున్నాడు. నవాజ్ చక్కటి బంతిని లీడ్ బౌల్డ్ కావడంతో 'డచ్' జట్టు ఓటమి లాంఛనమే అయింది.

స్కోరు వివరాలు

పాకిస్తాన్ ఇన్నింగ్స్: ఫఖర్ (సి అండ్ బి) వాన్ బీక్ 12; ఇమామ్ (సి) దత్ (బి) మీకెరెన్ 15; బాబర్ (సి) సాఖిబ్ (బి) అకెర్‌మన్ 5; రిజ్వాన్ (బి) డి లీడ్ 68; షకీల్ (సి) సాఖిబ్ (బి) దత్ 68; ఇఫ్తికార్ (సి) ఎడ్వర్డ్స్ (బి) డి లీడ్ 9; నవాజ్ (రనౌట్) 39; షాదాబ్ ఖాన్ (బి) డి లీడ్ 32; హసన్ అలీ (ఎల్బీ) (బి) డి లీడ్ 0; షాహీన్ అఫ్రిది (నాటౌట్) 13; రవూఫ్ (స్టంప్డ్) ఎడ్వర్డ్స్ (బి) అకెర్‌మన్ 16; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (49 ఓవర్లలో ఆలౌట్) 286. వికెట్ల పతనం:** 1-15, 2-34, 3-38, 4-158, 5-182, 6-188, 7-252, 8-252, 9-267, 10-286. **బౌలింగ్:** ఆర్యన్ దత్ 10-0-48-1, వాన్ బీక్ 6-0-30-1, అకెర్‌మన్ 8-1-39-2, మీకెరెన్ 6-0-40-1, డి లీడ్ 9-0-62-4, మెర్వ్ 6-0- 36- 0, విక్రమ్‌జిత్ 2-0-16-0, సాఖిబ్ 2-0- 15-0.

నెదర్లాండ్స్ ఇన్నింగ్స్: విక్రమ్‌జిత్ (సి) ఫఖర్ (బి) షాదాబ్ 52; మ్యాక్స్ డౌడ్ (సి) షాహీన్ (బి) హసన్ 5; అకెర్‌మన్ (బి) ఇఫ్తికార్ 17; డి లీడ్ (బి) నవాజ్ 67; తేజ (సి) ఫఖర్ (బి) రవూఫ్ 5; ఎడ్వర్డ్స్ (ఎల్బీ) (బి) రవూఫ్ 0; సాఖిబ్ (ఎల్బీ) (బి) షాహీన్ 10; వాన్‌డర్ మెర్వ్ (రనౌట్) 4; వాన్ బీక్ (నాటౌట్) 28; దత్ (బి) హసన్ 1; మీకెరెన్ (బి) రవూఫ్ 7; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (41 ఓవర్లలో ఆలౌట్) 205. వికెట్ల పతనం:** 1-28, 2-50, 3-120, 4-133, 5-133, 6-158, 7-164, 8-176, 9-184, 10-205. **బౌలింగ్:** షాహీన్ అఫ్రిది 7-0-37-1, హసన్ అలీ 7-1-33-2, రవూఫ్ 9-0-43-3, ఇఫ్తికార్ అహ్మద్ 3-0-16-1, మొహమ్మద్ నవాజ్ 7-0-31-1, షాదాబ్ ఖాన్ 8-0-45-1.


షకీల్

ప్రపంచకప్‌లో నేడు

అఫ్గానిస్తాన్ X బంగ్లాదేశ్
వేదిక: ధర్మశాల
ఉదయం గం. 10:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

శ్రీలంక X దక్షిణాఫ్రికా
వేదిక: న్యూఢిల్లీ
మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

సాక్షి బిజినెస్
శనివారం
7-10-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
364	108
65,996	19,654

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 ముగింపు)

నాస్‌డాక్	13,413	▲	192
డోజోన్స్	33,421	▲	301
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,495	▲	43
డాక్స్	15,300	▲	160
షాంఘై (గత గురువారం ముగింపు)	3,110	▲	3
నికాయ్	30,995	▼	81

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	56,539	▼	16
బంగారం (99.5 స్వచ్ఛత)	56,313	▼	16
వెండి (కేజీ)	67,095	▼	109

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటికి	82.47	84.14
£	బ్రిటన్ పౌండ్	ఒకటికి	98.86	103.18
€	యూరో	ఒకటికి	86.29	89.38
¥	జపాన్ ఎన్ (100)	ఒకటికి	55.20	56.92
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటికి	52.07	54.37
S$	సింగపూర్ డాలర్	ఒకటికి	59.97	61.91
SAR	సౌదీ రియాల్	ధామన్‌ఖకి	21.24	22.87
UAE D	యూఏఈ దిర్హామ్	ధామన్‌ఖకి	21.77	23.56
¥	చైనా యువాన్	ధామన్‌ఖకి	10.28	12.35

ధరల కట్టడే ధ్యేయం..




- 4% ద్రవ్యోల్బణమే ఆర్‌బీఐ లక్ష్యం
- 6.5 శాతం రెపో కొనసాగింపునకు పాలసీ కమిటీ ఏకగ్రీవ ఓటు
- ఈ తరహా నిర్ణయం వరుసగా నాల్గవసారి
- వ్యవస్థలో అదనపు ద్రవ్య లభ్యత తగ్గింపునకు చర్యలు
- 6.5 శాతం జీడీపీ వార్షిక వృద్ధి అంచనా
- ద్రవ్యోల్బణం సగటు 5.4 శాతంగా ఉంటుందని భరోసా

ముంబై: ధరల కట్టడికే అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు గవర్నర్ శక్తికాంతదాస్ నేతృత్వంలోని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఆరుగురు సభ్యుల ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) స్పష్టం చేసింది. బ్యాంకులకు ఆర్‌బీఐ తానిచ్చే రుణాలపై వసూలు చేసే వడ్డీరేటు– రెపోను యథాతథంగా 6.5 శాతంగా కొనసాగించాలని ఏకగ్రీవ నిర్ణయం తీసుకుంది. ఈ తరహా 'యథాతథ రెపో రేటు కొనసాగింపు' నిర్ణయం తీసుకోవడం వరుసగా ఇది నాల్గవసారి. రిటైల్ ద్రవ్యోల్బణం 4%గా కొనసాగించడమే ప్రధాన లక్ష్యమని ఉద్ఘాటించిన ఎంపీసీ, ఈ దిశలో వ్యవస్థలో అదనపు ద్రవ్య లభ్యతను (లిక్విడిటీ) వెనక్కు తీసుకునే విధానాన్ని కొనసాగిస్తామని పేర్కొంది. ఇందులో భాగంగా బాండ్ విక్రయాల ను చేపడుతున్నట్లు తెలిపింది. 'సరళతర ద్రవ్య విధానాన్ని వెనక్కుతీసుకునే' ధోరణికే కట్టుబడి ఉన్నట్లు పాలసీ కమిటీ స్పష్టం చేసింది. మూడు రోజులపాటు జరిగిన కమిటీ సమావేశాల నిర్ణయాలను గవర్నర్ శక్తికాంతదాస్ మీడియాకు తెలిపారు. 'ఆర్‌బీఐ ద్రవ్యోల్బణం లక్ష్యం 4%. 2 నుంచి 6% కాదు' అని ఉద్ఘాటించారు. ప్లస్ 2, మైనస్ 2తో 4% వద్ద ద్రవ్యోల్బణం ఉండాలని ఆర్‌బీఐకి కేంద్రం నిర్దేశిస్తున్న సంగతి తెలిసిందే.

పాలసీ ముఖ్యాంశాలు...

- 2023–24లో జీడీపీ 6.5 శాతం.
- రిటైల్ ద్రవ్యోల్బణం 5.4 శాతం.
- అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంకుల బుల్లెట్ రీపేమెంట్ స్కీమ్ కింద పసిడి రుణాల పరి మితి రూ. 2 లక్షల నుంచి రూ. 4లక్షలకు పెంపు.



కఠిన ద్రవ్య విధానం కొనసాగింపు..

ఆర్‌బీఐ 2022 మే నుంచి 250 బేసిస్ పాయింట్లు రెపో రేటును పెంచింది. అయితే ఇటు డిపాజిట్ల విషయంలో అటు రుణాల విషయంలో బ్యాంకులు కస్టమర్లకు ఈ రేట్లను పూర్తిగా బదలాయించలేదు. ఈ పరిస్థితుల్లో 'సరళతర ద్రవ్య విధానాన్ని వెనక్కుతీసుకునే' ధోరణినే కొనసాగించాలని ఆర్‌బీఐ భావిస్తోంది. అంటే ఇప్పటి వరకూ తీసుకున్న నిర్ణయాలు వ్యవస్థలో ఇంకా ప్రతిఫలించాల్సి ఉంది.

– శక్తికాంత దాస్, ఆర్‌బీఐ గవర్నర్

రూ. 2,000 నోట్లు ఇప్పటికీ మార్చుకోవచ్చు..



రూ.2,000 నోట్లను అక్టోబర్ 8 నుంచి కూడా మార్చుకునే అవకాశాలన్నీ ఆర్‌బీఐ కల్పించింది. గవర్నర్ ఈ విషయంపై మాట్లాడుతూ రూ. 3.43 లక్షల కోట్ల రూ. 2,000 డినామినేషన్ నోట్లు ఇప్పటి వరకూ బ్యాంకింగ్ వ్యవస్థలోకి తిరిగి వచ్చాయన్నారు. ఇంకా రూ.12,000 కోట్లకుపైగా విలువైన నోట్లు చెలామణీలో ఉన్నాయన్నారు. అక్టోబర్ 8 నుండి 19 ఆర్‌బీఐ కార్యాలయాల్లో వీటిని మార్చుకోవచ్చన్నారు. నోట్లను డిపాజిట్ చేయడానికి లేదా మార్చుకోవడానికి మొదట సెప్టెంబర్ 30 వరకు గడువిచ్చిన ఆర్‌బీఐ, ఈ తేదీని అక్టోబర్ 7 వరకూ పొడిగించింది. రాష్ట్ర రాజధానుల్లో ఆర్‌బీఐ కార్యాలయాలు ఉన్నందున, ఎక్కడివారైనా, 2,000 నోట్లను మార్చు కోవడానికి పోస్టల్ శాఖ సేవలను పొందవచ్చని దాస్ సూచించారు.



అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితిలోనూ దేశ ఆర్థికాభివృద్ధి పటిష్టతే లక్ష్యంగా ఉంది.
– దినేష్ ఖారా, ఎస్‌బీఐ చీఫ్



ద్రవ్యోల్బణం గరిష్ట స్థాయికి చేరుకున్నట్లు కనిపిస్తోంది. సమీపకాలంలో ధరలు తగ్గవచ్చు.
– సుబ్రకాంత్ పాండా, ఫిక్కీ ప్రెసిడెంట్



వృద్ధికి మద్దతునిస్తూ, ద్రవ్యోల్బణం కట్టడే ఆర్‌బీఐ ధ్యేయంగా కనబడుతోంది
– ప్రసేన్‌జిత్ బసు, చీఫ్ ఎకనమిస్ట్, ఐసీఐసీఐ సెక్యూరిటీస్



మార్కెట్‌లో 'ఆర్‌బీఐ' హుషారు

- రియల్టీ,ఆటో షేర్ల పరుగులు
- సెన్సెక్స్ లాభం 364 పాయింట్లు
- 19,650 పైకి నిఫ్టీ

ముంబై: అంచనాలకు తగ్గట్లే ఆర్‌బీఐ వరుసగా నాలుగోసారీ కీలక వడ్డీరేట్లను యథాతథంగా కొనసాగించడంతో శుక్రవారం స్టాక్ మార్కెట్ ర్యాలీ చేసింది. రేట్ల సంబంధిత ఫైనాన్స్, రియల్టీ, ఆటో షేర్లు రాణించడంతో సెన్సెక్స్ 364 పాయింట్లు పెరిగి 65,996 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 108 పాయింట్లు బలపడి 19,654 వద్ద నిలిచింది. ఆసియా, యూరప్ మార్కెట్ల రికవరీ ఇన్వెస్టర్లకు ఉత్సాహాన్నిచ్చింది. క్రూడాయిల్ ధరలు మరింత దిగిరావచ్చనే అశలూ సెంటిమెంట్‌ను బలపరిచాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం లాభాలతో మొదలయ్యాయి. ఆర్‌బీఐ ద్రవ్య పాలసీ ప్రకటన వెల్లడి తర్వాత మరింత దూసుకెళ్లాయి. ఒక దశలో సెన్సెక్స్ 464 పాయింట్లు బలపడి 66,096 వద్ద, నిఫ్టీ 130 పాయింట్లు దూసుకెళ్లి 19,676 వద్ద ఇంట్రాడే గరిష్టాలను తాకాయి.

వాలియంట్ లేబొరేటరీస్ అప్పర్ సర్క్యూట్



వాలియంట్ లేబొరేటరీస్ షేరు లిస్టింగ్ రోజే అప్పర్ సర్క్యూట్ తాకింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ.140)తో పోలిస్తే 15% ప్రీమియంతో రూ.161 వద్ద మొదలైంది. ఒక దశలో గరిష్ట ట్రేడింగ్ పరిమితి 21% ర్యాలీ చేసి రూ.169 వద్ద అప్పర్ సర్క్యూట్ తాకింది. ఎక్స్ఛేంజీలో 1.99 లక్షల షేర్లు చేతులు మారాయి. కంపెనీ మార్కెట్ విలువ రూ.735 కోట్లుగా నమోదైంది.

మళ్లీ టీసీఎస్ షేర్ల బైబ్యాక్!

టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) మరోసారి షేర్ల బైబ్యాక్ ప్రతిపాదనను తీసుకువస్తోంది. ఈ నెల 11వ తేదీ బోర్డు సమావేశంలో సొంత ఈక్విటీ షేర్ల కొనుగోలు అంశాన్ని పరిశీలించనున్నట్లు వెల్లడించింది. కంపెనీ ఇంతక్రితం 2022 మార్చిలో షేర్ల బైబ్యాక్‌ను ప్రకటించింది. ఎన్ఎస్ఈలో శుక్రవారం షేరు 1% బలపడి రూ. 3,621 వద్ద ముగిసింది.

రిలయన్స్ రిటైల్‌లో తాజా పెట్టుబడి

- అబుదాబి ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ రెడీ
- 0.59% వాటాకు రూ. 4,967 కోట్లు



ముంబై: డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ అనుబంధ విభాగం రిలయన్స్ రిటైల్ వెంచర్స్(ఆర్ఆర్‌వీఎల్)లో అబుదబి ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ(ఏడీఐఏ) రూ. 4,967 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. తద్వారా ఆర్ఆర్‌వీఎల్‌లో 0.59 శాతం వాటాను పొందనుంది. రూ. 8.38 లక్షల కోట్ల విలువలో ఏడీఐఏ ఇన్వెస్ట్ చేస్తున్నట్లు రిలయన్స్ రిటైల్ ఒక ప్రకటనలో పేర్కొంది. దీంతో విలువరీత్యా దేశంలోని టాప్–4 కంపెనీలలో చేరనుంది. సొంత అనుబంధ సంస్థ ద్వారా ఏడీఐఏ పెట్టుబడులకు తెరతీస్తున్నట్లు ఆర్ఆర్‌వీఎల్ వెల్లడించింది. సంస్థలో ఇన్వెస్టర్‌గా మద్దతు కొనసాగిస్తున్నందుకు ఏడీఐఏతో బంధం మరింత పటిష్టంకానున్నట్లు రిలయన్స్ రిటైల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఇషా ముకేశ్ అంబానీ పేర్కొన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థతోపాటు.. తమ బిజినెస్ మూలాలు, వ్యూహాలు, నిర్వహణపట్ల ఏడీఐఏకున్న విశ్వాసానికి పెట్టుబడులు నిదర్శనమని వ్యాఖ్యానించారు. అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న మార్కెట్లో పటిష్ట వృద్ధిని సాధిస్తున్న కంపెనీ రిలయన్స్ రిటైల్ అంటూ ఏడీఏఐ పీఈ విభాగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హమద్ షావాన్ అల్దాహెరీ పేర్కొన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

7-10-2023	
విశాఖ	534–00
చిత్తూరు	533–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	526–00
విజయవాడ	526–00
రిటైల్ ధర (డజను)	72.00
6-10-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	500–00
వరంగల్	502–00
రిటైల్ ధర	5.60

నిధుల సమీకరణలో పీట్రాన్

కొత్త ఉత్పత్తుల ఆవిష్కరణ



సీఈవో అమీన్ ఖ్వాజా

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: లిస్టెడ్ సంస్థ పాల్‌రెడ్ టెక్నాలజీస్‌లో భాగమైన పీట్రాన్ తాజాగా రూ. 30 కోట్ల నిధుల సమీకరణ యత్నాల్లో ఉంది. ప్రస్తుత ఇన్వెస్టర్ల నుంచి వచ్చే ఆరు నెలల్లో ఈ మొత్తాన్ని సమకూర్చుకోనున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు, సీఈవో అమీన్ ఖ్వాజా తెలిపారు. దీన్ని మార్కెటింగ్, ఆర్అండ్‌డీ, తయారీ కార్యకలాపాలకు వినియోగించనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటిదాకా రూ. 47 కోట్లు సమీకరించినట్లు విలేకరుల సమావేశంలో చెప్పారు. గత ఆర్థిక సంవత్సరం తమ టర్నోవర్ రూ. 147 కోట్లు ఉండగా ఈసారి రూ. 220 కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రిఫ్లెక్ట్ ప్రో స్మార్ట్‌వాచ్, జెన్‌బడ్స్ వన్ ఇయర్‌బడ్స్‌ను పీట్రాన్ ఆవిష్కరించింది. ఇయర్‌బడ్స్ ప్రత్యేక ధర రూ. 999గా ఉంటుందన్నారు.

రూ. 449కి బేస్‌బడ్స్..

పండుగ సీజన్ సందర్భంగా అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ నిర్వహిస్తున్న సేల్‌లో తమ ఉత్పత్తులపై భారీ ఆఫర్లు ఇస్తున్నట్లు ఖ్వాజా చెప్పారు. ఇందులో భాగంగా రూ. 799 విలువ చేసే పీట్రాన్ బేస్‌బడ్స్ డ్యుయోను రూ. 449కే అందిస్తున్నట్లు పేర్కొన్నారు. వైర్‌లెస్ ఇయర్‌బడ్స్, నెక్‌బ్యాండ్స్, హెడ్‌ఫోన్స్, స్మార్ట్‌వాచీలు, చార్జర్లు మొదలైన ప్రీమియం ఉత్పత్తులను అందుబాటు ధరలో రూ. 449 నుంచి రూ. 1,199 శ్రేణిలో అందిస్తున్నట్లు వివరించారు.

8 నుంచి జియో మార్ట్ ఉత్సవ్

ముంబై: రిలయన్స్ జియో మార్ట్ పండుగ సీజన్ సందర్భంగా 'జియో ఉత్సవ్' పేరుతో సేల్ ఆఫర్ ప్రకటించింది. ప్రముఖ క్రికెటర్ ధోని ప్రచారకర్తగా వ్యవహరించే ఈ సేల్ వేడుకలు అక్టోబర్ 8 నుంచి ప్రారంభం అవుతాయి. ఎలక్ట్రానిక్స్ ఉపకరణాలు, కిచెన్ ఉత్పత్తులు, ఫ్యాషన్–లైఫ్‌స్టైల్, బ్యూటీ, ఎఫ్ఎంసీజీ, కిరాణా, వినిమయ ఉత్పత్తులపై 50% నుంచి 80% వరకు ఆఫర్ ఇస్తుంది. ఈ విభాగాల్లో ప్రతి 24 గంటలకు ఫ్లాష్ డీల్స్ అందిస్తుంది. స్మార్ట్‌ఫోన్లు, యాక్సెసరీలపై 80% మినహాయింపు ఇస్తోంది. రెండు రోజుల్లో ఉచిత ఇన్‌స్టాలేషన్, ఏడాది వరకు నో కాస్ట్ ఈఎంఐలు, ఉచిత డెలవరీనీ అందిస్తుంది. స్మార్ట్‌ఫోన్లపై రూ.15వేల వరకు ఎక్స్ఛేంజ్ ప్రయోజనాలు పొందవచ్చు.



సినిమా

రిపీట్టే...



• కియారా అద్వానీ, రామ్‌చరణ్



• సాయిపల్లవి, నాగచైతన్య



• విజయ్ దేవరకొండ, రష్మికా మందన్నా

ఒక సినిమాలో హీరో–హీరోయిన్ మధ్య కెమిస్ట్రీ వర్కవుట్ అయితే మళ్లీ ఆ జంటను చూడాలని ప్రేక్షకులు కోరుకుంటారు. అయితే ఆ జంటకి మ్యాచ్ అయ్యే కథ దొరకాలి.. ఆ కథకు ఈ ఇద్దరినే హీరో–హీరోయిన్‌గా తీసుకోవాలనే ఆలోచన డైరెక్టర్‌కి రావాలి. ఇలా కొన్ని జంటలకు కథ కుదిరింది.ఆ కాంబినేషన్ రిపీట్ చేస్తే బాగుండనే ఆలోచన డైరెక్టర్‌కీ వచ్చింది. 'రిపీట్టే..' అంటూ మళ్లీ స్క్రీన్ షేర్ చేసుకుంటున్న ఆ జంటలు చేస్తున్న చిత్రాల గురించి...

• 'వినయ విధేయ రామ' చిత్రంతో ఆకట్టుకున్న హీరో రామ్‌చరణ్–హీరోయిన్ కియారా అద్వానీ 'గేమ్ చేంజర్' కోసం రెండోసారి జోడీ కట్టారు. ఈ చిత్రానికి శంకర్ దర్శకుడు. 'భరత్ అనే నేను' (2018) సినిమాతో కియారా టాలీవుడ్‌కి ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత బోయపాటి శ్రీను దర్శకత్వం వహించిన 'వినయ విధేయ రామ' (2019) లో రామ్ చరణ్‌కి జోడీగా నటించారామె. ఈ ఇద్దరి మధ్య మంచి కెమిస్ట్రీ కుదిరింది. ఇక ఈ ఇద్దరూ జత కట్టిన తాజా చిత్రం 'గేమ్ చేంజర్'ని 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. పొలిటికల్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం రూపొందుతోంది.

• 'లవ్‌స్టోరి' (2021)తో ప్రేక్షకులకు అందమైన ప్రేమకథని చూపించారు హీరో నాగ చైతన్య–హీరోయిన్ సాయిపల్లవి. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో నాగ చైతన్య, సాయిపల్లవి జోడీకి మంచి మార్కులు పడ్డాయి. ఈ జంట రెండేళ్లకు రెండోసారి జోడీగా నటిస్తున్నారు. 'ప్రేమమ్' (2016), 'సవ్యసాచి' (2018) చిత్రాల తర్వాత హీరో నాగచైతన్య–డైరెక్టర్ చందు మొండేటి కాంబినేషన్‌లో మూడో సినిమా రూపొందుతోంది. అల్లు అరవింద్ సమర్పణలో 'బన్నీ' వాసు నిర్మిస్తున్న ఈ సినిమా త్వరలో సెట్స్‌పైకి వెళ్లనుంది. ఈ సినిమాలో నాగచైతన్యకి జోడీగా సాయి పల్లవి నటించనున్నారు. చైతు–సాయి పల్లవి తొలిసారి జత కట్టిన 'లవ్‌స్టోరి' లానే తాజా చిత్రం కూడా ప్రేమ ప్రధానాంశంగా సాగుతుంది.



• నితిన్, రష్మిక

• 'భీష్మ' వంటి హిట్ సినిమా తర్వాత నితిన్–రష్మికా మందన్నా రెండోసారి నటించనున్న సంగతి తెలిసిందే. వెంకీ కుడుముల దర్శకత్వం వహించిన 'భీష్మ' (2020) చిత్రంలో నితిన్– రష్మిక తొలిసారి కలిసి నటించారు. ఈ చిత్రం మంచి విజయం సాధించింది. ప్రత్యేకించి నితిన్–రష్మిక డ్యాన్స్‌లు ప్రేక్షకులను అలరించాయి. ఇక వెంకీ కుడుముల దర్శకత్వం వహించిన 'ఛలో' చిత్రం ద్వారానే రష్మిక తెలుగు తెరకు పరిచయం అయిన సంగతి గుర్తుండే ఉంటుంది. ఆ విధంగా నితిన్–రష్మిక–వెంకీ కుడుముల.. ఈ ముగ్గురి కాంబినేషన్‌లో తాజాగా రెండో సినిమా రూపొందుతోందని చెప్పొచ్చు. నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ ఈ సినిమాని నిర్మిస్తున్నారు. అయితే ఈ చిత్రం నుంచి రష్మికా మందన్న తప్పుకున్నట్లు వార్తలొస్తున్నాయి. 'పుష్ప'తో పాన్ ఇండియా రేంజ్‌లో గుర్తింపు తెచ్చుకున్న రష్మిక ప్రస్తుతం తెలుగు, హిందీ చిత్రాలతో బిజీగా ఉన్నారు. ఈ కారణంగా డేట్స్ సర్దుబాటు కాకపోవడంతో ఈ మూవీ నుంచి తప్పుకున్నారట. ఆమె స్థానంలో శ్రీలీల అవకాశం అందుకున్నారని టాక్. ఈ వార్తపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

• 'గీత గోవిందం'(2018), 'డియర్ కామ్రేడ్' (2019) వంటి చిత్రాల తర్వాత విజయ్ దేవరకొండ–రష్మికా మందన్నా ముచ్చటగా మూడోసారి కలిసి నటించనున్నారని టాక్. విజయ్ దేవరకొండ హీరోగా 'జెర్సీ' ఫేమ్ గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో 'వీడీ 12' (వర్కింగ్ టైటిల్) చిత్రం తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో తొలుత హీరోయిన్‌గా శ్రీ లీలను ఫిక్స్ చేశారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్‌పై రూపొందుతున్న ఈ సినిమా పూజా కార్యక్రమాల్లో కూడా ఆమె పాల్గొన్నారు. అయితే వరుస సినిమాలతో డేట్స్ అడ్జస్ట్ చేయలేక 'వీడీ 12' ప్రాజెక్ట్ నుండి శ్రీ లీల తప్పుకున్నట్లు టాక్. దీంతో చిత్ర యూనిట్ రష్మికా మందన్నాని సంప్రదించగా... ఈ బ్యూటీ పచ్చజెండా ఊపారని తెలుస్తోంది. ఇదే నిజం అయితే విజయ్–రష్మిక కలిసి నటించనున్న మూడో చిత్రం ఇదే అవుతుంది. అయితే నితిన్ సినిమా నుంచి రష్మిక తప్పుకోవడంతో ఆ ప్లేస్‌ని శ్రీ లీల భర్తీ చేశారని, విజయ్ దేవరకొండ సినిమా నుంచి శ్రీ లీల తప్పుకుంటే ఈ ప్రాజెక్ట్‌లోకి రష్మిక ఎంట్రీ ఇచ్చారనే వార్తలపై అధికారిక ప్రకటనలు రావాల్సి ఉంది.



• కల్యాణ్ రామ్, సంయుక్తా మీనన్

• 'బింబిసార' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత హీరో కల్యాణ్ రామ్–హీరోయిన్ సంయుక్తా మీనన్ 'డెవిల్' సినిమా కోసం రెండోసారి జోడీ కట్టారు. వశిష్ఠ దర్శకత్వంలో కల్యాణ్ రామ్–సంయుక్తా మీనన్ జంటగా నటించిన తొలి చిత్రం 'బింబిసార' (2022). ఈ చిత్రవిజయంతో హిట్ పెయిర్ అనిపించుకున్న కల్యాణ్ రామ్–సంయుక్తా మీనన్ తాజాగా 'డెవిల్'లో నటిస్తున్నారు. దేవాన్ష్ నామా సమర్పణలో పీరియాడిక్ స్పై థ్రిల్లర్‌గా అభిషేక్ నామా స్వీయ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ సినిమా నవంబర్ 24న రిలీజ్ కానుంది.

ఇలా రిపీట్ అవుతున్న జంటలు ఇంకొన్ని ఉన్నాయి.

ఇండియన్ సైన్ లాంగ్వేజ్‌లో టైగర్



• రవితేజ

రవితేజ హీరోగా నటించిన తాజా చిత్రం 'టైగర్ నాగేశ్వరరావు'. వంశీ దర్శకత్వంలో అభిషేక్ అగర్వాల్ నిర్మించిన ఈ చిత్రంలో నూపుర్ సనన్, గాయత్రీ భరద్వాజ్ హీరోయిన్లు. ఈ చిత్రం ఈ నెల 20న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీలో విడుదలవుతోంది. ఈ చిత్రాన్ని ఇండియన్ సైన్ లాంగ్వేజ్‌లో (భారతీయ సంకేత భాష) కూడా విడుదల చేస్తున్నట్లు అభిషేక్ అగర్వాల్ ప్రకటించారు. ''భారత దేశంలోనే సైన్ భాషలో విడుదలైన తొలి ట్రైలర్ మా 'టైగర్ నాగేశ్వరరావు' చిత్రానిదే. ఎక్కువ మంది ప్రేక్షకులకు చేరువ చేయాలని సైన్ లాంగ్వేజ్‌లో కూడా మా చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్, కెమెరా: ఆర్ మది.

సరదా చికెన్



• రవి, విషికా

రవి మహాదాస్యం, విషికా లక్ష్మణ్ జంటగా రాజశేఖర్ సుద్మూన్ దర్శకత్వం వహించిన చిత్రం 'సగిలేటి కథ'. హీరో నవదీప్ సి–స్పేస్ సమర్పణలో షేడ్ ఎంటర్‌టైన్మెంట్, అశోక్ ఆర్ట్స్ బ్యానర్‌లో దేవీప్రసాద్ బలివాడ, అశోక్ మిట్టపల్లి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 13న విడుదల కానుంది. జశ్వంత్ పసుపులేటి సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'చికెన్..' అంటూ సాగే సరదా పాటని దర్శకులు వెంకటేశ్ మహా, సందీప్ రాజ్ విడుదల చేసి, సినిమా విజయం సాధించాలన్నారు. నవదీప్ మాట్లాడుతూ– ''ఈ సినిమాలో రోషం రాజు పాత్రంటే నాకు ఇష్టం. ఇందులోని వినోదం ప్రేక్షకులను నవ్విస్తుంది'' అన్నారు. ''రాయలసీమ పల్లెటూరి నేపథ్యంలో ఈ చిత్రకథ సాగుతుంది. మా సినిమా కూడా 'బలగం' స్థాయిలో హిట్ అవుతుందని నమ్ముతున్నాను'' అన్నారు రాజశేఖర్ సుద్మూన్.

ప్రతి మహిళా చూడాలి



• ఎస్తేర్

ఎస్తేర్ లీడ్ రోల్‌లో నటిస్తున్న లేడీ ఓరియంటెడ్ ఫిల్మ్ 'లేతాకులు'. చంటి గాణమని దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో శృతీ శరణ్, అవయుక్త, వంశీ పాండ్య కీలక పాత్రధారులు. ఎమ్ఆర్ చౌదరి వడ్లపట్ల సమర్పణలో వెంకటేశ్ చిక్కాల నిర్మిస్తున్నారు. తొలి సీన్‌కి నిర్మాత మోహన వడ్లపట్ల కెమెరా స్విచ్చాన్ చేయగా, బీసీ కమిషన్ చైర్మన్ వకలాబరణం కృష్ణమోహన్ క్లాప్ ఇచ్చారు. డైరెక్టర్ సముద్ర గౌరవ దర్శకత్వం వహించగా, రచయిత 'తమ్ముడు' సత్యం స్క్రిప్ట్‌ని అందించారు. ''స్త్రీలకు మా సినిమా నచ్చుతుంది'' అన్నారు వెంకటేశ్ చిక్కాల, ఎమ్ఆర్ చౌదరి వడ్లపట్ల. ''నూతిలో కప్పలు' తర్వాత నేను చేస్తున్న సినిమా 'లేతాకులు'' అన్నారు చంటి గాణమని. ''ప్రతి మహిళ చూడాల్సిన చిత్రమిది'' అన్నారు ఎస్తేర్.

బబుల్ గమ్



• రోషన్ కనకాల, మానస

నటుడు రాజీవ్ కనకాల, యాంకర్ సుమ తనయుడు రోషన్ కనకాల హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'బబుల్‌గమ్'. 'క్షణం, కృష్ణ అండ్ హిజ్ లీల' చిత్రాల ఫేమ్ రవికాంత్ పేరెపు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం ద్వారా మానసా చౌదరి హీరోయిన్‌గా ఎంట్రీ ఇస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీతో కలిసి మహేశ్వరి మూవీస్ నిర్మిస్తున్న 'బబుల్‌గమ్' ఫస్ట్ లుక్‌ను ప్రముఖ దర్శకుడు రాజమౌళి రిలీజ్ చేసి, ''రోషన్ తనకంటూ ఓ ప్రత్యేక ముద్ర వేయాలి. రాజీవ్, సుమ గర్వపడేలా చేయాలని కోరుకుంటున్నాను'' అన్నారు. ''చక్కని ప్రేమకథా చిత్రమిది'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: శ్రీచరణ్ పాకాల, కెమెరా: సురేష్ రగుతు.

ప్రతి తండ్రినీ కదిలించే పాట

నాని, మృణాల్ ఠాకూర్ జంటగా నటిస్తున్న చిత్రం 'హాయ్ నాన్న'. శౌర్యువ్ దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రంలో నాని కూతురు పాత్రలో బేబీ కియారా ఖన్నా నటిస్తున్నారు. మోహన్ చెరుకూరి, డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల నిర్మాతలు. హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'గాజు బొమ్మ...' అంటూ సాగే రెండో పాటని హీరో మహేశ్‌బాబు విడుదల చేసి, 'నన్ను కదిలించినట్లే ప్రతి తండ్రిని హత్తుకునే పాట 'గాజు బొమ్మ...'' అన్నారు. ''తండ్రీకూతుళ్ల అందమైన, భావోద్వేగ ప్రయాణాన్ని చూపిస్తుందీ చిత్రం. 'గాజు బొమ్మ..' పాటని హేషమ్ స్వరపరచడంతో పాటు పాడారు. అనంత శ్రీరామ్ చక్కని సాహిత్యం అందించారు. డిసెంబర్ 21న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తాం'' అన్నారు మేకర్స్.



• బేబి కియారా, నాని



• తలసాని శ్రీనివాస్ యాదవ్‌ని సన్మానిస్తున్న నిర్మాతలు

ఏ కష్టం వచ్చినా ముందుంటాను

– మంత్రి తలసాని

''నా పుట్టినరోజు వేడుకలను ఇంత భారీగా నిర్వహిస్తారని ఊహించలేదు. ఇందుకు తెలుగు చలన చిత్ర పరిశ్రమకు కృతజ్ఞతలు. నన్ను ఆశీర్వదించటానికి ఇన్ని వేల మంది రావడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నా'' అన్నారు తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్. శుక్రవారం (అక్టోబర్ 6) ఆయన పుట్టినరోజు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో తెలుగు చలనచిత్ర పరిశ్రమ ఆధ్వర్యంలో బర్త్ డే వేడుకలు జరిగాయి. ఈ వేడుకలో తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ– ''చిత్ర పరిశ్రమకు ఏ కష్టం వచ్చినా ముందుంటాను. ముఖ్యమంత్రి కేసీఆర్‌గారు కూడా ఇండస్ట్రీ సమస్యల పరిష్కారం పట్ల సానుకూలంగా ఉంటారు'' అన్నారు. తన తండ్రిపై రాయించిన ఓ పాటను తలసాని శ్రీనివాస్ యాదవ్ తనయుడు సాయి యాదవ్ రిలీజ్ చేశారు. సి. కల్యాణ్, దామోదర ప్రసాద్, 'దిల్' రాజు, ఎస్. రాధాకృష్ణ పాల్గొన్నారు.

స్వామివార్ల భూముల వేట

క్షుణ్ణంగా పరిశీలిస్తున్న దేవదాయశాఖ | జగనన్న సమగ్ర భూ సర్వేతో అనుసంధానం | లెక్క తేల్చే పనిలో యంత్రాంగం | మండల దేవదాయ అధికారుల నియామకం

సాక్షిప్రతినిధి, కాకినాడ

అన్యాక్రాంతమైన దేవదాయశాఖ భూముల కోసం వేట మొదలైంది. చిన్నా, పెద్దా అనే తారతమ్యం లేకుండా అన్ని ఆలయాల్లో రెక్కలు వచ్చిన భూములకు లెక్కలు కట్టి ఆలయాలకు అప్పగించే పని వేగంగా జరుగుతోంది. ఆక్రమణలకు గురైన, అన్యాక్రాంతమైన భూముల లెక్కలు తీస్తున్నారు. ఇందుకోసం దేవదాయశాఖపై పట్టు ఉన్న సీనియర్‌లను ఎంపిక చేశారు. వారి నుంచి ప్రతి మండలానికి ఒక అధికారిని నియమించారు. వారికి రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న సమగ్ర భూ సర్వే బృందాలను సమన్వయం చేసుకునేలా బాధ్యతలు అప్పగించారు. మండల దేవదాయ అధికారులు ఆయా మండలాల పరిధిలోని ఆలయాలకు రికార్డుల ప్రకారం ఎంత భూములు ఉన్నాయి, ఎక్కడెక్కడ ఉన్నాయి అనే వివరాలను రెవెన్యూ బృందాలకు అందజేస్తున్నారు. సర్వే నంబర్ ఆధారంగా భూములు ఏయే ప్రాంతాల్లో ఉన్నాయో లెక్క తేలుస్తున్నారు. ఎకరాలకు ఎకరాలున్నా కొన్ని ఆలయాలు ధూపదీప నైవేద్యాలకు నోచుకోని పరిస్థితులున్నాయి. ఆస్తులున్నా అన్యాక్రాంతమైన భూములను ఆక్రమణల చెర నుంచి విడిపించేందుకు జగనన్న సమగ్ర భూ సర్వే దోహదపడుతోంది. స్వాతంత్య్రం వచ్చాక చరిత్రలో దేవదాయ భూములు రికార్డుల ప్రకారం లెక్క తేల్చడం, ఆక్రమణల్లో ఉన్న వాటిని వెలుగులోకి తేవడం ఇదే తొలిసారి కావడం విశేషంగా చెప్పుకుంటున్నారు.

జగనన్న సమగ్ర భూ సర్వేతో తేలుతున్న లెక్కలు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆక్రమణల్లో ఉన్న దేవదాయ భూముల లెక్క తేల్చడంలో అటు దేవదాయశాఖ, ఇటు రెవెన్యూ యంత్రాంగం బిజీగా ఉంది. సమగ్ర భూ సర్వేలో ఇప్పటికే ప్రాథమిక సమాచారం కొంతవరకు దేవదాయశాఖ చేతికొచ్చింది. ఆ భూములు ఏయే ప్రాంతాల్లో ఉన్నాయి అనేది నిర్దిష్టంగా తేల్చేందుకు కుస్తీ పడుతున్నారు. దీంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మండలాల వారీగా ఆలయాలు, వాటి ఆధీనంలో ఉండాల్సిన భూముల జాబితా సిద్ధమవుతోంది. కాకినాడ జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రాల భూములు అన్యాక్రాంతానికి గురయ్యాయి. కొన్ని ఆలయాలకు సంబంధించి భూములు ఎక్కడ ఉన్నాయో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. ఆక్రమణలో ఉన్న భూములను వెలుగులోకి తెచ్చి ఆలయాలను అభివృద్ధి చేయాలని ఎన్నో ఏళ్లుగా భక్తులు డిమాండ్ చేస్తున్నారు. కానీ గత పాలకులు భక్తుల డిమాండ్‌లను పెడచెవిన పెడుతూ వచ్చారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సమగ్ర భూ సర్వే నిర్వహిస్తుండటంతో స్వాతంత్య్రానంతరం తొలిసారి భూముల లెక్కలు తేలుతున్నాయి. దేవాదాయ భూములకు కూడా మోక్షం కలిగే అవకాశం ఈ సర్వే ద్వారా దక్కుతోంది.



కాకినాడ జిల్లాలో ఇలా..

కాకినాడ జిల్లాలో ఆక్రమణలో ఉన్న ప్రముఖ ఆలయాల భూములు ఇటీవల సర్వేలో గుర్తించారు. కాకినాడ సర్పవరం భవన్నారాయణస్వామి ఆలయానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లో చాలా చోట్ల భూములున్నాయి. ఈ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆలయానికి 297 ఎకరాల భూమి ఉంది. ఇందులో ఆక్రమణలలో ఉన్న భూమి 180 ఎకరాలకు పైనే ఉందని ఈ సమగ్ర భూ సర్వేలో గుర్తించారు. కాకినాడ జగన్నాథపురం మల్లాడి సత్యలింగనాయకర్ (ఎంఎస్‌ఎన్) చార్టీస్‌కు రికార్డుల ప్రకారం 1,271 ఎకరాల భూమి ఉంది. ఇందులో 160 ఎకరాలు ఆక్రమణకు గురైనట్టుగా తేల్చారు. జగ్గంపేట నియోజకవర్గం గండేపల్లి మండలం తాళ్లూరులోని వేంకటేశ్వరస్వామి ఆలయానికి రికార్డుల ప్రకారం 151 ఎకరాల భూమి ఉంది. కానీ వాస్తవంగా పరిశీలించి సర్వే నిర్వహిస్తే మొత్తం 151 ఎకరాలు ఆక్రమణలో ఉందని ప్రాథమికంగా తేల్చారు.

దేవాలయాలు, సత్రాలు:
548
మొత్తం భూమి:
9,977 ఎకరాలు
సమగ్ర భూ సర్వేలో వెలుగులోకి వచ్చింది:
1,420 ఎకరాలు
ఆక్రమణలో ఉన్న భూమి:
541 ఎకరాలు



కోనసీమలోనూ శఠగోపం

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో కూడా పలు ఆలయాల భూములు ఆక్రమణల చెరలో ఉన్నట్టు గుర్తించారు. అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయ భూములు ఎన్నో ఏళ్లుగా ఆక్రమణలోనే ఉన్నాయి. లక్ష్మీనరసింహస్వామికి రూ.కోట్ల విలువైన సుమారు 930 ఎకరాలు ఉన్నాయి. వీటిలో 726 ఎకరాలు సఖినేటిపల్లి మండలం కేశవదాసుపాలెం, అంతర్వేది, గొంది, శృంగవరప్పాడు గ్రామాల్లోనే ఉన్నాయి. సుమారు 2,000 మంది రైతుల చేతుల్లోనే ఈ భూములున్నాయి. మరో 125ఎకరాల్లో రొయ్యల చెరువులు సాగవుతున్నాయి. ఈ భూములకు చిల్లిగవ్వ శిస్తు వసూలు కావడం లేదు. కోనసీమ జిల్లాతో పాటు పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల్లో విస్తరించి ఉన్న ఈ ఆలయ భూములు ఆక్రమణ చెరలో ఉన్నట్టుగా సమగ్ర భూ సర్వేలో ప్రాథమికంగా నిర్ధారించారు. ఇదే జిల్లాలో వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆస్తులు కూడా ఆక్రమణదారుల చేతుల్లో ఉన్నాయి.

దేవాలయాలు, సత్రాలు:
704
మొత్తం భూములు:
13,849 ఎకరాలు
ఆక్రమణలో ఉన్న భూమి :
434 ఎకరాలు



తూర్పులో పలు ఆక్రమణలు

తూర్పుగోదావరి జిల్లా కేంద్ర రాజమహేంద్రవరం సహా పలు మండలాల్లోని ఆలయాల భూముల లెక్కలు నిగ్గు తేలాల్సి ఉంది. రాజమహేంద్రవరంలోని కోటిలింగాలక్షేత్రం, ఉమారామలింగేశ్వరస్వామి, హితకారిణి సమాజం భూములపై సమగ్ర సర్వే జరుపుతున్నారు. ఈ ఆలయాలకు సంబంధించిన భూములు కడియం, నిడదవోలు, రాజానగరం, తుని తదితర ప్రాంతాల్లో ఆక్రమణల్లో ఉన్నట్టు గుర్తించారు. జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రం కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయ భూములకు కూడా రెక్కలు వచ్చాయి. ధూపదీప నైవేద్యాల కోసం వివిధ ప్రాంతాల్లో ఉన్న దాతలు ఇచ్చిన 1,620 ఎకరాలలో ప్రస్తుతం 13 ఎకరాలు మాత్రమే మిగిలి ఉంది. మిగిలిన భూమి పలు రకాలుగా ఆక్రమణలకు గురైంది. వీటిలో శాశ్వత భవనాలు నిర్మించేశారు. సమగ్ర భూ సర్వేలో ఈ భూముల వివరాలు బయటపడాల్సి ఉంది.

దేవాలయాలు, సత్రాలు:
923
మొత్తం భూమి :
15,900 ఎకరాలు
ఆక్రమణలో ఉన్న భూమి :
905 ఎకరాలు

భూములను నిషేధిత జాబితాలో పెడుతున్నాం



జగనన్న శాశ్వత భూ సర్వే ద్వారా దేవదాయశాఖ పరిధిలోని ఆలయాలు, సత్రాలు, మఠాలకు చెందిన భూమి వెలుగులోకి వస్తోంది. రెవెన్యూ రికార్డుల ప్రకారం ఆ భూములు దేవదాయశాఖకు చెందినదిగా ఉండడంతో వాటిని నిషేధిత జాబితాలో చేరుస్తున్నాం. ఇటీవల ప్రభుత్వం కొత్తగా ఇచ్చిన ఆర్డినెన్స్ ప్రకారం దేవదాయశాఖకు చెందిన భూములు ఎవరివద్దనైనా ఉంటే స్వాధీనం చేసుకునేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఆలయాలు, మఠాలు, సత్రాలకు ఎంతో ఉపయోగం. ప్రభుత్వం ఇచ్చిన ఆర్డినెన్స్‌తో దేవదాయశాఖ భూములకు మరింత రక్షణ వచ్చింది.

– మేడేపల్లి విజయరాజు, దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్

ప్రభుత్వ నిర్ణయం సరైనదే



ఎన్నో ఏళ్లుగా దేవదాయశాఖకు చెందిన భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్ల ఆయా భూములు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. ప్రస్తుతం ప్రభుత్వం చేస్తోన్న జగనన్న భూసర్వేలో దేవదాయశాఖకు చెందిన, ఆక్రమించిన భూములు బయటపడుతున్నాయి. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఆయా ఆలయాలు, సత్రాల భూములకు రక్షణ కల్పించినట్లయ్యింది.

– మామిళ్లపల్లి అయ్యప్ప శర్మ, అర్చక పురోహిత సంఘం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



గుంటూరు జిల్లాలో లంక భూములు ఇవీ..	గ్రామం	విస్తీర్ణం(ఎకరాల్లో)	రైతులు
	అన్నవరం	67.72	182
	బొమ్మువాని పాలెంలో	182.56	228

కాలం కలిసొచ్చే

లంక కష్టాలు పటా'పంచ'లు



ఈయన పేరు అద్దేపల్లి జక్రయ్య. కొల్లిపర మండలం అన్నవరం గ్రామవాసి. ఈయనకు ఎకరం పొలం ఉంది. మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తుంటారు. ఎప్పుడు వరద వచ్చినా, గాలి వాన వచ్చినా పైసా కూడా వెనక్కి రావడం లేదు. వరదలు వచ్చి మునిగిపోయినప్పుడు నష్టపోయినా ప్రభుత్వ వెబ్‌ల్యాండ్‌లో నమోదు కాకపోవడంతో పంట నష్టం గానీ, ఇన్‌పుట్ సబ్సిడీ కూడా రావడం లేదు. ఇప్పుడు ఐదేళ్లకు పట్టాలు జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించడంతో పరిస్థితి మారనుంది. ఫలితంగా జక్రయ్య ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- లంక భూములకు ఐదేళ్ల లీజు
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వ వరం
- కొల్లిపర గ్రామాల్లో పూర్తయిన సర్వే
- 654 మంది రైతుల గుర్తింపు
- 245 ఎకరాలకు ఐదేళ్లకు పట్టాలు
- త్వరలో పంపిణీకి రంగం సిద్ధం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఇక కృష్ణానదీ లంక భూముల్లో వ్యవసాయం చేస్తున్న రైతుల కష్టాలు తీరనున్నాయి. వీరి బతుకులు బాగుచేసేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నడుం బిగించింది. ఇప్పటివరకు లంక భూముల్లోని రైతులకు పట్టాలు లేవు. దీనివల్ల వరదల సమయంలో నష్టపోతే పరిహారం రావడం లేదు. పంట రుణాలూ అందడం లేదు. ఈ పరిస్థితిని గమనించిన ప్రభుత్వం ఐదేళ్లకు లీజు పట్టాలు ఇవ్వాలని నిర్ణయించింది. దీంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

లంక భూముల్లో మూడు రకాలు

గుంటూరు జిల్లా పునర్విభజన తర్వాత కొల్లిపర మండలం అన్నవరం, బొమ్మువానిపాలెం గ్రామాల్లో మాత్రమే లంక భూములు ఉన్నాయి. వీటిల్లో రైతులు దశాబ్దాలుగా వ్యవసాయం చేసుకుంటున్నా పట్టాలు ఇవ్వడం సాంకేతికంగా కుదరని పరిస్థితి. నదీ పరీవాహక భూముల క్లాసిఫికేషన్‌లో మూడు రకాలు ఉన్నాయి. ఏ రకం కరకట్టకు దగ్గరగా ఉండి ముంపునకు గురికానివి. బీ రకం వరదలు వచ్చినప్పుడు కొద్దిపాటి ముంపునకు గురయ్యేవి. సీ రకం వరదొస్తే పూర్తిగా ముంపునకు గురయ్యేవి. కొల్లిపర మండలంలో ఉన్న లంక భూములన్నీ సీ కేటగిరి కిందకే వస్తాయి. వరదొస్తే ఈ భూములు పూర్తిగా మునిగిపోతాయి. దీంతో ఈ భూములకు వాల్టా చట్టం ప్రకారం పట్టాలు ఇవ్వడం కుదరదు. ఈ నేపథ్యంలో ఈ భూములను సర్వే చేసి వాటిని వెబ్‌ల్యాండ్‌లోకి ఎక్కించి రైతులకు ఐదేళ్లపాటు లీజుకు ఇవ్వాలని జిల్లాస్థాయి కమిటీలో నిర్ణయించారు. ప్రస్తుతం ఈ భూముల్లో పసుపు, అరటి, కాయగూరలు, కర్రపెండలం తదితర పంటలు పండిస్తూ వస్తున్నారు.

త్వర్వలోనే లీజు ఒప్పందాలు

లంక భూముల్లో ఉంటున్న వారికి త్వరలోనే ఐదేళ్లపాటు లీజు అగ్రిమెంట్ చేయనున్నాం. ఇప్పటికే లంక గ్రామంలో రెవెన్యూ, జలవనరుల శాఖ, రివర్ కన్సర్వేటర్‌తో సర్వే చేయించాం. 250.28 ఎకరాల్లో 410 మంది లబ్ధిదారులను గుర్తించాం. జిల్లా కమిటీలోనూ నిర్ణయం తీసుకున్నాం. వారికి లీజు అగ్రిమెంట్లు సిద్ధం చేస్తున్నాం.

–జి.రాజకుమారి, జాయింట్ కలెక్టర్

మంచిరోజులొస్తున్నాయ్

దశాబ్దాలుగా వ్యవసాయం చేస్తున్నా ఏనాడూ మమ్మల్ని పట్టించుకున్న వారు లేరు. వరదలొస్తే పంట పూర్తిగా దెబ్బతిని ఇబ్బందులు పడుతున్నాం. కనీసం నష్టపరిహారం గానీ, బ్యాంకు రుణాలు కానీ రాని పరిస్థితి ఉంది. లీజు అగ్రిమెంట్ ఇస్తే మా బతుకులు మారతాయని ఆశిస్తున్నాం.

– మునిపల్లిరాజు, అన్నవరం

ఉర్దూ సేవకులకు పురస్కారాలు

ఉర్దూ అకాడమీ సెక్రటరీ మస్తాన్ వలీ వెల్లడి

సాక్షి, అమరావతి: ప్రతి యేటా మాదిరిగానే ఈ ఏడాది కూడా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి కార్యక్రమాన్ని నవంబర్ 11న ఘనంగా నిర్వహించనున్నట్లు ఏపీ ఉర్దూ అకాడమీ సెక్రటరీ షేక్ మస్తాన్‌వలీ శుక్రవారం తెలిపారు. దేశ తొలి విద్యా శాఖ మంత్రిగా సేవలు అందించిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని ఉర్దూ భాషాభివృద్ధి, సాహిత్య, విభిన్న విభాగాల్లో అత్యుత్తమ సేవలు అందించిన వారికి పురస్కారాలు అందిస్తామని చెప్పారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జాతీయ స్థాయి పురస్కారం (రూ.1.25 లక్షలు నగదు, సర్టిఫికెట్, మెమెంటో), డాక్టర్ అబ్దుల్ హఖ్ ప్రాంతీయ స్థాయి పురస్కారం (రూ.లక్ష, సర్టిఫికెట్, మెమెంటో) అందిస్తామన్నారు. ఉర్దూ సాహితీవేత్తలకు, పండితులకు (స్కాలర్), కవులు, పాత్రికేయులు, విమర్శ, పరిశోధన, గద్య బోధన, ఉర్దూ సేవలు అందించిన ఆరుగురికి జీవిత సాఫల్య పురస్కారాలు, ఉత్తమ ఉపాధ్యాయ, ఉత్తమ విద్యార్థి పురస్కారం అందిస్తామని వివరించారు. ఉర్దూ అకాడమీ ద్వారా జారీ చేసిన దరఖాస్తులను పూర్తి చేసి ఈ నెల 31లోగా షేక్ మస్తాన్ వలీ, సెక్రటరీ, ఏపీ ఉర్దూ అకాడమీ, డోర్ నెంబర్ 76-1-6ఎ/1 మాళవిక విల్లా, హెచ్‌బీ కాలనీ,భవానిపురం, విజయవాడ-520012కు అందజేయాలని సూచించారు.

అగ్రిసెట్ పరీక్ష ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ శారదా జయలక్ష్మీదేవి

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ వర్సిటీ పరిధిలోని కళాశాలల్లో అగ్రిసెట్ పరీక్షల ఫలితాలను వర్సిటీ వీసీ డాక్టర్ ఆర్ శారదా జయలక్ష్మిదేవి శుక్రవారం విడుదల చేశారు. పరీక్షకు 2,006 మంది హాజరవ్వగా 1,994 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. వ్యవసాయ డిప్లమో కోర్సులో ఆర్.హేమంత్ కుమార్ అత్యధికంగా 119 మార్కులు సాధించగా, పి.రామప్రతాప్, వి.హరీష్ 118 మార్కులు సాధించారన్నారు. సేంద్రియ వ్యవసాయం పరీక్షలో ఎ.యశస్విని 107 మార్కులు సాధించగా, ఎం.లహరి 100 మార్కులు, సి.కార్తికేయ 98 మార్కులు సాధించి మొదటి, రెండు మూడు స్థానాల్లో నిలిచారన్నారు. విత్తన సాంకేతిక పరిజ్ఞానం పాలిటెక్నిక్ పరీక్షలో ఉపాసి బాలాజి, లౌడ్యా రాకేష్‌లు 106 మార్కులు, గొల్లపల్లి లీలా మాళవిక 96 మార్కులతో తొలి 3 స్థానాలు సాధించారన్నారు. మార్కుల కార్డ్‌లను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. వివరాలకు www.angeau.ac.inను సంప్రదించాలన్నారు.

కచ్చితంగా కలుస్తాయ్

టీడీపీతో బీజేపీ పొత్తు పెట్టుకుంటుంది: పవన్

- మేం ముగ్గురం మళ్లీ కలిసే పోటీ చేస్తాం
- బాబుపై వచ్చినవి అభియోగాలే.. అవినీతిపరుడని ఎలా అంటాం?
- బీజేపీతో జగన్‌కు సత్సంబంధాలేవీ లేవు
- ఓ రాష్ట్ర సీఎంకి కేంద్రం ఇచ్చే మర్యాదే అది



సాక్షి, అమరావతి: తెలుగుదేశం పార్టీతో బీజేపీ మరోసారి కచ్చితంగా పొత్తు పెట్టుకుంటుందని జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యానించారు. శుక్రవారం మంగళగిరిలోని జనసేన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. టీడీపీ – జనసేన పొత్తులో మీతో బీజేపీ కలిసి రాకుంటే ఎవరితో కలసి ఉంటారన్న ప్రశ్నకు ఆయన స్పందిస్తూ.. ' కచ్చితంగా వస్తారు...(బీజేపీని ఉద్దేశించి).. అది కచ్చితంగా జరుగుతుందని నాకు తెలుసు' అని బదులిచ్చారు. కొద్ది రోజుల క్రితం రాజమండ్రి జైలులో మాజీ సీఎం చంద్రబాబును కలిసిన వెంటనే టీడీపీ – జనసేన పొత్తుపై తాను ప్రకటన చేయడంపై పవన్ ప్రత్యేకంగా వివరణ ఇచ్చారు. వాస్తవానికి అది ఢిల్లీ నుంచే ప్రకటించాల్సి ఉండాల్సిందన్నారు. వైఎస్సార్‌సీపీ వ్యతిరేక ఓటు చీలకూడదని 2021 నుంచి తాను ఎప్పుడు ఢిల్లీ వెళ్లినా బీజేపీకి చెబుతూ వచ్చానన్నారు. ఢిల్లీలో జీ 20 సమ్మిట్‌లో అందరూ (బీజేపీ పెద్దలు) నిమగ్నమై అందుబాటులో లేనందున తానే నిర్ణయం తీసుకొని ప్రకటన చేసినట్లు తెలిపారు. 2014 మాదిరిగానే బీజేపీ – టీడీపీ – జనసేన కలిసి పోటీ చేయాలన్నది తన కోరిక అని వెల్లడించారు. తెలంగాణలో టీడీపీతో కలసి పోటీ చేసే అంశం తాను ఒక్కడినే తీసుకునే నిర్ణయం కాదని, అది వాళ్లు కూడ తీసుకోవాల్సిన నిర్ణయమని చెప్పారు.

రాగానే ఇంటికెళ్లి కలుస్తా..

మళ్లీ చంద్రబాబును ఎప్పుడు కలుస్తారు? అన్న ప్రశ్నకు పవన్‌కళ్యాణ్ స్పందిస్తూ 'రాగానే ఇంటికి వెళ్లి కలుస్తా. త్వరలో వస్తారని ఆశిస్తున్నా' అని పేర్కొన్నారు. చంద్రబాబు అరెస్టు వ్యవహారంలో బీజేపీ హస్తం ఉందనడం సరి కాదన్నారు. పైకి అలా కనిపిస్తున్నా అందులో నిజం లేదన్నారు. సమాఖ్య వ్యవస్థలో ఒక ముఖ్యమంత్రికి కేంద్రం ఇవ్వాల్సిన మర్యాదగానే ప్రధాని మోదీ – సీఎం జగన్ మధ్య సంబంధాన్ని చూడాలన్నారు. అంతేగానీ వారిద్దరి మధ్య ప్రత్యేకంగా సత్సంబంధాలేవీ లేవన్నారు. వైఎస్ జగన్‌పై ఉన్న కేసులను ఎత్తివేస్తే ఏమన్నా అనుమానపడాలి గానీ, కేసులన్నీ అలానే ఉన్నప్పుడు ఆ ప్రచారాన్ని తాము నమ్మడం లేదన్నారు. టీడీపీతో సీట్ల సర్దుబాటుకు ఇంకా చాలా సమయం ఉందన్నారు. జనసేన – టీడీపీ పొత్తుపై నాదెండ్ల మనోహర్ చైర్మన్‌గా మరో ఐదుగురు నాయకులతో సమన్వయ కమిటీ నియమించినట్లు తెలిపారు. చంద్రబాబు అరెస్టుపై సినిమా రంగం స్పందించకపోవడం వెనుక తమను టార్గెట్ చేస్తారేమోనన్న వంద సమస్యలు ఉంటాయని వ్యాఖ్యానించారు.

బాబుపై అభియోగాలే.. అవినీతిపరుడని ఎలా అంటాం?

చంద్రబాబుపై వచ్చినవి కేవలం అభియోగాలు మాత్రమేనని ఏసీబీ కోర్టు స్పష్టంగా పేర్కొందని, అలాంటప్పుడు దానికే ఆయన్ను అవినీతిపరుడని ఎలా అంటామని పవన్ కళ్యాణ్ ప్రశ్నించారు. 2014–19 మధ్య చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జరిగిన అవినీతిపై ప్రధాని మోదీతో పాటు పవన్ కళ్యాణ్ కూడా గతంలో చేసిన వ్యాఖ్యలను విలేకరులు ప్రస్తావించడంపై సూటిగా సమాధానం ఇవ్వకుండా దాటవేశారు. మళ్లీ అలాంటి ప్రభుత్వాన్నే తెస్తామని చెబుతున్నారా? అన్న విలేకరుల ప్రశ్నకు బదులివ్వలేదు.

వాస్తవాలపై 'ఉక్కుపాదం'

ఈనాడు అసత్య కథనంపై రాష్ట్ర ఉపాధి, శిక్షణ శాఖ డైరెక్టర్ ఆగ్రహం

రాష్ట్రంలో 29 మోడల్ కెరీర్ సెంటర్ల ప్రతిపాదనకు కేంద్రం ఆమోదం తెలిపింది
నేషనల్ కెరీర్ సర్వీసులో భాగంగా దశల వారీగా నిధులు విడుదల చేస్తోంది
ఇప్పటికే రూ.4.99 కోట్లతో 12 ఉపాధి కార్యాలయాలను ఎంసీసీలుగా మార్చాం
ఈ ఆర్థిక సంవత్సరంలో 516 జాబ్ మేళాల ద్వారా 28,362 మందికి ఉపాధి కల్పించాం
నిరుద్యోగులకు నిరంతర సేవలు అందిస్తున్నాం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఉపాధి కార్యాలయాల ద్వారా నిరుద్యోగులకు నిరంతరం సేవలు అందిస్తున్నట్లు ఉపాధి, శిక్షణ శాఖ డైరెక్టర్ బి.నవ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ కెరీర్ సర్వీసు(ఎన్‌సీఎస్) ప్రాజెక్టులో భాగంగా రాష్ట్రంలో 29 మోడల్ కెరీర్ సెంటర్ల(ఎంసీసీ) అభివృద్ధి ప్రతిపాదనకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపి, ప్రణాళికాబద్ధంగా నిధులు విడుదల చేస్తోందని పేర్కొన్నారు. కానీ, ఈనాడు పత్రిక వాస్తవాలను వక్రీకరిస్తూ 'ఉపాధిపై ఉక్కుపాదం' పేరుతో అసత్య కథనాన్ని వండివార్చిందని ఆమె మండిపడ్డారు. ఇప్పటికే ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.4.99 కోట్ల ఎన్‌సీఎస్ నిధులతో 12 ఉపాధి కార్యాలయాలకు మరమ్మతులు చేసి కంప్యూటర్ పరికరాలను సమకూర్చడంతోపాటు పూర్తిస్థాయిలో ఎంసీసీ సెంటర్లను అందుబాటులోకి తెచ్చామని వివరించారు. ఉపాధి కార్యాలయాలు/ఎంసీసీ కేంద్రాల్లో అభ్యర్థుల వ్యక్తిగత హాజరు మేరకే రిజిస్ట్రేషన్లు, రెన్యువల్ ప్రక్రియ జరుగుతుందన్న విషయాన్ని ఈనాడు పత్రిక గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. నిరుద్యోగులు తమ ధ్రువీకరణపత్రాలతో జిల్లా ఉపాధి కార్యాలయాల్లో అధికారులను సంప్రదిస్తే ఉచిత రిజిస్ట్రేషన్, కెరీర్ కౌన్సెలింగ్ అందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 2,07,971 మంది అభ్యర్థులు ఎన్‌సీఎస్ పోర్టల్‌లో నమోదు చేసుకున్నారని వివరించారు. ఈ డేటా ఆధారంగా ప్రణాళిక ప్రకారం ప్రతి నెలా ఉద్యోగ మేళాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఎంసీసీ, ఏపీఎస్ఎస్‌డీసీ, సీడాప్ సమన్వయంతో 516 జాబ్ మేళాలు నిర్వహించి 28,362 మందికి ఉపాధి కల్పించినట్టు వివరించారు. ఇప్పటికే కొత్త జిల్లాల్లోనూ ఎంసీసీల నిర్వహణ కోసం కార్యాలయాల ఎంపిక చేసి అధికారులను నియమించామని నవ్య స్పష్టంచేశారు.



తిరుపతి లోని మోడల్ కెరీర్ సెంటర్

హార్టీసెట్-2023 ర్యాంకుల విడుదల

మొదటి ర్యాంకు సి.అజయ్‌కుమార్ • తర్వాత రెండు స్థానాల్లో నిరీష, అమృత



హార్టీసెట్ ర్యాంకులను విడుదల చేస్తున్న ఉద్యాన వర్సిటీ వీసీ డాక్టర్ టి.జానకీరామ్ తదితరులు

తాడేపల్లిగూడెం: డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం హార్టీసెట్-2023 ర్యాంకులను వీసీ టి.జానకీరామ్ పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంలో శుక్రవారం విడుదల చేశారు. ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని ఉద్యాన పాలిటెక్నిక్‌లలో రెండు సంవత్సరాల కోర్సు పూర్తి చేసి, హార్టీకల్చర్ కామన్ ప్రవేశ పరీక్ష (హార్టీసెట్)కు 373 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వారిలో 365 మంది బీఎస్సీ హార్టీకల్చర్ నాలుగు సంవత్సరాల కోర్సులో ప్రవేశానికి అర్హత సాధించారు. ఈ హార్టీసెట్‌లో హార్టీకల్చర్ పాలిటెక్నిక్ మడకశిరలో చదివిన సి.అజయ్‌కుమార్‌కు మొదటి ర్యాంకు రాగా, హార్టీకల్చర్ పాలిటెక్నిక్ -ఎచ్చెర్లలో చదివిన జీవీ రెడ్డి నాగవర్ధన్ రమాదేవి నిరీషకు రెండో ర్యాంకు, మడకశిర పాలిటెక్నిక్ కళాశాలలో చదివిన సుదర్శన్‌గారి అమృతకు మూడో ర్యాంకు వచ్చాయి. ఈ హార్టీ సెట్ ద్వారా నాలుగు ప్రభుత్వ, నాలుగు ప్రైవేటు ఉద్యాన కళాశాలలోని 92 సీట్లను మెరిట్, స్థానికత, సామాజిక అంశాల ఆధారంగా ప్రభుత్వ నియమ నిబంధనలకు లోబడి భర్తీ చేస్తారు. త్వరలోనే ఇందుకోసం కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.

డిసెంబర్ నెలాఖరుకు స్టేట్ ఫుడ్ లేబొరేటరీ ప్రారంభం

రూ.25 కోట్లతో అత్యాధునిక పరికరాలతో విశాఖలో ఏర్పాటు

సాక్షి, అమరావతి: ఈ ఏడాది డిసెంబర్ నెలాఖరులోగా విశాఖలో రాష్ట్ర స్థాయి ఫుడ్ లేబొరేటరీ కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. అత్యాధునిక పరికరాలతో దీనిని అభివృద్ధి చేస్తున్నారు. రాష్ట్ర విభజన అనంతరం ఏపీకి ప్రత్యేకంగా ఫుడ్ లేబొరేటరీ లేదు. ప్రజారోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ కలిగిన సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం ఆహార కల్తీ నియంత్రణపై దృష్టి పెట్టింది. ఈ క్రమంలో రాష్ట్రంలోనే లేబొరేటరీ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. విశాఖపట్నంలోని రీజినల్ ఫుడ్ లేబొరేటరీని స్టేట్ లేబొరేటరీగా ఆధునీకరిస్తున్నారు. ఈ ఏడాది మార్చి నెలలో ప్రభుత్వం దీనిని నోటిఫై చేసింది. రూ.25 కోట్లతో ఫుడ్ సేఫ్టీ, స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) సహకారంతో ఆధునిక లేబొరేటరీ ఏర్పాటు చేస్తున్నారు. సుశిక్షితులైన సిబ్బందిని నియమిస్తున్నారు. రెస్టారెంట్‌లు, హోటళ్లలో తనిఖీలు చేసినప్పుడు, ఫుడ్ పాయిజన్ ఘటనలు జరిగినప్పుడు ఫుడ్ సేఫ్టీ అధికారులు శాంపిళ్లు సేకరించి ఈ లేబొరేటరీకి పంపిస్తారు. ఈ ఆహార పదార్థాల్లో లోహాలు, పురుగు మందులు, యాంటీబయాటిక్, ఔషధ అవశేషాలు, సహజంగా సంభవించే విష పదార్థాలు, కల్తీని పరీక్షిస్తారు. తద్వారా నాసిరకం ఆహారాన్ని, ఆహార కల్తీని అరికట్టవచ్చు.

ఈ నెలలో సిబ్బంది నియామకం

రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ డైరెక్టర్ ఎస్.పూర్ణచంద్ర రావు

స్టేట్ లేబొరేటరీ పనులు వేగంగా జరుగుతున్నాయి. సిబ్బంది నియామకం ఈ నెలలో పూర్తి అవుతుంది. పరికరాలు కూడా సమకూరుస్తున్నాం. హైదరాబాద్‌లో ఉన్న ల్యాబ్‌తో కుదుర్చుకున్న 10 ఏళ్ల ఎంవోయూ త్వరలో ముగియనుంది. ఆ లోగా మన ల్యాబ్ అందుబాటులోకి వస్తుంది.

11న 'డిప్లొమా' మాన్యువల్ స్పాట్ కౌన్సెలింగ్

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల్లో సేంద్రియ వ్యవసాయం, విత్తన సాంకేతిక పరిజ్ఞానం, వ్యవసాయ ఇంజినీరింగ్ పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులకు 2023-24 విద్యా సంవత్సరానికి మిగిలిన సీట్ల భర్తీకి మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామారావు శుక్రవారం తెలిపారు. ఈ నెల 11వ తేదీన గుంటూరు లాంఫాం నందున్న సెమినార్ హాల్‌లో మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణత పొంది పాలిటెక్నిక్ ప్రవేశం కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న, చేయనివారైనా అర్హత ఉంటే అభ్యర్థులు నేరుగా హాజరుకావచ్చునని తెలిపారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ. ఏఎన్‌జీఆర్‌ఏయూ. ఏసీ.ఇన్‌ను సంప్రదించాలని కోరారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

జోరుగా నామినేషన్ ప్రక్రియ



నామినేషన్‌ను సమర్పిస్తున్న ఎమ్మెల్యే లతా మల్లికార్జున్

హొసపేటె: బీడీసీసీ బ్యాంక్ అధ్యక్ష స్థానానికి మాజీ మంత్రి ఆనంద్‌సింగ్ రాజీనామా చేయడంతో ఆ స్థానానికి జరిగే ఎన్నికలకు నామినేషన్ ప్రక్రియ జోరందుకుంది. ఎన్నడూ లేని విధంగా ఈసారి అధ్యక్ష బరిలో మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ప్రస్తుత ఎమ్మెల్యేలు కూడా నిలిచేందుకు నామినేషన్లు వేశారు. ఇప్పటికే మాజీ మంత్రి పరమేశ్వర్ నాయక్, మాజీ ఎమ్మెల్యే భీమానాయక్, ప్రస్తుత ఎమ్మెల్యేలు తుకారాం, లతా మల్లికార్జున్, రైతు నాయకులు నామినేషన్ దాఖలు చేశారు. ఈసారి ఈ ఎన్నికలు నగరంలో చర్చనీయాంశంగా మారాయి. ఈ నెల 7వ తేదీ నామినేషన్ సమర్పణకు తుది గడువు కాగా, ఈ నెల 15న ఎన్నికలు జరగనున్నాయి.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

బళ్లారిఅర్బన్: పవన్ హోటల్ వెనుక భాగంలోని రోటరీ క్లబ్ హాల్‌లో ప్రపంచ ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం రాత్రి పలువురు ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. క్లబ్ అధ్యక్షుడు సురేష్ మాట్లాడుతూ తల్లిదండ్రులు జన్మనిస్తే ఉపాధ్యాయులు జ్ఞానాన్ని ఇచ్చారన్నారు. గురువులను గుర్తించి సత్కరించడం మనందరి బాధ్యత అన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులు ప్రమీల, శోభ, సుమిత్ర, జావీద్, జమున, సతీష్, కాళమ్మ, రాజేంద్ర ప్రసాద్, రాజశేఖర్ తదితరులను సన్మానించారు. క్లబ్ సహ కార్యదర్శి ఖాదర్‌బాషా, రోటరీ ఇన్నర్ వీల్ క్లబ్ మహిళా అధ్యక్షురాలు ఎన్.టీ.లక్ష్మీప్రియ, కార్యదర్శి జయంతి శిల్పా, శివకుమార్, నామా సత్యనారాయణ, వితా కృష్ణ, వినోద్‌జైన్, రవీంద్రనాయుడు, గీతనాయుడు పాల్గొన్నారు.

చెరువు ఉన్నతీకరణ పనులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న దృశ్యం

కంప్లి: చెరువు నీటితో పశుపక్ష్యాదులు, మేకలకు తాగునీరు, వ్యవసాయానికి సాగునీటిని అందించవచ్చని జేఎస్‌డబ్ల్యూ ఫౌండేషన్ ఉపాధ్యక్షులు సునీల్‌కుమార్ సింగ్ తెలిపారు. సండూరు తాలూకా నందిహళ్లిలో శుక్రవారం చెరువు ఉన్నతీకరణ పనులకు భూమిపూజ నిర్వహించి ఆయన మాట్లాడారు. చెరువులు, వాగులకు మరమ్మతులు అవసరమన్నారు. తద్వారా రైతుల భూములకు అంతర్జలాలు పెంపొందుతాయన్నారు. ప్రధానంగా చెరువులో నీటి నిల్వ వృద్ధికి ముఖ్యంగా పూడిక తొలగింపు ప్రధానమని, ఆ పనులు కూడా పూర్తి చేస్తామన్నారు.

మైనర్లు డ్రైవింగ్ చేయడం నేరం



జిల్లా ఎస్పీ శ్రీహరిబాబు

హొసపేటె: డ్రైవింగ్ చేసే మైనర్లు, డ్రైవింగ్ లైసెన్స్ లేని వారికి భారీ జరిమానాతో పాటు జైలు శిక్ష తప్పదని విజయనగర జిల్లా ఎస్పీ శ్రీహరిబాబు తెలిపారు. మోటారు వాహన చట్టం ప్రకారం మైనర్లు, డ్రైవింగ్ లైసెన్స్ లేని వ్యక్తులు డ్రైవింగ్ చేయడం చట్ట విరుద్ధమని ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. నగరంలో ఇప్పటికే ఆపరేషన్ ప్రారంభించామని, తల్లిదండ్రులు తమ పిల్లలను వాహనాలను నడపడానికి అనుమతిస్తే వారి వాహనాన్ని జప్తు చేస్తామని, తల్లిదండ్రులపై సెక్షన్ 5(1) ప్రకారం మూడేళ్ల జైలు శిక్ష, రూ.25 వేల జరిమాన విధిస్తామని హెచ్చరించారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ సీఈఓ

రాయచూరు రూరల్: మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జెడ్పీ సీఈఓ రాహుల్ తుకారాం పాండే అన్నారు. శుక్రవారం జెడ్పీ భవనంలో హెచ్‌ఎల్ లైఫ్ కేర్ కంపెనీ ఆధ్వర్యంలో మహిళలకు ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. మహిళలు రుతుస్రావంతో ఇబ్బందులకు గురి కాకుండా జాగ్రత్త వహించాలన్నారు. ఈసందర్భంగా ఆశా, లలిత, నందిని, ప్రకాష్ తదితరులున్నారు.

పంటలు పూర్తిగా ఎండిపోయాయి

- కరువు అధ్యయన బృందానికి గోడు వినిపించిన రైతులు
- అధైర్యపడొద్దు..ఆదుకుంటామని భరోసా ఇచ్చిన అధికారులు



కొప్పళ జిల్లాలో పర్యటిస్తున్న అధ్యయన బృందానికి గోడు వినిపిస్తున్న మహిళా రైతు శరణమ్మ

సాక్షి,బళ్లారి: ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులతో పెట్టిన పంటలు పూర్తిగా ఎండిపోయి రైతులకు కనీసం పెట్టుబడి కూడా దక్కే అవకాశం లేకపోవడంతో రైతులు కరువు కోరల్లో చిక్కుకొని విలవిలలాడుతున్నారు. ఈనేపథ్యంలో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంట నష్టాన్ని అధ్యయనం చేయడానికి శుక్రవారం రాష్ట్రానికి కేంద్ర కరువు అధ్యయన బృందాలు విచ్చేశాయి. రాష్ట్రంలో కరువు బృందాలు వేర్వేరుగా పలు జిల్లాల్లో పర్యటించి రైతుల పంటల స్థితిగతులను పరిశీలించారు. కొప్పళ జిల్లా యలబుర్గ తాలూకా బండి క్రాస్ సమీపంలో శరణమ్మ అనే మహిళా రైతుకు చెందిన పంట పొలాలను పరిశీలించగా, రైతులు కరువు అధ్యయన బృందానికి తమ గోడు వెళ్లబోసుకున్నారు. బృందంలో సీనియర్ ఐఏఎస్ అధికారి రాజశేఖర్, పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ తకరే, గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయక కమిషనర్ మోతీరామ్, రాష్ట్రానికి చెందిన కరువు నివారణ సహాయక డైరెక్టర్ కరేగౌడ తదితరులు రైతు మహిళ పొలంలో పర్యటించి గోడును ఆలకించారు.

పెట్టుబడి కూడా దక్కదు

తన 10 ఎకరాల పొలంలో పూర్తిగా పంట ఎండిపోయిందని ఏకరువు పెట్టారు. పెట్టుబడి కూడా దక్కదన్నారు. ఒక ఎకరా పొలంలో సజ్జలు పూర్తిగా ఎండిపోయాయని కరువు బృందంతో కన్నీరు పెట్టుకుంది. ఇదే తరహాలో గ్రామంలోని రైతులు పెద్ద సంఖ్యలో చేరి రైతుల పంటల స్థితిగతులను వివరించారు. ఒక్క శరణమ్మ పొలంలోనే కాకుండా గ్రామం, తాలూకా, కొప్పళ జిల్లాలో వర్షాధారిత పొలాల్లో పంటలు పూర్తిగా ఎండిపోయాయని కేంద్ర కరువు బృందం దృష్టికి తెచ్చారు. బెళగావి, విజయపుర జిల్లాల్లో పలు గ్రామాల్లో కేంద్ర కరువు అధ్యయన బృందం పర్యటించి రైతుల బాధలను ఆలకించింది. కేంద్ర కరువు అధ్యయన బృందంలో అజిత్‌కుమార్ సాహా నేతృత్వంలో ముందుగా బెళగావి, విజయపుర జిల్లాల్లో పర్యటించి రైతు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో రైతులు తమ పంటలు ఎండిపోయిన విషయాన్ని అధ్యయన బృందంతో పంచుకుంది. ఆదుకోకపోతే తమకు ఆత్మహత్యలే శరణ్యమని విజ్ఞప్తి చేసింది.

గదగ్ జిల్లాలో..

అలాగే గదగ్ జిల్లాలో కరువు నివారణ బృందం రాజశేఖర్ నేతృత్వంలో పలు గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో రైతులు సమస్యలను తెలుసుకున్నారు. కరువు బృందంతో పాటు స్థానిక జిల్లాధికారులు, రైతు సంఘం నేతలు కూడా వెంట తిరిగి కేంద్ర బృందానికి రైతుల పంటలు ఎండిపోయిన విషయాన్ని వివరించారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఆయా జిల్లాల్లోని పలు తాలూకాలను కరువు తాలూకాలుగా ప్రకటించిన సంగతిని గుర్తు చేశారు. అనంతరం కేంద్ర కరువు బృందం రైతులను అధైర్య పడకూడదని, ఎట్టిపరిస్థితిలోను ఆత్మహత్యలు చేసుకోరాదని, కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, సంబంధిత మంత్రుల దృష్టికి తీసుకెళ్లి ఖచ్చితంగా రైతులను ఆదుకొనే చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా అధికారుల బృందం వెంట కొప్పళ లోక్‌సభ సభ్యుడు కరడి సంగణ్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరా క్యాంటీన్‌ను ప్రారంభించరూ..



వినతిపత్రం సమర్పిస్తున్న శరణప్ప

రాయచూరు రూరల్: రాయచూరు వైద్య విజ్ఞాన సంస్థ(రిమ్స్) ఆస్పత్రి, కళాశాల ఆవరణలో ఇందిరా క్యాంటీన్‌ను ప్రారంభించాలని దళిత సంఘర్ష సమితి డిమాండ్ చేసింది. శుక్రవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళననుద్దేశించి అధ్యక్షుడు శరణప్ప దిన్ని మాట్లాడారు. ఆస్పత్రిలో చికిత్స కోసం వచ్చే పేద రోగులు, వారి వెంట గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే సహాయకులకు అనుకూలమయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా క్యాంటీన్‌ను ప్రారంభించాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

కారు ఢీకొని బాలిక మృతి

హుబ్లీ: ఎదురుగా వస్తున్న బైక్‌ను కారు ఢీకొనడంతో ఓ బాలిక మృతి చెందిన ఘటన తాలూకాలోని హెబసూరులో జరిగింది. స్థానిక గణేష్‌నగర్ నివాసి మెహబూబ్ సాబ్ కుమార్తె సాజియా(4) మృతురాలు. కారు హుబ్లీ నుంచి నవలగుంద వైపునకు వెళుతుండగా డ్రైవర్ వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే ప్రయత్నంలో నవలగుంద నుంచి హుబ్లీ వైపునకు వస్తున్న బైక్‌ను ఢీకొన్నాడు. బైక్‌పై ఉన్న మెహబూబ్‌సాబ్, ఆయన భార్య నసీమా తీవ్రంగా గాయపడి కిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. కారులో ప్రయాణిస్తున్న ముంతాజ్ కూడా గాయపడ్డారు. కారును స్థలంలోనే వదిలి పరారైన డ్రైవర్‌ను హుబ్లీ గ్రామీణ పోలీసులు అరెస్ట్ చేసి కేసు దర్యాప్తు చేపట్టారు.

డివిజన్ స్థాయి పోటీలకు తరలిన విద్యార్థులు

గంగావతి: కలబురిగి డివిజన్ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన తాలూకాలోని పాఠశాల విద్యార్థులను క్లస్టర్ల వారీగా బీఈఓ వెంకటేష్ శుక్రవారం సాగనంపారు. ఈనెల 7, 8 తేదీల్లో యాదగిరి జిల్లా సురపురలో జరగనున్న ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావాలని బీఈఓ వారిని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వ్యాయామ విద్యాధికారులు, బీఈఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థినికి ప్రశస్తి



ప్రశస్తిని అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

కంప్లి: విజయనగర జిల్లా కూడ్లిగి పట్టణంలోని మౌలానా ఆజాద్ పాఠశాల విద్యార్థిని డి.నివేదిత 2022-23వ సంవత్సరపు ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షల్లో కన్నడ భాషలో 125 మార్కులకు గాను 123 మార్కులు పొందిన సందర్భంగా హరపనహళ్లి నవజ్యోతి సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో కన్నడ రత్న ప్రశస్తితో సత్కరించారు.

ఎమ్మెల్యే చొరవతో నిధుల విడుదలపై హర్షం



ఎమ్మెల్యేను అభినందించిన న్యాయవాదులు

బళ్లారిటౌన్: నగరంలో నూతనంగా నిర్మించిన జిల్లా కోర్టు సముదాయానికి సంబంధించి బకాయి ఉన్న నిధుల విషయంపై ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి మంత్రిమండలి దృష్టికి తేవడంతో చర్చ జరిగి నిధుల విడుదలకు అంగీకారం లభించింది. దీంతో శుక్రవారం జిల్లా నూతన కోర్టు ఆవరణలో ఎమ్మెల్యేను న్యాయవాదుల సంఘం పదాధికారులు అభినందించారు. గతంలో రూ.120.90 కోట్లతో నిర్మించిన ఈ కోర్టు సముదాయానికి ఇంకా రూ.21.90 కోట్ల నిధులు బకాయి ఉన్న విషయాన్ని ఎమ్మెల్యే మంత్రి మండలి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో బకాయి మొత్తాన్ని వెంటనే విడుదల చేయడానికి ఆమోదం లభించడంపై లాయర్ల అసోసియేషన్ అధ్యక్షులు ఎర్రెగౌడ, ఇతర పదాధికారులు హర్షం వ్యక్తం చేశారు.

డిసెంబర్ 31 వరకు సాగునీరివ్వాలి



వినతిపత్రాన్ని సమర్పిస్తున్న రైతు సంఘం నాయకులు

గంగావతి: తుంగభద్ర ఎడమ కాలువకు డిసెంబర్ 31కు సాగునీరు సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కారటగి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని కర్ణాటక రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు ముట్టడించారు. పోలీసులు ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు. ఆందోళనను ఉద్దేశించి సంఘం నేత శరణప్ప దొడ్డమని మాట్లాడుతూ తుంగభద్ర డ్యాం నీటిని అక్రమంగా కర్మాగారాలకు ధారాదత్తం చేస్తున్నారని ఆరోపించారు. ఆ నీటి పంపకాలను అరికడితే డిసెంబర్ చివరి వరకు రైతులకు సాగునీరు అందించవచ్చన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ప్రధానంగా చొరవ తీసుకోవాలని డిమాండ్‌చేశారు. రైతు సంఘం పదాధికారులు, ప్రముఖులు, ఆందోళనకారులను పోలీసులు వాహనంలో స్టేషన్‌కు తరలించి అనంతరం విడుదల చేశారు.

నకిలీ పత్రాలతో భూమి విక్రయం

- బతికుండగానే మరణించినట్లు రికార్డులు
- వెలుగు చూసిన తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది మోసం



మోసపోయిన బాధిత కుటుంబ సభ్యులు వీరే

రాయచూరు రూరల్: బతికుండగానే మరణించినట్లు తహసీల్దార్ కార్యాలయ సిబ్బందితో రికార్డులు పుట్టించి నకిలీ పత్రాలతో భూములను విక్రయించిన ఘటన తాలూకాలో వెలుగు చూసింది. వివరాలు..తాలూకాలోని పోతుగల్ నివాసి గోవిందప్ప పేరు మీద సర్వే నంబర్-172-3 లో ఆరు ఎకరాల పొలం ఉంది. గోవిందప్ప మరణానతరం భార్య సుశీలమ్మ పేరిట రిజిస్టరైంది. గోవిందప్ప, సుశీలమ్మకు పిల్లలు లేరని, మరణించినట్లు నకిలీ రికార్డులు తయారు చేసి భూమిని ఎస్.కే.నాగిరెడ్డికి తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది చేతివాటంతో విక్రయించారు. 16 ఏళ్ల క్రితం సుశీలమ్మ(68) మరణించినట్లు రికార్డుల్లో నమోదు చేశారు. శుక్రవారం సుశీలమ్మ, కుమారులు వచ్చి తమకు తహసీల్దార్ కార్యాలయ అధికారులు మోసం చేసి ఆరు ఎకరాల భూమిని ఇతరులకు అమ్మారని, తమకు న్యాయం చేయాలని, సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు చేపట్టాలని బాధిత కుటుంబ సభ్యులు విన్నవించారు.

అందరి సుఖాన్ని కోరేదే సనాతన ధర్మం



మాట్లాడుతున్న విశ్వప్రసన్నతీర్థ స్వామీజీ

హుబ్లీ: ధర్మం అంటే సమాజాన్ని నిరంతరం ముందుకు నడిపే బతుకు సూత్రం, అందరూ సుఖసంతోషాలతో ఉండాలి. అందుకోసం అలవరుచుకోవాల్సిన నీతినియమాలే సనాతన ధర్మం అని పేజావర మఠాధిపతి విశ్వప్రసన్న తీర్థ స్వామీజీ తెలిపారు. శుక్రవారం ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు హుబ్లీకి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. మనం సంతోష పడే ప్రయత్నం మరొకరి దుఃఖానికి కారణం కారాదన్నారు. తన ప్రయత్నం వల్ల చుట్టు పక్కల వారికి దుఃఖం కలగరాదన్నారు. తన ప్రయత్నం వల్ల తనతో ఉన్న అందరికీ సుఖం లభించాలన్నారు. శివమొగ్గలోని రాగిగుడ్డలో జరిగిన ఘర్షణపై విచారణకు సంబంధించి వానలు వచ్చినప్పుడు మొత్తం ఊరికే వరద వస్తుంది. అలాంటప్పుడు మరొకరికి దుఃఖం కలగకుండా అందరికీ సుఖం కలిగేలా తన ప్రయత్నం ఉండాలన్నారు. అప్పుడే అందరూ నెమ్మదిగా బతకడానికి సాధ్యం, ఇదే సనాతన ధర్మం అన్నారు. దీన్ని వ్యతిరేకించే స్థాయికి ఎవరూ వెళ్లరాదన్నారు. ఒక్కసారి కార్చిచ్చు రగిలితే శాంతి అంత తొందరగా దొరకదన్నారు. దీనికి మణిపూరే నిదర్శనం అన్నారు. రాజకీయ నేతలు ఓ పార్టీకి పరిమితం కాదన్నారు. సమాజంలోని అందరి సుఖ శాంతులకు అవసరమైన సూత్రాలను అలవరుచుకోవాలని హితవు చెప్పారు. శివమొగ్గ సంఘటన చిన్న విషయంగా భావించరాదన్నారు.

12, 13 తేదీల్లో ఆడిటర్ల వార్షిక సదస్సు



మాట్లాడుతున్న సీఏ పన్నారాజ్

బళ్లారిఅర్బన్: విజయనగర జిల్లా హొసపేటెలోని నందగోకుల లేఔట్‌లో ఈనెల 12, 13 తేదీల్లో సీఏ ఆడిటర్ల ప్రాంతీయ 75వ వార్షిక సదస్సు నిర్వహిస్తున్నట్లు సీఏ దక్షిణ భారత చైర్మన్ ఎస్.పన్నారాజ్ పేర్కొన్నారు. శుక్రవారం పార్వతినగర్‌లోని గొరిహళ్లిమనె హోటల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. సుమారు రూ.4 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేస్తున్న ఈ సదస్సులో సుమారు 2 వేల మందికి పైగా ఆడిటర్లు, సీఏలు పాల్గొంటారన్నారు. ఈ సదస్సును ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రారంభిస్తారన్నారు. మంత్రులు హెచ్‌కే.పాటిల్, జమీర్ అహ్మద్ ఖాన్, బీ.నాగేంద్ర, శరణబసప్ప, సంతోష్‌లాడ్, బైరతి బసవరాజ్‌లతో పాటు ఎమ్మెల్యేలు, సీఏ సంస్థ జాతీయ అధ్యక్షులు హనీకేర్ సునీల్, ఉపాధ్యక్షుడు రంజిత్‌కుమార్ అగర్వాల్ హాజరవుతున్నట్లు తెలిపారు. ఢిల్లీ, చెన్నై, ముంబై, బెంగళూరుల నుంచి విచ్చే నిపుణులు ఆదాయపు పన్ను, ఎంఎస్ఎంఈ యూనిట్ల నిర్వహణ, కంపెనీ పన్ను తదితర అంశాలపై ఉపన్యసిస్తారన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేశారన్నారు. ఈసందర్భంగా బళ్లారి శాఖ అధ్యక్షుడు కే.నాగనగౌడ, ఉపాధ్యక్షుడు వెంకటనారాయణ, కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, కోశాధికారి కేవీ.స్వప్నప్రియ, సభ్యులు నాగరాజ్, విశ్వనాథ ఆచారి, రాజశేఖర్, భరత్, సిద్దరామేశ్వర గౌడ, ప్రసన్నకుమార్, పాటిల్, ఎర్రిస్వామి, గజ, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనలకు పెద్దపీట వేయాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీఎం సిద్దరామయ్య

చెళ్లకెరె రూరల్: వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయాలలో డిగ్రీ విద్యార్థులను తయారు చేయడంతో పాటు పరిశోధనలకు ప్రాధాన్యత నివ్వాలని, వాతావరణ వైపరీత్యాలకు తట్టుకునే, రోగ నిరోధకశక్తి కలిగిన వంగడాలను అభివృద్ధి పరచాలని ముఖ్యమంత్రి సిద్దరామయ్య తెలిపారు. శుక్రవారం హిరియూరు తాలూకా బబ్బూరు ఫారం ప్రాంగణంలో కెళది శివప్ప వ్యవసాయ, ఉద్యాన విజ్ఞాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన బబ్బూరు వలయ వ్యవసాయ, ఉద్యాన విశ్వ విద్యాలయ శతమానోత్సవం, సిరిధాన్య మేళా, ఉద్యాన పంటలపై చర్చాగోష్ఠిని ఆయన ప్రారంభించి మాట్లాడారు. 2016లో వ్యవసాయ పరిశోధనా కేంద్రం శతమానోత్సవ వేడుకలను నిర్వహించాల్సిందన్నారు. ప్రస్తుతం పరిశోధనా కేంద్రానికి 107 సంవత్సరాలు పూర్తయ్యాయి. కారణాంతరాల వల్ల ఇప్పుడు వేడుకలను ఆచరిస్తున్నట్లు తెలిపారు. పరిశోధనలు ఫలప్రదమైతే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. కరువు, అతివృష్టి వల్ల పంటలకు సరైన ధరలు, కొత్త రకం విత్తనాలు లభించక, పంటలను నిల్వ చేసుకోడానికి సరైన గోదాములు లేక రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ సమస్యలన్నింటికీ పరిష్కారాన్ని విశ్వవిద్యాలయం పరిశోధనల ద్వారా కనుగొనాలన్నారురు. కరువు ప్రాంతమైన చిత్రదుర్గ జిల్లాలో రైతులు తీవ్ర కష్టాల్లో ఉన్నారన్నారు. బబ్బూరు వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పరిశోధనలు విరివిగా జరపాలి, కొత్తరకం విత్తనాలను కనుగొనాలని అన్నారు. పరిశోధనలకు ప్రభుత్వం నుంచి అన్ని విధాలుగా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మంత్రి డి.సుధాకర్, ఎమ్మెల్యేలు బి.జి.గోవిందప్ప, టి.రఘునాథ్, ఎన్‌వై గోపాలకృష్ణ, కెసి రవీంద్ర, కలెక్టర్ దివ్య ప్రభు, జెడ్పీ సీఈఓ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు, బైక్ ఢీ..ఒకరి మృతి

హుబ్లీ: ధార్వాడ తాలూకా సోమపుర వద్దగల మట్టిబావి సమీపంలో బస్సు, బైక్ మధ్య జరిగిన ప్రమాదంలో బైక్ చోదకుడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. మృతుడిని సవదత్తి తాలూకా యడ్రామికి చెందిన సూగురేశ్(35)గా గుర్తించారు. అమరగోళ వైపు బైక్, ధార్వాడ నుంచి గజేంద్రగడ వైపు బస్సు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ధార్వాడ గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

కత్తితో హల్‌చల్.. వ్యక్తి అరెస్ట్

హుబ్లీ: చేతిలో కత్తిని పట్టుకొని వీధుల్లో హల్‌చల్ చేస్తున్న ఓ వ్యక్తిని కసబాపేటె పోలీసులు అరెస్ట్ చేసి ఆయుధ చట్టం కింద కేసు నమోదు చేశారు. నూరాని ప్లాట్‌లో నివసించే సైఫ్ బిజాపుర అనే వ్యక్తి పాత హుబ్లీ సుంకదహాల్ వద్ద ఏదో నేరం చేయాలన్న ఉద్దేశంతో కత్తి పట్టుకొని సంచరిస్తుండగా స్థానికులు పోలీసులకు సమాచారం చేరవేశారు. తక్షణమే కసబాపేటె ఎస్ఐ రవి అక్కడకు చేరుకుని నిందితుడిని అరెస్ట్ చేశారు.

సమాన హక్కులతో సమసమాజ నిర్మాణం



మాట్లాడుతున్న సుమా గస్తీ

రాయచూరు రూరల్: సమ సమాజ నిర్మాణానికి పురుషులతో పాటు స్త్రీలకు కూడా సమాన హక్కులు అవసరమని బీజేపీ నాయకురాలు సుమా గస్తీ అన్నారు. శుక్రవారం ప్రభుత్వ బాలికల హాస్టల్‌లో ఏబీవీపీ ఏర్పాటు చేసిన దుర్గావతి దేవి జయంతిలో ఆమె మాట్లాడారు. మహిళలు హక్కులు, విధులతో సమానత్వం, విద్య, సామాజిక, ఆర్థిక రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు వీలుందన్నారు. దుర్గావతి దేవి సాగించిన స్వాతంత్ర్య పోరాటంపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రమిలా, సుజాత, పాండు, భీమేష్‌లున్నారు.

తాలూకా క్రీడాంగణానికి మోక్షమెన్నడో?



మైదాన ప్రవేశద్వారంలో నిలిచిన వర్షపు నీరు



ఆలనాపాలనా కరువైన క్రీడాంగణ మైదానం

- అభివృద్ధికి నోచుకోని మైదానం
- మౌలిక సౌకర్యాలు కరువైన వైనం

కంప్లి: అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా ఉంది కురుగోడు తాలూకా క్రీడాంగణం పరిస్థితి. కురుగోడు పట్టణాన్ని తాలూకా కేంద్రంగా ప్రకటించి ఇప్పటికే ఐదేళ్లు దాటినా పట్టణంలో తాలూకా క్రీడాంగణం నిర్మాణం పూర్తి కాలేదు. దీంతో క్రీడాకారులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. కంప్లి మార్గంలోని సుంకలమ్మదేవి దేవస్థానం పక్కన సువిశాలమైన ఆటల మైదానం ఉంది. అదే మైదానంలోనే తాలూకా స్థాయి క్రీడోత్సవాలు నిర్వహిస్తున్నారు. మైదానంలో ఏర్పాటు చేసిన వేదిక శిథిలావస్థకు చేరుకుంది. పాఠశాల పక్కనే మురికి కాలువ నదిలా పారుతున్నా పట్టించుకొనే నాథుడే లేరు. ఇక తాలూకా క్రీడాంగణం నిర్మాణమే కాకపోగా రూ.10 లక్షలను వ్యాయామ పాఠశాలకు కూడా మంజూరు చేశారు. టెండర్ల ప్రక్రియ ముగిసినా నిర్మాణ కార్యక్రమాలు ముందుకు సాగడం లేదు. రాత్రి వేళల్లో ఈ మైదానం, వేదిక మందుబాబులకు నిలయంగా మారి, తాగిన పారేసిన ఖాళీ సీసాలను మైదానంలోనే విసిరి వెళుతున్నారు. మైదానంలో క్రీడాకారులకు తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలు లేవు. దీంతో తాలూకా స్థాయి పోటీలకు విచ్చేసిన క్రీడాకారుల అవస్థలు వర్ణనాతీతం. క్రీడాంగణం నిర్మాణం త్వరలోనే పూర్తి చేయాలని ప్రజాప్రతినిధులకు విన్నవించినా స్పందించక పోవడం క్రీడాకారుల పాలిట శాపంగా మారింది. ఇకనైనా తాలూకా క్రీడాంగణ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి క్రీడాకారులకు అవకాశం కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పండని పంటలు..బీళ్లుగా పొలాలు

- నీరందక లక్షలాది ఎకరాల్లో పంటలకు నష్టం
- దిక్కుతోచని స్థితిలో కళ్యాణ కర్ణాటక జిల్లాల రైతులు



పొలాల్లో గొర్రెలను మేపుతున్న దృశ్యం



భూమిలో పంటను దున్నేస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులతో ఆకాశంలో తరచుగా మబ్బులు కమ్ముకుంటున్నా ఈఏడాది ఖరీఫ్ సీజన్‌లో సరైన వర్షాలు కురవక రైతుల ముఖాల్లో కళ కరువైంది. కళ్యాణ కర్ణాటకలోని రాయచూరు, యాదగిరి, కొప్పళ, బీదర్, కలబుర్గి కరువు జిల్లాలుగా మారాయి. రాయచూరు, కొప్పళ జిల్లాల్లోని నదుల్లో నీరు అంతంత మాత్రంగానే ఉన్నాయి. రాయచూరు, యాదగిరి జిల్లాల్లో కృష్ణా, భీమా నదులున్నా నీరు అందక కొందరు రైతులు తమ పొలాల్లో వేసుకున్న వరి తదితర పంటలను గొర్రెలను మేపడానికి వదిలేశారు. దీనికి తోడు అక్కడక్కడ కొందరు రైతులు ట్రాక్టర్‌తో దున్నించేసి పంటలను తొలగిస్తున్నారు. పొలంలో బోరుబావుల ద్వారా పంటలను పండించాలన్నా భూగర్భ జలాల స్థాయి అడుగంటింది. మరో వైపు విద్యుత్ కోతలు అధికమయ్యాయి.

ఉపాధి కోసం తప్పని వలసలు

రాయచూరు జిల్లాలో తుంగభద్ర, కృష్ణా నదులున్నా వ్యవసాయ పనులు మందగించి ఉపాధి కరువై కూలీకార్మికులకు సుదూర ప్రాంతాలకు, మహానగరాలకు వలసలు తప్పడం లేదు. రైతులు జిల్లాలో లక్షా 70 వేల ఎకరాల్లో పత్తి, లక్షా 50 వేల ఎకరాల్లో వరి, 86 వేల ఎకరాల్లో కంది పంటలను సాగు చేశారు. కాలువకు నీరందక, వానలు కురవక భూములు బీళ్లుగా మారుతున్నాయి. తుంగభద్ర ఎడమ కాలువ ఆయకట్టు చివరి భూములకు నీరందక వరి పంట చేతికందదనే ఆందోళనతో రైతులు పశువులను మేపడానికి సిద్ధమయ్యారు. ఈ ప్రాంతాల నుంచి ఎన్నికైన ప్రజాప్రతినిధులకు సాగునీటి ప్రాధాన్యతను పెంపొందించేందుకు ఎలాంటి పథకాలను ప్రారంభించాలనే తపన ఏ ఒక్కరి మదిలో లేకపోవడం విడ్డూరంగా ఉంది. అధికారం కోసం తహతహలాడే నేతలు రైతన్నలు పడుతున్న బాధలను పరిష్కరించడంపై నిర్లక్ష్యం వహిస్తున్నారు.